
www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI





సోమవారం | 1-7-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 76 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, కృష్ణపక్షం; తిథి: దశమి ఉ. 10.26 తదుపరి ఏకాదశి; నక్షత్రం: అశ్విని ఉ. 6.26, భరణి తె. 5.27; వర్జ్యం: మ. 3.38-5.10; దుర్ముహూర్తం: మ. 12.45-1.37, మ. 3.21-4.13; అమృతఘడియలు: రా. 12.50-2.22; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 5.48; సూర్యాస్తమయం: 6.49 | విజయవాడ సిటీ

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఫైనల్ వీక్షకులు 5.3 కోట్లు

న్యూఢిల్లీ: ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగిన టీ20 ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్ డిజిటల్ వీక్షణలోనూ రికార్డులను నెలకొల్పింది. ఓటీటీ ప్లాట్‌ఫామ్ డిస్నీ హాట్‌స్టార్‌లో ఈ పోరును ఏకంగా 5 కోట్ల 30 లక్షల మంది వీక్షించారు. అయితే గతేడాది వన్డే వరల్డ్‌కప్ ఫైనల్ రికార్డును మాత్రం దాటలేకపోయింది. అప్పుడు 5.9 కోట్ల మంది వీక్షించగా.. అదే ఆల్‌టైమ్ రికార్డుగా కొనసాగుతోంది. ఇక స్టార్‌స్పోర్ట్స్‌లో ఎంతమంది తిలకించారనే లెక్కలు వచ్చే వారం బార్క్ విడుదల చేయనుంది.

చాంపియన్లకు రూ.125 కోట్లు

టీ20 వరల్డ్‌కప్ గెలిచిన భారత క్రికెట్ జట్టుకు బీసీసీఐ భారీ నజరానా ప్రకటించింది. విజేతకు ఐసీసీ రూ.20.42 కోట్లే అందించగా... బోర్డు మాత్రం తమ స్థాయికి తగ్గట్టుగా ఏకంగా రూ.125 కోట్లు రోహిత్ సేనకు ఇవ్వనుంది. 'టోర్నీ అంతటా భారత జట్టు పట్టుదల, అంకితభావం, క్రీడాస్ఫూర్తి ప్రదర్శించింది. అందుకే విజేతగా నిలిచిన టీమిండియాకు రూ.125 కోట్ల ప్రైజ్‌మనీ ప్రకటిస్తున్నందుకు సంతోషంగా ఉంది. ఈ గెలుపులో భాగమైన ఆటగాళ్లు, కోచ్‌లు, సహాయక సిబ్బందికి అభినందనలు' అని బోర్డు కార్యదర్శి జైషా ఎక్స్‌లో పోస్ట్ చేశాడు.



కల నెరవేరె.. కెరీర్ ముగించె

టీ20లకు రోహిత్, విరాట్, జడేజా అల్విదా



భారత క్రికెట్‌లో ఇలాంటి దృశ్యం మునుపెన్నడూ చూడలేదు.. పేరుకే స్టార్ ఆటగాళ్లనీ, ఏళ్లు గడుస్తున్నా ఒక్క ఐసీసీ టైటిల్ కూడా సాధించలేకపోతున్నారన్న విమర్శల నేపథ్యంలో.. అందకుండా ఊరిస్తున్న వరల్డ్‌కప్‌ను అందుకున్న వేళ వారి భావోద్వేగాలు ఏ స్థాయిలో ఉంటాయి.. అందుకేనేమో.. ఇంతకు మించిన సమయం ఇంకేముంటుందన్న ఆలోచనతో ఒకరు కాదు, ఇద్దరు కాదు టీమిండియా విజయాలకు మూలస్తంభాలుగా నిలిచిన ముగ్గురు స్టార్లు పొట్టి ఫార్మాట్‌కు గుడ్‌బై చెప్పేశారు. తమ చిరకాల స్వప్నం నెరవేరిందన్న అంతులేని సంతృప్తితో.. కప్పును చూస్తూ మైమరుస్తూ.. హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ, కింగ్ విరాట్ కోహ్లీ, 'సర్' రవీంద్ర జడేజా ఒకరి తర్వాత మరొకరుగా యువతరానికి ద్వారాలు తెరిచారు.

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

సమర్థ నాయకుడు

'టీ20ల నుంచి తప్పుకోవాలని ఎప్పుడూ అనుకోలేదు. కానీ కప్‌ను సాధించాక గుడ్‌బై చెప్పడానికి ఇదే సరైన సమయం అనిపించింది'.. ఫైనల్ ముగిశాక కెప్టెన్ రోహిత్ చేసిన కామెంట్ ఇది. ధనాధన్ ఫార్మాట్‌లో అత్యంత విజయవంతమైన సారథిగా హిట్‌మ్యాన్ పేరు తెచ్చుకున్నాడు. అంతే కాదు.. కపిల్‌దేవ్, ఎంఎస్ ధోనీల తర్వాత భారత్‌కు వరల్డ్‌కప్ అందించిన కెప్టెన్‌గా చిరస్థాయిగా నిలుస్తాడు. విరాట్ నుంచి సారథ్య బాధ్యతలు తీసుకున్నాక, పరిస్థితులను తనకు అనుకూలంగా మలుచుకున్నాడు. తనకన్నా గొప్ప ఆటగాడైన విరాట్‌కు సముచిత గౌరవాన్నిస్తూ జట్టులో చక్కటి వాతావరణం ఉండేలా చూసుకున్నాడు. సమర్థవంతంగా జట్టును ముందుండి నడిపించాడు. రోహిత్ సారథ్యంలో భారత్ 61 టీ20 మ్యాచ్‌లు ఆడితే 50 గెలవగా, టీ20 వరల్డ్‌కప్‌లో 13 మ్యాచ్‌ల్లో 11 విజయాలున్నాయి. ఇక ఐపీఎల్ సంగతి అందరికీ తెలిసిందే. ఏకంగా ఐదు టైటిళ్లతో అదరగొట్టాడు. ఈక్రమంలో వ్యక్తిగత రికార్డులను ఏనాడూ పట్టించుకోకపోయినా ఎన్నో ఘనతలు అతని ఖాతాలో చేరాయి. అలాగే సహచరులతో ఎంత సరదాగా ఉన్నా.. మైదానంలో మందలింపుతో తప్పులను సరిదిద్దేందుకు వెనుకాడడు. అయితే ఎంఎస్ ధోనీ మాదిరే ఆటగాళ్లు ఫామ్ కోల్పోయి ఇబ్బందిపడుతున్న దశలో రోహిత్ వారికి అండగా నిలిచాడు. తాజా టీ20 వరల్డ్‌కప్‌లో జట్టు ఆరంభం నుంచి ముగింపు వరకు ఒకే బృందంతో ఆడిన విషయం గమనించవచ్చు. పిచ్‌ను అంచనా వేసి పేసర్ సిరాజ్‌ను మాత్రమే తప్పించారు. విరాట్, దూబేలపై ఎన్ని విమర్శలు వచ్చినా వారిపై నమ్మకాన్ని ఉంచాడు. ఫైనల్లో ఈ ఇద్దరి విలువైన పరుగులే జట్టు విజయంలో కీలకమైన విషయం తెలిసిందే. 2007లో అరంగేట్రం చేసిన రోహిత్ 159 మ్యాచ్‌లు ఆడగా ఈ ఫార్మాట్‌లో అత్యధిక పరుగులు (4231), అత్యధిక సెంచరీలు (5), అత్యధిక సిక్సర్ల (205)తో ఘనంగా వీడ్కోలు పలికాడు.

గేమ్ ఛేంజర్

టీ20 వరల్డ్‌కప్ గెలిచిన ఆనందంలో ఉన్న కోట్లాది మంది అభిమానులకు విరాట్ కోహ్లీ తన రిటైర్మెంట్ వార్తతో కాస్త షాక్‌కు గురిచేశాడు. నిజానికి తను ఈ మెగా టోర్నీలో సభ్యుడిగా ఉంటాడని అనుకోలేదు. 2022 టోర్నీలో జట్టు నిష్క్రమణ తర్వాత యువ ఆటగాళ్లతోనే టీమిండియా ముందుకెళ్లింది. అయితే ఐపీఎల్‌లో విరాట్ తన అద్భుత ఫామ్‌తో సెలెక్టర్లను ఆకట్టుకున్నాడు. కానీ విశ్వకప్‌లో తిరుగులేని రికార్డున్న తను ఈసారి అన్ని మ్యాచ్‌ల్లోనూ విఫలమయ్యాడు. అందుకే ఫైనల్లోనూ అతడి మీద ఎవరూ అంచనాలు పెట్టుకోలేదు. కానీ ఇదే తన చివరి మ్యాచ్ అనే భావనలో కోహ్లీ మొండిగా క్రీజులో నిలబడ్డాడు. అనుకున్నది సాధించి కప్ దక్కడంలో కీలక భూమిక పోషించాడు. వాస్తవానికి తన ఆటతీరుకు పొట్టి ఫార్మాట్ శైలి సరిపోదు. అందుకే పదేపదే అతని స్ట్రయిక్ రేట్ గురించి విమర్శలు ఎక్కుపెడుతుంటారు. కానీ వెటరన్‌గా ఎలా ఆడాలో అతడికి బాగా తెలుసు. 2022 టీ20 ప్రపంచకప్‌లో పాక్‌పై 31/4 స్కోరుతో ఓటమి ఖాయమనుకున్న స్థితిలో అతడి చిరస్మరణీయ ఇన్నింగ్స్‌ను అంత సులువుగా మర్చిపోగలమా? పొట్టి ఫార్మాట్‌లో 2010లో అరంగేట్రం చేసిన విరాట్ 125 మ్యాచ్‌ల్లో ఒక సెంచరీతో 4,188 పరుగులు సాధించాడు. రోహిత్ తర్వాత అతడివే అత్యధిక పరుగులు.

ది ఆల్‌రౌండర్



స్పిన్నర్‌గానే కాదు.. చక్కటి స్ట్రోక్ ప్లేతో బ్యాటింగ్.. మైదానంలో మెరుపులా కదిలే ఫీల్డర్.. ఇలా అన్ని విభాగాల్లో నికార్సయిన ఆల్‌రౌండర్‌గా భారత క్రికెట్‌లో రవీంద్ర జడేజా పేరు తెచ్చుకున్నాడు. 'మనస్ఫూర్తిగా అంతర్జాతీయ టీ20లకు వీడ్కోలు పలుకుతున్నా. దేశం కోసం నా శక్తిమేరా అత్యుత్తమ ప్రదర్శన కనబర్చాను. టీ20 వరల్డ్‌కప్ గెలవాలన్న కల నెరవేరింది. ఇతర ఫార్మాట్‌లో మాత్రం కొనసాగుతా' అంటూ కెరీర్‌లో తొలిసారి విశ్వకప్‌ను గెలిచిన సందర్భంలో జడేజా పేర్కొన్నాడు. వెటరన్ స్పిన్ ఆల్‌రౌండర్‌గా జట్టులో చోటు దక్కించుకున్నా జడ్డూ తాజా టోర్నీలో పెద్దగా ప్రభావం చూపలేదు. అయితే జట్టు నమ్మదగ్గ బౌలర్‌గా, టెయిలెండర్లలో ఆదుకునే బ్యాటర్‌గా పేరు తెచ్చుకున్నాడు. 2009లో తొలి టీ20 ఆడిన జడ్డూ ఆ తర్వాత జట్టులో నిలకడగా కొనసాగాడు. 74 మ్యాచ్‌ల్లో 515 రన్స్, 54 వికెట్లు, 28 క్యాచ్‌లు అందుకున్నాడు.

నానా మాటలు అన్నారు

ఐపీఎల్‌లో కెప్టెన్‌గా, ఆటగాడిగా విఫలమైన హార్దిక్ పాండ్యా సొంత జట్టు అభిమానుల నుంచే తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నాడు. వారందరికీ హార్దిక్ టీ20 వరల్డ్‌కప్‌లో గట్టి సమాధానమే ఇచ్చాడు. 'నా గురించి ఒక్క శాతం కూడా తెలియని వ్యక్తులు నానా మాటలు అన్నారు. కానీ నేను నమ్మకాన్ని కోల్పోలేదు. అలాంటి వారికి నోటితో కాకుండా ఆటతోనే బదులివ్వాలనుకున్నా' అని హార్దిక్ తెలిపాడు.

సఫారీలకు అండగా..

అజేయ ఆటతీరుతో ఫైనల్‌కు వచ్చిన దక్షిణాఫ్రికా ప్రదర్శనపై ఆ జట్టు అభిమానులు ప్రశంసలు కురిపించారు. రన్నరప్‌గా నిలిచినా సఫారీలకు అండగా ఉంటామని మాజీ స్పోర్ట్స్ ప్రెజెంటర్ విమ్లా ఫ్రాంక్ తెలిపింది. ఇక భారత్ చాంపియన్ ఆటతీరుతో ఆకట్టుకుందని మరో వ్యాఖ్యాత అస్లాం ఖోటా కొనియాడాడు.

వందనం.. అభివందనం

ఫోన్లో రోహిత్, కోహ్లీ, ద్రవిడ్‌తో మోదీ సంభాషణ





కప్ గెలిచిన భారత జట్టుపై ప్రశంసల వర్షం కురుస్తోంది. రాజకీయ, సినీ, క్రీడా రంగాలకు చెందిన వారు టీమిండియా ప్రదర్శనను కొనియాడుతూ సోషల్ మీడియాలో పోస్టులు చేశారు. అయితే, ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం స్వయంగా ఫోన్ చేసి భారత జట్టు సభ్యులతో విజయానందాన్ని పంచుకొన్నారు. రోహిత్ శర్మ కెప్టెన్సీతోపాటు అతడి అద్భుత కెరీర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. అంతేకాకుండా ఫైనల్ మ్యాచ్‌లో కోహ్లీ ఆడిన తీరును కొనియాడారు. ఆఖరి ఓవర్ వేసిన హార్దిక్ పాండ్యాను, అద్భుత క్యాచ్ అందుకున్న సూర్యకుమార్‌ను, ఆపద్బాంధవుడిగా జట్టును ఆదుకొన్న బుమ్రాను మోదీ అభినందించారు. టీమిండియాకు ఎనలేని సేవలందించిన కోచ్ రాహుల్ ద్రవిడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. 'భారత జట్టుతో మాట్లాడి వారి స్ఫూర్తిదాయక విజయాన్ని అభినందించా. టోర్నీ అంతటా అద్భుత ప్రదర్శన కనబర్చారు. జట్టులోని ప్రతి ఆటగాడి నిబద్ధత ప్రేరణ కలిగించింద'ని ఎక్స్‌లో మోదీ పోస్టు చేశారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా కూడా భారత జట్టుకు శుభాకాంక్షలు తెలిపారు.

ఇక.. నేను నిరుద్యోగిని



ఆటగాడిగా అందుకోలేకపోయిన ఐసీసీ కప్‌ను కోచ్‌గా సాధించిన రాహుల్ ద్రవిడ్ పదవీకాలం ఫైనల్ మ్యాచ్‌తో ముగిసింది. ఇక ఈ గెలుపు సంబరాల నుంచి తాను తొందరగా బయటపడి ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నాడు. ఎందుకంటే వచ్చే వారం నుంచి నిరుద్యోగిగా ఉండాల్సిందేనని, మున్ముందు ఏం చేస్తానో ఇప్పుడే చెప్పలేనంటూ ద్రవిడ్ సరదాగా వ్యాఖ్యానించాడు.

విక్టరీ టేస్ట్..



17 ఏళ్ల తర్వాత టీ20 ప్రపంచకప్‌ను అందుకున్న ఉత్సాహంలో కెప్టెన్ రోహిత్ కెన్సింగ్టన్ ఓవల్ మట్టిని రుచి చూశాడు. తమకు అద్భుత విజయాన్నందించినందుకు కృతజ్ఞతగా ఆ పిచ్‌పై ఉన్న మట్టిని కాస్త నోటిలో వేసుకున్నాడు. ఆ వీడియోను చూసిన నెటిజన్స్ దాన్ని 'విక్టరీ టేస్ట్'గా కామెంట్ చేశారు. టెన్నిస్ స్టార్ జొకోవిచ్ వింబుల్డన్ విజేతగా నిలిచినప్పుడు ఇలాగే అక్కడి గ్రాస్‌ను రుచి చూశాడు.

వరల్డ్‌కప్‌ను మళ్లీ దేశానికి తీసుకువస్తున్నందుకు ధన్యవాదాలు. క్లిష్టపరిస్థితుల్లో ఎంతో ప్రశాంతంగా ఆడారు. మ్యాచ్ చూస్తున్నప్పుడైతే గుండె వేగం అమాంతం పెరిగింది. నా పుట్టినరోజుకు గొప్ప బహుమతి.
- ఎంఎస్ ధోనీ

మనకు నాలుగో స్టార్ లభించింది. భారత జెర్సీకి లభించిన ప్రతీ స్టార్.. భవిష్యత్ తరంలో మరింత స్ఫూర్తిని నింపుతుంది. మిత్రుడు ద్రవిడ్ నేతృత్వంలో కప్‌ను సాధించడం ఎంతో ఆనందంగా ఉంది.
-సచిన్ టెండూల్కర్

భారత్.. ఎట్టకేలకు సాధించింది. విశ్వవిజేతకు అభినందనలు.
- సునీల్ గవాస్కర్

సుదీర్ఘ కాలం తర్వాత మళ్లీ ప్రపంచకప్ సాధించారు. ఇదే జోరులో మరిన్ని విజయాలు అందుకొంటారని భావిస్తున్నా.
- సౌరవ్ గంగూలీ

ఆనందభాష్పాలు ఆగడం లేదు. టీమిండియా తరహాలోనే నా భావోద్వేగాలు కూడా..! భారత్ వరల్డ్ చాంపియన్. నేను చూస్తే ఓడిపోతారేమోనని.. మ్యాచ్‌ను వీక్షించలేదు. భారత్ మాతాకీ జై.
- అమితాబ్ బచ్చన్

ఏం మ్యాచ్..! ఊపిరి బిగబట్టి చూశా. కంగ్రాట్స్ భారత్.. అద్భుత ప్రదర్శనకు పురస్కారం దక్కింది.
- గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్

ఉత్కంఠభరిత ఫైనల్..! భారత్‌కు శుభాకాంక్షలు. సౌతాఫ్రికా కూడా గొప్పగా ఆడింది. వెస్టిండీస్, అమెరికాలో మరిన్ని క్రికెట్ ఈవెంట్లు జరగాలి.
- మైక్రోసాఫ్ట్ చైర్మన్, సీఈవో సత్య నాదెళ్ల

వీళ్ల ఆటను మరువగలమా!

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)



క్రికెట్ టీమ్ గేమ్. 11 మంది కలిసికట్టుగా రాణిస్తేనే విజయాలు సిద్ధిస్తాయి. మరీముఖ్యంగా ప్రపంచ స్థాయి టోర్నీలైతే ఆటగాళ్లంతా సత్తా చాటితేనే లక్ష్యాలు చేరువవుతాయి. ఈక్రమంలో స్టార్ క్రికెటర్లపై సహజంగానే ఫ్యాన్స్ దృష్టి నిలుస్తుంది. వారు అద్భుతంగా ఆడితే అభిమానులు ఊగిపోతారు. వేనోళ్లా కీర్తిస్తారు. ఆకాశానికెత్తేస్తారు. కానీ స్టార్ ముద్రలేని క్రికెటర్లు ప్రతి జట్టులోనూ ఉంటారు. టీమ్ సాధించే విజయాల్లో వారి పాత్రా తక్కువేంకాదు. కాకపోతే..వారి పేరు పెద్దగా బయటకు రాదు. పొట్టి ఫార్మాట్‌లో ప్రపంచాన్ని జయించిన టీమిండియాలోనూ అలాంటి ఆటగాళ్లున్నారు.

అర్ష్‌దీప్ సింగ్: ఐపీఎల్‌లో అర్ష్‌దీప్ సింగ్ విఫలమయ్యాడు. ఫైనా..లీగ్‌లో అతడు 10.03 ఎకానమీతో భారీగా పరుగులు సమర్పించుకున్నాడు. దాంతో వరల్డ్ కప్‌లో ఏం చేస్తాడులే..అని అనుకున్నారు. కానీ మెగా టోర్నీలో మరో అర్ష్‌దీప్ సాక్షాత్కరించాడు. 25 ఏళ్ల ఈ ఎడమ చేతి పేసర్ లీగ్ దశలో చెలరేగాడు. 6.3 ఎకానమీతో ఏడు వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. అమెరికాతో మ్యాచ్‌లో 4/9తో వరల్డ్ కప్‌లో బెస్ట్ బౌలింగ్ నమోదు చేసిన భారత బౌలర్‌గా రికార్డులకెక్కాడు. సూపర్-8లో మరో ఎనిమిది వికెట్లతో అబ్బురపరిచాడు. ఆస్ట్రేలియాతో కీలక పోరులో తొలి ఓవర్‌లోనే వార్నర్ వికెట్ తీసి ప్రత్యర్థిని దెబ్బ కొట్టాడు. ఇక..సౌతాఫ్రికాతో టైటిల్ ఫైట్‌లో అర్ష్‌దీప్ బౌలింగ్ మరో స్థాయికి చేరింది. తన రెండో ఓవర్లోనే ఓ సూపర్ బంతితో సఫారీ సారథి మార్‌క్రమ్‌ను పెవిలియన్ చేర్చాడు. ఆపై ప్రమాదకర బ్యాటర్ డికాక్‌ను అవుట్ చేసి జట్టు విజయంలో ఎనలేని పాత్ర పోషించాడు. మొత్తంగా 17 వికెట్లతో టోర్నీ టాపర్‌గా నిలిచాడు.

అక్షర్ పటేల్: అద్భుత ఆల్‌రౌండ్ నైపుణ్యాలు తన సొంతమని ఈ ప్రపంచ కప్‌లో అక్షర్ పటేల్ నిరూపించాడు. ఫైనల్లో 34/3తో జట్టు అత్యంత గడ్డు స్థితిలో ఉన్నప్పుడు 47 పరుగులతో వెలకట్టలేని ఇన్నింగ్స్ ఆడాడు. ఇంగ్లండ్‌తో సెమీస్‌లో తన స్పిన్ మాయాజాలం (3/23)తో ప్రత్యర్థి టాపార్డర్ వెన్ను విరిచి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. పాకిస్థాన్‌తో స్వల్ప స్కోర్ల మ్యాచ్‌లో పంత్ తర్వాత అక్షర్ (20)దే టాప్ స్కోర్.

శివమ్ దూబే: ఐపీఎల్‌లో ధనాధన్ బ్యాటింగ్‌తో ప్రత్యర్థి బౌలర్ల గుండెల్లో గుబులు పుట్టించిన దూబే..వరల్డ్ కప్‌లో ఆ జోరు కొనసాగించకపోవడంతో తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నాడు. అయితే ఫైనల్లో 16 బంతుల్లోనే చేసిన 27 పరుగులు జట్టుకు ఎంతో విలువైనవో చెప్పాల్సిన పనిలేదు.

రిషభ్ పంత్: ఘోర రోడ్డు ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడి ప్రపంచ కప్‌లాంటి ప్రతిష్ఠాత్మక టోర్నీలో కీపర్‌గా బరిలో దిగడం ఆషామాషీ కాదు. ఇంగ్లండ్‌తో సెమీఫైనల్లో కళ్లుమూసి తెరిచేలోపు మొయిన్ అలీని స్టంపింగ్ చేసిన తీరు పంత్ అమోఘ కీపింగ్ నైపుణ్యాలకు తార్కాణం. పాకిస్థాన్ మ్యాచ్‌లో స్టార్ బ్యాటర్లు చేతులెత్తేసిన వేళ..42 పరుగులతో బాధ్యతాయుత ఇన్నింగ్స్‌తో ఆదుకున్నాడు.

బాలి గోల్ఫ్ విజేత కేయ



విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): బాలి అంతర్జాతీయ జూనియర్ గోల్ఫ్ చాంపియన్‌షిప్‌ను విశాఖపట్నం అమ్మాయి బి.కేయ కుమార్ కైవసం చేసుకుంది. జాతీయ పోటీల్లో ఢిల్లీకి ప్రాతినిధ్యం వహిస్తున్న కేయ, ప్రస్తుత ర్యాంకింగ్స్‌లో టాప్-15లో ఉంది. కేయ విశాఖకు చెందిన ఐఆర్ఎస్ అధికారి బి.శ్రీనివాస్ కుమార్తె.

తిరుమలలో గంభీర్



తిరుమల (ఆంధ్రజ్యోతి): టీమిండియా మాజీ క్రికెటర్ గౌతమ్ గంభీర్ ఆదివారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నాడు. ఆలయం ముందు గంభీర్‌తో సెల్ఫీలు తీసుకునేందుకు అభిమానులు భారీగా ఎగబడ్డారు. సెక్యూరిటీ సహాయంతో అతను ఆలయం నుంచి తిరిగి వెళ్లారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రోహిత్‌శర్మ, కోహ్లీ, ద్రవిడ్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపాడు. టీ20 గెలవడం కంటే రిటైర్మెంట్‌కు మంచి సందర్భం ఏముంటుందని అన్నాడు.

క్వార్టర్‌ఫైనల్లో జర్మనీ

» యూరో చాంపియన్‌షిప్

డార్ట్‌మండ్ (జర్మనీ): ఆతిథ్య జర్మనీ జట్టు యూరోపియన్ చాంపియన్‌షిప్‌లో క్వార్టర్‌ఫైనల్‌కు దూసుకుపోయింది. ఆదివారం జరిగిన రౌండ్-16 మ్యాచ్‌లో జర్మనీ 2-0తో డెన్మార్క్‌ను చిత్తు చేసింది. 53వ నిమిషంలో లుకాస్ హెవెట్జ్ పెనాల్టీ కిక్‌ను గోల్‌గా మలచగా, 68వ నిమిషంలో ముసియాలా రెండో గోల్ అందించాడు. అంతకుముందు మరో మ్యాచ్‌లో స్విట్జర్లాండ్ 2-0తో డిఫెండింగ్ చాంపియన్ ఇటలీకి షాకిచ్చి క్వార్టర్స్‌లో అడుగుపెట్టింది.

చెలరేగిన స్నేహ్ రాణా

8 వికెట్లతో సఫారీల పనిపట్టిన స్పిన్నర్



» దక్షిణాఫ్రికా ఫాలో ఆన్ » లుస్ సెంచరీ

2 టెస్ట్ క్రికెట్‌లో అత్యుత్తమ ప్రదర్శన చేసిన మూడో బౌలర్‌గా స్నేహ్ రాణా (8/77). భారత్‌కే చెందిన నీతూ డేవిడ్ (8/53) టాప్‌లో ఉండగా, ఆస్ట్రేలియా ప్లేయర్ ఆష్లే గార్డ్‌నర్ (8/66) తర్వాత రాణా మూడో స్థానంలో నిలిచింది.

చెన్నై: స్పిన్నర్ స్నేహ్‌రాణా (8/77) ఏకంగా ఎనిమిది వికెట్లతో విజృంభించడంతో భారత్‌తో జరుగుతున్న ఏకైక టెస్టులో దక్షిణాఫ్రికా ఫాలోఆన్‌లో పడింది. ఓవర్‌నైట్ స్కోరు 236/4తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన సౌతాఫ్రికా 266 పరుగులకు ఆలౌటైంది. రెండో రోజు 3 వికెట్లు సాధించిన రాణా, మూడోరోజు ఇంకో 5 వికెట్లతో అదరగొట్టింది. కాప్ (74) వెనుదిరగడంతో.. మరో 17 పరుగుల తేడాతో సౌతాఫ్రికా ఇన్నింగ్స్ ముగిసింది. దీప్తి శర్మకు 2 వికెట్లు దక్కాయి. తర్వాత ఫాలోఆన్ ఆడుతూ 337 పరుగుల లోటుతో రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన సౌతాఫ్రికా జట్టులో టాపార్డర్ బ్యాటర్ సునె లుస్ (109) శతకం సాధించింది. ఆదివారం ఆట చివరికి ఆ జట్టు 232/2 స్కోరు చేసింది. కెప్టెన్ లారా వొల్వార్ట్ (93), మరిజానె కాప్ (15) క్రీజులో ఉన్నారు. భారత స్కోరు 603/6 డిక్లేర్డ్‌కు సఫారీలు 105 రన్స్ దూరంలో ఉన్నారు. ఓపెనర్ అన్నెక్ బాష్ (9)ను దీప్తి ఎల్బీ చేసింది. అయితే, మరో ఓపెనర్ లారా, వన్‌డౌన్ బ్యాటర్ లుస్ రెండో వికెట్‌కు 190 పరుగుల భాగస్వామ్యంతో జట్టును ఆదుకొన్నారు. సెంచరీ సాధించిన లుస్‌ను హర్మన్‌ప్రీత్ బౌల్డ్ చేసింది.

భారత్ తొలి ఇన్నింగ్స్: 603/6 డిక్లేర్డ్; **దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్:** 266 ఆలౌట్ (మరిజానె కాప్ 74, లుస్ 65; రాణా 8/77, దీప్తి 2/47); దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్: 85 ఓవర్లలో 232/2 (సునె లుస్ 109, వొల్వార్ట్ 93 బ్యాటింగ్; హర్మన్‌ప్రీత్ 1/24, దీప్తి 1/56).

ఫేవరెట్ అల్కారజ్

మహిళల్లో స్వియటెక్, గాఫ్

నేటి నుంచే వింబుల్డన్

లండన్: గ్రాండ్‌స్లామ్ టెన్నిస్‌కు తలమానికమైన వింబుల్డన్ టోర్నీ సోమవారం ప్రారంభం కానుంది. పురుషుల విభాగంలో డిఫెండింగ్ చాంప్ కార్లోస్ అల్కారజ్, వరల్డ్ నెం.1 జానిక్ సిన్నర్‌తోపాటు 7సార్లు విజేత జొకోవిచ్, స్థానిక స్టార్ ఆండీ మర్రే బరిలోకి దిగుతున్నారు. గాయం కారణంగా ఫ్రెంచ్ ఓపెన్ నాలుగో రౌండ్ నుంచి అర్ధంతరంగా వైదొలగిన జొకోవిచ్‌పై పూర్తి అంచనాలు లేవు. అలాగే టాప్ సీడ్ సిన్నర్, మూడో సీడ్ అల్కారజ్ సెమీఫైనల్లో తలపడే అవకాశాలున్నాయి. జొకో ఫామ్ అంతంతమాత్రంగా ఉండడంతో ఈ పార్శ్వంనుంచి ఊహించని విధంగా మరో ఆటగాడు ఎవరన్నా ఫైనల్ చేరే చాన్సుంది. మహిళల విభాగంలో ప్రపంచ నెంబర్ వన్ స్వియటెక్, నెం.2 కొకో గాఫ్‌లకు టైటిల్ అవకాశాలు మెండుగా ఉన్నాయి.

మెయిన్ డ్రాలో నగాల్: భారత స్టార్ సుమిత్ నగాల్ పురుషుల సింగిల్స్ మెయిన్ డ్రాలో తలపడనున్నాడు. గుణేశ్వరన్ తర్వాత మెయిన్ డ్రాలో అదృష్టాన్ని పరీక్షించుకుంటున్న తొలి భారత ఆటగాడు నగాల్.



అల్కారజ్



కొకా గాఫ్

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

సోమవారం | 1-7-2024 | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ**


మోదీ తన ఎక్స్ ఖాతాలో షేర్ చేసిన ఫొటో

అరకు కాఫీకి ప్రధాని మోదీ ఫిదా!

రుచి అద్భుతమంటూ కితాబు

ప్రపంచంలోని కాఫీ ప్రియులంతా రుచి చూడాలి

ఆంధ్ర సీఎం చంద్రబాబుతో కలిసి తాగాను

'మన్ కీ బాత్'లో ప్రత్యేక ప్రస్తావన 9

మరో కప్పు కోసం ఎదురు చూస్తున్నా: బాబు


వెంకయ్యపై పుస్తకాన్ని విడుదల చేస్తున్న మోదీ

ప్రజల మనిషి వెంకయ్య

భరతమాత సేవలోనే ఆయన జీవన ప్రస్థానం

ప్రజాసేవ పట్ల తిరుగులేని నిబద్ధత గల నేత

ఆటుపోట్లను అధిగమించగల సమర్థుడు

మాజీ ఉపరాష్ట్రపతిపై ప్రధాని మోదీ వ్యాసం

వెంకయ్యనాయుడి వాక్పటిమ.. సాటిలేనిది

జన్మదిన వేడుకల సందర్భంగా ప్రధాని ప్రశంస

వెంకయ్యపై 3 పుస్తకాల ఆవిష్కరణ 8

'ప్రపంచ' వీరులకు రూ. 125 కోట్లు

టీమిండియాకు బీసీసీఐ భారీ నజరానా

అంతర్జాతీయ టి20లకు జడేజా గుడ్‌బై 11

విరాట్ కోహ్లి, రోహిత్‌శర్మ బాటలో వీడ్కోలు

స్వదేశీ న్యాయం

నేటి నుంచి అమలులోకి కొత్త నేరచట్టాలు

భారతీయ న్యాయ సంహిత, నాగరిక్ సురక్ష, సాక్ష్య అధినియమ్

ఐపీసీ ఇక బీఎన్ఎస్, సీఆర్‌పీసీ–బీఎన్ఎస్ఎస్, ఎవిడెన్స్ యాక్ట్– బీఎస్ఏగా మార్పు

పోలీసుల చేతికి మరిన్ని అధికారాలు

దేశద్రోహం రాజద్రోహంగా పరిగణన

నిందితుల చేతులకు బేడీల పునరుద్ధరణ

కొత్త చట్టాలపై పలు వర్గాల అభ్యంతరాలు

ఇవి మన కోసం చేసుకున్న చట్టాలు: అమిత్‌షా



న్యూఢిల్లీ, జూన్ 30: దేశ నేర న్యాయవ్యవస్థలో విస్తృతమైన మార్పులు తీసుకొచ్చే కొత్త నేర చట్టాలు సోమవారం నుంచి అమలులోకి రానున్నాయి. బ్రిటిష్ కాలం నాటి ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ) ఇక మీదట భారతీయ న్యాయ సంహితగా (బీఎన్ఎస్), కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్ (సీఆర్‌పీసీ) భారతీయ నాగరిక్ సురక్ష (బీఎన్ఎస్ఎస్)గా, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ భారతీయ సాక్ష్య అధినియమ్ (బీఎస్ఏ)గా మారనున్నాయి. అయితే, వివిధ వర్గాల నుంచి నూతన చట్టాలపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. వీటి అమలును నిలిపివేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో ఇప్పటికే ఓ పిటిషన్ దాఖలైంది. గత ఏడాది డిసెంబరులో సదరు

మిగతా 9వ పేజీలో...


'బెయిల్' కఠినం

పోలీసు కస్టడీలో 40-60 రోజులు

డిజిటల్ ఉపకరణాలను ట్యాంపర్ చేసి సాక్ష్యాధారంగా వాడే ముప్పు

కొత్త చట్టాల్లో ఉన్న అంశాలివీ..

అమలు వాయిదా కోరుతూ సుప్రీం కోర్టులో పిటిషన్



పింఛన్ల పండగ నేడే

అవ్వాతాతల చేతికి 7 వేలు

ఉదయమే లబ్ధిదారుల ఇళ్ల వద్ద పంపిణీ

ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా నెలకు 4 వేల పెన్షన్

గత 3 నెలల 3 వేలు కలిపి ఒకేసారి 7 వేలు

రాష్ట్రవ్యాప్తంగా సచివాలయ ఉద్యోగుల పంపిణీ

ప్రభుత్వంలో సరికొత్త అధ్యాయం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రవ్యాప్తంగా సోమవారం లబ్ధిదారులకు పెంచిన పెన్షన్లు పంపిణీ చేయనున్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం పెనుమాక గ్రామంలో ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సచివాలయ ఉద్యోగులు లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పెన్షన్లు పంపిణీ చేయనున్నారు. మొత్తం 1,20,097 మంది గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులతో పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మొదటిరోజే చాలావరకు పెన్షన్లు పంపిణీ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత, కల్లుగీత కార్మికులు, మత్స్యకారులు, కళాకారులు, డప్పు కళాకారులు, ట్రాన్స్‌జెండర్లు వంటి వారికి ఇకపై ప్రతినెలా రూ.4 వేలు పెన్షన్ ఇవ్వనున్నారు. దివ్యాంగులకు రూ.3 వేల నుంచి ఒకేసారి

మిగతా 10వ పేజీలో...

టీడీపీ కూటమి ప్రభుత్వం సామాజిక పింఛన్ల పంపిణీలో సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టబోతోంది. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఒక్కో పెన్షన్ దారుకు నెలకు రూ.4 వేలు ఇవ్వనుంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పెంచిన పెన్షన్ 4 వేలతో పాటు గత మూడు నెలలకు 3 వేలు (నెలకు 1000) బకాయి కలిపి ఒకేసారి 7 వేలు అందజేయనుంది.


గుంటూరు జిల్లా పెనుమాకలో చంద్రబాబు నుంచి పెన్షన్ అందుకోనున్న తండ్రీకూతురు

65 లక్షల మందికి రూ.4,408 కోట్ల పింఛను

వలంటీర్లపై త్వరలోనే నిర్ణయం: మంత్రి పార్థసారథి

నేడు పెనుమాకకు చంద్రబాబు

ఉదయం 6 గంటలకే స్వయంగా పెన్షన్ అందజేత

ఆ తర్వాత గ్రామంలో రచ్చబండ నిర్వహణ

ఇంత నష్టం ఎలా జరగనిచ్చారు?

గోదావరికి భారీ వరద వస్తుందని తెలుసు కదా!

పోలవరం స్థితిపై అంతర్జాతీయ నిపుణుల విస్మయం

గ్యాప్-1, కాఫర్ డ్యాంల పరిశీలన

నేడు గ్యాప్-2, డయాఫ్రం వాల్ సందర్శన 7

రేపు, ఎల్లుండి ప్రాజెక్టు నష్టాలపై అధ్యయనం

వీసీలు.. ఛీఛీలు 10

వైసీపీ కార్యాలయాలుగా పలు వర్సిటీలు.. వివాదాస్పద వీసీగా ప్రసాదరెడ్డి

సజ్జల అనుచరుడిగా ఏఎన్‌యూ వీసీ.. అర్హత లేకున్నా ఎస్వీయూకు శ్రీకాంత్‌రెడ్డి

భారతి బంధువుకు రిజిస్ట్రార్ పోస్టు.. వైసీపీ హయాంలో పదవుల పందేరం

తీవ్ర ఆరోపణల నేపథ్యంలో ఇప్పుడు స్వచ్ఛందంగా వీసీల రాజీనామాలు

వాటికి 'రోత పత్రిక' రాజకీయ రంగు.. ప్రభుత్వ ఒత్తిడి అంటూ తప్పుడు రాతలు

బాబు సర్కారు కోరలేదు.. ఒత్తిడీ లేదు.. గత తప్పులకు ప్రాయశ్చిత్తంగానే పక్కకు

బొమ్మలు: అక్బర్

చొక్కా పాతబడుతోంది



అప్పటికీ
మెలకువతోనే వున్నాను
కొన్నిచోట్ల వెన్నెముకను మడత పెట్టుకుని
కొన్నిచోట్ల తలను నేలలో పాతుకుని
చొక్కా చిరిగిపోకుండా కాపాడుకుంటూనే వున్నాను

కాలర్ దగ్గర పడ్డ మరకలు చెరిగేలా లేవు
పదేపదే జీవితంతో గొడవపడుతున్నానేమో
గుర్రాన్ని లొంగదీసుకున్నట్టు
కుక్కపిల్లను వెంట తిప్పుకున్నట్టు
పొయ్యిలో కాల్చి ఇనుపముక్కను ఇష్టానికి సర్దుకున్నట్టు
చొక్కాను సర్దుకోవడం నా వల్ల కావడం లేదు

అర్ధరాత్రి ఒంటరిగా చిక్కినప్పుడు
పది పది తలల నా చీకటి రూపం
చొక్కాను బద్దలుకొట్టుకునివచ్చి భయపెడుతోంది

ఇస్త్రీ చేసిన మడతల దగ్గర
దారాలు దారాలుగా తెగిపోతున్నాను
ఉడుకుడుకు గంజిలో నానబెట్టి ఎంతలా ఉతుక్కున్నా
చంకల లోతుల్లో దొరికిపోతున్నాను

బటన్ల దగ్గర దారం చిట్లిన చొక్కా
శరీరాన్ని దాచలేకపోతోంది
ఒకానొక కీలకఘట్టాన్ని చేరుకున్న సంకేతస్పర్శ
శీతాకాలపు మంచులా లోపలికి జొరబడుతోంది
ఉన్నదున్నట్టు
ప్రపంచం ముందు బయట పడిపోతున్నాను

నా చొక్కాకు ఏదో అయ్యింది
నటన మీద ఆకర్షణ మీద దృష్టి తగ్గినట్టుంది
పోనీ ఒకసారి
చొక్కా లేకుండా వేదిక మీదకు వెళ్ళిపోనా?
ఎపుడోసారికి నగ్నంగా మెరిసి మాయమయ్యే
మట్టిపాత్రలమేగా అందరం.

రాధ
83672 82012

విరసం ఆవిర్భావ సభ

విప్లవ రచయితల సంఘం ఆవిర్భావ సభ జూలై 4 ఉ.10గం.ల నుంచి సా.6గం.ల వరకు హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగుతుంది. 'వికసిత భారత్ @ హిందూ రాష్ట్ర' అంశంపై ప్రసంగాలు ఉంటాయి. హెత్మామ్, వరలక్ష్మి, పాణి, రివేరా, అరసవిల్లి కృష్ణ, శివరాత్రి సుధాకర్, రాంకీ, రాము, సాగర్ మాట్లాడతారు.

రివేరా

'పండుటాకు' కథా సంపుటి

కాట్రగడ్డ దయానంద్ కథా సంపుటి 'పండుటాకు - గుండ్లకమ్మ తీరాన' ఆవిష్కరణ సభ జూలై 4 సా.6.30గం.లకు అన్నమయ్య కళావేదిక, శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానం, బృందావన గార్డెన్స్, గుంటూరులో జరుగుతుంది. ఆవిష్కర్త పాపినేని శివశంకర్, అధ్యక్షత కందిమళ్ళ శివప్రసాద్. సభలో డి.ఎస్.వి.ఆర్. మూర్తి, వాసిరెడ్డి నవీన్, వి. ప్రతిమ పాల్గొంటారు.

మోదుగుల రవికృష్ణ

'సముద్ర నానీలు'

కిన్నెర ఆర్ట్ థియేటర్స్ నిర్వహణలో కొక్కుల శివకృష్ణ 'సముద్ర నానీలు' పుస్తకావిష్కరణ జూలై 7 ఉ.10గం.లకు రవీంద్రభారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. ఆవిష్కర్త ఎన్. గోపి; అధ్యక్షత సూర్యా ధనంజయ; విశిష్ట అతిథులు పోరెడ్డి రంగయ్య, కుడికాల వంశీధర్; గౌరవ అతిథులు సుంకరి కృష్ణ ప్రసాద్, చిత్తలూరి సత్యనారాయణ.

మద్దాళి రఘురాం

"రోజుకు పద్దెనిమిది గంటలు రాసేవాడిని"

పి. చంద్రశేఖర అజాద్



బాల సాహిత్యం రాయగలగటానికి మీ చుట్టూ పిల్లల బాల్యం, మీ బాల్యం ప్రభావం ఎంత?

నేను బాల సాహిత్యం రాయటానికి ప్రధానమైన సోర్స్ అప్పటి నుండి ఇప్పటి వరకు పిల్లలే. వారిని నిశితంగా గమనిస్తుంటాను. వారి మాటలు, అల్లర్లు, కోరికలు, కోపతాపాలు ఇవన్నీ దగ్గరగా చూస్తుంటాను. అవే అనేక కథలూ, నవలలుగా రూపొందాయి. పెద్దల కోసం రాసినవయినా, 'మంచుమైదానం', 'బాబూ ఓ బాబూ', 'మా తాత-గీత-మాప్రయాణం' ఇంకెన్నో నవలల్లో పిల్లలు ప్రధానపాత్రధారులు. నా మనవరాలు సాన్వి అజాద్ నాకు అయిదారు నవలలకు ప్రేరణ అయింది. నా పిల్లలు, వారితో స్నేహం చేసినవారు... ఇలా అనేకమంది. వారి భావాలు వింటున్నప్పుడు ఆశ్చర్యం కలుగుతుంది. వారిని చిత్రించే ప్రయత్నం చేశాను.

ఇంక నా బాల్యం, నా కష్టాలు, కన్నీళ్లు నా ఆస్తి. మాది పెద్ద మైదానం. అక్కడ గట్టు మీద మూడు చింత చెట్లు- మా మైదానంలో అన్ని కులాలు, మతాల, వర్గాల ప్రజలు వున్నారు. ఓ రకంగా ఆర్.కె. నారాయణ్ 'మాల్గుడి డేస్' లాంటి జీవితం దగ్గరగా మా రేపల్లెలో చూశాను. నాన్న నా ఏడు సంవత్సరాల వయసులో చనిపోయారు. అప్పుడు మృత్యువు అంటే తెలియదు. నాన్నను ప్రకృతిలో వెతుక్కున్నాను. క్రీస్తులా పునరుత్థానం చెందుతాడని నమ్మకం. ఇదంతా 'మనోప్రస్థానం' నవలలో వుంటుంది. అలా మా మైదానంలో ఇప్పటి వరకు తవ్వుకుంది స్వల్పమే. ఇంకెన్నో అనుభవాలు వున్నాయి. నా జీవితం నాన్న కమ్యూనిస్టు నేపథ్యంలో నన్ను తీవ్రవాదంలోకి నెట్టలేదు. సమన్వయాన్ని నేర్పాయి. నాకు కాస్త గౌరవాన్ని ఇచ్చింది బాల్యం-పిల్లలు. అలాగే మా అమ్మ విజయలక్ష్మి లక్ష్మణరావు. నాతో పాటు రక్తం పంచుకు పుట్టిన సోదరులు-అక్కలూ, వీరందరి తర్వాత నా భార్య జానకి, నా పిల్లలు, మనవడూ, మనవరాళ్లు, స్నేహితులు, గురువులు వాళ్లందరూ లేకపోతే నేను ఏమైపోయేవాడినో తెలియదు.

మీరు చదివిన బాలసాహిత్య రచనల్లో మిమ్మల్ని ప్రభావితం చేసినవేమిటి?

చిన్నతనంలో 'చందమామ', 'బాలమిత్ర' లాంటి పత్రికలు అందుబాటులో వుండేవి. అలాగే ఆంధ్రపత్రికలో 'రామచరిత మానస్' అని సీరియల్‌గా వస్తుండేది. నెల రోజులు, వారం రోజులు ఎదురు చూసేవాళ్లం. మా రేపల్లె గ్రంథాలయానికి వెళ్లాక అక్కడ పిల్లల నవలలు దొరికాయి. ఎవరు రాశారో తెలియదు. రచయితల పేర్లు చూసేవాడ్ని కాదు. అందులో అద్భుత ప్రపంచమే ప్రధానం. అప్పట్లోనే కథలు రాయాలనిపించింది. పత్రికలకు ఎలా పంపాలో తెలియదు. పది సంవత్సరాల వయసులో కొన్ని రచనలు చేసినా అవన్నీ పోయాయి. తర్వాత కాలంలో సోవియట్ రచనలు. అవి పిల్లలవి కావచ్చు, పెద్దవారి కోసం కావచ్చు. తక్కువ ధరలో దొరికేవి. అవి చదవటం వలన నాకు సరళత్వం వచ్చింది. అలాగే సౌందర్య దృష్టి వచ్చింది. ఆ రచనలు ఎంత హాయిగా వుంటాయో- పోప్లార్ చెట్లు, తొలి ఉపాధ్యాయుడు, జమీల్యా లాంటివి. తర్వాత 'పిల్లలకే నా హృదయం అంకితం' లాంటి పుస్తకాలు. రవీంద్రుడి నుండి నాకు అందుబాటులోకి వచ్చిన వివిధ దేశాల మహా రచయితలు పిల్లల కోసం రచించిన సాహిత్యం. అలాగే రైలుబడి లాంటి పుస్తకాలు. ఇవన్నీ నా జీవితాన్ని మలుపు తిప్పాయి.

మీరు వందకుపైగానే పుస్తకాలు రాశారు. ఇంత విరివిగా రాయటానికి రచయితకి ఎలాంటి శిక్షణ, క్రమశిక్షణ అవసరం?

నేను మన మహా రచయితల, రచయిత్రుల పుస్తకాలు చాలా కాలం చదవలేదు. దానికి కారణం నాకు అందుబాటులో లేకపోవటం. పందొమ్మిది సంవత్సరాల లోపు పెళ్లి అయింది. ఇద్దరు పిల్లలు. ఉద్యోగం లేదు. ఆస్తులు అమ్మి ఉద్యమాల్లో పాల్గొని, ఆరు సంవత్సరాలు జైలు జీవితం గడిపి, పార్టీ చీలక ముందు మా తండ్రి చనిపోయారు. అయిదుగురు పిల్లలం. కేవలం డెబ్బై అయిదు రూపాయలతో మా అమ్మ మమ్మల్ని పెంచింది. నాలుగు ముక్కలు కార్డులో రాయటానికి మా అమ్మ గంట తీసుకునేది. తను చదువుకుంది మూడో తరగతి. అందుకోసం నేను రాసే ప్రతి వాక్యం వెనుక మా అమ్మ వుంది. రోడ్డు మీద నిలబడిన నన్ను పెళ్లి చేసుకున్న నా భార్య జానకి వుంది. నేను అనేక రకాల ఉద్యోగాలు చేశాను. 1983 నుండి నా రచనలు వెలుగు చూడటం మొదలు పెట్టాయి. అక్కడ నుండి వెనక్కి తిరిగి చూసుకోలేదు. నవలను రెండు మూడు రోజుల్లో రాశాను. ఓ పని మొదలు పెడితే అది పూర్తి అయ్యేదాకా అశాంతి. టీవీకి రాసినా సాహిత్యాన్ని వదలలేదు. రోజుకు పద్దెనిమిది గంటలు రాసేవాడిని.

మనం ఎంత కష్టపడ్డాం అనేది పాఠకులకు అనవసరం. మనం ఏ రంగాన్ని ప్రేమిస్తే ఆ రంగంలో మన ముద్ర వేయాలంటే వ్యక్తిగత ఆనందాల్ని పక్కన పెట్టాలి. నా ఆరోగ్యం దెబ్బతింది. అయినా నాకు దిగులు లేదు. అలాగే ఎప్పటికప్పుడు ప్రక్రియలు మార్చాలి. అప్పుడు ఫ్రెష్‌గా వుంటాం. మళ్లీ అక్కడ నేర్చుకుంటాం. ఆ రకంగా అన్ని ప్రక్రియల్లోనూ రచనలు చేశాను, చేస్తున్నాను. ఇంకా ఓపిక వుంది. అందుకే క్రమశిక్షణ అనేది ఎవరికి వారు పాటించాల్సింది. శిక్షణ అవసరమే. అప్పట్లో మాకు బతుకు సమస్య. పడుతూ లేస్తూ ముందుకు నడిచాను. పుస్తకాలు, సంభాషణలు, ప్రజలు వీరందరూ ఎవరికయినా అదృశ్య గురువులు. ప్రత్యక్షంగా కూడా. నాకు ఆంగ్లం రాదు. అది వచ్చి వుంటే బాగుంటుంది కదా అనిపిస్తుంది.

ముందుగా నన్ను ఆదరించిన పత్రికలకు, సంపాదకులకు కృతజ్ఞతలు చెప్పుకోవాలి. అప్పట్లో రచయితగా గుర్తింపు పొందటానికి అవకాశాలు తక్కువ. కమర్షియల్ సాహిత్యం, మహిళా రచయిత్రుల కాలం అది. స్పేస్ లేదు. అప్పుడు ఖాళీగా బాలసాహిత్యం కనిపించింది. అప్పట్లో ఈ అవార్డులు లేవు. పిల్లల నవలలను ఆదరించి వుంటే మరో పది నవలలు రాసి వుండేవాడిని కదా అనిపిస్తుంది.

నేను ఏ సంస్థల్లోనూ సభ్యుడ్ని కాదు. అందుకు కారణం ఆ నియమాలకు తగ్గట్లు పనిచేసే అవకాశాలు లేకపోవటం. అలాంటి సంస్థల్లో కొన్ని పరిమితులు వుంటాయి. అందుకే స్వేచ్ఛగా, విస్తృతంగా రచనలు చేశాను. ప్రజలకు వ్యతిరేకంగా రచనలు వుండకుండా జాగ్రత్త పడుతుంటాను.

బాల సాహిత్య రచన చేసేటప్పుడు మీ తక్కిన రచన భాషశైలులు నుంచి ఏ విధంగా భిన్నంగా రాస్తారు?

బాలల కోసం రచన అనుకున్నప్పుడు ప్రధానంగా పది సంవత్సరాలు పైబడిన పిల్లల్ని దృష్టిలో వుంచుకుంటాను. సాధ్యమైనంత సరళంగా భాష వుండేలా జాగ్రత్తపడతాను. 'అందమైన పూలతోట' నవల రాసేటప్పుడు మా పిల్లల్ని పక్కన కూర్చోపెట్టుకుని స్థూలంగా కథ చెప్పి ఇప్పుడు మీరయితే ఏం చేస్తారు అని అడిగాను. వారు చెప్పిన సమాధానాలు విన్నాక నవల మొదలయింది. ఇది అప్పట్లో బాలజ్యోతి పత్రికలో మొదటి బహుమతి పొందిన నవల. అప్పటికీ, ఇప్పటికీ అది ప్రయోగాత్మక రచన. మరో ప్రయోగం 'మా హృదయం'. ఇది కూడా ఎనిమిది నుండి పన్నెండు సంవత్సరాలలోపు పిల్లల దృష్టి కోణం నుండి రాసింది. స్వాతి మాసపత్రికలో చివరి సీరియల్. అమ్మ నుండి మొదలై నాన్నతో ఇది ముగుస్తుంది. దాదాపు 48 అంశాలు. ముందు మా పిల్లలు సృజన్, స్పందన్‌లతో రెండు అంశాల మీద రాయించాను. ఆ భాషను అర్థం చేసుకున్నాను. నేను కూడా ఒకప్పటి పిల్లవాడిని కాబట్టి చిన్నప్పటి నా ఆలోచనలు, అనుభూతులు జోడించాను. అది కూడా బాల సాహిత్యంలో ప్రయోగాత్మక రచనగా నిలిచింది. ఇవన్నీ నాలుగు దశాబ్దాల క్రితం రచనలు.

పిల్లలు ఫ్యాంటసీని ఇష్టపడతారు. వాటితోపాటు నేను ఆధునిక పిల్లల జీవితాల గురించి రాశాను. 'జమీందారు కోట', 'దేవతా ఓ దేవతా', 'ఆట', 'పిల్లల పుస్తకం', 'దారితప్పిన పిల్లవాడు', 'మాయాలోకం' ఇలాంటివే. నా ప్రతి నవలలోనూ అణగారిన వర్గాల పిల్లల పాత్రలు వుంటాయి.

నేను బాల సాహిత్యం రాయటానికి ప్రధానమైన సోర్స్ పిల్లలే. వారి మాటలు, అల్లర్లు, కోరికలు, కోపతాపాలు ఇవన్నీ దగ్గరగా చూస్తుంటాను. అవే అనేక కథలూ, నవలలుగా రూపొందాయి. నా మనవరాలు సాన్వి అజాద్ నాకు అయిదారు నవలలకు ప్రేరణ అయింది. నా పిల్లలు, వారితో స్నేహం చేసినవారు... ఇలా అనేకమంది. వారి భావాలు వింటున్నప్పుడు ఆశ్చర్యం కలుగుతుంది. వారిని చిత్రించే ప్రయత్నం చేశాను.



2024 కేంద్ర సాహిత్య అకాడమీ - బాల సాహిత్య పురస్కారానికి పి. చంద్ర శేఖర అజాద్ నవల 'మాయాలోకం', కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారానికి రమేశ్ కార్తీక్ నాయక్ కథా సంపుటి 'ఢావ్లో - గోర్ బంజారా కథలు' ఎంపికయ్యాయి. ఈ సందర్భంగా అవార్డులు పొందిన ఇద్దరినీ వివిధ ఇంటర్వ్యూ చేసింది.



"రాసిన దాని కంటే, నేను ఎవరు అనేదే గ్లోరిఫై అవుతున్నది!"

రమేశ్ కార్తీక్ నాయక్

మీ 'ఢావ్లో' కథా సంపుటిలో గోర్ బంజారాల జీవితాన్ని చిత్రించేందుకు తెలుగు భాషను వాడాల్సి వచ్చినప్పుడు ఎలాంటి సవాళ్ళు ఎదుర్కొన్నారు? మీకంటే ముందు ఈ వర్గం రిప్రెజెంటేషన్ ఈ భాషలో అతితక్కువ ఉండటం వల్ల కథలు రాయటంలో ఇబ్బందులేమైనా ఎదురయ్యాయా?

కథలు రాయడం మొదలు పెట్టినప్పుడు, మొదటి రెండు కథలు తెలుగు లోనే రాసాను. ఆ కథలను తోట అపర్ణ గారికి చూపిస్తే, 'ఇవి తెలుగు కథలా! బంజారా కథలా!' అని అడిగారు. అవి మావాళ్ళ కథలని చెప్పాను. 'మరి మీవాళ్ళు తెలుగు భాష అంత స్పష్టంగా మాట్లాడుతారా' అని ప్రశ్నించారు. అప్పుడు మా వాళ్ల మాట్లాడే తెలుగును కథలోని పాత్రలకు అనుగుణంగా వాడాలని నిశ్చయించుకున్నాను. అలా నిజామాబాద్‌లో బంజారాలు మాట్లాడే భాషని కథలో వాడుతూ వచ్చాను. బంజారా పదాలను పరిచయం చేయాలనుకుని కథల్లో చొప్పించిన కొన్ని పదాలను తర్వాత వద్దని తీసేస్తే, ఆచార్య సూర్యాధనంజయ్ గారు, ఉంచిన వాటికి కింద ఫుట్ నోట్ ఇస్తే బాగుంటుందన్నారు. నేనేమో పూర్తిగా ఆంధ్ర తెలుగుకి అలవాటు పడిపోయాను, చుట్టూ ఉన్నవాళ్లు మాట్లాడేది కూడా అలాగే ఉండడంతో, ఒకరకంగా తెలుగంటే అదే అనేంత అలవాటు పడిపోయాను. తెలంగాణ జిల్లాల్లోని తండాల్లో మా వాళ్ళు మాట్లాడే భాష ప్రత్యేకంగా ఉంటుంది. కానీ అదే భాషని రాద్దాం అనుకున్నపుడు, నాకు తెలియకుండానే భాష షిఫ్ట్ అయిపోయేది.



సవాళ్ళు ఎదుర్కొన్నానని అనను కానీ, ఎడ్యుకేట్ అయ్యానని అనుకుంటున్నాను. రిప్రెజెంటేషన్ తక్కువ ఉండడం వల్ల ఇబ్బందేమీ కాలేదు. ఎందుకంటే ఆల్రెడీ ఒక వేళ ఉండి ఉంటే పాఠకులలో ఓ అభిప్రాయం ఏర్పడిపోయి ఉండేది. అప్పుడు కొత్తగా వస్తున్న సాహిత్యాన్ని వారు అక్కున చేర్చుకున్నా, బంజారాల మీద వారికి ముందు నుండీ ఉన్న అభిప్రాయం మారుతుందా అన్నది కచ్చితంగా చెప్పలేము. అలాగని నాకంటే ముందు రాయబడిన సాహిత్యం మా జీవితం కాదని అనను. అలాగని నేను రాస్తున్నది పూర్తిగా బంజారా జీవితమనీ అనను. సగం మాత్రమే బంజారా, విగిలింది తెలుగు జీవితమే. వీలైనంత వరకు సంపూర్ణ బంజారా జీవితాన్ని అక్షరీకరించాలన్నదే నా ఆరాటం.

సాహిత్యం వైపు మీ తొలి అడుగుల గురించి చెప్పండి?

2009-10లో తెలంగాణ ఉద్యమం కొనసాగుతున్న కాలం. శ్రీ విజయ సాయి హై స్కూల్ (బోధన్) లో నేను హాస్టల్‌లో ఉంటూ చదుకుంటున్న రోజులవి. అప్పటికే బొమ్మలు స్కెచ్‌లు వేసే వాడిని. మొదట బొమ్మలే వేశాను, కానీ ఎందుకో తర్వాత వాటికి రెండు లైన్ల క్యాప్షన్స్ రాయాలని అనిపించి, రాయడం అలవాటు చేసుకున్నాను. తర్వాత తెలంగాణ ఉద్యమానికి సంబంధించి పంపా సాహితి పీఠం (బోధన్) వారి కోసం 'తెలంగాణ ఔన్నత్యం' అనే కవితని రాస్తే మా తెలుగు టీచర్ శిరీష ఎడిట్ చేశారు. ఆ తర్వాత అలానే స్కూల్లో ఏ కార్యక్రమం జరిగినా, నా స్పీచ్ ఉండేది. ఎవరైనా గెస్ట్ వస్తే వాళ్ళకి నా పెయింటింగ్ గిఫ్ట్‌గా ఇవ్వడం ఇవి తప్పనిసరిగా ఉండేవి. ఆ రకంగా రచనల వైపు తొలి అడుగులు పడ్డాయని చెప్పొచ్చు.

ఈ పుస్తకానికి పెట్టిన 'ఢావ్లో' అనే శీర్షిక గురించి చెప్పండి?

మా వాళ్లలో ముఖ్యంగా స్త్రీలు ఢావ్లోను కచ్చితంగా నేర్చుకుంటారు. ఢావ్లో అంటే విషాద గీతమని అర్థం. దీనిని విషాద సమయాల్లోనే కాదు, ఆనంద సమయాల్లోనూ, ఎదురుపడినప్పుడల్లా కౌగిలించుకొని పాడుకుంటూ ఏడుస్తుంటారు/ ఏడుస్తూ పాడుకుంటారు. మా పూర్వీకులు పాడుకున్న పాటలు, లిఖితపూర్వకంగా లేకున్నా, మౌఖికంగానే కొత్త తరాన్ని చేరుతున్నాయి. ఇప్పటికీ కాలానికి అనుగుణంగా భిన్న సందర్భాలను, అనేక అనుభవాలను తమలోని ఉద్వేగంతో జోడించి ఢావ్లోను కొత్తగా పాడుకుంటున్నారు. ఈ మార్పు ద్వారా తమ పూర్తి బాధను వ్యక్తపరిచే ప్రయత్నం చేస్తున్నారని చెప్పొచ్చు. ఈ మౌఖిక సంప్రదాయం ఇంకా చెక్కుచెదరకుండా ఉన్నా, కూసింత మోడరన్‌గా కూడా మారింది. ముఖ్యంగా నా కథా సంపుటికి ఈ శీర్షిక పెట్టడానికి కారణం ఏంటంటే, చుట్టూ ఉన్న సాహితీ మిత్రులందరూ వాళ్ల బాల్యంలో వాళ్ళు చూసిన, విన్న ఈ ఢావ్లోను గురించి అడిగారు. నా మొదటి పుస్తకం బల్దేర్ బండితో రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడో ఒక అక్కడ ప్రయాణాన్ని కొనసాగించాను. ఆ ప్రయాణం తర్వాత నా కథ చెప్పడం అవసరం కదా అనిపించింది. అందుకే ఢావ్లోను వినిపించాను.

ఈ కథల పట్ల వచ్చిన స్పందనల్లో మీరు మర్చిపోలేనివి? మీ కుటుంబం, తోటి గోర్ బంజారాల స్పందనలు?

నిజానికి నా ఇంగ్లీష్ పుస్తకం చక్మక్‌కి వచ్చిన సమీక్షల్లో నా తెలుగు పుస్తకాలకు పావు వంతు సమీక్షలు కూడా రాలేదు. దీనికి గల కారణం తెలిసిందే, నేను బంజారా సంచార తెగకు సంబంధించిన వాడిని కావడం. నేను రాసిన దాని కంటే, నేను ఎవరు అనేదే గ్లోరిఫై అవుతున్నది. ఇది ఒక్క నా విషయమనే కాదు, బహుశా వేరే గిరిజన, ఆదివాసీ కొత్త గొంతుకలకు కూడా ఇలానే కావొచ్చు. చేసిన పని కంటే, మన బాక్‌గ్రౌండ్ ఎక్కువగా ప్రచారమౌతుంది. కొన్నిసార్లు గ్లోరిఫికేషన్ అవసరమే కానీ, సాహిత్యం విషయంలో ఇది అనవసరం. మా ఇంట్లో వాళ్లకు ఇప్పుడే కాదు ఎప్పటికీ నేను ఇలా రాసుకుంటూ జీవితం పాడు చేసుకుంటున్నానేమో అనే బాధ, మా తండా వాళ్లకు నేనేదో గొప్పపని చేసినందుకే పత్రికలు నా గురించి రాసాయనే ఆనందం అలానే ఉంటాయి. బాగా రాశానని దానికి గల కారణాలు చెప్పిన వారు ఉన్నారు. బాలేవు అని అన్నారే తప్పించి, ఎందుకో కారణం ఇప్పటి దాకా వాళ్ళు చెప్పలేదు, నేనింకా ఎదురు చూస్తునే ఉన్నాను. కాస్తో కూస్తో చదుకున్న వాళ్ళు పుస్తకాన్ని అపురూపంగా మళ్ళీ మళ్ళీ చదువుకుంటూ ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో నన్ను కాంటాక్ట్ అవుతున్నారు. మా నాన్న తరం వాళ్ళు నా పుస్తకాలను ఇంట్లో దాచుకుని, వాళ్ళ చుట్టాలకు మా తండా పిల్లాడు రాసాడు అని చూపించుకుంటున్నారని వాళ్ళూ వీళ్ళూ చెప్తుంటే భలే అనిపిస్తుంటుంది.

మా ఇంట్లో వాళ్లకు ఇప్పుడే కాదు ఎప్పటికీ నేను ఇలా రాసుకుంటూ జీవితం పాడు చేసుకుంటున్నానేమో అనే బాధ, మా తండా వాళ్లకు నేనేదో గొప్పపని చేసినందుకే పత్రికలు నా గురించి రాసాయనే ఆనందం అలానే ఉంటాయి. మా నాన్న తరం వాళ్ళు నా పుస్తకాలను ఇంట్లో దాచుకుని, వాళ్ళ చుట్టాలకు మా తండా పిల్లాడు రాసాడు అని చూపించుకుంటున్నారని వాళ్ళూ వీళ్ళూ చెప్తుంటే భలే అనిపిస్తుంటుంది.



సాహిత్యంలో మున్ముందు మీరు ముఖ్యంగా చేయాలనుకుంటున్నవి, రాయాలనుకుంటున్నవి?

సాహిత్యంలో కొత్త కొత్త పోకడలు వస్తూనే ఉన్నాయి. సైన్స్ ఫిక్షన్, సర్రియలిజం, మ్యాజికల్ రియాలిజం ఇలాంటి వాటి గురించి వింటూ ఉంటాం. వీలైనంత వరకు వీటిని నా రచనల్లో సహజంగా తీసుకురావాలని అనుకుంటున్నాను. రాసే వాటిలో సహజత్వం ఎంతుంటుందో తెలీదు కానీ, ఇది నా ఆలోచన, నా రచనాభిలాష. ఇకపోతే రెండు తెలుగు రాష్ట్రాల్లో మనకు మొత్తం 35 గిరిజన, సంచార, ఆదివాసీ తెగలు ఉన్నాయి. నా అవగాహన మేరకు, వాటిలో కొన్ని తెగలకు సంబంధించి సాహిత్య సృజన చేసినా చాలనుకుంటున్నాను. రాయడం అనేది కచ్చితం, కానీ ఎంత కాలం రాస్తాను, ఏం రాస్తాను అనేది చుట్టూ వాతావరణమే డిసైడ్ చేస్తుందని నమ్ముతాను. ప్రస్తుతానికి సూర్యాధనంజయ్, ధనంజయ నాయక్, మంత్రి శ్రీనివాస్ గార్లతో కలిసి ఓ సంకలనానికి పని చేస్తున్నాను.

ఈమెయిల్: rameshkarthik225@gmail.com

ఆధునిక భావ కవిత్వానికి దీటైన మూడొందలేళ్ల కావ్యం

ఒకరిపై ఒకరికి అత్యంతంగా వలపు ఉన్న ఇద్దరు ప్రేమికులకు, ఏదో కారణం చేత, కొంతకాలం విడిగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడగా, ఒకనాటి సాయంత్రం వారిరువురు కలుసుకుని, విడిపోయే సన్నివేశాన్ని 'మలహణ చరిత్రము' అనే కావ్యం, ద్వితీయాశ్వాసంలోని ఈ క్రింది పద్యం ఇలా వర్ణించింది.

కం. అడుగిడుచు మగుడిచూచుచు
నడు గామడగాఁగ నలసి యటఁ దొట్రిలుచున్
వడినీళ్ళ కెదురు నడిచిన
వడువున నెడఁబాసి చనిరి వనితయుఁ బతియున్.

'భావుకత' అనే మాటకు సరిపోయే ఆధునిక అర్థంలో, సున్నితమైన ఆలోచనలను చేసి ఆ ఆలోచనలను అంతకంటే సున్నితమైన మాటలలో పాఠకుడికి అందించడం క్రీ.శ.20వ శతాబ్దపు భావకవులతో మాత్రమే మొదలైందనే అభిప్రాయాన్ని నొక్కివక్కాణించేవారి మాటలలో ఎంత తొందరపాటుతనమున్నదో తెలియజెప్పడానికి ఉదాహరణలుగా నిలిచే పద్యాలలో ఒకటి ఈ పద్యం; అందులోనూ ముఖ్యంగా మూడవపాదంలోని భావం!

అడుగడుక్కీ ఒకసారి వెనక్కి తిరిగి చూసుకుంటూ ఒకర్ని వదిలి ఒకరు వెళ్ళిపోతున్నారు వాళ్ళు. ఆ ఇరువురి మధ్య పడుతున్న ఒక్కొక్క అడుగుకీ ఒక్కొక్క ఆమడ దూరం వారి మధ్య పెరుగుతూ ఉన్నట్లుగా ఉందట వాళ్ళకి. అనగా ప్రతి అడుగుకీ ఒక ఆమడ దూరం నడిచినంత భారంగా, అలసటగా ఉందని ఉత్ప్రేక్ష! అలా పెరిగిన అలసట, హృదయంలో భారాన్ని మరింత పెంచగా, అడుగులు తడబడుతూ పడసాగాయట! ఆ తడబాటు ఎంత భారమైనదంటే, 'వడినీళ్ళ కెదురు నడిచినట్లుగా' పడుతున్నాయట వాళ్ళ అడుగులు. ఏరు పొంగి, నీటి ఉధృతి ఎక్కువగా ఉన్న స్థితిలో ఆ నీటికి ఎదురు నడిచి ఏరు దాటాల్సిన అనుభవం ఒక్కసారైనా అయినవాళ్ళకు, ఆ మాటలలో ఉద్దేశించిన భావం స్పష్టంగా అర్థమౌతుంది. వేగంగా ప్రవహిస్తున్న నీటిలో ఒక్క అడుగు కూడా ఎదురు నడవడం ఎంతో కష్టంగా ఉంటుంది. ముందుకు ఎంత బలంగా అడుగు వేయాలని చూసినా అంతకు రెట్టింపు బలంతో నీటి ఉధృతి పడే అడుగుని వెనక్కి నెడుతుంది. ఆ కష్టాన్ని గుర్తుకు తెచ్చి, వారిరువురు ఒకరి నుండి ఒకరు దూరంగా నడిచి వెళ్ళే ప్రక్రియ ఎంత బాధతో కూడినదై సాగిందో కళ్ళకు కట్టినట్లు చూపబడింది ఆ మాటలలో. ఏ ఆధునిక భావకవి వర్ణనకైనా తీసిపోని వర్ణన మూడు శతాబ్దాల క్రితం నాటి ఈ పద్యకవి మాటలలో మనకు కనపడుతుంది.

పేరునుబట్టి కాశ్మీర దేశస్థుడుగా భావింపబడిన గొప్ప శివభక్తుడు మల్హణుడి జీవితానికి సంబంధించినవిగా లోకులు చెప్పుకునే కొన్ని సంఘటనలను కథావస్తువుగా చేసుకుని 17వ శతాబ్దానికి చెందిన యెడపాటి యెఱ్ఱ నార్యుడు రచించిన కావ్యం 'మలహణ చరిత్రము'. ఆధునిక భావకవిత్వ ధోరణికి చెందినవనిపించే పోలికలు, అరుదైన నానుడుల వర్ణన చిత్రాలు ఈ కావ్యంలో మెండుగా ఉన్నాయి.

పేద కుటుంబంలో పుట్టిన మల్హణుడు బహువిద్యావంతుడు, సౌదర్యవంతుడు. కథానాయిక పుష్పగంధి, మదనసేన అనే పేరుగల ఒక వారకాంత కూతురు, బహు సౌందర్యవతి. ఇరువురూ ఒకే ఒజ్జ దగ్గర పాఠాలు నేర్చుకుంటూ పెరిగి పెద్దవాళ్ళవుతారు. వయసు పెరిగే కొలది వారి మధ్య స్నేహం ప్రేమగా మారింది. ఈ ప్రేమ వ్యవహారం పుష్పగంధి తల్లికి నచ్చదు. మల్హణుడి స్థితిగతులను గురించి తెలుసుకుని, పైసాకు పనికిరాని అతనితో ప్రేమ వలన ప్రయోజనం ఉండదని అతడిని ఇంటికి రానివ్వదు. 'ఏ జంటకు ఏ జన్మలో హాని కలిగించామో, ఈ జన్మలో మనకీ విధంగా ఎడబాటును కలిగించాడు విధాత!' అని బాధపడతారు ప్రేమికులిరువురూ. అలా ఉండగా, వారవనితయైన మదనసేన, తన కూతురైన పుష్పగంధి జీవిక కోసం తనలా కష్టపడకూడదన్న కోరికతో, వెదికి ఊరిలోని ధనికుడైన వ్యాపారస్తుని పుత్రరత్నమైన ధనదత్తుడనే యువకునితో కూతురికి పొందు కుదిర్చి, ఒకనాటి రాత్రి ఇద్దరినీ గదిలో వేసి సుఖించమని తాను తప్పుకుంటుంది. అయితే పుష్పగంధి మనసు మల్హణుడి మీద లగ్నమైయున్న కారణంగా గదిలోంచి బయటకు వెళ్ళి తన దురదృష్టానికి దుఃఖిస్తూ ఉంటుంది. "ఎవరేమనుకున్నా, కూతురిని మదనసేన నాకు సొంతం చేసింది, అది చాలు ఇప్పటికి!" అని సంతోషంలో మునిగిపోయి, పుష్పగంధిని వదిలేసి ఆమె పరిచారికతో గదిలో సరసాలాడుతూ సుఖిస్తూ ఉంటాడు ధనదత్తుడు. హేయమైన ఆ సందర్భాన్ని ఈ క్రింది పద్యంలో వ్యాఖ్యానిస్తూ, ధనదత్తుడిని ఉద్దేశించి 'శిథిలాత్ముడు' అనే మాటను ప్రయోగించాడు యెడపాటి యెఱ్ఱ నార్యుడు:

కం. వృథఁ దల్పుగడియ పెట్టియు
శిథిలాత్ముఁడు దాసితోడఁ జెనకుచునుండెన్
క్షుధనొందినట్టి పిల్లికి
విధిమూడిన యెల్క లేదె వెదకిన నైనన్.

(మలహణ చరిత్రము, తృతీయాశ్వాసం)

"ఆకలితో అలమటిస్తున్న పిల్లికి, సరిగ్గా వెతకాలే గాని ఇంత ప్రపంచంలో విధి వక్రించి చావు దగ్గరపడిన ఒక్క బక్కచిక్కిన ఎలుక దొరకకుండా పోతుందా?" అని పై పద్యంలోని చివరి రెండు పాదాల భావం! హీనత్వానికి హద్దులను మాటలతో చెప్పడం కష్టం. వ్యాపారధర్మం అన్ని వైపులనుండి అనుక్షణమూ శాసిస్తూ ఉండే ఈ లోకవ్యవహారంలో, ఒక బలవంతుడి ఆకలి తీరడానికి ఒక బలహీనుడి నిస్సహాయత ఆహారంగా మారడం అన్న రాక్షస ధర్మం ఏ ఆర్భాటమూ లేకుండా నిర్వర్తించబడుతూ ఉంటుందన్న ఆధునిక కవి భావం ఈ చరణాలలోని మాటలలో గట్టిగానే చెప్పబడి కనపడుతుంది.


ప్రసిద్ధుడైన ఒక పూర్వ శివభక్తుడి జీవితంలో సంఘటనలను వస్తువుగా తీసుకుని, కథాగమనంలో సందర్భానికి సరిపోయే విధంగా ఆధునిక భావాలను, అరుదైన తెలుగు జాతీయాలను ఆలంబనగా చేసి, యెడపాటి యెఱ్ఱ నార్యుడు రచించిన 'మలహణ చరిత్రము' పద్యకావ్యం నేటి తరానికి తెలియని ఎన్నో అర్థవంతమైన నానుడులను కాలంలో కనుమరుగైపోకుండా కాపాడిన కావ్యాలలో ఒకటి!

భట్టు వెంకటరావు



ప్రసిద్ధుడైన ఒక పూర్వ శివభక్తుడి జీవితంలో సంఘటనలను వస్తువుగా తీసుకుని, కథాగమనంలో సందర్భానికి సరిపోయే విధంగా ఆధునిక భావాలను, అరుదైన తెలుగు జాతీయాలను ఆలంబనగా చేసి, యెడపాటి యెఱ్ఱ నార్యుడు రచించిన 'మలహణ చరిత్రము' పద్యకావ్యం నేటి తరానికి తెలియని ఎన్నో అర్థవంతమైన నానుడులను కాలంలో కనుమరుగైపోకుండా కాపాడిన కావ్యాలలో ఒకటి!

జీవితం ఎక్కడ పడిపోయిందో తెలియనే లేదు



జాతరలో, మేళాలో
బాంసురీలు అమ్ముకుంటూ తిరిగాను
దారిపొడుగునా
బెలూన్లు అమ్ముకుంటూ నడిచాను
ఆకలికి ఎక్కడా ఆగలేదు
దాహానికి ఎవరినీ అడగలేదు
చీకటి పడివేళ రోడ్ల మీద
దీపాలు అమ్ముతూ కూర్చున్నాను

అలసిపోయి చేతిలో చూసుకుంటే,
జీవితం ఎక్కడ పడిపోయిందో
శబ్దమే వినిపించ లేదు
ఎప్పుడు పడిపోయిందో
ఎలా పడిపోయిందో
నాకు తెలియనే లేదు

ఆశారాజు
asharaju.poet@gmail.com



కల్కి కారు..అభిమానుల హుషారు!

- ట్రెండ్‌సెట్ మాల్‌లో 'బుజ్జి' ప్రదర్శన
- చూసేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన అభిమానులు

4లో..



విస్తారంగా..

ఉమ్మడి కృష్ణాజిల్లాలో వర్షాలు

- ఎన్టీఆర్ జిల్లాలో 44.81 మి.మీ వర్షపాతం నమోదు
- కృష్ణాజిల్లాలో 37.4 మి.మీ
- సాగు పనుల్లో నిమగ్నమైన రైతులు

ఉమ్మడి కృష్ణాజిల్లాలో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. శనివారం రాత్రి నుంచి ప్రారంభమైన వర్షం ఆదివారం సాయంత్రం వరకు కురుస్తూనే ఉంది. వాతావరణం మేఘావృతమై ఉంది. రుతుపవనాలు వచ్చాక ఈస్థాయిలో వర్షాలు కురవడం ఇదే ప్రథమం. రైతులు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. ఈనెల 4వ తేదీ వరకు కోస్తాతీరం వెంబడి ఉరుములు, మెరుపులతో కూడిన ఒక మోస్తరు వర్షం కురుస్తుందని వాతావరణశాఖ ఆదివారం హెచ్చరికలు జారీ చేసింది.

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : ఎన్టీఆర్ జిల్లాలోని ఇతర మండలాల్లో ఎలాంటి వర్షపు ఛాయలు కనిపించలేదు. ఆదివారం మధ్యాహ్నం వరకు చిరుజల్లులు పడుతూనే ఉన్నాయి. మధ్యాహ్నం నుంచి మాత్రం వర్షం తెరపిచ్చింది. జిల్లాలో మొత్తం 44.81 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా తిరువూరు మండలంలో 69.47 మి.మీ వర్షం కురిసింది. విజయవాడ నగరంలో ఏకధాటిగా వర్షం కురవడంతో పల్లపు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది. ఈదురు గాలులు లేకపోవడంతో ఎలాంటి ఆస్తినష్టం జరగలేదు. జగ్గయ్యపేటలో మాత్రం విద్యుత్ స్తంభాలు ఒక వైపునకు ఒరిగాయి. ఎలాంటి ప్రమాదం జరగకుండా విద్యుత్ శాఖ సిబ్బంది వాటిని వెంటనే సరిచేశారు. విజయవాడలో ఎన్టీఆర్ సర్కిల్, కబేళా, సితార సెంటర్, ఆంజనేయవాగు, పెజ్జోనిపేట ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోయింది.

ఊపిరిపీల్చుకున్న మెట్ట రైతు

సాగుకు సమయం ఆసన్నమైనా నీటిని విడుదల చేయలేని పరిస్థితి జిల్లాలో కనిపిస్తోంది. అటు డెల్టాలోనూ, ఇటు మైదాన ప్రాంతంలోనూ ఇదే పరిస్థితి ఉంది. డెల్టా రైతుల కంటే మైదాన రైతుల పరిస్థితి భిన్నంగా ఉంటుంది. వర్షంపై ఆధారపడి సాగు చేసుకుంటారు. ఈసారి ల్యానినో ప్రభావం ఉండడంతో వర్షాలు విస్తారంగా కురుస్తాయని వాతావరణ శాఖ నిపుణులు తెలిపారు. దీంతో మెట్ట ప్రాంత రైతులు మే నెలాఖరు నాటికి సాగు కోసం పొలాలను సిద్ధం చేసుకున్నారు. జూన్‌లో వర్షాలు కురుస్తాయని భావించారు. అడపాదడపా కురిసినా మెట్టను పలకరించలేదు. కురిసిన ఆ చినుకుల ప్రభావంతోనే చాలామంది రైతులు పొలాల్లో నాట్లు వేశారు. మెట్ట ప్రాంతంలో ఎక్కువగా మిరప, పత్తి, టమాట పంటలు సాగు చేస్తారు. ఈ ప్రాంతంలో సాగునీటి సదుపాయాలు తక్కువగా ఉండడంతో రైతులు వర్షంపైనే పూర్తిగా ఆధారపడతారు. మొన్నటి వరకు ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు కురవకపోవడంతో చాలా వరకు పంటలు నష్టపోయాయి. ఈసారి వర్షాలు అంతంత మాత్రంగానే కురవడంతో రైతులు బెంగపడ్డారు. తాజాగా కురిసిన వర్షాల ప్రభావం మెట్టలోనూ పడింది. విస్తారంగా కురుస్తున్న వర్షాలతో రైతుల్లో సంతోషం కనిపిస్తోంది.

ఇదిగో భరోసా!



పెరిగిన పింఛనుతో కలిపి నేడు, రేపు లబ్ధిదారులకు పంపిణీ

- జిల్లాలో 2.35,477 సామాజిక పింఛన్లు
- ఒకేసారి రూ.7వేలు అందుకోనున్న లబ్ధిదారులు
- రూ.160.53 కోట్లు పంపిణీకి ఏర్పాట్లు
- రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశాలు

నూతన ప్రభుత్వంలో సోమవారం తొలి సంక్షేమం అందనుంది. అత్యంత కీలకమైన హామీల్లో ఒకటిగా ఉన్న పింఛన్.. పెరిగిన దాంతో కలిపి సోమ, మంగళవారాల్లో లబ్ధిదారులకు దక్కనుంది. ఈ మేరకు అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా జిల్లాలో 2,35,477 మందికి సామాజిక పింఛన్లు పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇందుకోసం రూ.160.53 కోట్లు సిద్ధం చేశారు. నూతన ప్రభుత్వంలో ఒకేసారి రూ.7వేలు పింఛను అందుకునేందుకు లబ్ధిదారులు తహతహలాడిపోతున్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఎన్నికల ముందు ఇచ్చిన పింఛన్ల పెంపు హామీని టీడీపీ ప్రభుత్వం నేడు (సోమవారం) ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా అమలు చేస్తోంది. పింఛన్‌దారులకు మాట ఇచ్చినట్టుగానే పెంపుతో పాటు ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి బకాయిలను నెలకు రూ.1000 చొప్పున రూ.3000 అదనంగా టీడీపీ ప్రభుత్వం చెల్లిస్తోంది. రూ.5 వేల పెన్షన్ తీసుకునే వారికి రూ.15,000, అవయవ మార్పిడి చేసుకున్నవారికి రూ.5 వేల నుంచి రూ.15 వేల మేర చెల్లించనున్నారు.

గతం కంటే ప్రతినెలా రూ.29 కోట్లు అదనం

వైసీపీ ప్రభుత్వ హయాంలో నెలకు రూ.70.36 కోట్ల పింఛన్ సొమ్ము అందిస్తుండగా.. టీడీపీ ప్రభుత్వం దీనికి రెండు రెట్లు ఎక్కువగా జూలై పింఛన్‌ను అందిస్తోంది. కిందటి ప్రభుత్వం అందించిన లబ్ధి కంటే అదనంగా రూ.90.17 కోట్లు అదనంగా పింఛన్ అందిస్తోంది. మూడు నెలల బకాయిలను తీసివేస్తే రూ.29 కోట్లను ప్రతి నెలా పింఛనుదారులకు టీడీపీ ప్రభుత్వం చెల్లించబోతోంది. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా సోమ, మంగళవారాలలో పింఛన్ల పంపిణీని నూరు శాతం పూర్తి చేయాల్సిందిగా జిల్లా కలెక్టర్ సృజన డీఆర్‌డీఏ అధికారులకు నిర్దేశించారు. సచివాలయ ఉద్యోగుల ద్వారా లబ్ధిదారుల ఇంటికే తీసుకువెళ్లి అందించటానికి డీఆర్‌డీఏ అధికారులు రంగం సిద్ధం చేశారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంపిణీ చేసేందుకు వీలుగా ఎన్టీఆర్ జిల్లా డీఆర్‌డీఏ పీడీ కే శ్రీనివాసరావు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

పింఛనుదారులు ఇలా..

- జిల్లా వ్యాప్తంగా 1,12,413 మంది వృద్ధులు గతంలో 3 వేల పింఛన్ తీసుకునేవారు. ప్రస్తుతం వీరు రూ.4 వేలతో పాటు ఆరియర్స్ రూ.3 వేలు కూడా కలిపి జూలై నెలలో రూ.7 వేలు అందుకోనున్నారు. ఈ లెక్కన ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా వృద్ధులు రూ.78.69 క్లోల మేర పింఛన్ సొమ్మును అందుకోబోతున్నారు. టీడీపీ ప్రభుత్వం చేసిన మంచి ద్వారా వృద్ధులు పెంపు ద్వారా రూ.11.24 కోట్లు, బకాయిలు రూ.33.72 కోట్లు కలిపిరూ.67 కోట్ల మేర ప్రయోజనం పొందుతున్నారు.
- వితంతువులు ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా 69,561 మంది ఉన్నారు. వీరికి ప్రస్తుతం రూ.3 వేల లెక్కన గతంలో రూ.20.86 కోట్ల మేర పింఛన్ వచ్చేది. వీరికి పెంచిన పింఛనుతో కలిపి రూ.4వేల లెక్కన రూ.7 కోట్లు, బకాయిలు రూ.20.87 కలిపి రూ.27.87 కోట్ల మేర లబ్ధిపొందనున్నారు.
- జిల్లా వ్యాప్తంగా 27,302 మంది దివ్యాంగులు ఉన్నారు. వీరికి ప్రస్తుతం రూ.20.86 కోట్ల మేర పింఛన్ తీసుకోవటం జరిగేది. ఈ నెలలో వీరు పెంచిన రూ.7 కోట్లను అందుకోనున్నారు.
- జిల్లాలో 8868 ఒంటరి మహిళలు పెంపు రూ.3.55 కోట్లు, బకాయిలు రూ.26.6 కోట్లు చొప్పున అదనంగా అందుకోనున్నారు. వెరసి ఈ నెల వీరు రూ.6.21 కోట్లు పింఛను అందుకోనున్నారు.
- జిల్లాలోని 1446 మత్స్యకారులు పెంపు రూ.43లక్షలు, బకాయిలు రూ.57 లక్షలు వెరసి మొత్తంగా 1.01 కోట్ల మేర ప్రయోజనాన్ని పొందనున్నారు.
- కల్లుగీత కార్మికులు జిల్లాలో 2057 మంది ఉన్నారు. వీరు పెంచిన పెంపు రూ.82.88 లక్షలు, బకాయిలు రూ.61.71 లక్షలు కలిపి రూ.1.43 కోట్ల మేర లబ్ధిపొందనున్నారు.
- చర్మకారులు జిల్లా వ్యాప్తంగా 4813 మంది ఉన్నారు. వీరంతా ప్రస్తుతం రూ.1.44 కోట్ల పింఛన్ అందుకుంటున్నారు. ఈ నెల పెంచిన రూ.1.92 కోట్లతో పాటు బకాయిలు 1.44 కోట్లు కలిపి మొత్తంగా రూ.3.36 కోట్ల మేర ప్రయోజనం పొందనున్నారు.
- ట్రాన్స్‌జెండర్లు జిల్లాలో 144 మంది ఉన్నారు. వీరు ప్రస్తుతం రూ.4.32 లక్షల మేర ప్రయోజనం పొందుతున్నారు. ఈనెలలో వీరు పెంచిన రూ.5.36 లక్షలతో పాటు బకాయిలు రూ.4.32 లక్షలు కలిపి మొత్తంగా 10.08 కోట్ల పింఛన్ అందుకోనున్నారు.
- చేనేత కార్మికులు జిల్లా వ్యాప్తంగా 728 మంది ఉన్నారు. వీరంతా ప్రస్తుతం రూ.21.84 లక్షల మేర పెన్షన్ తీసుకుంటున్నారు. ఈ నెలలో వీరంతా పెంపు రూ.29.12 లక్షలతో పాటు బకాయిలు రూ. 21.84 లక్షలు వెరసి మొత్తంగా రూ.50.96 లక్షల మేర ప్రయోజనం పొందనున్నారు.
- డప్పువాయిద్యకారులు జిల్లాలో 3753 మంది ఉన్నారు. వీరంతా ప్రస్తుతం రూ.1.12 లక్షల పింఛన్ తీసుకుంటున్నారు. వీరంతా ఈ నెల పెంపు రూ.1.50 కోట్లతో పాటు బకాయిలు రూ.1.12 కోట్లు వెరసి మొత్తంగా రూ.2.62 కోట్ల మేర ప్రయోజనం పొందనున్నారు.
- శాశ్వితంగా మంచాన ఉన్నవారు, వీల్ చైర్‌లో ఉండేవారు, ప్రమాదాల కారణంగా లేవలేనివారు, కిడ్నీ వ్యాధిగ్రస్తులు, డయాలసిస్ చేయించుకునేవారు, గుండె, కిడ్నీ, లివర్ మార్పిడి జరిగిన వారు, కుష్టు వ్యాధిగ్రస్తులకు రూ. 21 లక్షల మేర గతంలో పింఛన్ ప్రయోజనం అందుకునేవారు. ఈ నెల వీరంతా రూ.62 లక్షల పెంపు ప్రయోజనాన్ని పొందనున్నారు.

19 నుంచి దుర్గగుడిలో శాకంబరి ఉత్సవాలు

4లో..

» మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహిస్తాం: ఈవో రామారావు

ప్రభుత్వం మారినా ఉదాశీనతే!

అంబాపురంలో వంశీ అనుచరులు కబ్జా చేసిన భూముల స్వాధీనానికి అధికారుల వెనకడుగు

» స్థలాలు స్వాధీనం చేసుకోవాలని స్థానికుల డిమాండ్

4లో..

దుర్గమ్మ సన్నిధిలో 'పల్లా'



గాజువాక ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మవారిని ఆదివారం దర్శించుకున్నారు. ఈవో కేఎస్ రామారావు ఆయనకు ఆలయ మర్యాదలతో సాదర స్వాగతం పలికారు. అనంతరం వేద పండితులు వేదాశీర్వచనమిచ్చారు. ఆయనకు ఈవో అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.

ఉద్యోగులకు అశాంతి!

వైసీపీ ప్రభుత్వ హయాంలో దేవదాయశాఖలో వేళ్లూనుకున్న అవినీతి కలుపు మొక్కలను ప్రక్షాళన చేసేందుకు రంగం సిద్ధమవుతోంది. వైసీపీ కీలక నేత విజయసాయి రెడ్డి ఆశీస్సులతో ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల దేవదాయశాఖ పగ్గాలు చేపట్టి పెత్తనం చెలాయిస్తున్న అధికారిణిని బదిలీ చేసేందుకు ఉన్నతాధికారులు సమాయత్తమయ్యారు. రెండు జిల్లాల్లో విధులు నిర్వహించే దేవదాయ ఉద్యోగులను నిత్యం విధులకు హాజరవ్వగానే ఫొటోలు తీసి తనకు వాట్సాప్ చేయాలని ఈ అధికారిణి హుకుం జారీ చేయడం, తనకు అనుకూలురైన ఉద్యోగులకు మాత్రం ఈ వాట్సాప్ అటెండెన్స్ నుంచి మినహాయింపు ఇవ్వడం... ఉద్యోగులపై బూతు పురాణంతో రెచ్చిపోవడం లాంటి వాటితో చెడ్డపేరు మూటగట్టుకున్న ఆ అధికారిణి అక్రమాలపై ప్రత్యేక కథనం..

దేవదాయశాఖ అధికారిణి తీరుపై ఉద్యోగుల గగ్గోలు



- » నిత్యం వాట్సాప్ అటెండెన్స్ పేరుతో వేధింపులు
- » చెప్పినట్టు వినని ఉద్యోగులపై బూతులతో దాడి
- » సహ ఉద్యోగులను ఏజెంట్లుగా పెట్టి అక్రమాలు
- » ఉయ్యూరుకు చెందిన ఈవో.. మరో గుమస్తా విధులకు డుమ్మా కొట్టి అధికారిణితో కలిసి చెట్టపట్టాల్
- » ఏసీబీకి ఉద్యోగుల నుంచి ఫిర్యాదుల వెల్లువ

త్వరలో బదిలీకి రంగం సిద్ధం

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : దేవదాయశాఖ సిబ్బందిని ఇష్టారాజ్యంగా దూషిస్తారని ఈ అధికారిణికి పేరు. 'మీకు మీ తల్లిదండ్రులు చనిపోతే ఉద్యోగాలు వచ్చాయి. మీకు చదువు లేదు. అందుకే పనులు రావు' అంటూ అవమానిస్తున్నారని ఉద్యోగులు వాపోతున్నారు. ఓ ఈవోను తన కార్యాలయంలో ఏసీ పనిచేయడం లేదని కొత్తది కొనుగోలు చేసి పంపాలని ఈమె ఆదేశించారు. ఆ ఈవో కొత్త ఏసీ కొనుగోలులో కొన్ని రోజులు జాప్యం చేయడంతో అతని పిలిచి అందరి ముందే బూతులు తిట్టి ఎందుకూ చేతకాని వాడివంటూ దూషించారు.

• విజయసాయిరెడ్డి అండతో...

జిల్లాలో దేవదాయశాఖ అధికారిణిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత వైసీపీ ఎమ్మెల్యేలను సైతం లెక్క చేయలేదు. జిల్లాకు వచ్చిన తొలిరోజుల్లో తిరువూరు నియోజకవర్గంలోని ఓ ఆలయం ఈవోగా బాధ్యతలు చేపట్టిన ఈమెతో స్థానిక ఎమ్మెల్యేగా ఉన్న రక్షణనిధిని కలిసేందుకు వెళదామని తోటి ఉద్యోగులు సూచించారు. ఎమ్మెల్యేనా ఆయన ఎవరు అంటూ ఈమె వ్యాఖ్యానించడంతో వారు అవాక్కయ్యారు. మచిలీపట్నం ఎమ్మెల్యేగా పేర్ని నాని ఉన్న సమయంలో ఈమె తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణతో సమీక్ష సమావేశంలోనే ఈ అధికారిణి తీరుపై ఫిర్యాదు చేసి, ఆమెను జిల్లా నుంచి పంపించి వేయాలని కోరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ.. అది తన చేతుల్లో లేదని, సాయిరెడ్డికి చెప్పాలని పేర్నికి సూచించడం గమనార్హం. ఆ తర్వాత సాయిరెడ్డి సూచనలతో ఈమె పేర్నిని కలిసి ప్రసన్నం చేసుకున్నారని చెబుతారు. విశాఖపట్నంలో పనిచేసే సమయంలో వైసీపీ నాయకుడు విజయసాయి రెడ్డి భూకబ్జాలకు ఈమె తన వంతు సహకారం అందించారని దేవదాయశాఖ ఉద్యోగులే చెబుతుంటారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని దేవదాయ భూములకు సంబంధించిన మొత్తం వివరాలను జిరాక్స్ తీసి మరీ సాయిరెడ్డికి అప్పగించారన్న ఆరోపణలు ఉన్నాయి. వాటి ఆధారంగా విశాఖలో సాయిరెడ్డి కబ్జా పర్వం సాగిందని చెబుతారు.

• వసూళ్లకు ఏజెంట్లు..

రెండు జిల్లాల్లో వసూళ్ల కోసం ఈ అధికారిణి ప్రత్యేకంగా కొందరు దేవదాయశాఖ ఉద్యోగులను నియమించుకోవడం గమనార్హం. ఉయ్యూరులో ఈవోగా విధులు నిర్వహిస్తున్న ఓ ఉద్యోగి అక్కడ కన్నా ఈ అధికారిణి వెంటే ఎక్కువ కనిపిస్తుంటారు. ముదినేపల్లి మండలం వడాలిలో గుమస్తాగా విధులు నిర్వహించాల్సిన ఉద్యోగి అక్కడ విధులు నిర్వహించకుండా ఈ అధికారిణి వెంటే తిరుగుతుంటారు. ఎన్‌వోసీలు జారీ చేసే సమయంలో డబ్బులు దండుకోవడం.. ఆలయాల ఇన్స్‌పెక్షన్ సమయంలో డబ్బులు వసూలు చేయడం వంటివి వీరు చేస్తుంటారు. కొద్ది రోజుల క్రితం ఉయ్యూరుకు వెళ్లిన ఈ అధికారిణి తనిఖీల పేరుతో హడావిడి చేసి ఓ మహిళా ఉద్యోగి నుంచి లక్ష రూపాయలు వసూలు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. సదరు మహిళా ఉద్యోగి తన నగలు తాకట్టు పెట్టి మరీ ఆ మొత్తాన్ని ఈ అధికారిణి వెంట తిరిగే గుమస్తాకు సమర్పించుకోవడం గమనార్హం.

• ఏసీబీకి ఫిర్యాదుల వెల్లువ

ఈ అధికారిణి తీరుతో విసుగెత్తిపోయిన కొందరు ఉద్యోగులు ఇటీవల ప్రభుత్వం మారగానే ఏసీబీ అధికారులకు ఫిర్యాదులు చేయడం ప్రారంభించారు. కేవలం 20 రోజుల వ్యవధిలోనే ఈ అధికారిణిపై 10కి పైగా ఫిర్యాదులు వెళ్లాయి. విశాఖపట్నంలో పనిచేసే సమయంలో ఉద్యోగులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లోనే.. తనకు పెళ్లి సమయంలో తల్లిదండ్రులు 100 కాసుల బంగారం పెట్టారని, భర్త మరికొన్ని నగలు చేయించారని, పిల్లలు పుట్టాక మరింత బంగారం పెట్టారని తాను ఆ వివరాలన్నీ ప్రభుత్వానికి నివేదించానని ఈ అధికారిణి చెప్పుకొచ్చారు. సాధారణ దిగువ మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చిన అధికారిణి ఉద్యోగంలో చేరి పట్టుమని 10 సంవత్సరాలు కూడా కాకముందే వందల కోట్ల ఆస్తిని ఎలా ఆర్జించారన్నది ప్రశ్న. ఈ అధికారిణి ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ప్రతి ఏటా సమర్పించిన సెల్ఫ్ డిక్లరేషన్లను.. ఆమె వాస్తవ ఆస్తులను పరిశీలిస్తే ఈమె అక్రమార్జన గుట్టు రట్టవుతుందని దేవదాయశాఖ ఉద్యోగులు పేర్కొంటున్నారు.

టీడీపీ నేతల ప్రాపకం కోసం ప్రయత్నాలు

విశాఖలో పనిచేసిన సమయంలో ఈమెపై సహోద్యోగే అవినీతి ఆరోపణలు చేశారు. నర్సీపట్నం దుర్గామల్లేశ్వర ఆలయ ఈవో శర్మ.. తాను ఈ అధికారిణికి రూ.8.5 లక్షలు ఇచ్చానని ఏకంగా మీడియా ఎదుటే ఆరోపణలు చేయడం గమనార్హం. ఆ డబ్బులు తీసుకుని మూడు రోజులు తిరక్కముందే మళ్లీ రూ.50వేలు కావాలని కబురు పెట్టారని ఆయన అప్పట్లో ఆరోపించారు. నిన్నటి వరకు విజయసాయి రెడ్డి అండ చూసుకుని చెలరేగిపోయిన ఈమె ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో టీడీపీ నేతల ప్రాపకం కోసం పాకులాడుతూ ఎన్టీఆర్ లేదా కృష్ణా జిల్లాలోనే కొనసాగేలా ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఇలాంటి అధికారిణి రెండు జిల్లాల్లో కొనసాగించవద్దని దేవదాయశాఖ ఉద్యోగులు ఉన్నతాధికారులను కోరుతున్నారు.

కిడ్నీవ్యాధితో మహిళ మృతి

- కిడ్నీ సమస్యను గతంలో జనసేన అధినేతకు వివరించిన మహిళ



లాకావతు నాగమ్మ (ఫైల్)

ఎ.కొండూరు, జూన్ 30 : మండలంలోని రేపూడి తండాకు చెందిన లాకావతు నాగమ్మ(49) కిడ్నీ వ్యాధితో, విజయవాడ ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతు ఆదివారం మృతి చెందింది. నాగమ్మ కొంత కాలంగా కిడ్నీవ్యాధికి గురై వైద్యుల సలహా మేరకు చికిత్స పొందుతోంది. వ్యాధి తీవ్రత పెరగడంతో ఆమెను విజయవాడ ప్రభుత్వ వైద్యశాలలో చేర్చారు. క్రియేటిన్ శాతం ఒక్కసారిగా పెరగడంతో, ఆమె మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. గతంలో విజయవాడలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో మండలంలోనే కిడ్నీవ్యాధి తీవ్రతతో గిరిజనులు పడుతున్న బాధలను జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌కు ఆమె స్వయంగా వివరించారు. మృతురాలి కుటుంబానికి ప్రభుత్వం తరుపున రూ.10 వేలు, తిరువూరు మాజీ ఏఎంసీ చైర్మన్ ఆలవాల రమేష్ రెడ్డి రూ.20 వేలు జనసేన ఇన్‌చార్జి మనుబోలు శ్రీనివాసరావు, అధికారులు బాధిత కుటుంబానికి అందించారు.



మంత్రి కొల్లు రవీంద్రతో సినీ దర్శకుడు మారుతి

సినీ పరిశ్రమకు ఊతమిస్తాం

దర్శకుడు మారుతితో మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, జూన్ 30: టీడీపీ కూటమి ప్రభుత్వంలో సినీ పరిశ్రమకు ఊతమిస్తామని మంత్రి కొల్లు రవీంద్ర హామీ ఇచ్చారు. ఆదివారం కొల్లు రవీంద్ర కార్యాలయానికి వచ్చిన సినీ దర్శకుడు, మచిలీపట్నం నివాసి మారుతితో మంత్రి కొల్లు రవీంద్ర చలనచిత్ర పరిశ్రమ సమస్యలపై మాట్లాడారు. ఉప ముఖ్య మంత్రి పవన్‌కల్యాణ్ సినీ రంగానికి చెందిన వారవడంతో చలన చిత్ర రంగంలోని సాధకబాధకాలు ఆయనకు తెలుసన్నారు. చలనచిత్ర రంగంలోని పేద కళాకారు లను ఆదుకుంటామన్నారు. సినీ షూటింగ్‌లకు రాష్ట్రంలో అనువైన స్థలాలను ఎం పిక చేయాల్సిన అవసరం ఉందని మారుతి అన్నారు. మారుతిని కొల్లు రవీంద్ర సత్కరించారు. మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, టీడీపీ నగర కార్యదర్శి పిప్పళ్ల కాంతారావు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న అర్చకులు

ఈనాం భూములకు భూమి శిస్తు రశీదులివ్వాలి

అవనిగడ్డ, జూన్ 30: రాష్ట్రంలో దేవదాయ శాఖ పరిధిలో, దేవాలయాల అర్చకుల ఆధీనంలో ఉన్న ఆలయ భూములకు(సర్వీస్ ఈనాం) అర్చకుల పేరునే భూమి శిస్తు రశీదులు జారీ చేయాలని రాష్ట్ర అర్చక సమాఖ్య ప్రతినిధులు దీవి రామకృష్ణమాచార్యులు(బార్లపూడి), వాసుదేవ సీతారామకృష్ణ, కుమార ఆచార్యులు (హంసలదీవి), బాలకృష్ణ ఆచార్యులు, లక్ష్మీ దాశరధి, బృందావనం అనంత రామా చార్యుల బృందం ఆదివారం అవనిగడ్డ నుంచి ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ద్వారా దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి వినతిపత్రాన్ని పం పింది. అనుభవదారులైన అర్చకులకు భూమి శిస్తు రశీదులు ఇవ్వొద్దని గత ప్రభు త్వం ఆదేశాలు ఇచ్చిందని, దీంతో ఆలయ భూములపై ఉన్న హక్కులను అర్చకులు కోల్పోయే ప్రమాదం ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అనుభవదారు లుగా అర్చకుల పేరిట పట్టాదారు పాస్ పుస్తకాలివ్వాలని వారు అభ్యర్థించారు.



భట్టి విక్రమార్కకు తిరుపతమ్మ చిత్రపటాన్ని అందిస్తున్న ఆలయ అధికారులు

తిరుపతమ్మ సేవలో తెలంగాణ డిప్యూటీ సీఎం

పెనుగంచిప్రోలు, జూన్ 30: తెలంగాణ రాష్ట్రంలోని మధిరకు చెందిన కాం గ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం తిరుపతమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాల్గొన్నారు. భట్టి వి క్రమార్కను దేవస్థానం ఆలయ డిప్యూటీ కలెక్టర్ కె.రమేష్‌నాయుడు, టీడీపీ నియోజకవర్గ ప్రముఖుడు, తిరుపతమ్మ దేవస్థానం మాజీ చైర్మన్ నూతలపాటి చెన్నకేశవరావు కలిశారు. అమ్మవారి ప్రసాదాలు, చిత్రపటాన్ని అందజేశారు. నియో జకవర్గ జనసేన నాయకుడు లగడపాటి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సుబ్బారాయుడిని దర్శించుకున్న కృష్ణా ఎన్నికల పరిశీలకుడు ప్రవీణ్‌చౌహాన్

మోపిదేవి, జూన్ 30: సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో స్వామిని కృష్ణా జిల్లా ఎన్నికల పరిశీలకుడు ప్రవీణ్‌చౌహాన్ మోహన్‌దాస్ ఆదివారం దర్శించు కున్నారు. ఆలయ అధికారులు, అర్చక బృందం ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. నాగపుట్టలో పాలుపోసి, స్వామికి విశేష పూజలు చేశారు. అర్చక బృందం శేషవస్త్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదాలు అంద జేశారు. ఆర్‌ఐ సునీల్‌కుమార్, వీఆర్వో మూర్తి ఆయన వెంట ఉన్నారు.

పామర్రు-అవనిగడ్డ ప్రధాన రహదారిపై కూలిన వృక్షం

పామర్రు, జూన్ 30: పామర్రు-అవనిగడ్డ ప్రధాన రహదారిపై పామర్రు-రాపర్ల అడ్డరోడ్డు సమీపంలోని శ్యామల పురం వద్ద ఆదివారం ఉదయం రోడ్డు పక్కన ఉన్న ఓ మహా వృక్షం నేలకొరిగింది. దీంతో గం టల కొద్దీ వాహనాల రాక పోక లకు అంతరాయం ఏర్పడింది. ఎస్సై పి.ప్రవీణ్‌కుమార్ రెడ్డి సిబ్బందితో వెళ్లి వాహనాలను వేరే గ్రామాలమీదగా మళ్లించారు. కూలిన వృక్షాన్ని యంత్ర పరికరాలతో తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. వర్షా నికి డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేక పామర్రులో బస్టాండ్, తహసీల్దార్ కార్యాల యం, ఫైర్‌స్టేషన్ ప్రాంగణాలు వర్షపునీటితో నిండిపోయాయి.



యంత్రంతో చెట్టును తొలగిస్తున్న పోలీసులు

వెంకయ్యనాయుడుకు జన్మదిన శుభాకాంక్షలు

పెనమలూరు, జూన్ 30: మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడుకు 75వ జన్మ దినం సందర్భంగా పెదపులి పాకకు చెందిన బీజేపీ, జనసంఘ్ రాష్ట్ర నాయకుడు వల్లూరి శ్రీమ న్నారాయణ తదితరులు హైదరా బాద్‌లోని అన్వయ కన్వెన్షన్ సెంట రులో నిర్వహించిన కార్యక్రమం లో శుభాకాంక్షలు తెలిపారు. వెంక య్యనాయుడును దుశ్శాలువతో సత్కరించారు. వెంకయ్యనాయుడుకు ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని బహూకరించారు. కుక్కపల్లి నాగేశ్వరరావు, పొట్టి శ్రీహరి, విస్సంశెట్టి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.




వెంకయ్యనాయుడుకు శివాజీ విగ్రహాన్ని అందిస్తున్న వల్లూరి శ్రీమన్నారాయణ



పదవీ విరమణ చేసిన టీపీవో పద్మావతితో పూర్వ మునిసిపల్ కమిషనర్ డాక్టర్ ప్రకాశరావు, సిబ్బంది

పదవీ విరమణ చేసిన మునిసిపల్ ఉద్యోగినికి సత్కారం

పెనమలూరు, జూన్ 30: తాడిగడప మునిసిపాలిటీలో టౌన్‌ప్లానింగ్ అధికారి ణిగా పని చేసి, ఉత్తమ అధికారిణిగా పేరు తెచ్చుకొన్న యార్లగడ్డ పద్మావతి పదవీ వి రమణ సందర్భంగా ఆమెను తోటి ఉద్యోగులు, పూర్వ కమిషనరు డాక్టర్ ప్రకాశరావు అభినందించారు. కానూరులోని మన కల్యాణ మండపంలో నిర్వహిం చిన అభినందన సభలో డాక్టర్ ప్రకాశరావు మాట్లాడారు. విధి నిర్వహణలో పద్మావతి నిక్కచ్చిగా వ్యవ హరించేవారని, మునిసిపాలిటీ అభివృద్ధిలో ఆమె పాత్ర చెప్పుకోదగ్గదని పేర్కొన్నారు. మునిసిపల్ ఉద్యోగులు మేనేజర్ విజయలక్ష్మి, ఏసీపీ మురళీగౌడ్, గిరి, పద్మావతిని దుశ్శాలువతో సన్మానించి అభినందించారు.





ట్రెండ్‌సెట్ మాల్ వద్ద ప్రదర్శనగా ఉంచిన కల్కి సినిమాలోని కారు బుజ్జి వద్ద ఫొటోలు దిగుతూ సందడి చేస్తున్న యువకులు, పిల్లలు

కల్కి కారు..అభిమానుల హుషారు!

ట్రెండ్‌సెట్ మాల్‌లో 'బుజ్జి' ప్రదర్శన ● చూసేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన అభిమానులు

విజయవాడ కల్చరల్, జూన్ 30: ప్రభాస్ నటించిన కల్కి 2898 ఏడీ సినిమా థియేటర్లలో అలరిస్తోంది. ఈ సినిమాలో ప్రభాస్ వినియోగించిన (ప్రత్యేకంగా రూపొందించిన) కారు 'బుజ్జి'ని నగరంలోని ట్రెండ్‌సెట్ మాల్ వద్ద ప్రదర్శనకు ఉంచారు. చూసేందుకు అభిమానులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. దాని పక్కన ఫొటోలు దిగేం దుకు ఆసక్తి కనబరిచారు. విభిన్నమైన ఆకృతిలో ఉన్న ఈ బుజ్జి వాహనం వీక్షకులను ఆకట్టుకుంటోంది. వాహనాన్ని మహీంద్ర కం పెనీ వాళ్లు తయారీ చేశారు. సినిమాలో ప్రభాస్ పాత్ర కోసం బుజ్జిని రూ.7 కోట్ల ఖర్చుతో ఏఐ ఆధారంగా రూపొందించినట్లు డిజైనర్ రమేష్ తెలిపారు. ముందు టైర్ల రిమ్ పరిమాణం 34.5 అంగుళాలు, పొడవు 6,075 మిల్లీమీటర్లు, వెడల్పు 3,380 మిల్లీ మీటర్లు, ఎత్తు 2,186 మిల్లీమీటర్లు, వెనుక మరో భారీ టైర్ ఉంటుందని ఆయన తెలి పారు. గంటకి నలభై కిలోమీటర్లు ప్రయాణి స్తుందన్నారు. ఈ వాహనానికి చక్రాలను సీ ఎట్ కంపెనీ రూపొందించిదన్నారు. వాహనం బరువు వెనుక చక్రంపైనే ఉంటుందని, బ్యాటరీ ఫుల్ చార్జింగ్ పెడితే 50 కిలో మీటర్లు నడుస్తుందని తెలిపారు. సినీనటుడు మేడసారి కిరణ్ పాల్గొన్నారు.



అంబాపురంలో సర్వే నెం 98/2బీలో వైసీపీ నేతలు అమ్మకాలకు పెట్టిన కామన్ స్థలం



పలగాని రోడ్డులో కబ్జాకు గురైన పంచాయతీ స్థలం

ప్రభుత్వం మారినా ఉదాసీనతే!

అంబాపురంలో వంశీ అనుచరులు కబ్జా చేసిన భూముల స్వాధీనానికి అధికారుల వెనకడుగు

స్థలాలు స్వాధీనం చేసుకోవాలని స్థానికుల డిమాండ్

విజయవాడ రూరల్: మండలంలోని అంబాపురం పంచాయతీ పరిధిలో వైసీపీ నేత, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుచరుల భూ కబ్జాలపై చర్యలు తీసుకోవడంలో అధికారులు ఉదాసీన వైఖరి చూపుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వంలో కోట్లాది రూపాయల ప్రభుత్వ భూములు కబ్జాకు గురైనా అధికారులు అప్పటి అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి చూసీచూడనట్టు వదిలేశారు. ఇప్పుడు ప్రభుత్వం మారినా అధికారులు కబ్జాలపై తూతూ మంత్రంగా చర్యలు తీసుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం మారి, అధికారులపై ఎలాంటి ఒత్తిడి ఉండదని, ఆ స్థలాన్ని వైసీపీ నేతల చెర నుంచి విడిపించి స్వాధీనపరచుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. అంబాపురం పంచాయతీ పరిధిలో వల్లభనేని వంశీ అనుచరుడు వైసీపీ నేత బెంజిమెన్, అతని సోదరుడు విజయ్‌కుమార్‌లు మూడు చోట్ల కబ్జాలకు పాల్పడి మొత్తం రూ.10 కోట్ల విలువైన ప్రభుత్వ భూములకు ఎసరు పెట్టారు. నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి పంచాయతీ స్థలాలను ఆక్రమించి అమ్మకాలకు పెట్టారు. దీనిపై గత నెలలో ఆంధ్రజ్యోతిలో 'కన్ను గప్పి కబ్జా' పేరుతో కథనం కూడా ప్రచురితమైంది. నెల తర్వాత ప్రభుత్వం మారడంతో అధికారులు స్పందించారు. మొత్తం మూడు చోట్ల వైసీపీ నేతలు కబ్జాలకు పాల్పడితే ఒక చోట మాత్రమే స్థలానికి ఫెన్సింగ్ వేసి వదిలివేశారు. రూ.10 కోట్లు విలువైన 3,370 గజాల స్థలాలు కబ్జా అయితే 370 గజాల స్థలానికి మాత్రమే అధికారులు ఫెన్సింగ్ వేశారు. 370 గజాల ఆక్రమిత స్థలంలో సగభాగంలో వైసీపీ నేత రేకుల షెడ్ నిర్మిస్తే, షెడ్ తొలగించకుండా పెయింటింగ్‌లతో ప్రభుత్వ స్థలంగా రాసి వదిలేశారు.

వైసీపీ నేతల చెరలో ఉన్న రూ.9 కోట్ల విలువైన స్థలాలివే..

పైపుల రోడ్డు సెంటర్ నుంచి మిల్క్‌ప్రాజెక్ట్‌కు వెళ్లే దారిలో ఇన్నర్ రింగ్ రోడ్డును ఆనుకుని అంబాపురం పంచాయతీ 11వ లైన్‌లో సర్వే నెం.98/2బీలో 2వేల గజాల కామన్ స్థలం కబ్జాకు గురైంది. అప్పట్లో తహసీల్దార్ చర్యలకు పూనుకోగా రాజకీయ ఒత్తిళ్లతో అధికారులు దాని జోలికి పోలేదు. మొత్తం 2 వేల గజాలను మూడు భాగాలుగా విభజించి కొలతలు వేసి నేతలు పంచేసుకున్నారు. ఆ స్థలాలు అమ్మకాలకు కూడా పెట్టినట్లు తెలిసింది. వైసీపీ నేతలు కబ్జా చేసిన 2 వేల గజాల విలువ రూ. 6 కోట్లు పైమాటే.

పలగాని రోడ్డులో రూ.3 కోట్ల స్థలం

ఇన్నర్ రింగ్‌రోడ్డును ఆనుకుని పైపుల రోడ్డు నుంచి మిల్క్ ప్రాజెక్ట్ వెళ్లే దారిలోని పలగాని రోడ్డు సర్వే నెం 94/2లో రూ. 3 కోట్లు విలువైన వెయ్యి గజాల స్థలం వైసీపీ నేతల కబంధ హస్తాల్లోనే ఉండిపోయింది. అప్పట్లో అధికారులు ఆ స్థలానికి ఫెన్సింగ్ వేసి హెచ్చరిక బోర్డులు రాయించినా బోర్డులను ధ్వంసంచేసి అన్నదమ్ములిద్దరు స్థలంలోకి చొరబడి కబ్జా చేశారు.

సర్వే చేసి ఫెన్సింగ్ వేస్తాం

కబ్జాల వ్యవహారం మాదృష్టికి వచ్చింది. వీఆర్వో, సర్వేయర్లను పిలిపించి అధికారుల సమక్షంలో భూములను సర్వే చేయిస్తాం. కబ్జా అయిన భూములను గుర్తించి, స్వాధీనం చేసుకుని, ఫెన్సింగ్ వేస్తాం.

-డి.శ్రీనివాస్, అంబాపురం పంచాయతీ ఈవో

19 నుంచి దుర్గగుడిలో శాకంబరి ఉత్సవాలు

మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహిస్తాం: ఈవో కేఎస్ రామారావు

వన్‌టౌన్, జూన్ 30: దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో జూలై 19వ తేదీ నుంచి 21వ తేదీ వరకు శాకంబరీదేవి ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఈవో కేఎస్ రామారావు తెలిపారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జూలై 19వ తేదీన ఉదయం 8 గంటలకు విఘ్నేశ్వర పూజతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, అఖండ దీపారాధన, అంకురార్పణ నిర్వహిస్తామని, సాయంత్రం 4 గంటలకు కలశస్థాపన చేసి అగ్ని ప్రతిష్ఠాపన, మండపారాధన, హారతి, మంత్రపుష్పం, ప్రసాద వితరణలు ఉంటాయని తెలిపారు. 20వ తేదీ ఉదయం 8 గంటలకు సప్తశతి, మహా విద్యా పారాయణలు, హోమాలు ఉంటాయని సాయంత్రం 5 గంటలకు మూలమంత్ర హవనాలు, 21వ తేదీ ఉదయం 8 గంటలకు సప్తశతి, మహా విద్యా పారాయణలు, శాంతి పౌష్టిక హోమాలు, మంటపపూజలు నిర్వహిస్తామని తెలిపారు. అవి ముగిశాక 9.30 గంటలకు పూర్ణాహుతి, కలశోద్వాసన, మార్జనం, ప్రసాద వితరణలతో శాకంబరీ దేవి ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు.



డీజీపీ ద్వారకా తిరుమలరావు కుటుంబసభ్యులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో కేఎస్ రామారావు

దుర్గమ్మను దర్శించుకున్న డీజీపీ

వన్‌టౌన్: ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను ఆదివారం డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు కుటుంబసభ్యులతో దర్శించుకున్నారు. ఆయనకు ఈవో కేఎస్ రామారావు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. అమ్మవారి ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రాన్ని ఈవో అందజేశారు. దుర్గగుడిలోని ధర్మపథం వేదికపై రాయన శ్రీనివాసరావు బృందం ఆంధ్రనాట్య ప్రదర్శనను నిర్వహించింది. ఆహూతులను అలరించారు.

6 నుంచి వారాహిదేవి పూజలు, ఆషాఢ సారె సమర్పణలు

జూలై 6 నుంచి 15వ తేదీ వరకు దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో తొలిసారిగా వారాహిదేవి పూజాధికాలు జరుగుతాయని ఈవో పేర్కొన్నారు. దేవస్థానం అర్చకులు ప్రత్యేకంగా జప, తప, హోమాదులు నిర్వహించి అమ్మవారికి తర్పణ చేస్తారని, ఇవి అంతర్గతంగా జరుగుతాయని పేర్కొన్నారు. ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని జూలై 6వ తేదీ నుంచి ఆగస్టు 4వ తేదీ వరకు కనకదుర్గమ్మకు పవిత్రసారె సమర్పించే కార్యక్రమాలు ఉంటాయన్నారు. అమ్మవారికి మహామండపం ఆరో అంతస్థులో సారె స్వీకరణ, పూజాధికాలు నిర్వహిస్తారని తెలిపారు. జూలై 14వ తేదీన హైదరాబాద్ పాతబస్తీ నుంచి ఉమ్మడి దేవాలయాల కమిటీ బంగారు బోనం సమర్పణ ఉంటుందన్నారు. జూలై 26వ తేదీన దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం తరఫున భాగ్యనగర్ మహంకాళీ అమ్మవారి ఉమ్మడి దేవాలయాల ఉత్సవాలకు పట్టువస్త్రాల సమర్పణ చేస్తామన్నారు.

19, 20 తేదీల్లో వద్దిపర్తి పద్మాకర్ ప్రవచనం

తుమ్మలపల్లి వారిక్షేత్రయ్య కళాక్షేత్రంలో జూలై 19, 20 తేదీల్లో కనకదుర్గాదేవి మహిమలపై ప్రముఖ ఆధ్యాత్మిక, ధార్మిక ప్రవచనకర్త వద్దిపర్తి పద్మాకర్ సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు ప్రవచనం చేస్తారని తెలిపారు. సమావేశంలో స్థానాచార్యుడు శివప్రసాదశర్మ, ముఖ్య అర్చకుడు బద్రీనాథ్‌బాబు, ముఖ్య అర్చకుడు ఆర్. శ్రీనివాసశాస్త్రి, ఈఈలు కోటేశ్వరరావు, రమాదేవి, ఏఈవో రమేష్‌బాబు, డీఈ కోటేశ్వరరావు పాల్గొన్నారు.



సన్మాన సభలో ఉద్యోగుల సేవలను ప్రశంసిస్తున్న బ్యాంకు సిబ్బంది

సప్తగిరి బ్యాంకు ఉద్యోగుల సేవలు అభినందనీయం

అజిత్‌సింగ్‌నగర్, జూన్ 30: సప్తగిరి గ్రామీణ బ్యాంకు ఉద్యోగుల సేవలు అభినందనీయమని బ్యాంక్ రీజనల్ మేనేజర్ నాయుడు బ్రహ్మయ్య పేర్కొన్నారు. ఆరుగురు బ్యాంకు ఉద్యోగుల పదవీ విరమణ సభ పైపుల రోడ్డు వద్ద వైఎ స్సార్ కల్యాణ మండపంలో ఆదివారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలను అందజేశారు. ఖాతాదారులకు వారు అందించిన సేవలను కొనియాడారు. చీఫ్ మేనేజర్లు యార్లగడ్డ మాధవి, ఎంవీ నాగిరెడ్డి, సీనియర్ మేనేజర్లు టి.సత్యనారాయణ, వాసన వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ మేనేజర్లు పి.సాంబశివరావు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఎన్టీఆర్ కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కృష్ణలంక, జూన్ 30: కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం నిర్వహిస్తామని ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్, డివిజన్, మున్సిపల్, మండల కేంద్రాల్లో అధికారులు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజలకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారని ఆమె తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, మండల కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తామని, ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

రామరాజు సేవలు మరువలేనివి

డిప్లొమా ఇంజనీర్ల సంఘం నేత పదవీ విరమణ సభలో ఈఎన్‌సీ

విజయవాడ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ డిప్లొమా ఇంజనీర్ల అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి దాట్ల దశరథరామరాజు ఇంజనీర్లకు అందించిన సేవలు మరువలేనివని పంచాయతీరాజ్ ఈఎన్‌సీ బాలూనాయక్ ప్రశంసించారు. 30 ఏళ్ల పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖలో సేవలందించి జూన్ నెలాఖరులో పదవీ విరమణ చేసిన ఆయనను పంచాయతీరాజ్ డిప్లమో ఇంజనీర్ల అసోసియేషన్ తరఫున ఏపీఎన్జీవో కార్యాలయంలో ఆదివారం సన్మానించారు. ఇంజనీర్ల సమస్యల పరిష్కారం కోసం యూనియన్ తరఫున రామరాజు విశేష సేవలందించారని బాలూనాయక్ తెలిపారు. సౌమ్యంగా, లౌక్యంగా ఉన్నతాధికారులతో చర్చించి సమస్యలను కొలిక్కి తీసుకురావడంలో రామరాజుతో పాటు సోమేశ్వరరావు జంటను కొనియాడకుండా ఉండలేమన్నారు. ఉన్నతాధికారులతో సఖ్యతతో మెలుగుతూ ఉద్యోగుల సర్వీసును పోరాడి సాధించిన ఘనత ఆయనకు దక్కుతుందన్నారు. ఉద్యోగ సంఘం నేతగా రామరాజు చిత్తశుద్ధితో పనిచేసేవారని ఏపీ ఎన్జీవో కృష్ణాజిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు అన్నారు. నిస్వార్థ ఇంజనీర్ల నాయకుడు రామరాజు అని డిప్లమో ఇంజనీర్ల అసోసియేషన్ రాష్ట్ర సలహాదారు వి.హనుమంతరావు కొనియాడారు. ఏపీఎన్జీవో అధ్యక్షుడు శివారెడ్డి, ఇంజనీర్ల అసోసియేషన్ జేఏసీ కార్యదర్శి సంగీతరావు, డిప్లమో ఇంజనీర్ల అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు రియాజ్, అధ్యక్షుడు రవీంద్ర, కార్యదర్శి రత్నప్రసాద్, సోమేశ్వరరావు పాల్గొన్నారు.



దాట్ల దశరథరామరాజు పదవీ విరమణ సభలో మాట్లాడుతున్న ఈఎన్‌సీ బాలూనాయక్



అశోక్ కుమార్‌కు జ్ఞాపిక అందిస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా



సత్కరిస్తున్న ఉద్యోగ సంఘాల నేతలు విద్యాసాగర్ తదితరులు

చలసాని అశోక్‌కుమార్ సేవలు అభినందనీయం

కూచిపూడి, జూన్ 30: పంచాయతీరాజ్ శాఖలో 33 ఏళ్ల వివిధ హోదాల్లో పనిచేసి పదవీ విరమణ పొందిన చలసాని అశోక్‌కుమార్ సేవలు అభినందనీయమని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. ఆదివారం భట్లపెనుమర్రులోని పింగళి వెంకయ్య భవన్‌లో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఉద్యోగ సంఘాల నాయకుడిగా అశోక్ కుమార్ సమర్థవంతంగా పనిచేశారని ఆయన ప్రశంసించారు. అశోక్ కుమార్‌ను దుశ్శాలువాలతో సత్కరించి మెమొంటో అందించి అభినందించారు. కళ్లేపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆనంద్ కుమార్, ఏపీ ఎన్జీవో అసోసియేషన్ వెస్ట్ కృష్ణా అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్, ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు, ఉద్యోగ సంఘాల నేతలు జె.ఎల్.ప్రసాద్, టీడీపీ మండల అధ్యక్షుడు లింగమనేని రామలింగేశ్వరరావు, ఎంపీపీ కొండేటి ఇందిర, సర్పంచ్ మట్టా ఇందిర, ఉభయ కృష్ణా జిల్లాలకు చెందిన ఉద్యోగ సంఘాల నేతలు పాల్గొన్నారు. అశోక్ కుమార్ దంపతులను వారు ఘనంగా సత్కరించారు.

జోగి భూ కబ్జా వ్యవహారంలో సస్పెండైన

మండల సర్వేయర్ రమేశ్ నిర్వాకం

సస్పెన్షన్ ఆర్డర్ రాకుండా సర్వేశాఖ ఉన్నతాధికారులకు లంచం!

ఆయనతో పాటు సస్పెండైన మరో ఇద్దరికి ఉత్తర్వులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): సీఐడీ అటాచ్‌లో ఉన్న అగ్రిగోల్డ్ భూములను మాజీ మంత్రి జోగి రమేశ్ కబ్జా చేశారని ఆరోపణలున్న వ్యవహారంలో కీలక సూత్ర ధారిగా ఉన్న విజయవాడ రూరల్ మండల సర్వేయర్ రమేశ్ సస్పెండ్ వేటు నుంచి తప్పించుకోవటానికి జిల్లా, రాష్ట్ర సర్వేశాఖ ఉన్నతాధికారులకు భారీగా ముడుపులు సమర్పించుకున్నట్టుగా తెలుస్తోంది. అగ్రిగోల్డ్ భూముల అన్యాక్రాంతంలో బాధ్యులైన వారిపై తహసీల్దార్ జాహ్నవి నివేదిక ఆధారంగా విజయవాడ రూరల్ మండల డిప్యూటీ తహసీల్దార్, మండల సర్వేయర్, గ్రామ సర్వే యర్లను సస్పెండ్ చేయమని అప్పటి కలెక్టర్ ఢిల్లీ రావు ఆదేశాలు జారీ చేశారు. వీరిలో సస్పెండైన మండల సర్వే యర్ రమేశ్ మాత్రం డబ్బులతో తిరిగి పోస్టు తెచ్చు కునేందుకు ప్రయత్నించడం విమర్శలకు తావిస్తోంది. మిగిలిన ఇద్దరికీ సస్పెన్షన్ ఆర్డర్స్ వచ్చినా మండల సర్వే యర్‌కు మాత్రం రాలేదు. జిల్లా సర్వే శాఖ ఉన్నతాధికా రితో పాటు, రాష్ట్ర స్థాయిలో సర్వేశాఖ ఉన్న తాధికారుల దగ్గర ఉన్న తన పలుకుబడితో కొంత, డబ్బులు ముట్ట చెప్పి తనకు సస్పెండ్ ఆర్డర్ రాకుండా చూసుకున్నట్టుగా తెలుస్తోంది. ఈ వ్యవహారంపై కలెక్టర్ సృజన విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్‌పై దాడి చేసిన నకిలీ విలేకరి అరెస్టు

గుడివాడ: అవనిగడ్డ డిపో ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవ ర్‌పై దాడి చేసి, దుర్భాషలాడిన కేసులో నకిలీ విలేకరిని అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ ఎం.నాగదుర్గారావు ఆది వారం ఒక ప్రకటనలో తెలిపారు. డ్రైవర్ సిరివెళ్ల రాకేష్‌పై గుడివాడకు చెందిన పట్టపు శివ వెంకటనాగేంద్ర, నకిలీ విలేకరి పంచకర్ల శ్రీనివాస్ మద్యం మత్తులో దాడి చేశా రని తెలిపారు. వీరిలో శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకు న్నామని, మరో నిందితుడు పట్టపు శివవెంకటనాగేంద్ర పరారీలో ఉన్నాడని పేర్కొన్నారు.

నేటి నుంచి పీఏసీఎస్ సీఈవోలకు శిక్షణ

మచిలీపట్నం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పరపతి సహకార సంఘాల(పీఏసీఎస్) పని తీరును మెరుగుపరిచేందుకు, సేవలను సులభతరంగా అందించేందుకు నేషనల్ కౌన్సిల్ ఫర్ కో-ఆపరేటివ్ శిక్షణ సంస్థ (ఎన్‌సీసీటీ)ద్వారా కృష్ణాజిల్లాలోని 188 పీఏసీఎస్‌లలో పనిచేసే సీఈవోలకు ఎస్‌వీహెచ్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం నుంచి నాలుగు రోజులపాటు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా సహకారశాఖ అధికారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 300రకాల ఆన్‌లైన్ సేవలు అందించడం, పీఏసీఎస్‌లలో పరిపాలనా పరమైన అంశాలపైన శిక్షణ ఇస్తామని ఆయన తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాల ఎన్‌సీసీటీ సమన్వయకర్త ప్రొఫెసర్ ఎస్ ఎల్ ఎన్‌టీ శ్రీనివాస్ తదితరులు శిక్షణ ఇస్తారని ఆయన పేర్కొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	127, 136, 147
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.35

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం

విద్యాధరపురం, జూన్ 30: స్థానిక టీవీ కృష్ణారావు వీధిలోని శృతి నిలయంలో నివాసముంటున్న సముద్రాల పుల్లారావు మనుమరాలు సముద్రాల శృతి జన్మదినం సందర్భంగా 15 మంది పేద విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.4వేల చొప్పున ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. శ్రీరామ వాసవీ సేవా సమితి కమిటీ సభ్యులు, విద్యార్థులు, వారి తల్లితండ్రులు పాల్గొన్నారు.



సాయం అందజేస్తున్న పుల్లారావు

ఎంపీ కేశినేని శివనాథ్‌కు ఘన సత్కారం



ఎంపీ కేశినేని శివనాథ్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

విద్యాధరపురం, జూన్ 30: విశాఖ పర్యటనలో భాగంగా ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అక్కడి నార్త్ బీజేపీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజును ఆయన కార్యాలయంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చిన్నికి ఆయన పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువా కప్పి సత్కరించారు. వీరిద్దరు కొద్దిసేపు విశాఖ స్టీల్‌ప్లాంట్ సమస్యలను, రాజకీయ అంశాలను చర్చించుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

పాయకాపురం/అజిత్‌సింగ్‌నగర్, జూన్ 30 : పాయకాపురం, అజిత్‌సింగ్ నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు కార్యనిర్వాహక ఇంజనీర్ బీవీ సుధాకర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్లకు, ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతుల కారణంగా పాయకాపురంలోని ఏపీఎస్ రెడ్డి రోడ్డు, డాక్టర్స్ కాలనీ, న్యూ రాజీవ్‌నగర్, రాధానగర్, బర్మాకాలనీ, విశాలాంధ్ర కాలనీ పరిసర ప్రాంతాలు, అజిత్‌సింగ్ నగర్ పరిధిలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం అపార్ట్‌మెంట్స్, వాంబేకాలనీ ఏ, బీ, సీ, డీ, ఈ, ఎఫ్, జీ, హెచ్ బ్లాక్స్, డిస్నీల్యాండ్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు పేర్కొన్నారు.

ఆరోగ్యానికి యోగా మహాభాగ్యం

పాయకాపురం, జూన్ 30: నిత్యం జీవితంలో ఎదురయ్యే ఒత్తిళ్ల నుంచి ఉపశమనం పొందడానికి, చక్కటి ఆరోగ్యానికి యోగానే మహాభాగ్యం అని స్పందన సేవా సమితి అధ్యక్షుడు ఇమ్మానేని కృష్ణ ప్రసాద్ అన్నారు. ప్రశాంతినగర్‌లోని స్పందన వాకర్స్ క్లబ్‌లో ఆదివారం ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం 50 మంది మహిళలకు చీరల పంపిణీ చేశారు. వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ చిన్నం రామకృష్ణ, ఎం.కృష్ణ ముఖ్య అతిథులుగా, క్లబ్ సభ్యులు శాస్త్రి, నరసింహమూర్తి పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయంలో వేడుకలు



కేక్ కట్ చేసి టీమిండియాకు శుభాకాంక్షలు తెలుపుతున్న బొండా ఉమా

టీ-20 వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్‌లో టీమిండియా విజయం సాధించిన సందర్భాన్ని పురస్కరించుకుని టీడీపీ సెంట్రల్ నేతలు ఆదివారం సంబరాలు నిర్వహించారు. మొగల్రాజపురంలోని బొండా ఉమా నివాసంలో జరిగిన ఈ సంబరాల్లో ఎమ్మెల్యే బొండా ఉమా కేక్ కట్ చేసి టీమిండియా క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. నేతలు నవనీతం సాంబశివరావు, దెందుకూరి మురళీకృష్ణంరాజు పాల్గొన్నారు.

భక్తులకు మామిడి రసం పంపిణీ

వన్‌టౌన్, జూన్ 30: దుర్గగుడిలో కృష్ణాజిల్లా బాపులపాడు మండలం రేమల్లెకు చెందిన విజయ కృష్ణ ఆగ్రో ఫుడ్ ప్రాసెసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆర్.లలితకుమారి బృందం ఆదివారం భక్తులకు మామిడి రసాన్ని పంపిణీ చేశారు. ఈ పంపిణీని ఈవో కేఎస్ రామారావు ప్రారంభించారు.

‘సమభావన’ సేవలు అభినందనీయం

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



గద్దె రామ్మోహన్‌ను సత్కరిస్తున్న సమభావన మిత్రమండలి సభ్యులు

పటమట, జూన్ 30 : సమాజంపై గౌరవంతో ప్రజలకు మంచి చేయాలనే ఆశయంతో సమభావన మిత్రమండలి సామాజిక సేవ చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. సమభావన మిత్రమండలి 100వ సమావేశం ఆదివారం అధ్యక్షుడు కోనేరు నరేంద్రబాబు అధ్యక్షతన బెంజిసర్కిల్‌లోని వాసవ్య మహిళామండలి జూబ్లీహాల్లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ చేతుల మీదుగా రష్మి సమరం, మోతుకూరి వెంకటేశ్వరరావు, డాక్టర్ ఎన్‌వీ రావుకు సన్మానం చేశారు. అనంతరం గద్దెను సంఘ పెద్దలు సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సమభావన మిత్రమండలి 100వ సమావేశంలో తాను పాల్గొనటం అదృష్టమన్నారు. విశిష్ట అతిథి ప్రముఖ ఆర్థోపెడిక్ నిపుణులు డాక్టర్ మనోజ్‌కుమార్ సీనియర్ సిటిజన్స్ తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. టి.శోభనాద్రి, గుమ్మా సాంబశివరావు, యార్లగడ్డ రంగారావు, డాక్టర్ ఎంవీ రావు, వెంకటరెడ్డి, డాక్టర్ జంధ్యాల శంకర్, గోళ్ల నారాయణరావు, సుంకర నాగభూషనం, డాక్టర్ పీఆర్‌కే ప్రసాద్, మనవాళ్ల సూరి, అప్పారావు, కోనేరు భీమేశ్వరరావు, పేర్లి దాసు, ఎం అంజయ్య పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు



స్వాధీనం చేసుకున్న వాహనాలతో పోలీసులు

సత్యనారాయణపురం, జూన్ 30: నగరంలో పలు ప్రాంతాల్లో బైక్‌లను దొంగిలించిన వ్యక్తిని సత్యనారాయణపురం పోలీసులు అదుపులోకి తీసుకొని 19 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం మహ్మద్ రబ్బాని పడమటలో లాడ్జిలో ఉంటున్నాడు. చెడు అలవాట్లకు బానిసై హైదరాబాద్‌లో భార్యా పిల్లలను వదిలేసి ఇక్కడ ఉంటున్నాడు. కేటరింగ్, కూలీ పనులు చేస్తుంటాడు. సంపాదన చాలక బైక్ దొంగతనాలకు అలవాటుపడ్డాడు. ఇతడిపై గతంలో పోలీసులు కేసు పెట్టారు. 2 నెలలుగా బైక్ దొంగతనాలు అధికమవడంతో సీపీ పీహెచ్‌డీ రామకృష్ణ ఆదేశాల మేరకు డీసీపీ హరికృష్ణ పర్యవేక్షణలో ఏసీపీ ప్రసాద్ ఆధ్వర్యంలో మూడు స్పెషల్ టీంలు ఏర్పాటు చేశారు. దొంగిలించిన బైక్‌పై అనుమానాస్పదంగా తిరుగుతున్న రబ్బానిని సీఐ వెంకట నారాయణ తన సిబ్బందితో కలిసి ఆదివారం సాంబమూర్తి రోడ్డు కొత్తవంతెన వద్ద అదుపులోకి తీసుకున్నారు. వారి విచారణలో నిందితుడు నగరంలో 19 బైక్‌లు దొంగతనం చేసినట్టు తేలింది. తమ స్టేషన్ పరిధిలో 7, అజిత్‌సింగ్‌నగర్ పీఎస్ పరిధిలో 3, సూర్యారావు పేట, మాచవరం, పటమట, గుణదల, నున్న ప్రాంతాల్లో మిగిలిన బైక్‌లు దొంగిలించినట్లు తేలింది. దీంతో పోలీసులు 19 బైక్‌లను స్వాధీనం చేసుకుని అతడిని కోర్టుకు హాజరుపరిచారు. దొంగిలించిన బైక్‌ల విలువ సుమారు రూ.5లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

లౌకికరాజ్యాన్ని మతరాజ్యంగా మార్చే కుట్ర

● పీయూసీఎల్ నేత సాంబశివరావు



ఓపీడీఆర్ మాజీ అధ్యక్షుడు ఏసు ప్రథమ వర్థంతి సభలో ఆయన జీవిత చరిత్రను తెలిపే బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు

గవర్నర్‌పేట, జూన్ 30 : జూలై 1 నుంచి అమలు జరపనున్న మూడు న్యాయ చట్టాలులౌకికరాజ్యాన్ని మతరాజ్యంగా మార్చడానికి ఉద్దేశించినవేనని పీయూసీఎల్ నేతలు, అడ్వకేట్ బండ్ల సాంబశివరావు అన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల ఓపీడీఆర్ మాజీ అధ్యక్షుడు కె.ఏసు ప్రథమ వర్థంతి సభ ఆదివారం ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో జరిగింది. ఏసు చిత్రపటానికి పలువురు నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభకు ఓపీడీఆర్ ఉమ్మడి ఏపీ ప్రధాన కార్యదర్శి వి.హనుమంతరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ ప్రజా ఉద్యమాల్లో ఏసు పాత్ర, తుదికంటూ ఉద్యమం పట్ల చూపిన అంకిత భావాన్ని, నిబద్ధత ఆదర్శనీయమన్నారు. సభలో ఆలిండియా ఓపీడీఆర్ చైర్మన్ సి.భాస్కరరావు, హ్యూమన్ రైట్స్ అడ్వకేట్ ఏఎస్ఎస్ రాంప్రసాద్, ఓపీడీఆర్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్ వెంకటేశ్వరరెడ్డి, జె పాపారావు, స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్ర అధ్యక్షురాలు సి. విజయ, వివిధ సంఘాల నేతలు వీరబాబు, జి. రోహిత్, ఎం. ప్రసాద్‌బాబు, రామకృష్ణ, ముప్పాళ్ల భార్గవశ్రీ, ఏసు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

పెనమలూరు, జూన్ 30 : విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన ఘటన కానూరు వందడుగుల రోడ్డులో జరిగింది. ఆదివారం జరిగిన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి వివరాలను వెల్లడించారు. మచిలీపట్నానికి చెందిన కుంబ దత్తాత్రేయ తనకు చెందిన టాటాఏస్ వాహనంలో తన బంధువుల ఇంటికి వచ్చాడు. తన బంధువులకు చెందిన చికెన్ సెంటరుకు సంబంధించిన వేస్ట్‌ను తన వాహనంలో ఎక్కించి వందడుగుల రోడ్డులో వెళుతుండగా వాహనం అదుపు తప్పి సైడు కాల్వలో పడింది. దీన్ని బయటికి తీయడానికి అతడు ఒక జేసీబీనీ మాట్లాడి తీసుకువచ్చి వ్యాన్‌ను తీయడానికి ప్రయత్నిస్తుండగా జేసీబీకి చెందిన కొక్కెం అక్కడే పైగా వెళుతున్న విద్యుత్ తీగలకు తగలడంతో వ్యాన్‌ను పట్టుకునే ఉన్న దత్తాత్రేయకు విద్యుత్ షాక్ తగిలింది. దీనితో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఉయ్యూరు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

అలరించిన కనకపుష్యరాగం

విజయవాడ కల్చరల్, జూన్ 30: దృశ్యవేదిక సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం గాంధీనగర్‌లోని వెలిదండల హనుమంతరాయ గ్రంథాలయంలో కనకపుష్యరాగం నాటకం ప్రదర్శించారు. నటరాజుగా పేరుగాంచిన కొప్పిలి వెంకటేశ్వరరావు శత జయంతిని పురస్కరించుకొని సాంస్కృతిక వేడుకను నిర్వహించారు. ఎస్.కె.మిశ్రో దర్శకత్వంలో దివంగత రచయిత రాఘవ రచించిన కనకపుష్యరాగం నాటకానికి సిరికి స్వామినాయుడు గేయాలు అందించారు. దొంతల ప్రకాష్, ఈవన భాగ్యరాజ్, కత్తి శ్యాంప్రసాద్, ఈవన రమేష్‌బాబు, బొర్రా నరేన్, బి.రూపశ్రీ, జి.ఎన్.డి.కుసుమ సాయిలు పాత్రలను చక్కగా పోషించారు. అనంతరం దర్శకులు మిశ్రోని ఘనంగా సత్కరించారు. రంగస్థల నట దర్శకుడు హెచ్‌వీఆర్ఎస్ ప్రసాద్ నిర్వహించారు.



కనకపుష్యరాగం నాటకంలో ఓ సన్నివేశం

12 నుంచి పోలేరమ్మ తిరునాళ్ల



తిరునాళ్ల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సూరసాని రామిరెడ్డి

భవానీపురం, జూన్ 30 : ఊర్మిళానగర్‌లో ప్రసిద్ధిగాంచిన గ్రామదేవత పోలేరమ్మ గుడిలో 37వ తిరునాళ్ల ఉత్సవాలను ఈనెల 12 నుంచి 14 వరకు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు సూరసాని రామిరెడ్డి తెలిపారు. పోలేరమ్మ ఆలయంలో కమిటీ సభ్యులతో తిరునాళ్లకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. 12న అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, కుంకుమ పూజలుంటాయని, 13న పోలేరమ్మకు అన్నాభిషేకం, 14న కృష్ణా నదీ జలాలతో అభిషేకాలుంటాయన్నారు. భక్తులు విరివిగా పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని రామిరెడ్డి కోరారు. పోలేరమ్మ దేవస్థానంలో రేకులషెడ్డు స్థానంలో దసరా నాటికి స్లాబ్ వేయాలని నిర్ణయించామని, దాతలు స్పందించి విరాళాలు అందించాలని కోరారు. కమిటీ కార్యదర్శి గుత్తావళి విజయబాబు, సభ్యులు తుమ్మా తిరుపతిరెడ్డి, దొడ్డా వెంకటేశ్వరరావు, రాచమల్ల రమణమ్మ, గొందేసి సత్యనారాయణరెడ్డి, గోవిందబాబు, ప్రధానార్చకులు గంటి సన్యాసిరావు పాల్గొన్నారు.

52వ డివిజన్‌లో ప్రజాదర్బార్



స్థానికులతో మాట్లాడుతున్న 52వ డివిజన్ కార్పొరేటర్ చంటి

వన్‌టౌన్, జూన్ 30: 52వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు (చంటి) ఆదివారం డివిజన్‌లోని యాదవ కల్యాణమండపం వద్ద శుభోదయం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఎన్‌డీఏ కూటమికి ఓటు వేసి చంద్రబాబును సీఎం చేసినందుకు కృతజ్ఞతగా స్థానికులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా స్థానికంగా వీధి దీపాల సమస్యను ఆయన దృష్టికి తెచ్చారు. మంచినీటిలో నలకలు రావడం, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యలను పరిష్కరించడం వంటి సమస్యలను స్థానికులు ప్రస్తావించారు. గత ప్రభుత్వ హయాంలో తొలగించిన పెన్షన్లను పునరుద్ధరించాలని కోరగా అర్హులందరికీ పెన్షన్‌లు ఇప్పిస్తామని ఆయన అన్నారు.



గేట్ మీటింగ్ నిర్వహించిన ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

వన్‌టౌన్, జూన్ 30 : గవర్నరుపేట-2 డిపోలో ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం డిపో వద్ద ఎంప్లాయీస్ యూనియన్ నేతలు గేట్ మీటింగ్ నిర్వహించారు. యూనియన్ జోనల్ కార్యదర్శి వైఎస్, సహాయ కార్యదర్శి ఎస్‌కేఎన్ మీరా, ప్రాంతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు రాంబాబు, డిపో కార్యదర్శి పీఎస్ రావు, డిపో అధ్యక్షుడు ఎస్‌కే చింతయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ చిన్నచిన్న కారణాలకే ఉద్యోగులను సస్పెండ్ చేస్తున్నారన్నారు. మహిళా ఉద్యోగులకు మరుగుదొడ్ల వసతి సమస్యను పరిష్కరించలేదన్నారు. ఉద్యోగులను దుర్భాషలాడుతున్న ఎస్‌టీఐ, సెలవుల విషయంలో ఏకపక్షంగా వ్యవహరిస్తున్న టీఐ2కు వ్యతిరేకంగా గేట్ మీటింగ్ నిర్వహించి నిరసన తెలిపామన్నారు.

బడిపిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలి



ఊర్మిళానగర్‌లో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న గాంధీనాగరాజన్

భవానీపురం, జూన్ 30: ప్రభుత్వ పాఠశాలల్లో చదువునే పిల్లలకు నాణ్యమైన బియ్యం అందించి వారికి మంచి భోజనం అందించాలని గాంధీ దేశం సోషల్ వెల్ఫేర్ ట్రస్ట్ అధ్యక్షుడు ఆర్. గాంధీ నాగరాజన్ కోరారు. దీనిపై ఇటీవల సీఎం చంద్రబాబుకు ఒక లేఖ రాశానన్నారు. ప్రతి నెల 30న నిరసన దీక్షలో భాగంగా కళ్లకు గంతలు కట్టుకుని ఆదివారం గాంధీ నాగరాజన్ నిరసన దీక్ష చేపట్టారు. ట్రస్టు సభ్యులు ఆర్.శివరంజని, బంగారు భారతి పాల్గొన్నారు.

ఆదరించిన ప్రజలకు అండగా ఉంటా

ఎమ్మెల్యే బోడె ప్రసాద్



గోసాల విజయోత్సవ ర్యాలీలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్

గోసాల (కంకిపాడు), జూన్ 30 : ఆదరించిన ప్రజలకు అండగా ఉంటా నని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. గోసాలలో ఆదివారం నిర్వహించిన విజయోత్సవ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పెనమలూరు నియోజక వర్గంలో 2009 నుంచి 2024 వరకు జరిగిన ఎన్నికల్లో ఎన్నడూ లేని విధంగా 60 వేల మెజారిటీ ఇవ్వడం జరిగిందన్నారు ప్రజలను తనను ఏ విధంగా ఆదరించారో అర్థం అవుతుందని, ఆదరించిన నియోజక వర్గ ప్రజలకు తాను అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఏ చిన్న సమస్య వచ్చినా పోరంకిలోని తన కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో అనుమోలు ప్రభాకర్, కోయా ఆనంద్, సెంగెపు రంగారావు, కోనేరు సాంబ శివరావు, మాబు సుబాని, ఆంజనేయులు, కోటేశ్వరరావు, కాసరనేని మురళి, ఎండవ రాంబాబు, బిల్లా సత్యనారాయణ, షేక్ లాలీ పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

పెనమలూరు : 2019లో గత ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి తెచ్చిన సీసీఆర్‌సీ చట్టాన్ని సవరించి కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులివ్వాలని డిమాండ్ చేస్తూ కౌలు రైతుసంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఏపీ కౌలు రైతు సంఘం కృష్ణా జిల్లా అధ్యక్షులు పంచకర్ల రంగారావు మాట్లాడుతూ, రైతాంగం సాధించుకొన్న 2011 కౌలు రైతుల చట్టాన్ని గత ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా రద్దు చేసిందని, భూయజమాని సంతకం ఉంటేనే కౌలు రైతులకు గుర్తింపు కార్డులిస్తామని ప్రకటించిందని వాపోయారు. ఎమ్మెల్యే బోడె మాట్లాడుతూ, కౌలు రైతుల ఇబ్బందులను అసెంబ్లీలో చర్చించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మాదు నాగేశ్వరరావు, పెదపూడి శ్రీనివాస్, మరియదాసు, త్రిమూర్తులు, రాంబాబు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

లిటిల్ మాస్టర్ డైవర్

నీరంటే పిచ్చి... స్కూబా డైవింగ్ అంటే ఆసక్తి. అవే కైనా ఖరేకి ప్రపంచంలోనే అత్యంత పిన్నవయస్కురాలైన మాస్టర్ స్కూబా డైవర్‌గా గుర్తింపు తెచ్చిపెట్టాయి. సాహసాలకు వయసుతో పని లేదంటున్న ఈ పన్నెండేళ్ళ బెంగళూరు అమ్మాయి కథేమిటంటే...



"నీటి అడుగున నాకు ఎన్నో అనుభవాలు ఎదురయ్యాయి. చెప్పడానికి అనేక విశేషాలున్నాయి. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలీదు. వాతావరణం భయానకంగా ఉంటుంది, ఒక్కోసారి ఏదీ కనిపించదు. మనతో కలిసి డైవ్ చేసినవారు కనిపించకుండా పోవచ్చు. వాళ్ళకోసం వెతుకుతూ ఉండాలి. కొన్నిసార్లు చేపలు దాడి చేస్తాయి. "ఇంత రిస్క్ తీసుకొని, ఈ చిన్న వయసులో ఎందుకీ సాహసాలు?" అని ఎందరో అడుగుతూ ఉంటారు. "ఎందుకంటే... నీళ్ళంటే నాకు పిచ్చి. డైవింగ్ అంటే ఎనలేని ఆసక్తి. ఇక రిస్క్ అంటారా... రోడ్డు మీద నడిచి వెళ్తున్నప్పుడు కూడా ప్రమాదం జరగొచ్చు. అందరూ అన్ని వేళలా జాగ్రత్తగా, అప్రమత్తంగా ఉండాలి" అని చెబుతుంది కైనా ఖరే. ఇటీవలే అండమాన్-నికోబార్‌లో 'మాస్టర్ స్కూబా డైవర్ సర్టిఫికేషన్ అందుకొని, అధికారికంగా 'మాస్టర్ డైవర్'గా గుర్తింపు పొందిన ఈ పన్నెండేళ్ళ అమ్మాయి స్వస్థలం బెంగళూరు. రెండేళ్ళ వయసులోనే కైనాకు ఆమె తల్లితండ్రులు స్విమ్మింగ్‌ను పరిచయం చేశారు. 'కైనాను అందరూ 'వాటర్ బేబీ' అని పిలిచేవారు. మా అపార్ట్‌మెంట్‌లోని స్విమ్మింగ్ పూల్‌లో ఈతను ఆమెకు పరిచయం చేశాం. అందులో మంచి ప్రావీణ్యం సంపాదించింది. రెండేళ్ళ కిందట... తనకు పదేళ్ళ వయసులో... మా కుటుంబం అండమాన్-నికోబార్ దీవుల పర్యటనకు వెళ్ళినప్పుడు... స్కూబా డైవింగ్ పరిచయం అయింది. అప్పటి నుంచీ ఆమెకు అదే లోకంగా మారిపోయింది" అని చెప్పారు కైనా తల్లి అన్నుమ. స్విమ్మింగ్ పూల్‌లో కాకుండా... సముద్రం జలాల్లో డైవ్ చెయ్యడం కాస్త భయంగానూ, సరదాగానూ అనిపించింది. స్కూబా డైవింగ్‌లో మరింత నైపుణ్యం కోసం ఇండోనేసియాలోని బాలిలో 'ఓపెన్ వాటర్ కోర్స్' చేశాను. అలాగే థాయిలాండ్‌లో 'అడ్వాన్స్‌డ్ ఓపెన్ వాటర్ కోర్స్ పూర్తి చేసి, సర్టిఫికెట్ అందుకున్నాను" అని చెబుతున్న కైనా అండర్‌వాటర్ ఫొటోగ్రఫీ, స్పెషలైజ్డ్ నిట్రోక్స్ డైవింగ్, రెస్క్యూ డైవర్ ట్రైనింగ్... ఇలా అనేక అంశాల్లో శిక్షణ పొందింది. "ఇవేవీ సాధారణమైన అంశాలు కావు. కేవలం రెండేళ్ళలోనే వాటన్నిటిలో కైనా నిష్ణాతురాలై... అనుభవజ్ఞులైన స్కూబా డైవర్లను ఆశ్చర్యపరచింది. స్కూబా డైవింగ్‌లో కోర్సులు చేస్తానని కైనా చెప్పినప్పుడు... మొదట్లో మేము సంకోచించాం. కానీ ఆమె పట్టుదలను చూసి... ప్రోత్సహించాం" అంటారు అన్నుమ.



సవాళ్ళకు ఎప్పుడూ సిద్ధంగా ఉండాలి

స్కూబా డైవింగ్‌కు ఎంతో ధైర్యం, సమయస్ఫూర్తి కావాలి. భద్రతా ప్రోటోకాల్స్ కచ్చితంగా పాటించాలి. దానికి అనుగుణంగా కైమా తల్లితండ్రులు అన్ని జాగ్రత్తలూ తీసుకుంటారు. "నేను అండమాన్-నికోబార్ దీవులతో పాటు బాలి, మాల్దీవులు, థాయిలాండ్... ఇలా ఎన్నో ప్రాంతాల్లో డైవింగ్ చేశాను. ప్రతి ప్రదేశానికీ తనదైన విశిష్టత ఉంది. నీటి అడుగున ఉండే పర్యావరణ వ్యవస్థలన్నా, జీవులన్నా నాకు చాలా ఇష్టం. అన్నిటిన్నా సముద్రపు తాబేళ్ళు నాకు ఫేవరెట్. అవి భారీగా, అద్భుతంగా ఉంటాయి" అని అంటోంది కైనా. స్కూబా డైవింగ్‌లో ఆమె ప్రతిభ... అధికారికంగా 'మాస్టర్ డైవర్ టైటిల్' అందుకొనేలా చేసింది. అసాధారణమైన పరిజ్ఞానం, అంకితభావం, నైపుణ్యం ఉన్నవారికి ఈ టైటిల్ ఇస్తారు. తద్వారా 'ప్రపంచంలో తక్కువ వయసున్న మహిళా మాస్టర్ స్కూబా డైవర్‌'గా గుర్తింపును సైతం కైనా సొంతం చేసుకుంది. "సముద్రంలో ఎలాంటి సవాల్‌నైనా ఎదుర్కోవడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉండాలి. ప్రత్యేకించి అండమాన్-నికోబార్ దీవుల్లో వాతావరణం భయపెడుతుంది. వర్షాలు, తుపాన్లు హఠాత్తుగా ముంచుకొస్తాయి. అలాంటి వాతావరణంలో ఒకసారి ఒక డైవర్ నీళ్ళలోకి దూకి అపస్మారక స్థితికి చేరాడు. నేను అతన్ని బోట్ వరకూ ఈడ్చుకువచ్చాను. ఆ సంఘటన ఇప్పటికీ గుర్తొస్తూ ఉంటుంది" అంటున్న కైనా "మెరైన్ సైన్స్ చదవాలనేది నా కోరిక. ప్రపంచంలో వీలైన ప్రతిచోటా స్కూబా డైవింగ్ చెయ్యాలన్నది నా కల" అని చెబుతోంది.



వరుస సినిమాలు లేవు. కానీ కెమెరా లెన్స్‌లు ఎప్పుడూ ఆమెపై ఎక్కుపెట్టే ఉంటాయి. టీవీ షోలకు గెస్ట్‌గా... హోస్ట్‌గా... అన్నిటికీ విఎంచి ఫిట్‌నెస్ గురూగా... భిన్న పాత్రల్లో ఒదిగిపోయిన బాలీవుడ్ నటి **శిల్పాశెట్టి**. 'నా మది నియంత్రణలో నేను లేను. నా ఆధీనంలో నా మనస్సు ఉంటుంది. ఇదే నా ఆనందమయ జీవనానికి కారణం' అంటున్న శిల్ప... యాభై ఏళ్ల వయసులోనూ తరగని అందం... మైమరిపించే రూపంతో ఆకట్టుకుంటోంది.

శిల్ప సౌందర్యం



"ఎంత పని ఒత్తిడి ఉన్నా, ఎన్ని సమస్యలు చుట్టుముట్టినా, నన్ను మానసికంగా ఇంత దృఢంగా ఉంచుతున్నది భగవద్గీతలోని 'బంధురాత్మనస్తస్య యేనాత్మైవాత్మానా జితః... అనాత్మనస్తు శత్రుత్వే వర్తేతాత్మైవ శత్రువత్' శ్లోకం. 'ఎవరైతే తమ మనస్సును జయిస్తారో అది వారికి మంచి మిత్రుడిగా ఉంటుంది. లేదంటే అదే వారికి శత్రువు అవుతుంది' అని దీని అర్థం. నా మనసు నా నియంత్రణలో ఉందని, దాని ఆధీనంలో నేను లేనని గుర్తు చేసుకోవడానికి రోజూ ఈ శ్లోకాన్ని బిగ్గరగా చదువుతా" అంటున్న శిల్ప క్రమం తప్పకుండా యోగా చేస్తుంది. క్లిష్టమైన యోగాసనాలతో కొన్ని వీడియోలు కూడా ఆమె విడుదల చేసింది. 'అలాగే శ్వాసకు, మానసిక ఆరోగ్యానికి సంబంధం ఉంది. ప్రతి భావోద్వేగం శ్వాసతో ముడిపడి ఉంటుంది. ఒకవేళ మీరు శ్వాస లయను మార్చగలిగితే భావోద్వేగాన్ని కూడా మార్చవచ్చు' అంటుందీ బ్యూటీ.

'యోగా ప్రకారం శ్వాసకు, మానసిక ఆరోగ్యానికి అనివార్యమైన సంబంధం ఉంది. ఎందుకంటే ఒక వ్యక్తి శ్వాస అతడి మానసిక స్థితిని ప్రతిబింబిస్తుంది. శ్వాస మీద నియంత్రణ గలవారు ప్రశాంత చిత్తంతో ఉండగలరు. ప్రాణాయామం లాంటి శ్వాస సంబంధిత ప్రక్రియలు ఒత్తిడిని తగ్గించి, భావోద్వేగాల సమతుల్యతకు దోహదపడతాయి. అదేవిధంగా పలు యోగాసనాల భంగిమలు కూడా శ్వాసతో ముడిపడినవే. గురువుల పర్యవేక్షణలో సాధన చేస్తే ఆనందమయమైన, ఆరోగ్యకరమైన జీవన శైలిని పొందగలుగుతారు'... అనేది శిల్ప మాట. యోగాను దైనందిన జీవితంలో భాగం చేయాలనుకొనేవారు... 'తొలుత సులువైన ఆసనాలతో ప్రారంభించి, క్రమంగా శరీరానికి అవసరమైనవాటిని సాధన చేస్తూ పోవాలి. వ్యాయామాలను ఏదో తప్పనిసరిగా చేస్తున్నట్టు కాకుండా... వాటిని ఆస్వాదిస్తే మరింత మెరుగైన ఫలితాలు వస్తాయి. వీటన్నిటితో పాటు పరిశుభ్రమైన సమతుల ఆహారం, జీవన శైలి కూడా ఎంతో ముఖ్యం. అప్పుడే మన శరీరం సంపూర్ణ ఆరోగ్యం సంతరించుకొంటుంది' అంటోందీ భామ.

వర్కవుట్ ఇలా...

ఇటీవల శిల్పాశెట్టి ఇన్‌స్టాలో ఫిట్‌నెస్‌కు సంబంధించి ఒక రీల్ పోస్టు చేసింది. అందులో సులువైనదీ, ఇంట్లోనే చేసుకోదగినవి, ప్రభావవంతమైనవి, అద్భుతమైన ఫలితాలను ఇచ్చే ప్లాంక్స్ చేసి చూపించింది. వాటిల్లో ఆర్మ్ ప్లాంక్, సైడ్ ఎల్బో ప్లాంక్, ఎల్బో ప్లాంక్ ఉన్నాయి. రోజుకు 15-20 చొప్పున మూడు సెట్లు చేస్తే చేతులు, భుజాలు, నడుము దగ్గర కండరాలు బలపడతాయని, ఇవి కేవలం ఇరవై నిమిషాల్లో ముగించగల వ్యాయామాలని చెప్పింది శిల్ప. అలాగే 'సేతు బంధాసన, విశుద్ధి చక్ర, అర్ధహలాసన, నవాసనాలను రోజువారీ యోగా సాధనలో చేర్చుకొంటే అద్భుత ఫలితాలు ఉంటాయంటోంది.

- శిల్పాశెట్టి వర్కవుట్స్ యోగా, కార్డియో, వెయిట్స్ కాంబినేషన్‌తో ఉంటాయి. శరీరాన్ని దృఢంగా, అపురూపంగా తీర్చిదిద్దుకోవడానికి ఆమె తన శరీరానికి సరిపడే కొన్ని వ్యాయామాలతో ఫిట్‌నెస్ మెనూ రూపొందించుకుంది.
- రోజూ ఉదయం ముప్పై నుంచి నలభై నిమిషాలపాటు యోగా
- తరువాత రన్నింగ్, జాగింగ్, స్విమ్మింగ్, సైక్లింగ్‌తో కూడిన కార్డియో
- బిగువైన, బలమైన కండరాల కోసం వెయిట్‌లిఫ్టింగ్, స్క్వాట్స్, లంగెస్, పుషప్స్

ఇదీ మెనూ...

బిడ్డకు జన్మనిచ్చిన తరువాత కూడా శిల్పాశెట్టి శరీరాకృతిలో ఎలాంటి మార్పు రాలేదు. అందుకు ఆమె పాటించే వ్యాయామ, ఆహార నియమాలే ప్రధాన కారణం. మొదలుపెట్టి వదిలేసేవాళ్లే ఎక్కువగా కనిపిస్తుంటారు. అలాంటివారికి భిన్నం శిల్ప. క్రమశిక్షణకు ఆమె అధిక ప్రాధాన్యం ఇస్తుంది. ఆమె మెనూలో పోషకాలు నిండిన సమతుల ఆహారం ఉంటుంది. జీవక్రియ చురుగ్గా ఉండటానికి ఒకేసారి కాకుండా చిన్న చిన్న విరామాల్లో కొద్ది మొత్తంలో తీసుకొంటుంది. తాజా పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, ఆరోగ్యకరమైన కొవ్వు పదార్థాలు మెనూలో ఉంటాయి. ప్రాసెస్‌డ్, జంక్ ఫుడ్, కూల్‌డ్రింక్స్, ఇతర డ్రింక్స్‌కు పూర్తిగా దూరం. శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచుకోవడానికి తరచూ మంచినీళ్లు తాగుతుంది.

- ఉదయం 15 ఎంఎల్ అలోవెరా జ్యూస్, పది తులసి ఆకులు, బెల్లం, అల్లం జ్యూస్. తరువాత రెండు గ్లాసుల గోరువెచ్చటి నీళ్లు.
- ఉదయం 8 గంటలకు బ్రేక్‌ఫాస్ట్‌లో మూడొంతుల నీళ్లు, ఒక వంతు పాలలో ఉడకబెట్టిన ఓట్స్/ మరగబెట్టిన పాలతో ముస్లీ/ వీట్ బ్రెడ్ టోస్ట్‌తో రెండు ఉడకబెట్టిన గుడ్లు, నానబెట్టిన బాదం.
- ఉదయం 9 గంటలకు బ్రౌన్ షుగర్‌తో టీ. గంట తరువాత బొప్పాయి, కర్బూజా, స్ట్రాబెర్రీ, నారింజ, ఐదు టేబుల్ స్పూన్ల యోగర్ట్ కలిపి ఒక బౌల్ నిండా ఫ్రూట్ సలాడ్.
- మధ్యాహ్నం ఒంటి గంటకు భోజనంలో చికెన్/ గ్రిల్డ్ ఫిష్, ఉడకబెట్టిన కాయగూరలు, నెయ్యితో బ్రౌన్ రైస్. లేదంటే ఉడకబెట్టిన బీన్స్, ఒక పచ్చి క్యారెట్, రోస్టెడ్ జీరాతో గ్లాసు ఉప్పు వేసిన మజ్జిగ.
- సాయంత్ర స్నాక్స్‌లో వెరైటీలు మారుతుంటాయి. పది రోస్టెడ్ మఖానా, ఐదు అక్రోట్స్, కిస్మిస్.
- రాత్రి ఏడున్నరకు మిక్స్‌డ్ వెజిటబుల్/ చికెన్ సూప్‌తో పాటు టమాటో, మొలకలు, యాపిల్, చాట్ మసాల కలిపిన పాలకూర.
- డిన్నర్‌లో గ్రిల్డ్, ఫ్రైడ్ చికెన్‌తో ఉడకబెట్టిన కూరగాయలు. లేదంటే బీన్స్/ బ్రకోలీతో ఉడకబెట్టిన ఫిష్, ఒక క్యారెట్.

కురుల ఆరోగ్యానికి.. అలోవెరా!

న్యూట్రిన్లు, విటమిన్లు, అమినో ఆమ్లాలుండే అలోవెరా చర్మానికే కాదు జుట్టు ఆరోగ్యానికి ఉపయోగపడుతుంది. ఇంట్లోని పెరటిలో ఉండాల్సిన మొక్క ఇది. ఇంతకీ అలోవెరాతో హెయిర్ ప్యాక్స్ చేసుకోవటమెలా?

- అలోవెరా జెల్‌ను తలకు పట్టించుకుంటే.. జుట్టు రాలటం ఆగిపోతుంది. ముఖ్యంగా తలలో దురదలు తగ్గిపోతాయి.
- బౌల్‌లో రెండు టేబుల్ స్పూన్ల అలోవెరా జెల్, రెండు టేబుల్ స్పూన్ల పెరుగు, రెండు టేబుల్ స్పూన్ల తేనె కలిపి చూర్ణంలా చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని పట్టించి ఆరిన తర్వాత మంచి నీళ్లతో శుభ్రం చేసుకోవాలి. ఇలా తరచూ చేస్తుంటే చుండ్రు తగ్గిపోతుంది. మాడు చల్లగా, ఆరోగ్యంగా ఉంటుంది.
- బౌల్‌లో రెండు టేబుల్ స్పూన్ల అలోవెరా జెల్, రెండున్నర స్పూన్ల కొబ్బరినూనె వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని పట్టించి అరగంట తర్వాత కడిగేయాలి. ఇలా చేస్తుంటే.. హెయిర్ డ్యామేజ్ కావటం ఆగిపోతుంది.
- రెండున్నర టేబుల్ స్పూన్లు అలోవెరా జెల్‌కు.. రెండు టేబుల్ స్పూన్ల నిమ్మరసం వేయాలి. మిశ్రమాన్ని బాగా కలిపి జుట్టుకు పట్టించి ఆరిన తర్వాత శుభ్రంగా కడిగేయాలి. ఇలా పలుసార్లు చేస్తుంటే.. చుండ్రు పోతుంది. జుట్టు మిలమిలా మెరుస్తుంది.
- రెండు టేబుల్ స్పూన్ల మెంతుల్ని రాత్రంతా నానబెట్టాలి. ఉదయాన్నే మెత్తటి పేస్టులా చేసుకోవాలి. హెయిర్ ప్యాక్ కోసం బౌల్‌లో మూడు స్పూన్ల అలోవెరా జెల్ తీసుకుని.. ఇందులోకి మెంతుల పేస్ట్ వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని జుట్టుకు పట్టించి ఇరవై నిముషాల తర్వాత శుభ్రం చేసుకోవాలి. ఇలా చేస్తే జుట్టు పెరుగుతుంది.
- బౌల్‌లో అరకప్పు అలోవెరా జెల్ తీసుకుని.. ఇందులోకి రెండు టేబుల్ స్పూన్ల ఆలివ్ ఆయిల్, ఒక కోడిగుడ్డు వేసి స్పూన్‌తో మెత్తటి పేస్ట్‌లో చేయాలి. దీన్ని జుట్టుకు పట్టించి ఆరిన తర్వాత కడిగేయాలి. దీని వల్ల జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది.



నవ్య | చిత్రజ్యోతి

ఎవడికోసం తగ్గాలి



వైవిధ్యమైన చిత్రాలు, పాత్రలతో కథానాయకుడిగా ప్రేక్షకుల ముందుకొస్తున్నారు అల్లరి నరేశ్. ఆయన నటిస్తున్న 'బచ్చల మల్లి' చిత్రం గ్లింప్స్‌ను యూనిట్ ఆదివారం విడుదల చేసింది. ఈ వీడియోలో అల్లరి నరేశ్ పాత్రను మేకర్స్ పరిచయం చేశారు. 'ఏయ్ ఎవడికోసం తగ్గాలి, ఎందుకోసం తగ్గాలి' అంటూ ఆవేశంగా ఆయన పలికిన సంభాషణలు, పోరాట ఘట్టాల్లో ప్రదర్శించిన నటన ఆకట్టుకుంది. అమృత అయ్యర్ ఈ చిత్రంలో కథానాయిక. సుబ్బు మంగదేవి దర్శకత్వం వహిస్తున్నారు. రోహిణి, రావు రమేశ్, బలగం జయరాం, వైవా హర్ష కీలకపాత్రలు పోషిస్తున్నారు. విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తున్నారు.

అల్లరి నరేశ్‌తో సితార చిత్రం

అల్లరి నరేశ్ హీరోగా ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ఓ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఆయన పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం కొత్త సినిమాను ప్రకటించింది. 'మీరు అతని కంటి నుంచి తప్పించుకోలేరు' అంటూ పోస్టర్‌ను విడుదల చేసి, సినిమాపై ఆసక్తిని పెంచింది. 'ఫ్యామిలీ డ్రామా' చిత్రంతో ప్రశంసలు పొందిన మెహర్‌తేజ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నాడు. 'ఏఎన్ 63' అనేది వర్కింగ్ టైటిల్. ఈ చిత్రం ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుందనే నమ్మకాన్ని మేకర్స్ వ్యక్తం చేశారు. ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడిస్తామని చిత్రబృందం తెలిపింది.

సాహసనారి పాత్రలో...




ఆది సాయికుమార్ నటిస్తున్న చిత్రం 'షణ్ముఖ'. ఈ డివోషనల్ థ్రిల్లర్‌కు షణ్ముగం సాప్పని దర్శకత్వం వహిస్తుండగా, తులసీరామ్ సాప్పని, షణ్ముగం సాప్పని, రమేశ్ యాదవ్ నిర్మిస్తున్నారు. ఇందులో కథానాయికగా అవికా గోర్ నటిస్తున్నారు. ఆదివారం ఆమె పుట్టిన రోజు సందర్భంగా చిత్రంలో అవికా పోషించే పాత్ర లుక్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు షణ్ముగం సాప్పని మాట్లాడుతూ "ఇప్పటివరకూ ఎవరూ టచ్ చేయని పాయింట్‌తో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నాం. ఇందులో అవికా సాహసోతమైన పనులు చేస్తూ, కథానాయకుడి లక్ష్య సాధనకు తోడ్పడే అమ్మాయి పాత్రను పోషిస్తున్నారు. చిత్రీకరణలో ఎక్కడా రాజీ పడకుండా అత్యున్నత సాంకేతిక విలువలతో రూపొందించాం. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉన్న ఈ చిత్రాన్ని త్వరలోనే విడుదల చేస్తాం" అని చెప్పారు. 'ఇదొక విభిన్న తరహా చిత్రం, కథానాయిక పాత్రకు ప్రాధాన్యం ఉంది. ప్రేక్షకులను ఆకట్టుకునే కొత్త తరహా కథాంశంతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం' అని నిర్మాతలు తెలిపారు. ఈ చిత్రానికి రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు.

నటి వరలక్ష్మీ శరత్‌కుమార్, వ్యాపారవేత్త నికోలయ్ సచ్‌దేవ్ పెళ్లి వేడుకలు మొదలయ్యాయి. రేపు ముంబైలో వీరి వివాహం జరగనుంది. ముందస్తు పెళ్లి వేడుకలకు సంబంధించిన ఫొటోలను వరలక్ష్మి తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో అభిమానులతో షేర్ చేసుకున్నారు.



టీమ్ ఇండియా గెలుపుతో భావోద్వేగానికి లోనయ్యా



క్రికెట్‌లో టీమ్ ఇండియా ఆటను నిరంతం సపోర్ట్ చేసే సినీ తారల్లో బిగ్‌బీ అమితాబ్ బచ్చన్ ఒకరు. శనివారం జరిగిన టీ20 ప్రపంచకప్ ఫైనల్లో దక్షిణాఫ్రికాపై టీమ్ ఇండియా గెలవడంతో ఆయన భావోద్వేగానికి లోనయ్యారు. ఆ ఆనందాన్ని ఎక్స్‌లో షేర్ చేసుకున్నారు. "ఎన్నో ఏళ్ల తర్వాత ఓ ఐసీసీ ట్రోఫీని ఇండియా ముద్దాడడంతో నా కళ్ల వెంట ఆనందభాష్పాలు రాలుతున్నాయి. ఈ గెలుపు ఎప్పటికీ ప్రత్యేకమే. భారత్‌ను విశ్వవిజేతగా చూడటం మనందరికీ గర్వకారణం. భారత్ మాతా కీ జై..జై హింద్.." అని పేర్కొన్నారు. కాగా, తాను మ్యాచ్ చూస్తే ఇండియా ఓడిపోతుందని అమితాబచ్ నమ్ముతారు. అందుకే శనివారం జరిగిన ఫైనల్‌ను కూడా చూడలేదని ఆయన చెప్పారు.



మిస్టర్ ఎక్స్ ముగించాడు

ఆర్య, గౌతమ్ కార్తిక్ హీరోలుగా మను ఆనంద్ దర్శకత్వం వహిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'మిస్టర్ ఎక్స్'. శరత్‌కుమార్, మంజు వారియర్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. ప్రిన్స్ పిక్చర్స్ పతాకంపై ఎస్. లక్ష్మణ్‌కుమార్ ఈ భారీ బడ్జెట్ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రం షూటింగ్ పూర్తయింది. చివరి రోజు చిత్రీకరణకు సంబంధించిన స్టిల్స్‌ను ఆదివారం మేకర్స్ విడుదల చేశారు. అజర్ బైజాన్, జార్జియా, ఉగాండా దేశాల్లో పోరాట ఘట్టాలను తెరకెక్కించామని మేకర్స్ తెలిపారు. ధిబు నినాన్ థామస్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: తన్వీర్ మీర్, ఎడిటింగ్: ప్రసన్న జీకే

కొత్త రోల్ కోసం రంగంలోకి



తనలోని నటికి సవాల్ విసిరే పాత్రల కోసం ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు అలియా భట్. గ్లామర్ తారగానే కాదు లేడీ ఓరియంటెడ్ చిత్రాలతోనూ సత్తా చాటుతున్నారు ఆమె. తాజాగా యశ్‌రాజ్ ఫిల్మ్స్ నిర్మిస్తున్న స్పై యాక్షన్ థ్రిల్లర్‌లో ఆమె 'రా' ఏజెంట్ పాత్రలో కనిపించనున్నారు. త్వరలోనే ఈ చిత్రం సెట్స్‌పైకి వెళ్లనుంది. దీంతో తన పాత్ర కోసం అలియా సన్నాహాలు మొదలు పెట్టారు. జిమ్‌లో భారీ వర్కౌట్ సెషన్స్‌లో పాల్గొంటున్నారు. ఆదివారం కూడా జిమ్‌లో శ్రమిస్తున్నారు. ఈ చిత్రానికి శార్వరీ వాఘ్ దర్శకుడు. ఆలియా నటించిన జిగ్రా చిత్రం అక్టోబర్‌లో ప్రేక్షకుల ముందుకు రానుంది. సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో 'లవ్ అండ్ వార్' చిత్రంలో నటిస్తున్నారు.

ఘనంగా 'ఎన్టీఆర్ ఫిల్మ్ అవార్డ్స్' ప్రదానోత్సవం



'కళావేదిక ఎన్టీఆర్ ఫిల్మ్ అవార్డ్స్' ప్రదానోత్సవం ఇటీవలే హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. నందమూరి మోహన్ కృష్ణ, నటుడు, మాజీ పార్లమెంట్ సభ్యుడు మురళీమోహన్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును అందుకున్నారు. 'బేబీ' చిత్రానికి గాను ఉత్తమ కథానాయకుడిగా ఆనంద్ దేవరకొండ, దర్శకుడిగా సాయిరాజేశ్ పురస్కారాలను స్వీకరించారు. ఈ సందర్భంగా మురళీ మోహన్ మాట్లాడుతూ 'ఎన్టీఆర్ పేరిట ఇచ్చే ఈ పురస్కారాలను అందుకున్నందుకు ఆనందంగా ఉంది. ఈసారి ఎన్టీఆర్ ఫిలిం లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు నాకు దక్కినందుకు ఆనందంగా ఉంది' అని చెప్పారు. మోహన్ కృష్ణ మాట్లాడుతూ 'ఎన్టీఆర్ అనే మూడక్షరాలు సంచలనానికి మారుపేరు, ఆయన కొడుగ్గా పుట్టడం ఏదో జన్మలో చేసుకున్న పుణ్యంగా భావిస్తున్నాను. ఈ కార్యక్రమాన్ని ఇంత గొప్పగా నిర్వహిస్తున్న కళావేదిక సంస్థకు నా అభినందనలు' అన్నారు. తెలుగు జాతి కోసమే పుట్టి, తెలుగు జాతి ఆత్మగౌరవం కోసమే బతికిన వ్యక్తి తారక రామారావు గారు అని ముఖ్య అతిథిగా పాల్గొన్న నందమూరి మోహన రూప చెప్పారు.

శ్రీవారి దర్శనాల్లో వైసీపీ నేతల రికార్డ్ 'బ్రేక్'

- నాటి మంత్రులు, ఎమ్మెల్యేల లీలలు
- భారీగా సిఫారసు లేఖలు
- స్వయంగా మందీమార్బలంతో రాక
- దర్జాగా స్వామి దర్శనం

తిరుమల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో గత ప్రభుత్వంలో సామాన్య భక్తులకు ఇబ్బందులు కలిగించేలా రోజుకు పదుల సంఖ్యలో వీఐపీ బ్రేక్ దర్శనాలు పొందిన మంత్రుల అక్రమాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. వ్యక్తిగత, రాజకీయ లబ్ధి కోసం తిరుమలలో తమ హవా చూపించుకునేందుకు వైసీపీకి చెందిన మంత్రులు తమ సిఫారసు లేఖలతో భారీగా వీఐపీ బ్రేక్ దర్శనాలు పొందిన ఉదంతాలు తాజాగా వెలుగులోకి వస్తున్నాయి. దర్శనానికి సామాన్య భక్తులు 30 నుంచి 48 గంటలు క్యూలైన్లలో పడిగాపులు పడుతుంటే.. వీరు మాత్రం ఇష్టానుసారం వీఐపీ బ్రేక్ టికెట్లు పొంది.. వారిని ఇబ్బందులకు గురిచేశారు. తన సిఫారసులు చాలా తక్కువగా ఉంటాయని చెప్పుకొనే మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఇచ్చిన ఓ లేఖ ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. ఈ ఏడాది ఫిబ్రవరి 12న నాలుగు తోమాలసేవ, ఆరు ప్రొటోకాల్ దర్శనాలు, 12 మందికి కల్యాణోత్సవం, 52 మందికి వీఐపీ బ్రేక్ దర్శనాలు చొప్పున 74 మందికి ఆర్జితసేవ, బ్రేక్ దర్శనాలకు ఆయన సిఫారసు చేశారని దాని ద్వారా తేలింది. ఆర్కే రోజా ఏపీఐఐసీ చైర్‌పర్సన్‌గా ఉన్నప్పుడు (అప్పటికి ఇంకా మంత్రి కాలేదు).. 2021 నవంబరు 30న కనీసం భక్తుల పేర్లు కూడా లేకుండా 20 మందికి బ్రేక్ దర్శనాలు కేటాయించాలని లేఖ రాశారు. వీరి తరహాలోనే జిల్లాకు చెందిన నాటి ఉపముఖ్యమంత్రి కె.నారాయణస్వామి, నాటి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డితోపాటు పలువురు మంత్రులు రోజుకు పదుల సంఖ్యలో వీఐపీ బ్రేక్ దర్శనం, ఆర్జిత సేవా టికెట్లు పొంది.. సామాన్య భక్తులు క్యూలైన్‌లో అగచాట్లు పడేలా చేశారనే విమర్శలు ఉన్నాయి. దీంతో గతంలో 2 వేల నుంచి 3వేల వరకు ఉండే వీఐపీ బ్రేక్ దర్శనాల సంఖ్య భారీగా పెరిగింది.

మందీమార్బలంతో..

సిఫారసులతోనే కాకుండా పదవులను అడ్డుపెట్టుకుని వైసీపీ మంత్రులు నెలలో 2-3సార్లు శ్రీవారి దర్శనానికి వచ్చేవారు. రోజా, వేణుగోపాలకృష్ణ, నారాయణస్వామి, మేరుగ నాగార్జున, కారుమూరి నాగేశ్వరావు, నాటి ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, గోరంట్ల మాధవ్, బెల్లాన చంద్రశేఖర్ వంటి వారు తరచూ మందీమార్బలంతో ప్రత్యక్షమయ్యేవారు. 2022 ఆగస్టులో మంత్రి ఉషశ్రీ చరణ్ ఒకేసారి 50మందితో శ్రీవారిని దర్శించుకున్నారు. అదే రోజు 10 సుప్రభాతసేవ టికెట్లు కూడా పొందారు. అదే నెల 18న మంత్రి రోజా 30 మందితో వీఐపీ బ్రేక్ దర్శనం చేసుకున్నారు. అదేరోజు దాడిశెట్టి రాజా 30 మందితో దర్శించుకున్నారు. అదే ఏడాది జూలైలో సీదిరి అప్పలరాజు ఏకంగా 150 మందితో వీఐపీ బ్రేక్‌లో హల్‌చల్ చేశారు. ఇవన్నీ ఉదాహరణలు మాత్రమే. ఇలా వైసీపీ మంత్రులు అధికార హోదా ప్రదర్శించి మందీమార్బలంతో తిరుమలేశుడిని దర్శించుకుంటే.. సాధారణ భక్తులు మాత్రం గంటల కొద్దీ పొడవాటి క్యూలైన్లలో ఎదురుచూసేవారు.

లడక్ ప్రమాదంలో కృష్ణాజిల్లా జవాను మృతి


నాగరాజు

పెడన రూరల్ (కృష్ణాజిల్లా), జూన్ 30: లడక్‌లో శనివారం ఉదయం జరిగిన ప్రమాదంలో కృష్ణాజిల్లా పెడన మండలం చేవేంద్ర గ్రామానికి చెందిన జవాను సాదరబోయిన నాగరాజు (32) మృతిచెందారు. చేవేంద్ర ఉప్పరగూడెం ప్రాంతానికి చెందిన సాదరబోయిన వెంకన్న పెద్దకుమారుడైన నాగరాజు ఎనిమిదేళ్ల క్రితం ఆర్మీలో చేరారు. చిన్న కుమారుడు శివయ్య కూడా ఆర్మీలోనే పనిచేస్తున్నారు. నాగరాజు భార్య మంగాదేవి ఉరివి సచివాలయంలో మహిళా పోలీసుగా పనిచేస్తున్నారు. వీరికి ఏడాది వయసున్న పాప హస్విక ఉంది. కాగా.. నాగరాజు మృతదేహం సోమవారం మధ్యాహ్నం గన్నవరం విమానాశ్రయానికి చేరుతుందని, అక్కడ నుంచి చేవేంద్రకు తరలించి, అంత్యక్రియలు నిర్వహిస్తామని కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు.

మా స్థలంలో వైసీపీ ఆఫీసు నిర్మించారు

- ప్రజాదర్బార్‌లో మంత్రి అచ్చెన్నకు ఉపాధ్యాయుల ఫిర్యాదు

టెక్కలి, జూన్ 30: తమ స్థలాలను కబ్జా చేసి వైసీపీ జిల్లా కార్యాలయాన్ని నిర్మించారని బాధిత ఉపాధ్యాయులు మంత్రి అచ్చెన్నాయుడుకు ఫిర్యాదు చేశారు. ఆదివారం శ్రీకాకుళం జిల్లా నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో అచ్చెన్న ప్రజా దర్బార్ నిర్వహించారు. 'శ్రీకాకుళంలోని పెద్దపాడు రెవెన్యూ పరిధిలో లేఅవుట్‌లో 1991-93 మధ్యకాలంలో ఒక్కొక్కరం ఐదున్నర సెంట్లు చొప్పున స్థలం కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నాం. ఆ స్థలాల్లో వైసీపీ జిల్లా కార్యాలయాన్ని అక్రమంగా నిర్మించారు. మా స్థలం మాకు దక్కేలా న్యాయం చేయండి' అని ఉపాధ్యాయులు కోరగా, పరిశీలించి న్యాయం చేస్తామని అచ్చెన్న హామీ ఇచ్చారు. అలాగే గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో అనేక కష్టాలు పడ్డామని, తమ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు మంత్రిని కోరారు.


ప్రజాదర్బార్‌లో మంత్రి అచ్చెన్నకు సమస్యలు విన్నవిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు

ఇంత నష్టం ఎలా జరగనిచ్చారు?

- గోదావరికి వరద వస్తుందని తెలుసు కదా!
- పోలవరంపై అంతర్జాతీయ నిపుణుల విస్మయం


స్పిల్‌వేపై విదేశీ నిపుణుల బృందానికి వివరాలు తెలుపుతున్న పోలవరం అధికారులు

అమరావతి-ఆంధ్రజ్యోతి/పోలవరం, జూన్ 30: పోలవరం ప్రాజెక్టుకు ఇంత నష్టం ఎలా జరగనిచ్చారని అంతర్జాతీయ నిపుణులు విస్తుపోయారు. గోదావరికి భారీ వరద వస్తుందని ఇంజనీరింగ్ అధికారులకు తెలిసినప్పుడు ఇంత నష్టానికి ఎలా అవకాశమిచ్చారు.. ప్రభుత్వానికి ఆ విషయం తెలియజేయలేదా అని ప్రశ్నించినట్లు తెలిసింది. ప్రాజెక్టు నిర్మాణాలకు సంబంధించి గతంలో ఆమోదం పొందిన డిజైన్లు, చేపట్టిన పనులను క్షుణ్ణంగా అధ్యయనం చేశాకే.. డయాఫ్రం వాల్ మరమ్మతు.. సమాంతరంగా కొత్త ప్లాస్టిక్ వాల్ నిర్మాణంపై సలహాలు, సూచనలు చేస్తామని వారు స్పష్టం చేశారు. వాల్ దెబ్బతినడం.. కాఫర్ డ్యాంలో సీపేజీ, గైడ్‌బండ్ కుంగడం తదితర నష్టాల నేపథ్యంలో.. పనులు ఎక్కడి నుంచి ప్రారంభించాలి, సత్వరం పూర్తిచేయడానికి తీసుకోవలసిన చర్యలను తెలుసుకోవడానికి పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ).. అమెరికాకు చెందిన ప్రాజెక్టుల నిర్మాణ నిపుణులు జియాన్ ఫ్రాంకో డి సిస్కో, డేవిడ్ బి పాల్.. కెనడా నిపుణులు సీన్ హించ్ బెర్గర్, రిచర్డ్ డొనెల్లీలను నియమించింది. వీరు ఆదివారం ప్రాజెక్టు ప్రాంతాన్ని సందర్శించారు. ఉదయం 10 గంటలకు ప్రాజెక్టు అతిథి గృహానికి చేరుకుని.. కొద్దిసేపు సీఈ నరసింహమూర్తి, ఇతర ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. 10.30 గంటలకు 23వ బ్లాకు వద్ద స్పిల్‌వేను పరిశీలించారు. అక్కడ మ్యాప్ పాయింటింగ్ ద్వారా దాని నిర్మాణం, ఇతర అంశాలను కేంద్ర జల సంఘం డిప్యూటీ డైరెక్టర్ అశ్విన్‌కుమార్, జలవనరుల శాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, నరసింహమూర్తి వివరించారు. 11 గంటలకు ఎగువ కాఫర్ డ్యాం వద్ద ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ ద్వారా కాఫర్ డ్యాం నిర్మాణ దశలు, నిర్మాణ విధానాలను తెలియజేశారు. ఎగువ, దిగువ కాఫర్ డ్యాం వద్ద పరిస్థితి.. డయాఫ్రం వాల్, గ్యాప్-1 ప్రాంతాలను చూపించారు. ఇందుకు సంబంధించి నిర్మాణ సమయంలో, ఆ తర్వాత చేపట్టిన పనులు, దెబ్బతిన్నాక కట్టడాలను ఫొటో గ్యాలరీ ద్వారా చూపించారు. గతంలో నిర్మాణ సంస్థ, కేంద్ర జల సంఘం, ఇతర కేంద్ర సంస్థలు ఇచ్చిన డిజైన్లు, డ్రాయింగ్‌లు.. వాటిని పరిశీలించి కేంద్ర జల సంఘం ఆమోదం తెలపడం తదితర అంశాలను వెంకటేశ్వరరావు వివరించారు. గ్యాప్-1 ప్రాంతంలో నిర్మాణాలు ఎప్పుడెప్పుడు, ఎలా దెబ్బతిన్నాయో నిపుణులు చూశారు. గ్యాప్-1 పనులు ఎందుకు పూర్తి చేయలేదో ఆరా తీశారు. ఎగువ కాఫర్ డ్యాంలో గ్యాప్‌లను ఎందుకు పూడ్చలేదని ప్రశ్నించారు. ఈ గ్యాప్‌లను పూడ్చకపోవడం వల్ల ఎదురైన సాంకేతిక సమస్యల గురించి తెలుసుకున్నారు. సీపేజీ నివారణకు వైబ్రో కంపాక్షన్ విధానంలో చేపట్టిన మరమ్మతులు.. వాటివల్ల వచ్చిన ఫలితాలనూ తెలుసుకున్నారు. ప్రస్తుతం ఎగువ, దిగువ కాఫర్ డ్యాంల మధ్య భారీగా వరద చేరడంతో.. దీనిని తోడడానికి, ఇదే సమయంలో డయాఫ్రంవాల్ మరమ్మతులకు, కొత్తగా సమాంతర వాల్ నిర్మాణానికి తీసుకోవలసిన చర్యలపైనా చర్చించారు. మట్టి, రాతి నాణ్యత విషయంలో పలు అంశాలను భూకంప ఇంజనీరింగ్ నిపుణుడైన హించ్‌బర్గర్ అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు ఎగువ కాఫర్ డ్యాంపై 300 చానల్ నుంచి 550 చానల్ వరకూ మూడు ప్రాంతాల్లో బోర్ సెట్ల ద్వారా ఇంజనీరింగ్ అధికారులు సేకరించిన మట్టి నమూనాలను నిపుణులు పరిశీలించారు. అనంతరం అక్కడ ఉబికి వస్తున్న సీపేజీ జలాలను చూశారు. ప్రాజెక్టు స్థితిగతులపై అధికారులు చెప్పినదంతా సావధానంగా విన్నారు. అనంతరం రాజమహేంద్రవరం బయల్దేరి వెళ్లారు. సోమవారం గ్యాప్-2 ప్రాంతం, అక్కడ ఏర్పడిన భారీ గుంతలు, సీపేజీ పిజియో మీటర్ల ప్రాంతాలను, డయాఫ్రం వాల్‌ను కూడా పరిశీలిస్తారని నరసింహమూర్తి తెలిపారు. కాగా.. తాము ప్రత్యక్షంగా చూసిన దెబ్బతిన్న కట్టడాలు, వాటి మరమ్మతుల కోసం నిర్మాణ సంస్థ ఇచ్చిన డిజైన్లు.. కేంద్ర జల సంఘం, ఎన్‌హెచ్‌పీసీ ఇచ్చిన సలహాలు, సూచనలపై నిపుణులు మంగళ, బుధవారాల్లో అధ్యయనం చేస్తారు. బుధవారంనాటి సమీక్ష తర్వాత వారో నిర్ణయానికి వచ్చే వీలుందని అధికారులు చెబుతున్నారు. బుధవారం సాయంత్రం గానీ.. లేదంటే ఇక్కడి నుంచి వెళ్లిన ఒకట్రెండు రోజుల్లో ప్రాథమికంగా కొన్ని సలహాలు, సూచనలు చేస్తామని నిపుణులు చెప్పారని అంటున్నారు. మొత్తానికి నిపుణుల రాకతో.. మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేసిన విధ్వంసాన్ని సరిదిద్ది.. పోలవరాన్ని పునర్నిర్మాణం చేసే దిశగా ముందడుగు పడిందని జల వనరులశాఖ భావిస్తోంది.

టీటీడీ వెబ్‌సైట్‌లో బోర్డు నిర్ణయాలు

- ప్రభుత్వ మార్పుతో మళ్లీ పారదర్శకతకు శ్రీకారం

తిరుమల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ధర్మకర్తల మండలి తీసుకున్న నిర్ణయాలను తిరిగి టీటీడీ అధికార వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసే విధానానికి ఉన్నతాధికారులు శ్రీకారం చుట్టారు. టీటీడీ బోర్డు తీసుకునే పలు నిర్ణయాలకు పారదర్శకతను పాటించడంలో భాగంగా టీటీడీ 1993 మే 10 నుంచి 2023 జూన్ 19వ తేదీ వరకు జరిగిన ధర్మకర్తల మండలి, స్పెసిఫైడ్ అథారిటీ తీసుకున్న నిర్ణయాలను టీటీడీ అధికార వెబ్‌సైట్ 'తిరుమల.ఓఆర్జీ'లో అప్‌లోడ్ చేసిన విషయం తెలిసిందే. వైసీపీ ప్రభుత్వంలో ఏర్పాటైన బోర్డు.. నిబంధనలకు విరుద్ధంగా ఇంజనీరింగ్ పనులకు, తదితరాలకు నిధులు కేటాయించారని, అందుకే తీర్మానాలను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయడం లేదంటూ రాజకీయపార్టీల నుంచి విమర్శలు వచ్చాయి. నిర్ణయాలను అంత గోప్యంగా ఉంచాల్సిన అవసరం ఏముందంటూ ప్రతిపక్షాలు మండిపడ్డాయి. కూటమి ప్రభుత్వం తాజాగా ఏర్పడిన నేపథ్యంలో 2023 ఆగస్టు 7 నుంచి 2024 మార్చి 11 వరకు చేసిన తీర్మానాలను తిరిగి టీటీడీ వెబ్‌సైట్‌లో ఇప్పుడు అప్‌లోడ్ చేశారు.

సీఎం అదనపు కార్యదర్శిగా కార్తికేయ మిశ్రా

అమరావతి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కేంద్ర సర్వీస్‌లో ఉన్న ఐఏఎస్ అధికారి కార్తికేయ మిశ్రా ఏపీ ప్రభుత్వంలోకి వచ్చారు. ఏపీ కేడర్‌కు చెందిన ఆయన గత ప్రభుత్వంలో కేంద్ర సర్వీసులకు వెళ్లారు. తిరిగి ఏపీకి పంపించాలని సీఎం చంద్రబాబు కేంద్రానికి లేఖ రాయగా, కేంద్ర ప్రభుత్వం ఆయన్ను రిలీవ్ చేసింది. కార్తికేయ మిశ్రా శనివారం ఉదయం సీఎస్ నీరబ్‌కుమార్‌కు రిపోర్టు చేశారు. సీఎం అదనపు కార్యదర్శిగా నియమిస్తూ ఆదివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

హోంమంత్రి ఓఎస్డీగా అనిల్

అమరావతి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత ఓఎస్డీగా అడిషనల్ ఎస్పీ అనిల్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు డీజీపీ ద్వారకా తిరుమలరావు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం తూర్పు గోదావరి జిల్లా శాంతిభద్రతల విభాగంలో పనిచేస్తున్న అనిల్ గతంలో డీజీపీ గౌతమ్ సవాంగ్ వద్ద ఓఎస్డీగా పనిచేశారు. అనిల్‌కు ఎస్ఐబీ(ఇంటెలిజెన్స్)లో పోస్టింగ్ ఇస్తూ హోంమంత్రి ఓఎస్డీగా విధులు అప్పగించారు.

నేడు టెట్ నోటిఫికేషన్

- రెండుమూడ్రోజుల్లో డీఎస్సీ నోటిఫికేషన్.. పాత డీఎస్సీ నోటిఫికేషన్ రద్దు

ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)కు నేడు(సోమవారం) నోటిఫికేషన్ జారీచేయనున్నట్లు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. షెడ్యూలు, నోటిఫికేషన్, సమాచార బులెటిన్, సిలబస్ తదితర సమాచారం అంతా మంగళవారం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్‌లో వివరాలు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. కాగా, ఎన్నికలకు ముందు నిర్వహించిన టెట్ ఫలితాలను తాజాగా విడుదల చేసిన విషయం తెలిసిందే. అయితే మెగా డీఎస్సీకి నోటిఫికేషన్ ఇస్తున్నందున మరో అవకాశంగా టెట్‌ను నిర్వహిస్తున్నారు. రెండు మూడు రోజుల్లో డీఎస్సీకి నోటిఫికేషన్ జారీకానుంది. 16347 పోస్టులతో మెగా డీఎస్సీ విడుదలకు కేబినెట్ ఇప్పటికే ఆమోదం తెలిపింది. అలాగే, ఎన్నికలకు ముందు గత ప్రభుత్వం హడావుడిగా ఇచ్చిన 6100 పోస్టుల డీఎస్సీ నోటిఫికేషన్‌ను ప్రభుత్వం రద్దుచేసింది.

జూనియర్ లెక్చరర్లను రెన్యువల్ చేయాలి: జేఏసీ

ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న జూనియర్ లెక్చరర్ల కాంట్రాక్టును వీలైనంత త్వరగా రెన్యువల్ చేసి ఉత్తర్వులు జారీచేయాలని కాంట్రాక్టు లెక్చరర్ల జేఏసీ నేతలు కుమ్మరకుంట సురేష్, కల్లూరి శ్రీనివాస్ కోరారు. కాంట్రాక్టు లెక్చరర్లకు సంబంధించిన పలు సమస్యలను సీఎం చంద్రబాబును కలిసి వివరించారు. ఏప్రిల్ 30తో కాంట్రాక్టు గడువు ముగియగా, కాంట్రాక్టు రెన్యువల్ ఇప్పటికీ కాలేదన్నారు.

దగా వైసీపీలోనే.. టీడీపీలో కాదు: నిరుద్యోగ జేఏసీ

వైసీపీ దగా డీఎస్సీని ఇస్తే, టీడీపీ ప్రభుత్వం మెగా డీఎస్సీ ఇస్తోందని నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ షేక్ సిద్దిక్ అన్నారు. టీడీపీలో దగా డీఎస్సీలు ఉండవన్నారు. ఐదేళ్ల పాటు ఒక్క టీచర్ ఉద్యోగాన్నీ భర్తీ చేయని వైసీపీ ప్రభుత్వం ఇప్పుడు సీఎం చంద్రబాబు తొలి సంతకం డీఎస్సీ ఫైలుపై పెట్టగానే.. నిరుద్యోగులను రెచ్చగొట్టే ప్రయత్నం వైసీపీ చేస్తోందన్నారు. దగా డీఎస్సీ అంటూ జగన్ రోత మీడియా రెచ్చగొట్టేలా కథనాలు రాస్తూ నిరుద్యోగులను తప్పుదారి పట్టిస్తోందన్నారు.



విజయనగరం కలెక్టరేట్‌లో ఫైళ్లకు నిప్పు

విజయనగరం కలెక్టరేట్ ఆవరణలో ఆదివారం అనేక ఫైళ్లు తగలబెట్టారు. వైసీపీ హయాంలో డీ పట్టా, అసైన్డ్ భూముల కుంభకోణం, 22ఎ నిషేధిత జాబితా నుంచి కొన్ని భూముల సర్వే నంబర్లు తొలగింపు వంటి అక్రమాలన్నీ కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయాల్లోనే జరిగాయన్నది ప్రధాన ఆరోపణ. ఈ నేపథ్యంలో ఫైళ్ల దగ్ధం వార్త సామాజిక మాధ్యమాల్లో వైరలైంది. కాలం చెల్లిన, నిరుపయోగ ఫైళ్లను తొలగించామని డీఆర్వో ఎస్‌డీ అనిత వివరణ ఇచ్చారు. – ఆంధ్రజ్యోతి, విజయనగరం

పెన్షన్ పెంపు మంచిదే!

- ప్రజలు మమ్మల్ని అంగీకరించలేదు..అందుకే రిలాక్స్ మూడ్: బొత్స



విజయనగరం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ హామీల్లో ఒకటైన పెన్షన్‌ను పెంచి లబ్ధిదారులకు రూ.4,000 ఇవ్వటం మంచిదేనని, మిగిలిన ఐదు హామీలూ నెరవేర్చే బలాన్ని వారికి ఇవ్వాలని కోరుకుంటున్నానని మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ వ్యాఖ్యానించారు. విజయనగరంలోని తన సోదరుని నివాసంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వీసీల రాజీనామాలను ప్రభుత్వం కోరడం తప్పుకాదన్నారు. వైసీపీ కార్యాలయాల్లోకి కూటమి నేతలు చొచ్చుకుపోవడం సరికాదన్నారు. 'ప్రజలు మమ్మల్ని అంగీకరించలేదు కాబట్టే మేం రిలాక్స్ మూడ్‌లో ఉన్నాం' అని వ్యాఖ్యానించారు. తాను విద్యాశాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఉపాధ్యాయుల బదిలీల్లో అక్రమాలు జరిగాయని చేస్తున్న ఆరోపణలను ఖండించారు. వైసీపీ కార్యాలయంలోకి ప్రజాప్రతినిధిగా వెళ్లడం తప్పు కాదని, 200 మందిని వెంట పెట్టుకుని వెళ్లడం వల్ల ప్రజలకు ఎలాంటి సంకేతాలు వెళ్తాయో అర్థం చేసుకోవాలని విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజును ఉద్దేశించి చెప్పారు. తిరిగి వైసీపీ వస్తే ఇళ్లవద్దకు కూడా కార్యకర్తలు వెళ్లే పరిస్థితి రాకుండా చూసుకోవాలని హితవు పలికారు.

అక్రమ మద్యం కేసులో వైసీపీ నేత అరెస్టు

- నిందితుడు మంగళగిరి అభ్యర్థి తండ్రి శివనాగేంద్రం

మంగళగిరి, జూన్ 30: గుంటూరు జిల్లా మంగళగిరిలో సంచలనం సృష్టించిన అక్రమ మద్యం నిల్వల కేసులో వైసీపీ నేత కాండ్రు శివనాగేంద్రంను మంగళగిరి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అరెస్టు చేశారు. నాగేంద్రం కుమార్తె లావణ్య మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన విషయం తెలిసిందే. ఎన్నికల కౌంటింగ్‌కు మూడు రోజుల ముందు మంగళగిరి కాండ్రు వారి వీధిలో భారీ మద్యం డంప్‌ను సెబ్ అధికారులు గుర్తించారు. హైదరాబాద్ బ్లూ బ్రాండ్ 120 బాక్సులు, ఓల్డ్ ట్రావెన్ 16 బాక్సులు కలుపుకొని మొత్తం సుమారు రూ.9.79 లక్షల విలువైన 6,528 మద్యం సీసాలను సెబ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇంటి యాజమాని దామర్ల వీరాంజనేయులును అదే రోజు అదుపులోకి తీసుకుని విచారించగా శివనాగేంద్రం తమ ఇంట్లో మద్యం నిల్వలను ఉంచాడని చెప్పాడు. దీంతో సెబ్ అధికారులు ఏ-2 నిందితుడుగా శివనాగేంద్రంపై కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో మంగళగిరి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శివనాగేంద్రంను విజయవాడలో శనివారం అదుపులోకి తీసుకుని అరెస్టు చూపారు. మద్యం అక్రమ నిల్వల వెనుక మరికొందరు వైసీపీ ముఖ్య నాయకులు కూడా ఉన్నట్టు సమాచారం. విచారణలో ఆ పేర్లు బయటకు వచ్చే అవకాశం ఉంది.

పుంగనూరులో ఉద్రిక్తత

- మిథున్‌రెడ్డి రావద్దంటూ కూటమి నేతల ఆందోళన
- ఆయన నివాసం వద్ద భారీగా బలగాలు

పుంగనూరు-తిరుపతి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా పుంగనూరులో మరోసారి ఉద్రిక్తత నెలకొంది. ఆదివారం వైసీపీ కార్యకర్తల సమావేశానికి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కొడుకు, రాజంపేట వైసీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి వస్తున్నారన్న సమాచారంతో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. ప్రశాంతంగా ఉన్న పుంగనూరుకు ఐదేళ్లదాకా పెద్దిరెడ్డి, మిథున్‌రెడ్డి రావద్దని డిమాండ్ చేశారు. నల్ల జెండాలు చేతబట్టి, రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో కూడా చేశారు. పోలీసులు భారీగా తరలిరావడం.. బాష్పవాయువు ప్రయోగించే వజ్ర వాహనం కూడా రావడంతో పట్టణంలో ఉత్కంఠ నెలకొంది. ఇదే సమయంలో మిథున్‌రెడ్డిని పోలీసులు తిరుపతిలో గృహనిర్బంధం చేశారు. పుంగనూరు బయల్దేరుతుండగా.. అక్కడకు వెళ్తే గొడవలు జరిగే అవకాశం ఉందని.. అక్కడకు వెళ్లేందుకు అనుమతి లేదంటూ నోటీసులు ఇచ్చారు. ఆయన నివాసం వద్ద బలగాలను భారీగా మోహరించారు. దీనిపై మిథున్‌రెడ్డి మాట్లాడుతూ.. తన నియోజకవర్గంలో తాను పర్యటించకుండా అడ్డుకోవడాన్ని లోక్‌సభ స్పీకర్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. కాగా.. వైసీపీ సమావేశం కోసం ఉదయం పుంగనూరు వచ్చిన మాజీ ఎంపీ ఎన్.రెడ్డెప్ప, ఆ పార్టీ నేతలు.. టీడీపీ శ్రేణులు అడ్డుకుంటారనే సమాచారంతో వెళ్లిపోయారు. జూన్ 15న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి పట్టణానికి రావలసి ఉండగా టీడీపీ నిరసనలతో పర్యటనను వాయిదా వేసుకున్న సంగతి తెలిసిందే. అలాగే ఆయన వర్గానికి చెందిన మున్సిపల్ ఛైర్మన్ అలీంబాషా, మరో 10మంది కౌన్సిలర్లు వైసీపీకి నాలుగు రోజుల కిందట రాజీనామా చేశారు. ఇంకొందరు కౌన్సిలర్లతో కలిసి టీడీపీలో చేరతామని వారు ప్రకటించారు కూడా.

జూన్‌లో అధిక వర్షపాతం

- రాష్ట్రంలో 61.3 శాతం ఎక్కువగా నమోదు
- అన్ని ప్రాంతాలకు సమానంగా కురవని వైనం
- వాతావరణ అనిశ్చితి ప్రభావమే అధికం
- రుతుపవన ప్రభావం తక్కువేనంటున్న నిపుణులు
- దేశంలో 11 శాతం తక్కువ వర్షపాతం నమోదు
- ఉత్తర, తూర్పు భారతంలో తీవ్ర వర్షాభావం, వడగాడ్పులు

విశాఖపట్నం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): నైరుతి రుతు పవనాల సీజన్ మొదటి నెల రాష్ట్రంలో అధిక వర్షాలు కురిశాయి. జూన్‌లో సాధారణంగా 96 మి.మీ. కురవాల్సి ఉండగా, 154.8 మి.మీ.ల వర్షపాతం (సాధారణం కంటే 61.3 శాతం ఎక్కువ) నమోదైంది. జూన్ 2న రాయలసీమలోకి ప్రవేశించిన రుతుపవనాలు మూడోతేదీ కల్లా ఉత్తర కోస్తాలోని నర్సాపురం వరకు విస్తరించాయి. తరువాత పదిరోజులకు విజయనగరం, ఆ తరువాత మరో తొమ్మిది రోజులకు రాష్ట్రమంతా విస్తరించాయి. అయితే రాష్ట్రంలో కురిసిన వర్షంలో ఎక్కువ శాతం వాతావరణ అనిశ్చితి ప్రభావంతోనే కురిసిందని వాతావరణ నిపుణులు విశ్లేషించారు. నైరుతి రుతుపవనాలు, బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో తక్కువ వర్షమే పడిందని చెబుతున్నారు. అసాధారణ ఎండలు, వడగాడ్పులు, రాత్రి సమయంలో వేడి వాతావరణంతో అనిశ్చితి నెలకొని ఈదురుగాలులు, పిడుగులు, భారీ వర్షాలు కురవడంతో జూన్‌లో సాధారణం కంటే ఎక్కువగా వర్షపాతం నమోదైందంటున్నారు. జూన్‌లో మిగులు వర్షం వల్ల అనేక ప్రాంతాల్లో వ్యవసాయ పనులు ఊపందుకోవడం, తాగునీటి సమస్య పరిష్కారమైనా... అన్ని ప్రాంతాల్లో సమానంగా వర్షాలు కురవలేదని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలోని విజయనగరం, కాకినాడ, ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు, బాపట్ల జిల్లాలతోపాటు రాయలసీమలోని అన్ని జిల్లాల్లో సాధారణం కంటే 60 శాతం ఎక్కువగా వర్షం కురిసింది. విశాఖ, ఎన్టీఆర్, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో సాధారణం కంటే 20 నుంచి 59 శాతం ఎక్కువగా, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో సాధారణ వర్షపాతం (మైనస్ 19 శాతం నుంచి ప్లస్ 19 శాతం వరకు) నమోదైంది.

దేశవ్యాప్తంగా రుతుపవనాల విస్తరణ..

వాయవ్య భారతంలో కొద్ది ప్రాంతాలు మినహా దేశంలోని అన్ని ప్రాంతాలకు రుతుపవనాలు విస్తరించాయి. సాధారణం కంటే ముందుగా అంటే మే 30వ తేదీన కేరళకు వచ్చిన రుతుపవనాలు పదోతేదీ వరకు దక్షిణ భారత శివారు ప్రాంతాల వరకు వేగంగా విస్తరించినా, తరువాత రెండువారాలపాటు స్థిరంగా ఉండిపోయాయి. ఆ సమయంలో ఉత్తర, మధ్య, తూర్పుభారతంలో తీవ్రమైన వడగాడ్పులు, రికార్డుస్థాయి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జూన్ ఒకటో తేదీ నుంచి ఆదివారం వరకు 147.2 మి.మీ (సాధారణం కంటే 11 శాతం తక్కువ) వర్షపాతం కురిసింది. ప్రధానంగా రాజస్థాన్ నుంచి జమ్ముకశ్మీర్ వరకు, ఉత్తరాఖండ్ నుంచి ఒడిశా వరకు వర్షాభావం కొనసాగుతోంది. జార్ఖండ్, పశ్చిమబెంగాల్‌లో తీవ్రస్థాయిలో వర్షాభావం నెలకొంది.

ముసురేసింది!

- రాష్ట్రంలో విస్తారంగా వానలు
- మెట్ట పైర్లు, వరి నారుమళ్లకు జీవం
- మరింత పుంజుకోనున్న ఖరీఫ్ సాగు


విజయవాడలో కురుస్తున్న వర్షం

అమరావతి, విజయవాడ, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఉపరితల ఆవర్తనం, నైరుతి రుతుపవనాల ప్రభావంతో రాష్ట్రమంతటా ముసురు పట్టింది. శనివారం అర్ధరాత్రి నుంచి కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా ఓ మోస్తరు వాన పడింది. శ్రీకాకుళం, విశాఖ, ఉమ్మడి గుంటూరు, కృష్ణా, ఉభయగోదావరి, కర్నూలు తదితర జిల్లాల్లో నానుడు వాన పడింది. రాయలసీమలో అనేక చోట్ల తేలికపాటి వర్షం కురిసింది. తెరపిలేని వానతో పల్లపు ప్రాంతాల్లోని పొలాల్లో నీరు నిలిచింది. చిన్న చిన్న వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. పట్టణ శివారు కాలనీలు జలమయమయ్యాయి. రైల్వే అండర్ పాస్‌ల్లో వాన నీరు స్తంభించింది. ఎన్టీఆర్ జిల్లాలో మొత్తం 44.81 మిల్లీమీటర్లు, కృష్ణాజిల్లాలో 37.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. రానున్న 24 గంటల్లో రాష్ట్రవ్యాప్తంగా అనేక చోట్ల మోస్తరు వర్షాలు, తర్వాత 24గంటల్లో తేలికపాటి జల్లులు పడతాయని వాతావరణ శాఖ తెలిపింది. వరుస వర్షాలు మెట్ట పైర్లకు జీవం పోస్తాయని రైతులు భావిస్తున్నారు. అలాగే మెట్ట భూముల్లో పత్తి, వేరుశనగ, అపరాలు, నూనె గింజల విత్తనాలు నాటేందుకు అనుకూలంగా మారింది. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే 5లక్షల ఎకరాల్లో రైతులు పంటలేశారు. ఈ వర్షాలతో ఖరీఫ్ సాగు మరింత పుంజుకోనుంది. కృష్ణా, గోదావరి డెల్టా, వంశధార, నాగావళి ప్రాంతాల్లో వరి నారుమళ్లకు కూడా ఈ వానలు మేలు చేస్తాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మా ఆయనకు మళ్లీ పెళ్లి!

- భర్తకు మూడో వివాహం చేసిన ఇద్దరు భార్యలు
- అల్లూరి జిల్లాలో వైరల్


భర్త పెళ్లికి ఇద్దరు భార్యల పేరిట రూపొందించిన ఫ్లెక్సీ

పాడేరు/ జి.మాడుగుల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): భర్త రెండో పెళ్లి చేసుకుంటేనే మొదటి భార్య క్షణం ఆలోచించకుండా కేసు పెట్టేసే ఈ రోజుల్లో.. ఇప్పటికే ఇద్దరిని వివాహం చేసుకున్న వ్యక్తికి అతడి భార్యలే మూడో వివాహం చేశారు. అల్లూరి సీతారామ రాజు జిల్లా పెదబయలు మండలం గుల్లెలు పంచాయతీ కించూరు గ్రామంలో ఈనెల 25న ఈ పెళ్లి జరిగింది. కించూరుకు చెందిన సాగెని పండన్నకు పార్వతమ్మతో మొదటి వివాహం జరిగింది. ఆమెకు పిల్లలు పుట్టకపోవడంతో కొన్నాళ్లకు అప్పలమ్మ అనే మరో మహిళను రెండో వివాహం చేసుకున్నాడు. ఈమెకు ఓ కుమారుడు కలిగాడు. అయినప్పటికీ పండన్న జి.మాడుగుల మండలం కిల్లంకోట పంచాయతీ బందవీధి గ్రామానికి చెందిన లక్ష్మి అలియాస్ లావ్యపై మనసుపడ్డాడు. ఈ విషయాన్ని ఇద్దరు భార్యలతో చెప్పి ఆమెను మూడో వివాహం చేసుకునేందుకు ఒప్పించాడు. దీంతో ఇద్దరు భార్యలు.. భర్త మూడో వివాహానికి అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఈనెల 25న ఘనంగా వివాహం జరిపించారు. ఈ విషయం ఆదివారం జిల్లా కేంద్రం పాడేరు వచ్చిన పలువురు తెలియజేయడంతో క్షణాల్లో 'భర్తకు మూడో వివాహం చేసిన ఇద్దరు భార్యలు' అంటూ సోషల్ మీడియాలో కథనాలు వైరల్‌గా మారాయి.

పెళ్లిళ్ల వ్యాపారం.. ఏటా రూ.10 లక్షల కోట్లు

అంతర్జాతీయ కన్సల్టెన్సీ సంస్థ జెఫ్రీస్ వెల్లడి

జోరుజోరుగా వివాహ బిజినెస్.. సగటు వివాహ ఖర్చు రూ.12.5 లక్షలు



న్యూఢిల్లీ: భారత్‌లో ఇప్పుడు పెళ్లిళ్లు కూడా పెద్ద బిజినెస్‌గా మారాయి. ఈ బిజినెస్ ఎంత లేదన్నా ఏటా రూ.10 లక్షల కోట్లు (13.000 కోట్ల డాలర్లు) ఉంటుందని అంతర్జాతీయ కన్సల్టెన్సీ సంస్థ జెఫ్రీస్ ఒక నివేదికలో తెలిపింది. రిటైల్‌గా చూస్తే ఆహారం, చిల్లర సరుకుల తరువాత దేశంలో ఇదే అతిపెద్ద వ్యాపారమని పేర్కొంది. నిశ్చితార్థం మొదలుకొని, విందులు, వినోదాలు, నగనట్రా, పెళ్లి బట్టల కొనుగోలు, రవాణా కోసం చేసే ఖర్చులను పరిగణనలోకి తీసుకుని జెఫ్రీస్ ఈ నివేదిక రూపొందించింది.

ఏటా కోటి వివాహాలు

మన దేశంలో ఏటా 80 లక్షల నుంచి కోటి పెళ్లిళ్లు జరుగుతున్నాయి. ఒక్కో పెళ్లికి సగటున రూ.12.5 లక్షలు ఖర్చు చేస్తున్నట్టు అంచనా. పిల్లల చదువుల మీద పెట్టే ఖర్చుల కంటే తల్లిదండ్రులు రెండింతలు పిల్లల పెళ్లిళ్ల మీద ఖర్చు చేస్తున్నారు. ఆర్థిక స్థోమత అంతంతమాత్రంగా ఉన్నా పిల్లల పెళ్లిళ్లు మాత్రం ఘనంగా చేసేందుకు తల్లిదండ్రులు మొగ్గు చూపుతున్నారని తెలిపింది. ఇక బడాబాబులైతే దేశంలోని ప్రముఖ ప్రదేశాలు, విదేశాల్లోని ప్రముఖ ప్రదేశాల్లో తమ పిల్లల పెళ్లిళ్లు చేస్తున్నారు.

ఖర్చుల్లో చైనాదే అగ్ర స్థానం

అమెరికా, చైనాలతో పోలిస్తే మన దేశంలో ఏటా జరిగే పెళ్లిళ్లే ఎక్కువ. చైనాలో ఏటా 70-80 లక్షల పెళ్లిళ్లు జరుగుతుంటే అమెరికాలో ఏటా జరిగే పెళ్లిళ్లు 20 నుంచి 25 లక్షలు మాత్రమే. మన దేశంలో మాత్రం ఏటా 80 లక్షల నుంచి కోటి జంటలు పెళ్లితో ఒకటవుతున్నాయి. చైనాలో ఏటా 70-80 లక్షల పెళ్లిళ్లు జరిగినా ఖర్చులపరంగా చూస్తే మన కంటే చాలా ముందుంది. అక్కడ పెళ్లిళ్ల కారణంగా జరిగే వార్షిక వ్యాపారం రూ.14.17 లక్షల కోట్ల వరకు ఉంటుందని జెఫ్రీస్ సంస్థ అంచనా.

ఏఐ రెండు వైపులా పదునున్న కత్తి

న్యూఢిల్లీ: కృత్రిమ మేధ (ఏఐ) వినియోగం విషయంలో జాగ్రత్తలు తప్పనిసరని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇది రెండు వైపులా పదునున్న కత్తి లాంటిదని సేల్స్ ఫోర్స్ ఇండియా సీఈఓ, చైర్‌పర్సన్, ఎస్‌బీఐ మాజీ చైర్మన్ అరుంధతీ భట్టాచార్య అన్నారు. ఏఐతో మానవాళికి అనేక ప్రయోజనాలు ఉన్నా, ఇది దుష్ట శక్తుల చేతుల్లో పడితే దుష్ఫలితాలూ తప్పవని హెచ్చరించారు. మన దేశానికి సంబంధించినంత వరకైతే ఏఐ ఒక 'గేమ్ చేంజర్' అని అరుంధతీ భట్టాచార్య అన్నారు.

ఓలా ఈ-స్కూటర్లలో.. ఇక ఓలా బ్యాటరీలు

OLA ELECTRIC

దేశీయంగా తయారీ.. వచ్చే ఏడాది అందుబాటులోకి

ఓలా ఎలక్ట్రిక్ చైర్మన్ భవిష్ అగర్వాల్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఓలా ఎలక్ట్రిక్.. తన ఎలక్ట్రిక్ స్కూటర్ల (ఈవీ)లో తాను సొంతంగా ఉత్పత్తి చేయనున్న లిథియం అయాన్ బ్యాటరీ సెల్స్‌ను వినియోగించనుంది. వచ్చే ఏడాది ఆరంభంలో ఓలా ఎలక్ట్రిక్ పోర్టుఫోలియోలోని అన్ని స్కూటర్లను దేశీయంగా తయారు చేయనున్న బ్యాటరీలతో అందుబాటులోకి తీసుకురానున్నట్లు కంపెనీ చైర్మన్, ఎండీ భవిష్ అగర్వాల్ వెల్లడించారు. కంపెనీ తమిళనాడులోని కృష్ణగిరిలో కొత్తగా ఏర్పాటు చేసిన ఓలా గిగా ఫ్యాక్టరీలో లిథియం అయాన్ బ్యాటరీలను ఉత్పత్తి చేయనున్నట్లు ఆయన చెప్పారు. దీంతో ఈవీ బ్యాటరీల దిగుమతుల భారం తగ్గటమే కాకుండా ఉత్పత్తి వ్యయం గణనీయంగా తగ్గనుందని తెలిపారు. ప్రస్తుతం ఈ గిగా ఫ్యాక్టరీలో ప్రయోగాత్మకంగా ఉత్పత్తిని ప్రారంభించినట్లు ఆయన చెప్పారు. అంతర్జాతీయంగా అడ్వాన్స్‌డ్ సెల్ టెక్నాలజీతో లిథియం అయాన్ బ్యాటరీలను తయారు చేస్తున్న కంపెనీలు కొన్ని మాత్రమే ఉన్నాయని, అందులో భారత్ నుంచి ఓలా ఎలక్ట్రిక్ ఒక్కటే ఈ జాబితాలో ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం భారత్‌లోని ఎలక్ట్రిక్ వాహన తయారీ కంపెనీలు.. చైనా, తైవాన్, జపాన్, కొరియా దేశాల నుంచి పెద్దఎత్తున బ్యాటరీలను దిగుమతి చేసుకుంటాయన్నారు.

రూ.835 కోట్ల పెట్టుబడి

ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాల పథకం (పీఎల్ఐ) కింద కేంద్ర ప్రభుత్వం 30 గిగావాట్ల (జీడబ్ల్యూహెచ్) సామర్థ్యం గల ప్లాంట్ల ఏర్పాటుకు ఆమోదం తెలిపిందని, ఇందులో ఓలా ఒక్కటే 20 గిగావాట్ల సామర్థ్యంతో కూడిన ప్రాజెక్ట్‌ను దక్కించుకుందని భవిష్ తెలిపారు. 110 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ గిగా ఫ్యాక్టరీలో తొలుత 5 గిగావాట్ అవర్స్ (జీడబ్ల్యూహెచ్) సామర్థ్యాన్ని అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన చెప్పారు. ఆ తర్వాత దశలవారీగా ఈ ప్లాంట్ పూర్తి సామర్థ్యం 100 జీడబ్ల్యూహెచ్‌కు పెంచాలని చూస్తున్నట్లు తెలిపారు. ఈ ప్లాంట్‌పై ఇప్పటికే రూ.835 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టినట్లు ఆయన చెప్పారు. కాగా ఇప్పటికే ఈ ప్లాంట్‌లో 1.4 జీడబ్ల్యూహెచ్ సామర్థ్యం గల బ్యాటరీలను ఉత్పత్తి చేస్తున్నట్లు అగర్వాల్ పేర్కొన్నారు. అయితే సాంప్రదాయ 2170 సెల్స్ కంటే మరింత అడ్వాన్స్‌డ్ టెక్నాలజీలతో కూడిన 4680 సెల్స్‌ను కూడా కంపెనీ దేశీయంగా అభివృద్ధి చేసిందని, దీనికి బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) నుంచి సర్టిఫికేషన్ కూడా లభించిందన్నారు. ఈ బ్యాటరీలనే వచ్చే ఏడాది నుంచి తమ ఈవీల్లో వినియోగించాలని చూస్తున్నట్లు చెప్పారు. అలాగే లిథియం అయాన్ కంటే మెరుగైన సాలిడ్ స్టేట్ బ్యాటరీస్‌పై కూడా ప్రయోగాలు జరుపుతున్నట్లు తెలిపారు.

వచ్చే ఏడాది ఓలా ఈవీ మోటార్‌సైకిళ్లు

కృష్ణగిరిలోని కంపెనీ ఫ్యూచర్ ఫ్యాక్టరీలో కంపెనీ నాలుగు ఈవీ మోడల్స్‌ను ఉత్పత్తి చేస్తోందని అగర్వాల్ వెల్లడించారు. ప్రస్తుతం ఈ ప్లాంట్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 10 లక్షల యూనిట్లుగా ఉందన్నారు. అయితే డిమాండ్‌కు అనుగుణంగా ఈ ప్లాంట్‌లో ఉత్పత్తిని చేపడుతున్నామని, ప్రస్తుతం రోజుకు 2,200 యూనిట్లను ఉత్పత్తి చేస్తున్నట్లు ఆయన వివరించారు. కాగా కంపెనీ ఎలక్ట్రిక్ మోటార్ సైకిల్స్‌ను మార్కెట్లోకి తీసుకువచ్చేందుకు సన్నాహాలు చేస్తోందన్నారు. వచ్చే ఏడాది నాటికల్లా కనీసం మూడు మోటార్ సైకిల్స్‌ను మార్కెట్లోకి తీసుకురావాలని కంపెనీ భావిస్తోంది.

24,850 పైన బుల్లిష్

(జూలై 1-5 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

అస్ట్రో

నిఫ్టీ గత వారం 24,174-23,350 పాయింట్ల మధ్యన కదలాడి 510 పాయింట్ల లాభంతో 24,011 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 24,850 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 23,985, 23,746, 23,600, 23,212 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డీఎంఏ 200 డీఎంఏ కన్నా పైన ఉండడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి : 24,350 **బ్రేక్‌డౌన్ స్థాయి :** 23,700
నిరోధ స్థాయిలు : 24,225, 24,325, 24,425 (24,110 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు : 23,800, 23,700, 23,600 (23,900 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



జూలై 1వ తేదీ			
హైదరాబాద్	525	విజయవాడ	540
వరంగల్	527	గోదావరి	530
చిత్తూరు	573	విశాఖపట్నం	545
		దజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	112	విజయవాడ	123
వరంగల్	112	గుంటూరు	123
కరీంనగర్	112	ఒంగోలు	123
మహబూబ్‌నగర్	112	చిత్తూరు	113
కర్నూలు	112	నెల్లూరు	113
విశాఖపట్నం	129	అనంతపురం	123
గోదావరి	123		

లాభాల స్వీకరణకు చాన్స్ !

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ వారం మిశ్రమంగా కదలాడే అవకాశం ఉంది. సూచీలు ఇప్పటికే గరిష్ఠ స్థాయిలకు చేరటంతో మదుపరులు లాభాల స్వీకరణకు దిగే అవకాశం ఉంది. శుక్రవారం నాటి సెషన్లో ఇదే కనిపించింది. అయితే బడ్జెట్‌లో కేంద్రం మౌలిక రంగం, పెట్టుబడులు, ప్రభుత్వ రంగ సంస్థలకు మద్దతుగా నిర్ణయాలు తీసుకోవచ్చని భావిస్తే మాత్రం మార్కెట్ మరింత పెరిగే అవకాశం లేకపోలేదు.

స్టాక్ రికమండేషన్స్

ఇండస్ టవర్: నిఫ్టీతో పోలిస్తే ఈ షేరు మెరుగ్గా ట్రేడవుతోంది. రూ.360 వద్ద గరిష్ఠ స్థాయిని చేరిన తర్వాత సైడ్‌వేస్ కన్సాలిడేషన్ జరిగింది. తక్కువ వాల్యూమ్ నమోదు కావటాన్ని బట్టి చూస్తే డిమాండ్ ఎక్కువగా ఉందని అర్థం చేసుకోవచ్చు. గత శుక్రవారం ఈ షేరు 2.75 శాతం లాభంతో రూ.375 వద్ద క్లోజైంది. ట్రేడర్లు ఈ కౌంటర్‌లో రూ.360/370 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.425 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.349 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

జేకే టైర్: పెరిగిన రబ్బరు ధరల భారాన్ని వినియోగదారులకు బదలాయిస్తామని కంపెనీ చెప్పటంతో ఈ షేరులో ఒక్కసారిగా కదలిక ఏర్పడింది. రానున్న రోజుల్లో మార్జిన్స్ పెరిగే అవకావం ఉండటంతో ఇన్వెస్టర్ల చూపు ఈ షేరుపై పడింది. ఈ షేరు జీవితకాల గరిష్ఠాన్ని తాకిన తర్వాత 26 శాతం మేర క్షీణించింది. తాజాగా ఈ షేరుకు రూ.400 స్థాయిల్లో మంచి బేస్ ఏర్పడింది. గత శుక్రవారం ఈ షేరు 9.13 శాతం లాభంతో 429.75 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.428 స్థాయిల్లో ప్రవేశించి రూ.442/448 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.425 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఎస్‌బీఐ లైఫ్: గత వారం ఈ షేరు వారం, నెల గరిష్ఠాలను బ్రేక్ చేసింది. జూన్ ఆరంభం నుంచి అప్‌ట్రెండ్‌ను కనబరుస్తూ వస్తోంది. గత శుక్రవారం 1.95 శాతం లాభంతో రూ.1,491 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లోకి మదుపరులు రూ.1,460/1,480 స్థాయిల్లో ప్రవేశించి రూ.1,545/1,595 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,445 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

హీరో మోటోకార్ప్: జీవితకాల గరిష్ఠాన్ని తాకిన తర్వాత ఈ షేరులో స్వల్ప పుల్‌బ్యాక్ వచ్చింది. చివరి వారం వాల్యూమ్ తగ్గటమే కాకుండా ప్రైస్ యాక్షన్ చాలా టైట్‌గా జరుగుతోంది. నిఫ్టీతో పోల్చితే బలంగా ట్రేడవుతుండటం, గరిష్ఠ స్థాయిలను తాకే కొద్దీ పుల్‌బ్యాక్ స్వల్పంగా ఉండటం దీని ప్రత్యేకత. కిత్రం సెషన్‌లో ఈ షేరు 1.91 శాతం లాభంతో రూ.5,590 వద్ద ముగిసింది. మదుపరులు ఈ కౌంటర్‌లోకి రూ.5,550/5,560 స్థాయిల్లో ఎంటరై రూ.5,760 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.5,510 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఐఐఎఫ్ఎల్: ఈ షేరు విభజన అనంతరం ఈ కౌంటర్‌లో వాల్యూమ్ విపరీతంగా పెరిగింది. ప్రస్తుతం అప్‌ట్రెండ్ దిశగా సాగుతోంది. రిలేటివ్ స్ట్రెంత్ మాత్రం కాస్త బలహీనంగా ఉంది. అయితే చివరి మూడు సెషన్లలో 13 శాతం లాభపడటం సానుకూల అంశం. గత శుక్రవారం ఈ షేరు 7.8 శాతం లాభంతో రూ.517.30 వద్ద క్లోజైంది.

మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.510 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.555/590 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.485 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

24,000 పైన నిలదొక్కుకోవాలి

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం 23,400 వద్ద రియాక్షన్‌తో ప్రారంభమైనా తక్షణం పునరుజ్జీవం సాధించింది. తదుపరి అన్ని ట్రేడింగ్ దినాల్లోనూ అప్‌ట్రెండ్‌ను కొనసాగిస్తూ శుక్రవారం ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయి 24,150 వరకు వెళ్లి మైనర్ రియాక్షన్‌కు గురైంది. అయినప్పటికీ వారం మొత్తంలో 510 పాయింట్ల లాభంతో 24,000 సమీపంలో నిలకడగా ముగిసింది. మొత్తం మీద నిఫ్టీ జూన్ నెల మొత్తం బలమైన ర్యాలీలో ట్రేడవుతూ 2,800 పాయింట్ల వరకు లాభపడింది. ఈ కారణంగా ప్రస్తుత గరిష్ఠ స్థాయిల్లో టెక్నికల్ కరెక్షన్ లేదా కన్సాలిడేషన్ ఏర్పడవలసి ఉంది. గత వారంలో మిడ్‌క్యాప్-100 ఇండెక్స్ 300 పాయింట్లు, స్మాల్‌క్యాప్-100 ఇండెక్స్ 80 పాయింట్లు లాభపడ్డాయి. జూన్ నెలలో ఏర్పడిన ర్యాలీ ఏ గ్రూప్ షేర్ల కారణంగానే ఏర్పడిందనేందుకు ఇది సంకేతం. టెక్నికల్‌గా మార్కెట్ ఓవర్‌బాట్ స్థితిలో ప్రవేశిస్తోంది.

బుల్లిష్ స్థాయిలు: 24,000 పాయింట్ల స్థాయిలో మార్కెట్ కన్సాలిడేట్ కావచ్చు. సానుకూలత కోసం ఈ స్థాయిలో బలాన్ని ప్రదర్శించాలి. మరింత అప్‌ట్రెండ్‌లో ట్రేడయి గురువారం ఏర్పడిన గరిష్ఠ స్థాయి, ప్రధాన నిరోధం 24,150 వద్ద బ్రేకౌట్ సాధిస్తే సరికొత్త శిఖరాల దిశగా సాగుతుంది.

బేరిష్ స్థాయిలు: కరెక్షన్‌లో పడినా భద్రత కోసం మైనర్ మద్దతు స్థాయి 23,800 వద్ద నిలదొక్కుకోవాలి. విఫలమైతే మైనర్ బలహీనత మరింతగా కొనసాగుతుంది. ప్రధాన మద్దతు స్థాయిలు 23,650, 23,500.

బ్యాంక్ నిఫ్టీ : ఈ సూచీ గత వారం కనిష్ఠ స్థాయి 51,200 నుంచి ర్యాలీ సాధించి 53,200 వరకు వెళ్లింది. కాని గత శుక్రవారం ఈ స్థాయిలో 470 పాయింట్ల మేరకు రియాక్షన్ సాధించడం అప్రమత్త సంకేతం. అయినా గత వారంతో పోల్చితే 680 పాయింట్ల లాభంతో ముగిసింది. నిరోధ స్థాయిలు 52,700, 53,000. ఆ పైన మాత్రమే మరింత అప్‌ట్రెండ్‌లో పురోగమిస్తుంది. ప్రధాన మద్దతు స్థాయిలు 51,700, 51,000.

పాటర్న్: ఆర్ఎస్ఐ సూచీల ప్రకారం డెయిలీ చార్టులు, మంత్లీ చార్టులు రెండింటిలోనూ ఓవర్‌బాట్ స్థితి కనిపిస్తోంది. స్వల్పకాల ఇన్వెస్టర్లు ప్రస్తుత గరిష్ఠ స్థాయిల్లో అప్రమత్తంగా ఉండాలనేందుకు ఇది సంకేతం. 23,800 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" కన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనత ఏర్పడుతుంది.

టైమ్ : ఈ సూచీ ప్రకారం గురువారం తదుపరి మైనర్ రివర్సల్ ఉంది. అలాగే ఈ వారంలో స్వల్పకాలిక రివర్సల్‌కు కూడా ఆస్కారం ఉంది.

సోమ వారం స్థాయిలు	
నిరోధం :	24,090, 24,150
మద్దతు :	23,940, 23,860

ప్రజల మనిషి.. వెంకయ్య!

ప్రజాసేవ పట్ల తిరుగులేని నిబద్ధత గల నాయకుడు.. మాజీ ఉపరాష్ట్రపతిపై ప్రధాని నరేంద్ర మోదీ వ్యాసం

"వెంకయ్యనాయుడు.. రాజనీతిజ్ఞుడు. ఎలాంటి ఆటుపోట్లనైనా అవలీలగా అధిగమించగల సమర్థుడు" అని ప్రధాని నరేంద్రమోదీ మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యను కొనియాడారు. వెంకయ్యతో తనది దశాబ్దాల అనుబంధమని.. తామిద్దరం కలిసి పనిచేసినప్పుడు ఆయన్నుంచి తాను ఎంతో నేర్చుకున్నానని మోదీ పేర్కొన్నారు. సోమవారం (జూలై 1) వెంకయ్య నాయుడి పుట్టినరోజు సందర్భంగా.. 'భరతమాత సేవలో వెంకయ్య జీవితం' పేరిట ప్రధాని మోదీ ఒక వ్యాసం రాశారు. అందులోని ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..



మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పుట్టిన రోజు వేడుకల సందర్భంగా ఆన్‌లైన్ వేదికగా వెంకయ్య జీవితంపై ప్రచురితమైన పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ప్రధాని మోదీ, హాజరైన వెంకయ్య దంపతులు, ప్రముఖులు

దేశ మాజీ ఉపరాష్ట్రపతి, రాజనీతిజ్ఞుడు వెంకయ్య నాయుడుకు ఇవాళ్టితో 75 ఏళ్లు పూర్తవుతాయి. ఈ సందర్భంగా ఆయనకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆ దైవాన్ని ప్రార్థిస్తున్నాను. అలాగే ఆయన శ్రేయోభిలాషులందరికీ నా శుభాకాంక్షలు. అంకితభావం, ఒదిగిపోయే తత్వం, ప్రజాసేవ పట్ల తిరుగులేని నిబద్ధత కలిగిన ఒక నాయకుడిని గౌరవించుకునే తరుణమిది. రాజకీయ రంగ ప్రవేశం నుంచి ఉపరాష్ట్రపతిగా పదవీ బాధ్యతలు నిర్వర్తించే దాకా సాగిన వెంకయ్యనాయుడు కెరీర్.. భారత రాజకీయాల్లోని సంక్లిష్టతలను హుందాగా, సులువుగా అధిగమించడంలో ఆయనకుగల అరుదైన సామర్థ్యాన్ని మన ముందుంచుతుంది. వెంకయ్య వాగ్ధాటి, చతురత, ప్రగతి సంబంధిత అంశాలపై దృఢ వైఖరి వంటి సుగుణాలు.. పార్టీలకు అతీతంగా ఆయనకు ఎనలేని గౌరవం తెచ్చిపెట్టాయి. ఆయన జీవితంలో అప్పటికీ ఇప్పటికీ మారనిది ఒక్కటే. అది.. ప్రజలపై ప్రేమ. ఆంధ్రప్రదేశ్‌లో విద్యార్థి నాయకుడిగా ఆయన రాజకీయ ప్రస్థానం ప్రారంభమైంది. ఆయన అపూర్వ ప్రతిభ, వాక్పటిమ, నిర్వహణ నైపుణ్యాల కారణంగా.. ఏ రాజకీయ పార్టీ అయినా ఆయనకు స్వాగతం పలకడానికి సిద్ధంగా ఉంటుంది. అయితే 'దేశమే ముందు (నేషన్ ఫస్ట్)' అనే దార్శనికత నుంచి స్ఫూర్తిపొందిన ఆయన సంఘ్ పరివార్‌తో కలిసి పనిచేయడానికి మొగ్గుచూపారు. ఆ విధంగా 'ఆర్ఎస్ఎస్', 'ఏబీవీపీ'తో ఆయనకు గల అనుబంధం.. తర్వాతి కాలంలో జనసంఘ్, బీజేపీ బలోపేతానికి ఎంతగానో దోహదం చేసింది. దేశంలో దాదాపు 50 ఏళ్ల కిందట ఎమర్జెన్సీ విధించిన వేళ, దాన్ని వ్యతిరేకిస్తూ మొదలైన ఉద్యమంలో.. చురుకైన పాతికేళ్ల యువకుడుగా వెంకయ్య ముందుకు దూకారు. ఆ క్రమంలో.. కేవలం లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్‌ను ఆంధ్రప్రదేశ్‌కి ఆహ్వానించినందుకే ప్రభుత్వం ఆయనను జైల్లో పెట్టింది. 1980ల మధ్యలో.. మహానేత ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని కేంద్రంలోని నాటి కాంగ్రెస్ ప్రభుత్వం అమర్యాదపూర్వకంగా బర్తరఫ్ చేసిన సందర్భంలోనూ ప్రజాస్వామ్య సిద్ధాంత పరిరక్షణ ఉద్యమంలో ఆయన మరోసారి ముందువరుసలో నిలిచారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభకు 1978లో జరిగిన ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు అఖండ విజయం కట్టబెట్టినా.. కాంగ్రెస్ జోరును తట్టుకుని యువ ఎమ్మెల్యేగా వెంకయ్య ఎన్నికయ్యారు. ఆ తర్వాత ఐదేళ్లకు జరిగిన ఎన్నికల్లో ఎన్టీఆర్ సునామీ రాష్ట్రాన్ని చుట్టబెట్టినప్పుడు కూడా బీజేపీ ఎమ్మెల్యేగా వెంకయ్యనాయుడు ఎన్నికై, ఆంధ్రప్రదేశ్‌లో పార్టీ (బీజేపీ) ఎదుగుదలకు బాటలు వేశారు.

కేంద్ర మంత్రిగా..

2000 సంవత్సరంలో.. నాటి ప్రధాని వాజపేయి వెంకయ్యను కేంద్ర మంత్రిమండలిలోకి తీసుకునేందుకు ఆసక్తి చూపారు. అప్పుడు వెంకయ్య వెంటనే.. గ్రామీణాభివృద్ధి శాఖ పట్ల తన ఆసక్తి గురించి ఆయనకు తెలియజేశారు. దీంతో అటల్జీ సహా అగ్ర నాయకులందరూ ఆశ్చర్యపోయారు. కానీ ఆ విషయంలో వెంకయ్య చాలా స్పష్టంగా ఉన్నారు. తానొక రైతు బిడ్డనని, తన బాల్యమంతా గ్రామాల్లోనే గడిచింది కాబట్టి మంత్రిగా తాను కోరుకునేది ఏదైనా ఉందంటే అది గ్రామీణాభివృద్ధేనని వివరించారు. ఆ శాఖ మంత్రిగా ఆయన.. 'ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన' వంటి పథకానికి రూపకర్తగా ప్రధాన పాత్ర పోషించారు. కొన్నేళ్ల తర్వాత 2014లో ఎన్డీయే అధికారంలోకి వచ్చినప్పుడు.. ఆ ప్రభుత్వంలో ఆయన పట్టణాభివృద్ధి, గృహనిర్మాణం, పట్టణ పేదరిక నిర్మూలన సంబంధిత కీలకశాఖల బాధ్యతలు నిర్వహించారు. ఆయనహయాంలోనే మేము కీలకమైన 'స్వచ్ఛభారత్ మిషన్', పట్టణాభివృద్ధి సంబంధిత ప్రధాన పథకాలకు శ్రీకారం చుట్టాం. దాదాపు 15 సంవత్సరాలు గుజరాత్ బాధ్యతలు చూసి.. 2014లో నేను ఢిల్లీకి వచ్చేటప్పటికి.. జాతీయ రాజధానికి నేనొక బయటి వ్యక్తిని మాత్రమే. అటువంటి సమయంలో వెంకయ్య సలహాలు, సూచనలు నాకెంతో ఉపయుక్తమయ్యాయి.

ఉపరాష్ట్రపతిగా..

2017లో మా (ఎన్డీయే) కూటమి ఆయనను ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ప్రతిపాదించింది. ఉప రాష్ట్రపతి పదవికి ఆయనను మించిన ఉత్తమ అభ్యర్థి మరొకరు లేరన్న వాస్తవం కూడా మాకు తెలుసు. ఈ నేపథ్యంలో ఎంపీగా, మంత్రిగా తన పదవులకు రాజీనామా చేస్తూ ఆయనిచ్చిన ఉపన్యాసాల్లో ఒక్క అక్షరం కూడా నేను మరువలేను. పార్టీతో తనకు గల అనుబంధాన్ని, దాని ఎదుగుదలకు తాను చేసిన కృషిని గుర్తుచేసుకుంటూ ఆయన కన్నీటి పర్యంతమయ్యారు. ఉప రాష్ట్రపతి అయ్యాక.. ఆ పదవికి మరింత విలువను ఆపాదించే అనేక చర్యలు తీసుకున్నారు. యువ ఎంపీలు, మహిళా ఎంపీలు, తొలిసారి ఎంపీ అయినవారికి మాట్లాడే అవకాశం కల్పించడంలో రాజ్యసభకు అత్యుత్తమ చైర్‌పర్సన్‌గా నిలిచారు. జమ్మూకశ్మీర్‌కు సంబంధించి ఆర్టికల్ 370, 35(ఎ)ను రద్దుచేస్తూ రాజ్యసభలో తీర్మానం ప్రవేశపెట్టినపుడు వెంకయ్యనాయుడే సభాపతిగా ఉన్నారు. అది ఆయనకు ఎంతో ఉద్విగ్నభరిత క్షణమని నా నిశ్చితాభిప్రాయం. పని, రాజకీయాలను పక్కన పెడితే.. వెంకయ్యనాయుడు విపరీతమైన పఠనాభిలాషి, రచయిత కూడా. ఉజ్వలమైన తెలుగు సంస్కృతిని దేశరాజధానికి పరిచయం చేసిన నేతగా ఢిల్లీ ప్రజల్లో ఆయనకు విశేషమైన గుర్తింపు ఉంది. ఏటా సంక్రాంతి, ఉగాది పర్వదినాల్లో ఆయన నిర్వహించే కార్యక్రమాలు ఢిల్లీలో చాలామందికి మధుర జ్ఞాపకాలు. ఉపరాష్ట్రపతి పదవీ కాలం ముగిసిన తర్వాత కూడా వెంకయ్య ప్రజాజీవితంలో చురుగ్గా ఉంటున్నారు. తనకు ఆసక్తిగల అంశాలపై ఆయన అప్పుడప్పుడూ ఫోన్ ద్వారా నన్ను వాకబు చేస్తుంటారు. మా ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో ఇటీవలే నేను ఆయనను కలిస్తే.. ఆయన ఎంతో సంతోషంతో నాకు, నా బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఇలాంటి తీపి జ్ఞాపకాలతో 75 ఏళ్ల మైలురాయిని చేరిన వెంకయ్యనాయుడుకు మరోసారి శుభాకాంక్షలు తెలుపుతున్నాను. యువకార్యకర్తలు, ఎన్నికైన ప్రజాప్రతినిధులు, ప్రజా సేవాభిలాషులైన ప్రతి ఒక్కరూ ఆయన జీవితానుభవాల వెలుగులో విలువలను అందిపుచ్చుకోగలరని ఆశిస్తున్నాను. అలాంటి అరుదైన నాయకులే దేశాన్ని మరింత మెరుగ్గా తీర్చిదిద్దుతూ ఉత్తేజమిస్తున్నారు.

- నరేంద్ర మోదీ

మాటలే కాదు.. చేతలూ..

వెంకయ్యనాయుడు ప్రసంగం విన్నవారంతా సాధారణంగా ఆయన వాక్పటిమకు పెద్దపీట వేస్తారు. అయితే, ఆయన వాక్చతురుడు మాత్రమే కాదు... కార్యదక్షుడు కూడా! యువ ఎమ్మెల్యేగా శాసనసభకు ప్రాతినిధ్యం వహించి రోజుల నుంచీ సభా వ్యవహారాలను ఔపోసన పట్టిన ఆయనలోని కచ్చితత్వం.. నియోజకవర్గ ప్రజల గళాన్ని సభలో వినిపించడంలో చూపిన అంకితభావం.. వెంకయ్యనాయుడుకు అపార గౌరవాన్ని సముపార్జించి పెట్టాయి. ఆయన ప్రతిభను గుర్తించిన ఎన్టీఆర్ వంటి దిగ్గజనేత.. ఆయన్ను తన పార్టీలో చేర్చుకోవాలని అనుకున్నారు. కానీ, వెంకయ్యనాయుడు తన మౌలిక సిద్ధాంతాన్ని వీడబోనంటూ సున్నితంగా నిరాకరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామగ్రామానా పర్యటించి, అన్ని వర్గాల ప్రజలతో మమేకమవుతూ బీజేపీని రాష్ట్రంలో బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించారు. సభాపక్ష నాయకుడుగా పార్టీని విజయవంతంగా నడిపిస్తూ ఆ తర్వాత బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడయ్యారు. బీజేపీ కేంద్ర నాయకత్వం 1990ల్లో ఆయన కృషిని గుర్తించింది. 1993లో ఆయన్ను పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శిగా నియమించింది. నాటి నుంచీ జాతీయ రాజకీయాల్లో ఆయన ప్రస్థానం ప్రారంభమైంది. యుక్తవయసులో అటల్జీ (అటల్ బిహారీ వాజపేయి), అద్వాణీ వంటి అగ్రనేతల పర్యటనల గురించి ప్రకటించిన ఆయన.. అనంతరం కాలంలో వారితో ప్రత్యక్షంగా కలిసి పనిచేయడం నిజంగా అసాధారణమైన గౌరవం. బీజేపీని అధికారంలోకి తేవడంతోపాటు.. దేశానికి తొలి బీజేపీ ప్రధాన మంత్రి నాయకత్వం వహించేలా చేయడంపై ప్రధానకార్యదర్శి హోదాలో ఆయన నిశితంగా దృష్టిసారించారు. ఈ క్రమంలో, ఢిల్లీకి వెళ్లిన తర్వాత.. ఆయన ఏనాడూ వెనుదిరిగి చూసుకునే అవసరం లేకుండా ఎదిగి ఏకంగా పార్టీ జాతీయ అధ్యక్షుడయ్యారు.

వెంకయ్య వాక్పటిమ సాటిలేనిది

- మాజీ ఉపరాష్ట్రపతి జన్మదిన వేడుకల సందర్భంగా ఆన్‌లైన్ ద్వారా ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంస
- వెంకయ్యనాయుడిపై 3 పుస్తకాల ఆవిష్కరణ
- రాజీనామా చేశాకే పార్టీలు మారాలి: వెంకయ్య



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి పుస్తకాన్ని అందజేస్తున్న వెంకయ్యనాయుడు

హైదరాబాద్ సిటీ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): "ముప్పవరపు వెంకయ్యనాయుడు వాక్పటిమ గురించి ఎంత చెప్పినా తక్కువే. ఆయన వాగ్ధాటి ముందు ఎవరూ నిలవలేరు. రాజ్యసభ చైర్మన్‌గా.. సభలో తలెత్తిన ఎన్నో వివాదాలను అత్యంత హుందాగా పరిష్కరించిన ఘనత ఆయన సొంతం. ఆర్టికల్ 370 రద్దు ప్రతిపాదనను ముందుగా రాజ్యసభలో ఉంచాం. ఆ సమయంలో ఎన్‌డీఏకి అక్కడ సంఖ్యాబలం తక్కువుంది. అయినా, అది కేవలం వెంకయ్య అనుభవం, చొరవ వల్లే ఆమోదం పొందింది. ఆయన సేవలను దేశం ఎన్నటికి మరవదు" అని ప్రధాని నరేంద్ర మోదీ శ్లాఘించారు. "వాజ్‌పేయీ ప్రభుత్వంలో ఆయనకు మరింత కీలక పదవిని చేపట్టే అవకాశం ఉన్నా, గ్రామీణాభివృద్ధి శాఖను ఎంచుకొని పల్లెసీమల ప్రగతికోసం కృషి చేశారు. మా క్యాబినెట్‌లో పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా వెంకయ్య ఆధునిక నగరాల ఏర్పాటుకు మార్గనిర్దేశం చేశారు. స్వచ్ఛభారత్, అమృత్‌యోజన వంటి ఎన్నో పథకాలను సమర్థంగా అమలుచేశారు" అని కొనియాడారు. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు పుట్టిన రోజు వేడుకలు ఆదివారం గచ్చిబౌలిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన జీవిత విశేషాలతో సీనియర్ జర్నలిస్టు నగేష్‌కుమార్ రాసిన 'వెంకయ్యనాయుడు - ఎ లైఫ్ ఇన్ సర్వీస్'(ఇంగ్లిష్), ఉపరాష్ట్రపతి మాజీ కార్యదర్శి ఐవీ సుబ్బారావు రచించిన 'సెలబ్రేటింగ్ భారత్'(ఇంగ్లిష్), సంజయ్‌కిషోర్ సంకలనం చేసిన 'మహానేత - జీవన చిత్రమాలిక'(తెలుగు) పుస్తకాలను ప్రధాని మోదీ ఆన్‌లైన్ ద్వారా ఆవిష్కరించారు. ఈ పుస్తకాలు ప్రజలకు ప్రేరణగా నిలుస్తాయన్నారు. వెంకయ్యనాయుడు లాంటి నాయకుల సుదీర్ఘ సేవ వల్లే బీజేపీ ఇవాళ ఈ స్థాయిలో ఉందని పేర్కొన్నారు. మారుమూల గ్రామంలో ఓ సాధారణరైతు కుటుంబంలో పుట్టి, ఉప రాష్ట్రపతి స్థాయి వరకూ వెంకయ్యనాయుడు ఎదిగిన తీరు స్ఫూర్తిదాయకమన్నారు. ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన వెంకయ్య.. మోదీ ప్రభుత్వ విధానాలను కొనియాడారు. కాగా.. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, తెలంగాణ గవర్నర్ రాధాకృష్ణన్, ఏపీ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు, ఏపీ మంత్రి సత్య కుమార్, ఎంపీ భరత్, ఏపీ ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాసరావు, రఘురామకృష్ణంరాజు, సుజనా చౌదరి, మాజీ మంత్రి మల్లారెడ్డి, ప్రముఖ పారిశ్రామిక వేత్త గ్రంధి మల్లికార్జునరావు, విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు, మాజీ ఐఏఎస్‌లు నిమ్మగడ్డ రమేశ్, కె.లక్ష్మీనారాయణ, డీఆర్డీవో సతీశ్ రెడ్డి, మాజీ డీజీపీలు ఆర్పీ ఠాకూర్, దినేశ్ రెడ్డి, సినీ ప్రముఖులు మురళీమోహన్, కీరవాణి, నందమూరి రామకృష్ణ తదితర ప్రముఖులు హాజరయ్యారు.

హుందాగా ప్రవర్తించాలి..

ప్రజలకు సేవ చేయాలని పరితపించేవారంతా రాజకీయాల్లోకి రావాలని.. సిద్ధాంతపరమైన రాజకీయాలను ప్రోత్సహించాలని వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. చట్టసభలకు ఎన్నికైనవారు హుందాగా ప్రవర్తించాలని.. మానవీయ విలువలను పాటిస్తూ, మాతృభాషను ప్రోత్సహించాలని ఆకాంక్షించారు. "ఒక పార్టీ సిద్ధాంతాలు నచ్చకపోతే, మరొక పార్టీలోకి వెళ్లొచ్చు. కాకపోతే అంతకు ముందు.. ఆ పార్టీ ద్వారా వచ్చిన పదవికి రాజీనామా చేశాకే మారాలి" అని ఆయన వ్యాఖ్యానించారు. తన వద్ద సుదీర్ఘకాలం వ్యక్తిగత కార్యదర్శిగా సేవలందించిన ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ ఏపీలో మంత్రిగా బాధ్యతలు స్వీకరించడం ఆనందం కలిగించిందన్నారు.

పశ్చిమబెంగాల్‌లో ఆటవిక శిక్షలు!

» లక్ష్మీపూర్‌లో టీఎంసీ మద్దతుదారు ఘాతుకం


మహిళను కొడుతున్న తేజేముల్

కోల్‌కతా, జూన్ 30: పశ్చిమ బెంగాల్‌లో టీఎంసీ మద్దతుదారు ఒకరు 'ఇన్సాఫ్ సభ' పేరుతో ఆటవిక శిక్షలు విధిస్తున్న ఉదంతమిది. తాజాగా ఓ మహిళ, మరో యువకుడిని నడిరోడ్డుపై కింద పారేసి.. విచక్షణారహితంగా కర్రతో దాడి చేసి, కాళ్లతో తన్నిన ఘటన వెలుగులోకి వచ్చింది. సీపీఎం నేత, రాజ్యసభ మాజీ సభ్యుడు మహమ్మద్ సలీమ్ స్వయంగా ఈ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఆ వీడియో వైరల్ అవుతున్నా.. అటు ప్రభుత్వం గానీ, ఇటు పోలీసులు గానీ చర్యలు తీసుకున్న దాఖలాలు లేకపోవడం గమనార్హం..! వివరాల్లోకి వెళ్తే.. చోప్రా నియోజకవర్గ పరిధిలోని దిఘల్‌గావ్ ప్రాంతం, లక్ష్మీపూర్ గ్రామంలో టీఎంసీ ఎమ్మెల్యే హమీద్-ఉర్-రెహ్మాన్ అనుచరుడు జేసీబీ అలియాస్ తేజేముల్ అనే వ్యక్తి తక్షణ న్యాయం పేరుతో స్థానికంగా 'ఇన్సాఫ్ సభ'లను ఏర్పాటు చేస్తూ.. ఆటవిక శిక్షలను విధిస్తుంటాడు. ఈ క్రమంలో వివాహేతర సంబంధం పేరుతో ఓ మహిళను, మరో యువకుడిని చితకబాదుతున్న వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ అయ్యింది. బాధిత మహిళ దెబ్బలకు తాళలేక.. రోడ్డుపై పొర్లుతూ రోదిస్తున్నా.. కనికరం లేకుండా కర్రతో ఎడాపెడా దాడి చేశాడు. మరో యువకుడిని కూడా ఇదేవిధంగా హింసించాడు. చుట్టూ జనం గుమిగూడినా.. ఓ వృద్ధుడు మినహా.. ఎవరూ తేజేముల్‌ను ఆపేందుకు యత్నించలేదు. కొంతదూరంలోనే పోలీసు పెట్రోలింగ్ జీపు ఉన్నా.. ఒక్క పోలీసు కూడా కిందకు దిగి, అతణ్ని వారించే ప్రయత్నం చేయలేదు. దీనిపై సీపీఎం నేత సలీం సీరియస్ అయ్యారు. బెంగాల్‌లో మమత హయాంలో ఆటవిక శిక్షలను విధిస్తున్నారని ఆరోపించారు. బీజేపీ సోషల్ మీడియా చీఫ్ మాలవీయ కూడా.. "తాలిబాన్ల తరహాలో శిక్షలు విధిస్తుంటే.. ప్రభుత్వం ఏం చేస్తోంది" అని ప్రశ్నించారు.

కుటుంబ పింఛనుదారుల సమస్యలపై ప్రత్యేక డ్రైవ్

న్యూఢిల్లీ, జూన్ 30: కేంద్ర ప్రభుత్వం కుటుంబ పింఛనుదారుల సమస్యల పరిష్కారానికి సోమవారం నుంచి ప్రత్యేక కార్యక్రమం ప్రారంభించనుంది. జూలై 31 వరకు కొనసాగే ఈ కార్యక్రమంలో 46 శాఖలు/విభాగాలు పాల్గొంటాయి. ఇప్పటి వరకు పింఛన్ సమస్యలపై దాదాపు 90 వేల అర్జీలు ఆన్‌లైన్‌లో అందాయని, వీటిలో కుటుంబ పింఛన్లవి 20-25% ఉన్నాయని కేంద్ర సిబ్బంది మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఇందులో రక్షణ శాఖ, రైల్వే శాఖ, కేంద్ర సాయుధ పోలీసు దళానికి సంబంధించినవి ఎక్కువగా ఉన్నాయని వివరించింది. కుటుంబ పింఛన్లకు సంబంధించి సమస్యలుంటే నేరుగా కానీ www.pgportal.gov.in/PENSION పోర్టల్‌లో కానీ నమోదు చేసుకోవచ్చని తెలిపింది. టోల్ ఫ్రీ నంబర్ 1800-1101960లో సంప్రదించవచ్చని

అసెంబ్లీ ఎన్నికల్లో కూటమిగానే పోటీ: శరద్ పవార్

పుణె, జూన్ 30: మహారాష్ట్ర అసెంబ్లీకి అక్టోబరులో జరగనున్న ఎన్నికల్లో మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ) కూటమి కలిసికట్టుగానే పోటీ చేస్తుందని సీనియర్ నాయకుడు, ఎన్‌సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ వెల్లడించారు. ఈ కూటమిలోని ఎన్‌సీపీ (శరద్ పవార్), శివసేన (ఠాక్రే), కాంగ్రెస్ పార్టీలు ఉమ్మడిగానే రంగంలో ఉంటాయని తెలిపారు. ఆదివారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ తమ కూటమిలో చిన్న పార్టీలను కూడా చేర్చుకుంటామని చెప్పారు. గత లోక్‌సభ ఎన్నికల్లో వామపక్షాలు, పీజెంట్స్ అండ్ వర్కర్స్ పార్టీకి సీట్లు ఇవ్వలేకపోయామని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం వాటికి సీట్లను సర్దుబాటు చేయాల్సిన నైతిక బాధ్యత తమపై ఉందని చెప్పారు.

ఆర్మీ చీఫ్‌గా ఉపేంద్ర ద్వివేది బాధ్యతల స్వీకరణ



న్యూఢిల్లీ, జూన్ 30: భారత 30వ సైన్యాధిపతిగా జనరల్ ఉపేంద్ర ద్వివేది బాధ్యతలు చేపట్టారు. ఆయనకు పాకిస్థాన్, చైనా సరిహద్దుల్లో పనిచేసిన సుదీర్ఘ అనుభవం ఉంది. వాస్తవాధీన రేఖ(ఎల్‌ఏసీ) వెంబడి సహా భద్రతకు సంబంధించిన అనేక సవాళ్లను దేశం ఎదుర్కొంటున్న వేళ 13 లక్షల సిబ్బందిని కలిగి ఉన్న బలమైన సైన్యానికి ఆయన అధిపతి అయ్యారు. ఇప్పటి వరకు ఆ పదవిలో కొనసాగిన జనరల్ మనోజ్ పాండే నుంచి ఆదివారం ఆయన ఆర్మీచీఫ్‌గా బాధ్యతలు స్వీకరించారు. నాలుగు దశాబ్దాలకుపైగా సైన్యంలో సేవలందించిన జనరల్ మనోజ్ పాండే ఆదివారం పదవీ విరమణ పొందారు. జనరల్ పాండే 2022 నుంచి ఆర్మీ చీఫ్‌గా కొనసాగారు. జనరల్ ద్వివేది కూడా అంతే సుదీర్ఘ అనుభవం కలిగి ఉండటంతో పాటు అనూహ్య పరిస్థితుల్లో సమర్థవంతంగా ప్రణాళికలు రూపొందించి అమలు చేసిన ట్రాక్ రికార్డు కలిగి ఉన్నారని సైన్యం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ ఏడాది ఫిబ్రవరి 19వ తేదీ నుంచి ఆయన ఆర్మీ వైస్ చీఫ్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అంతకుముందు 2022 నుంచి నార్తర్న్ కమాండ్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్‌గా పనిచేశారు. మధ్యప్రదేశ్‌కు చెందిన ఆయన రేవాలోని సైనిక స్కూల్ పూర్వ విద్యార్థి. అనంతరం 1981లో నేషనల్ డిఫెన్స్ అకాడమీ(ఎన్‌డీఏ)లో చేరారు. 1984 డిసెంబరులో జమ్మూకశ్మీర్ రైఫిల్స్‌కు చెందిన 18వ బెటాలియన్ ద్వారా సైన్యంలో బాధ్యతలు చేపట్టారు. ఆయన సేవలకుగాను ప్రభుత్వం పరమ విశిష్ట సేవా మెడల్, అతి విశిష్ట సేవా మెడల్, మూడు జనరల్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్‌చార్జి(జీవోసీ ఇన్ సీ) కమాండేషన్ కార్డ్స్ పతకాలతో సత్కరించింది.

మెదక్ ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీ సీజీఎంగా ఎస్ఎస్ ప్రసాద్




అల్వాల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మెదక్ ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీ చీఫ్ జనరల్ మేనేజర్(సీజీఎం)గా ఎస్ఎస్ ప్రసాద్ నియమితులయ్యారు. సోమవారం ఆయన ఈ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇప్పటివరకు ఆ పదవిలో ఉన్న కే సుధాకర్ పదవీ విరమణ చేశారు. ఎస్ఎస్ ప్రసాద్ 1992లో ఇండియన్ ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీలో చేరారు. శిక్షణ అనంతరం 1993లో తొలుత డెహ్రాడూన్‌లోని ఆప్టోఎలక్ట్రానిక్స్ ఫ్యాక్టరీలో అసిస్టెంట్ వర్క్స్ మేనేజర్‌గా విధులు నిర్వహించారు. తర్వాత కాన్పూర్‌లోని పారాచూట్ ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీకి ట్రాన్స్‌ఫర్ అయ్యారు. 2016 జూన్‌లో పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. తర్వాత, 2023 సెప్టెంబరులో మెదక్ ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీ జనరల్ మేనేజర్‌గా నియమితులయ్యారు.

నీట్-యూజీ ఇక ఆన్‌లైన్‌లో.. కేంద్రం పరిశీలన

న్యూఢిల్లీ, జూన్ 30: నీట్-యూజీని పెన్ను-పేపరు విధానానికి బదులు ఇక ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహించాలని కేంద్రం భావిస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. మే 5న ఈ పరీక్ష నిర్వహించగా.. ప్రశ్నపత్రం లీక్, అవకతవకలు వెలుగుచూడడంతో కేంద్రంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఆన్‌లైన్ విధానంలో పరీక్ష నిర్వహణకు కేంద్రం మొగ్గు చూపుతోంది. ఇదిలా ఉండగా, నీట్ అక్రమాలకు సంబంధించి గోద్రాలో ఓ పాఠశాల యజమానిని సీబీఐ అరెస్టు చేసింది.

స్వదేశీ న్యాయం


నూతన చట్టాల్లోని వివాదాస్పద అంశాలు

(మొదటి పేజీ తరువాయి)

చట్టాల తాలూకు బిల్లుల ఆమోదం సందర్భంగా లోక్‌సభ, రాజ్యసభల నుంచి ఏకంగా 146 మంది విపక్ష ఎంపీలను సస్పెండ్ చేశారని, చర్చ జరపకుండానే బిల్లులను ఆమోదించారని పిటిషనర్లు అంజలీ పటేల్, ఛాయామిశ్రా పేర్కొన్నారు. ప్రజల నుంచి కూడా ఈ కొత్త చట్టాలపై అభిప్రాయాలను సేకరించలేదన్నారు. పశ్చిమ బెంగాల్, తమిళనాడు ముఖ్యమంత్రులు ఈ చట్టాల అమలును వ్యతిరేకిస్తున్నారని గుర్తు చేశారు. ఈ చట్టాల ప్రకారం నిందితులకు బెయిల్ ఇచ్చే అవకాశాలు గణనీయంగా తగ్గిపోతాయని, పోలీసులకు విపరీతమైన అధికారాలు లభిస్తాయని పేర్కొన్నారు. మరోవైపు, కొత్త నేరచట్టాల అమలును వాయిదా వేయాలని కోరుతూ పౌరహక్కుల ప్రజాసంఘం (పీయూసీఎల్) కేంద్ర న్యాయశాఖమంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్‌కు లేఖ రాసింది. క్రిమినల్ లాయర్లు, దర్యాప్తు సంస్థలు, న్యాయమూర్తులు, సాధారణ పౌరుల నుంచి విస్తృత స్థాయిలో అభిప్రాయాలు సేకరించకుండానే ఈ చట్టాలను తీసుకొచ్చారని గుర్తు చేసింది. భారతదేశ ప్రజాస్వామ్యంపై దీర్ఘకాలికంగా తీవ్ర ప్రభావం చూపే ఈ చట్టాలపై ఇప్పటికైనా దేశవ్యాప్తంగా పెద్దఎత్తున చర్చలు జరపాలని, అప్పటి వరకూ వాటి అమలును వాయిదా వేయాలని పీయూసీఎల్ కోరింది. వలస చట్టాల నుంచి బయటపడుతున్నామని చెబుతూనే.. నాటి బ్రిటీష్ చట్టాల్లోని అనేక అంశాలను యథాతథంగా తీసుకొచ్చారని (కట్ అండ్ పేస్ట్ చేశారని) పీయూసీఎల్ వెల్లడించింది. మరోవైపు నూతన నేర చట్టాలు పేరులోనేగాక సారంలోనూ భారతీయతను కలిగి ఉన్నాయని, వాటి ఆత్మ, శరీరం, స్ఫూర్తి భారతీయత అని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పేర్కొన్నారు. 'భారతీయుల కొరకు భారతీయుల చేత భారతీయ పార్లమెంటు ద్వారా ఇవి రూపొందాయని, వలసకాలం నాటి చట్టాలకు దీంతో తెరపడింది' అని తెలిపారు.

- న్యాయసంహిత చట్టంలో గ్యాంగ్, వ్యవస్థీకృత నేరముఠాల వంటి పదాలున్నాయిగానీ వాటిని నిర్వచించలేదు. ఫలితంగా అమాయకులను కూడా కేసులతో ఇరికించే అవకాశాలున్నాయని న్యాయ నిపుణులు అంటున్నారు.
- న్యాయసంహిత ప్రకారం మానసిక వికలాంగులకు విచారణ నుంచి రక్షణ లభిస్తుంది. అయితే, బుద్ధిమాంద్యం ఉన్న వారిని ఈ క్యాటగిరీలో చేర్చలేదు. ఫలితంగా బుద్ధిమాంద్యం ఉన్న వారిపై కేసులు నమోదు చేయవచ్చు.
- నాగరిక్ సురక్ష సంహిత ప్రకారం.. పోలీసులు నిందితులను తమ కస్టడీలో 15 రోజులపాటు ఉంచుకోవచ్చు. అంతేకాదు, ఆ తర్వాత కూడా 40 నుంచి 60 రోజుల అదనపు కస్టడీని కోరవచ్చు. ఈ కస్టడీని ఒకేదఫాలోగానీ పలుదఫాల్లోగానీ అమలుపరచవచ్చు. తద్వారా నిందితుడికి న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసినా కూడా పోలీసులు కస్టడీలోకి తీసుకునే అవకాశం ఉంటుంది.
- ఎలక్ట్రానిక్ రికార్డులను ఎవిడెన్సు యాక్ట్ ద్వితీయ స్థాయి సాక్ష్యాధారాలుగా పరిగణిస్తే.. దానిస్థానంలో వచ్చిన భారతీయ సాక్ష్య అధినియమ్ వాటిని ప్రథమ స్థాయి సాక్ష్యాధారాలుగా పరిగణిస్తోంది. తద్వారా స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌ల వంటి సాధనాలతోపాటు సెమీకండక్టర్ మెమొరీలో నిక్షిప్తమై ఉన్న సమాచారాన్ని కూడా సాక్ష్యాధారంగా భావిస్తుంది. వీటిని సాక్ష్యంగా పరిగణించే కొత్త చట్టం.. పోలీసులు వీటిని నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్నప్పుడు లేదా తనిఖీ నిర్వహించినప్పుడు వాటిల్లో లేని సమాచారాన్ని తామే స్వయంగా చొప్పిస్తే పరిస్థితి ఏమిటి? అన్నదానిని మాత్రం చర్చించలేదు. అటువంటి పరిస్థితి తలెత్తకుండా ఎటువంటి చర్యలనుగానీ, నిబంధనలనుగానీ పేర్కొనలేదు.

ఇతర ముఖ్యాంశాలు

క్రిమినల్ కేసుల్లో విచారణ ప్రారంభమైన తర్వాత 60 రోజుల్లోపు అభియోగాలు నమోదు చేయాలి. విచారణ పూర్తయిన 45 రోజుల్లోపు న్యాయమూర్తి తీర్పు వెలువరించాలి. గరిష్ఠంగా కేసును రెండుసార్లు మాత్రమే వాయిదా వేయాలి. రేప్ బాధితుల వాంగ్మూలాన్ని మహిళా పోలీసు అధికారి బాధితురాలి సంరక్షకుల సమక్షంలో నమోదు చేయాలి. ఘటన జరిగిన తర్వాత ఏడు రోజుల్లోపు వైద్య నివేదిక సిద్ధం కావాలి. సాక్షులకు రాష్ట్ర ప్రభుత్వాలు రక్షణ కల్పించాలి. లింగసమానత్వంలో భాగంగా లింగం (జెండర్) అనే క్యాటగిరీ కింద ట్రాన్స్‌జెండర్లకు కూడా అవకాశం.

స్వాతంత్రోద్యమంలో నాటి జాతీయ నాయకులను జైళ్లలో పెట్టటానికి బ్రిటీష్ ప్రభుత్వం ఉపయోగించిన దేశద్రోహ చట్టం అమలును సుప్రీంకోర్టు 2022లో నిలిపివేసింది. ఈ చట్టంపై సమీక్ష జరుపుతామని కేంద్రం నాడు సుప్రీంకోర్టులో తెలిపింది. కానీ, కొత్త చట్టంలో తిరిగి దేశద్రోహ చట్టాన్ని తీసుకొచ్చింది. ప్రభుత్వ విధానాలను విమర్శించటానికి ప్రజలకు, సంస్థలకు ఉన్న ప్రజాస్వామ్యహక్కును.. దేశద్రోహం పేరుతో అణచివేయటానికి ఈ చట్టం ఉపయోగపడుతోందన్న విమర్శలు ఎంతో కాలంగా ఉన్నాయి.

అరెస్టు సందర్భంగా నిందితుల చేతులకు బేడీలు వేయటాన్ని పునరుద్ధరించటం, తప్పనిసరిగా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలన్న ప్రస్తుత నిబంధనను తొలగించటం.. పాతకాలపు పోకడలకు దేశాన్ని మళ్లీ తీసుకెళ్లటంగా పలువురు భావిస్తున్నారు.

ఏ చట్టంలో ఏముంది


భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)

- మహిళలు, పిల్లలపై జరిగే నేరాలపై విచారణకు ప్రాధాన్యం ఇచ్చారు. పెళ్లి చేసుకుంటాననో లేదా మరో విధంగానో యువతులను మోసగించి లైంగికంగా సంబంధం పెట్టుకోవటాన్ని సెక్షన్ 69 ప్రకారం నేరంగా పరిగణిస్తారు. మైనర్‌పై గ్యాంగ్‌రేప్‌నకు పాల్పడిన వారికి మరణశిక్ష లేదా జీవితఖైదు విధిస్తారు.
- బాధిత మహిళలను, పిల్లలను ఆస్పత్రిలో చేర్చగానే వారికి తొలుత ఉచితంగా వైద్యం అందించాల్సి ఉంటుంది.
- ఉగ్రవాదం, ఉగ్రవాద చర్యలను తొలిసారిగా నిర్వచించి నేర చట్టం కిందికి తీసుకొచ్చారు.
- ఇంతకుముందటి దేశద్రోహం నేరాన్ని రాజద్రోహంగా మార్పు చేశారు.
- నిర్లక్ష్యంతో వాహనం నడిపించి మరణానికి కారణమైన నేరస్థులకు (హిట్ అండ్ రన్ కేసుల్లో) ఇప్పుడున్న రెండేళ్ల జైలు శిక్షను ఐదేళ్లకు పెంచారు.
- మూకదాడిని హత్యతో సమానంగా పరిగణించి విచారిస్తారు.
- శిక్ష అమలులో భాగంగా నిందితులతో సామాజిక సేవ చేయించటం అనే కొత్త నిబంధనను ప్రవేశపెట్టారు.

భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్)

- ఇప్పటి వరకున్న సీఆర్‌పీసీ ప్రకారం.. పోలీసులు తొలుత ఎఫ్ఐఆర్ దాఖలు చేసిన తర్వాతే విచారణ ప్రారంభించాలి. వివాహ సంబంధిత వివాదాలు, వ్యాపార గొడవలు వంటి కొన్నింటిల్లోనే తొలుత విచారణ జరిపి ఆ తర్వాత అవసరమైతే ఎఫ్ఐఆర్ దాఖలు చేస్తారు. కానీ, కొత్త చట్టం ప్రకారం పోలీసులు ఏ కేసులోనైనా తొలుత ప్రాథమిక విచారణ జరిపి, అవసరమైతేనే ఎఫ్ఐఆర్ దాఖలు చేయాలి.
- పోలీస్ స్టేషన్ పరిధితో సంబంధం లేకుండా ఘటన ఎక్కడ జరిగినా ఏ పోలీస్ స్టేషన్‌లోనైనా ఎఫ్ఐఆర్ దాఖలు చేయవచ్చు. దీనినే జీరో ఎఫ్ఐఆర్‌గా వ్యవహరిస్తున్నారు.
- పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండానే ఏదైనా ఘటనపై ఫోన్ తదితర సమాచార సాధనాల ద్వారా ఫిర్యాదు చేయవచ్చు.
- అరెస్టు చేసిన వ్యక్తుల వివరాలను పోలీస్ స్టేషన్‌లో అందరికీ కనిపించేలా ప్రదర్శించాలి. తద్వారా సదరు వ్యక్తుల బంధుమిత్రులు తగు న్యాయపరమైన చర్యలు చేపట్టటానికి వీలవుతుంది.
- ప్రస్తుతం ఈడీకి నిందితుల ఆస్తులను జప్తు చేసే అధికారం ఉన్నట్లుగా నేరాలపై దర్యాప్తు జరిపే సంస్థలకు కూడా ఆస్తుల జప్తు అధికారాల్ని ఈ కొత్త చట్టం కట్టబెడుతోంది.
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిందితులు, బాధితులు, సాక్షులు విచారణకు హాజరు కావచ్చు. ఇదే పద్ధతిలో వాంగ్మూలాన్ని కూడా రికార్డు చేయవచ్చు.

లోకం తీరు



భారతీయ సాక్ష్య అధినియమ్

- ఇంతకుముందటి ఎవిడెన్స్ యాక్ట్‌లోని పలు అంశాలను దీంట్లో తిరిగి కొన్ని మార్పులతో పొందుపరిచారు. ఉదాహరణకు, ఎవిడెన్స్ యాక్టులో భారత భూభాగం అంతటికీ చట్టం వర్తిస్తుందని స్పష్టం చేయగా.. దాంట్లో ఉన్న 'ఇండియా' అనే పేరును బీఎస్ఏలో తొలగించారు. తద్వారా భారత భూభాగం వెలుపలి ప్రాంతాలకు చెందిన డిజిటల్ రికార్డులను కూడా సాక్ష్యంగా పరిగణించటానికి అవకాశం ఏర్పడింది.
- స్మార్ట్‌ఫోన్లు, ఇతర డిజిటల్ ఉపకరణాల్లోని వివరాలను కూడా సాక్ష్యాధారాలుగా పరిగణిస్తూ 'డాక్యుమెంట్' నిర్వచనాన్ని విస్తృతపరిచారు. ఆడియో, వీడియో రికార్డులను కూడా ఎవిడెన్స్‌గా పరిగణిస్తారు.
- ఆర్థిక తదితర రంగాల నిపుణుల మౌఖిక అభిప్రాయాలనూ సాక్ష్యాధారంగా పరిగణిస్తారు.
- ఏదైనా కేసులో నిందితులు ఒకరి కంటే ఎక్కువ ఉంటే.. విచారణ దశలో వారిలో ఎవరైనా పరారైనా.. ఆ నిందితుడి గైర్హాజరులోనే విచారణ కొనసాగుతుంది.

సవాళ్లు

- కొత్త నేరచట్టాల అమలుకు ముందు (2024 జూలై 1వ తేదీకి ముందు) జరిగిన నేరాలను ఐపీసీ తదితర పాత చట్టాల ప్రకారం విచారించాల్సి ఉంటుంది. జూలై 1 నుంచి జరిగిన నేరాలను కొత్త చట్టాల ప్రకారం విచారించాలి. ఇది తీవ్ర గందరగోళానికి దారితీసి న్యాయవాదులు, న్యాయమూర్తులు ఇబ్బందులను ఎదుర్కొనే అవకాశం ఉంది. కేసుల నమోదులో పోలీసులకూ ఇటువంటి ఇబ్బందులు ఎదురవుతాయి.
- నిందితులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణ జరపవచ్చని కొత్త చట్టాలు చెబుతున్నాయి. కానీ, దేశంలోని 80% కోర్టుల్లో దీనికి అవసరమైన మౌలిక సదుపాయాలు లేవు.

డిప్యూటీ స్పీకర్ బరిలో అవధేశ్ ప్రసాద్!

అభ్యర్థిగా నిలపాలని విపక్ష కూటమి యోచన



న్యూఢిల్లీ, జూన్ 30: లోక్‌సభలో డిప్యూటీ స్పీకర్ పదవికి సమాజ్‌వాదీపార్టీ ఎంపీ అవధేశ్ ప్రసాద్‌ను తమ అభ్యర్థిగా బరిలో నిలపాలని విపక్ష ఇండియా కూటమి భావిస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు కూటమిలోని ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, తృణమూల్, ఎస్పీ సంప్రదింపులు జరుపుతున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. యూపీకి చెందిన అవధేశ్ ప్రసాద్ తొమ్మిదిసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో అయోధ్య రామాలయం ఉన్న ఫైజాబాద్ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థి మీద తొలిసారిగా ఎంపీగా విజయం సాధించి సంచలనం సృష్టించారు. ఫైజాబాద్ నియోజకవర్గం జనరల్‌సీటు అయినప్పటికీ దళిత సామాజికవర్గానికి చెందిన అవధేశ్ ప్రసాద్ అక్కడి నుంచి విజయం సాధించటం విశేషం. ఎన్నికల్లో బీజేపీ హిందుత్వ అజెండా ఓడిపోయిందనటానికి అవధేశ్ గెలుపు ఓ నిదర్శమని, జనరల్ స్థానం నుంచి ఆయన గెలవటం దేశ రాజకీయాల్లో ఓ ముఖ్యమైన పరిణామమని ఇండియా కూటమికి చెందిన ఒక సీనియర్ నేత వ్యాఖ్యానించారు. కాగా, ఇటీవలి 17వ లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ లేకుండానే ముగిసింది. ఈసారి కూడా ఎన్డీయే సర్కారు ఈ పదవిని ఖాళీగానే ఉంచుతుందా? లేక, ఆ పదవి భర్తీకి చర్యలు తీసుకుంటుందా అన్నదానిపై స్పష్టత లేదు. జూలై 3వ తేదీతో పార్లమెంటు తొలి దశ సమావేశాలు ముగుస్తాయి. ఆలోపు ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకోకపోతే స్పీకర్‌కు లేఖ రాయాలని ఇండియా కూటమి భావిస్తున్నట్లు సమాచారం. కాగా, సోమవారం పార్లమెంటు సమావేశాలు తిరిగి ప్రారంభం కానున్నాయి.

అమ్మ కోసం ఓ మొక్క!

ప్రధాని నూతన కార్యక్రమం 'ఏక్ పేడ్ మా కే నామ్'

» మూడోసారి గద్దెనెక్కాక తొలి 'మన్ కీ బాత్'లో మోదీ ప్రకటన


2016లో అప్పటి మంత్రి రావెల కిశోర్‌బాబు నుంచి అరకు కాఫీని అందుకుంటున్న ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, జూన్ 30: తల్లిని గౌరవించేందుకు దేశంలోని ప్రతి ఒక్కరూ ఓ మొక్క నాటాలని ప్రధాని మోదీ పిలుపిచ్చారు. పర్యావరణ పరిరక్షణ కోసం తన ప్రభుత్వం చేపట్టిన కొత్త కార్యక్రమం 'అమ్మ పేరుతో ఓ మొక్క(ఏక్ పేడ్ మా కే నామ్)' గురించి 'మన్ కీ బాత్'లో పిలుపిచ్చారు. మూడోసారి ప్రధాని అయ్యాక.. ఆకాశవాణిలో ఆదివారం 'మన్ కీ బాత్'లో ఆయన ప్రసంగించారు. తాను కూడా తన తల్లి పేరిట ఓ మొక్క నాటానని తెలిపారు. రాజ్యాంగం, ప్రజాస్వామిక విలువలపై తమకున్న అచంచల విశ్వాసాన్ని ఓటుద్వారా వ్యక్తం చేసిన దేశ ప్రజలను ఆయన అభినందించారు. ఎన్డీయేని తిరిగి ఎన్నుకున్నందుకు ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. భారతీయ సంస్కృతి విశ్వవ్యాప్తంగా పరిఢవిల్లుతోందని చెప్పారు. మన కవులు, భాషలకు పలు దేశాల్లో ప్రాధాన్యం లభిస్తోందన్నారు. 'కువైట్ ప్రభుత్వం అక్కడి నేషనల్ రేడియోలో హిందీలో ప్రత్యేక కార్యక్రమం ప్రసారం చేస్తోంది. ప్రతి ఆదివారం ఇది అరగంటపాటు ఉంటుంది. మన సంస్కృతీ విశేషాలు, సినిమాలు, కళలపై నిర్వహించే చర్చలు అక్కడి భారతీయులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. తుర్కిమెనిస్థాన్‌లో ఇటీవల వారి జాతీయ కవి(మగ్తిమ్‌గులీ ఫైరగీ) 300వ జయంతి జరిగింది. ఆ సందర్భంగా ఆ దేశాధ్యక్షుడు ప్రపంచ ప్రసిద్ధి చెందిన 24 మంది కవుల విగ్రహాలను ఆవిష్కరించారు. వారిలో మన గురుదేవ్ రవీంద్రనాథ్ ఠాగూర్ విగ్రహం కూడా ఉంది. ఇది మనకెంతో గర్వకారణం. అలాగే జూన్ నెలలో కరీబియన్ దేశాలైన సురినామ్, సెయింట్‌విన్సెంట్-గ్రెనడైన్స్ మన సంస్కృతీ వారసత్వాలను వేడుకగా జరిపాయి. జూన్ 5వ తేదీని ప్రవాసీదిన్, భారతీయులు అడుగుపెట్టిన రోజుగా జరుపుకొన్నారు. వర్షాకాలం ఆరంభాన్ని పురస్కరించుకుని కేరళలోని అట్టప్పాడిలో గిరిజన మహిళలు తయారుచేసే 'కర్తుంబి' గొడుగుల గురించి మోదీ ప్రస్తావించారు. చిన్న గ్రామంలో మొదలైన వీరి ప్రయాణం బహుళ జాతి కంపెనీలకు ఈ గొడుగులను సరఫరా చేసే స్థాయికి చేరిందన్నారు. 'వోకల్ ఫర్ లోకల్'కు ఇంత కంటే మంచి ఉదాహరణ ఏముంటుందన్నారు. ఆకాశవాణిలో సంస్కృత వార్తల బులెటిన్ 50 ఏళ్లు పూర్తిచేసుకోవడంపై ప్రధాని హర్షం వ్యక్తంచేశారు. భారతీయ శాస్త్ర విజ్ఞానాల పురోగతిలో ఈ ప్రాచీన భాష విశేష పాత్ర పోషించిందన్నారు.వచ్చే నెలలో జరిగే పారిస్ ఒలింపిక్స్‌లో పాలుపంచుకోనున్న భారతీయ అథ్లెట్లకు ప్రధాని శుభాకాంక్షలు తెలిపారు. వారిని యావద్దేశం ఉత్సాహపరచాలని పిలుపిచ్చారు. కాగా, మోదీ 'మన్ కీ బాత్'లో ప్రజల సమస్యలను ప్రస్తావించలేదని కాంగ్రెస్ ఆక్షేపించింది.

అరకు కాఫీకి ఫిదా!

న్యూఢిల్లీ/అమరావతి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): అరకు కాఫీ అద్భుతమని ప్రధాని మోదీ ప్రశంసించారు. సీఎం చంద్రబాబుతో కలిసి ఈ కాఫీ రుచి చూశానన్నారు. ఆదివారం 'మన్ కీ బాత్'లో అరకు కాఫీ గురించి ప్రస్తావించారు. గొప్ప రుచికి, సువాసనకు ఇది ప్రసిద్ధి చెందిందన్నారు. 'దేశంలోని స్థానిక ఉత్పత్తులకు గ్లోబల్ ప్రాశస్త్యం రావడం గర్వకారణం. అటువంటిదే అరకు కాఫీ. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఇది ఉత్పత్తి అవుతోంది. దాదాపు 1.5 లక్షల గిరిజన కుటుంబాలు దీని సాగుతో ముడిపడి ఉన్నాయి. అరకు కాఫీని కొత్త పుంతలు తొక్కించడంలో గిరిజన సహకార సంఘానిది కీలక పాత్ర. దీంతో రైతుల ఆదాయం బాగా పెరిగింది. ఒకసారి విశాఖలో ఏపీ సీఎం చంద్రబాబుతో కలిసి ఈ కాఫీని రుచి చూసే అవకాశం నాకు లభించింది. చాలా అద్భుతంగా ఉంది. అరకు కాఫీకి అనేక అంతర్జాతీయ పురస్కారాలు వచ్చాయి. ఢిల్లీలో జరిగిన జీ-20 సదస్సులోనూ దీని మాధుర్యాన్ని అతిథులు రుచి చూశారు. మీకూ అవకాశం దొరికినప్పుడల్లా అరకు కాఫీని ఆస్వాదించండి' అని మోదీ ప్రజలను కోరారు. తర్వాత సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా చంద్రబాబుతో కలిసి దిగిన ఫొటోలు, వీడియోలను షేర్ చేశారు.

ప్రేమ, భక్తితో పండిస్తారు: చంద్రబాబు

మోదీ పోస్టుపై చంద్రబాబు కూడా స్పందించారు. 'అరకు కాఫీని మన గిరిజన సోదరీమణులు ప్రేమ, భక్తితో పండిస్తారు. ఇది సుస్థిరత, గిరిజన సాధికారత, ఆవిష్కరణలకు ప్రతీకగా నిలుస్తుంది. ఇది ఏపీ ప్రజల అపరిమితమైన సామర్థ్యానికి ప్రతిబింబం. అరకు కాఫీకి సంబంధించిన విషయాన్ని షేర్ చేసినందుకు, మేడిన్ ఏపీ ఉత్పత్తిగా ఉన్న సదరు కాఫీకి ప్రచారం కల్పిస్తున్నందుకు ప్రధాని మోదీకి ధన్యవాదాలు. మీతో మరో కప్పు అరకు కాఫీ తాగుతూ ఆనందించడానికి ఎదురు చూస్తున్నాను' అని పేర్కొన్నారు.

బ్రిటన్ ఎన్నికల్లో హిందూ మ్యానిఫెస్టో!

» ఆ దేశంలో 10 లక్షల మందికిపైగా హిందువులు
» తన నేపథ్యాన్ని గుర్తు చేస్తూ సునాక్ ప్రయత్నం


ఆదివారం లండన్‌లోని స్వామినారాయణ్ మందిర్‌లో సునాక్ దంపతుల పూజలు


లండన్, జూన్ 30: ఎన్నడూ లేనివిధంగా బ్రిటన్ ఎన్నికల్లో హిందూ మ్యానిఫెస్టో ఈసారి ప్రధాన పాత్ర పోషిస్తోంది. ఆలయాల సంరక్షణకు, అకారణ విద్వేషానికి అడ్డుకట్ట వేసేందుకు ఎన్నికైన ప్రజాప్రతినిధులు చొరవ చూపాలంటూ స్థానిక హిందూ సంస్థలు నిర్దేశించిన అంశాలు ప్రస్తుతం కీలకంగా మారాయి. బ్రిటన్‌లో జూలై 4న గురువారం బ్రిటన్‌లో పోలింగ్ జరగనుంది. ఈ దేశంలో పది లక్షల మందిపైగానే హిందువులున్నారు. దీంతో ఇద్దరు ప్రధాన అభ్యర్థులు వారి ఓట్లే లక్ష్యంగా ప్రయత్నాలు ప్రచారం సాగించారు. ఆలయాల సందర్శనతో పాటు భారత్‌తో తమ అనుబంధాన్ని గుర్తుచేస్తున్నారు. ప్రస్తుత ప్రధాని, కన్జర్వేటివ్ పార్టీని మరోసారి గెలిపించే బాధ్యతను భుజాన వేసుకున్న రిషి సునాక్ భార్య అక్షతా మూర్తితో కలిసి ఆదివారం స్వామి నారాయణ్ ఆలయాన్ని సందర్శించారు. హిందూ విశ్వాసాలు, విలువలు, సంస్కృతి గొప్పదనాన్ని కొనియాడారు. లేబర్ పార్టీ నాయకుడు, సునాక్ ప్రధాన ప్రత్యర్థి కీర్ స్టార్మర్ భారత్‌తో వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందాన్ని పట్టాలెక్కిస్తానని ప్రకటించారు. ఈయన జై స్వామి నారాయణ్ అని నినదించారు. తమను గెలిపిస్తే సేవే లక్ష్యంగా ముందుకుసాగుతామని.. హిందూ ఫోబియాకు బ్రిటన్‌లో చోటు లేకుండా చేస్తానని వాగ్దానం చేశారు. కాగా, ఎన్నికలకు ముందు నిర్వహించిన అన్ని సర్వేల్లోనూ సునాక్ సారథ్యంలోని కన్జర్వేటివ్ పార్టీ వెనుకంజలో ఉన్నట్లు స్పష్టమైంది.ఈ నేపథ్యంలో ఎన్నికల్లో హిందువులతో పాటు భారతీయ మూలాలున్న ఓటర్లు ఎవరి వైపు మొగ్గుతారనేది కీలకంగా మారింది.

తాలిబాన్లకు భారత్ నిధులు

» కశ్మీరీ, ఖలిస్థానీ, పాక్ నేతలను చంపేందుకే
» సీఐఏ మాజీ అధికారి సారా ఆరోపణలు

న్యూఢిల్లీ, జూన్ 30: కశ్మీరీ, ఖలిస్థానీ, పాకిస్థాన్ వ్యాప్తంగా దేశ వ్యతిరేక నాయకులను చంపేందుకు అఫ్ఘానిస్థాన్ తాలిబాన్లకు భారత్ 10 మిలియన్ డాలర్ల (రూ.83.36 కోట్లు) నిధులు సమకూరుస్తోందంటూ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ (సీఐఏ-అమెరికా) మాజీ అధికారి సారా ఆడమ్స్ సంచలన ఆరోపణలు చేశారు. ఈ నిధులను తాలిబాన్లు తెహ్రీక్-ఈ-తాలిబాన్ పాకిస్థాన్ (టీటీపీ)కి చేరవేస్తూ హత్యలకు పథకాలు అమలు చేస్తున్నారన్నారు. అమెరికా మాజీ నేవీ సీల్ అధికారి, సీఐఏ కాంట్రాక్టర్ షాన్ ర్యాన్ నిర్వహించిన 'షాన్ ర్యాన్ షో'లో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. అలాగే పాక్‌కు చెందిన జమియత్ ఉలేమా-ఈ-ఇస్లాం (ఎఫ్) రాజకీయ పార్టీకి తాలిబాన్లు, అల్‌ఖైదా రెండింటితోనూ సంబంధాలున్నాయని.. వారు పాక్‌లోని ఫెడరల్లీ అడ్మినిస్టేడ్ ట్రైబల్ ఏరియాస్ (ఎఫ్ఏటీఏ) ను స్వాధీనం చేసుకునేందుకు కుట్రలు పన్నుతున్నారని వెల్లడించారు. ఆడమ్స్ వ్యాఖ్యలను ఎవరూ ధ్రువీకరించనప్పటికీ.. ఆమె నేపథ్యాన్ని బట్టి లేవనెత్తిన అంశాలపై విచారణకు దారితీసే అవకాశం లేకపోలేదు.

బైడెన్ స్థానంలో మిషెల్ ఒబామా?



వాషింగ్టన్, జూన్ 30: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమోక్రాటిక్ పార్టీ అభ్యర్థిగా జో బైడెన్ స్థానంలో మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా భార్య మిషెల్ ఒబామాను బరిలో నిలుపుతారనే ఊహాగానాలు వెలువడుతున్నాయి. గురువారం రాత్రి జరిగిన తొలి ప్రెసిడెన్షియల్ డిబేట్‌లో బైడెన్ పలుమార్లు తడబాటుగా మాట్లాడటంతో ఆ పార్టీలో ఆందోళన వ్యక్తమవుతోంది. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో జరిగిన డిబేట్‌లో బైడెన్ తేలిపోయారనే విమర్శలు వస్తున్నాయి. అధ్యక్ష ఎన్నికల్లో పార్టీ విజయావకాశాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని డెమోక్రాట్లు ఆందోళన చెందుతున్నారు. అధ్యక్ష రేసు నుంచి బైడెన్ తప్పుకోవాలనే డిమాండ్లు వస్తున్నాయి. అమెరికా అధ్యక్ష ఎన్నికలకు మూడు నెలలు ముందు ఆగస్టులో జరిగే డెమోక్రాటిక్ నేషనల్ కన్వెన్షన్‌లో ఆ పార్టీ అభ్యర్థిగా మిచెల్ ఒబామాను ప్రకటించే అవకాశాలున్నాయని డెమోక్రాట్లు అభిప్రాయపడుతున్నారు. 'తొలి డిబేట్‌లో బైడెన్ ఘోరంగా విఫలమయ్యారు. ఆయన తీరుతో దేశవ్యాప్తంగా డెమోక్రాట్లు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. డెమోక్రాటిక్ అభ్యర్థిగా బైడెన్‌ను తొలగించి మిచెల్ ఒబామాను బరిలో నిలపాలి. ఆగస్టులో జరిగే డెమోక్రాటిక్ నేషనల్ కన్వెన్షన్‌లో ఈ మార్పు జరుగుతుంది' అని యూఎస్ సెనెటర్ టెడ్ క్రజ్ పేర్కొన్నారు. డెమోక్రాటిక్ అభ్యర్థిగా బైడెన్ ఉండబోరని రిపబ్లికన్ పార్టీకి చెందిన సౌత్ కరోలినా మాజీ గవర్నర్ నిక్కీ హేలీ 'ఎక్స్'లో పోస్టు చేశారు. డిబేట్‌లో బైడెన్ మాట్లాడిన తీరు చూసినవారంతా షాకయ్యారని వివేక్ రామస్వామి అభిప్రాయపడ్డారు.

తప్పుడు ఆరోపణలు చేసిన భార్యపై కేసు పెట్టుకోవచ్చు

అనుమతి ఇచ్చిన కర్ణాటక హైకోర్టు

బెంగళూరు, జూన్ 30: తనపై తప్పుడు ఆరోపణలు చేసిన భార్యపై అవసరమైతే కేసు పెట్టుకోవచ్చని ఓ భర్తకు కర్ణాటక హైకోర్టు అనుమతి ఇచ్చింది. ఐపీసీలోని సెక్షన్ 211 ప్రకారం కేసు పెట్టవచ్చని తెలిపింది. భర్త తనను వేధిస్తున్నాడంటూ ఓ మహిళ 2022లో బసవనగుడి పోలీసు స్టేషన్‌లో కేసు పెట్టింది. ఈ కేసు హైకోర్టు జడ్జి జస్టిస్ నాగప్రసన్న ధర్మాసనం ముందుకు వచ్చింది. ఛార్జిషీటును, ఇతర వాంగ్మూలాలను పరిశీలించిన ఆమె ఈ కేసును కొట్టివేశారు. భార్యవి తప్పుడు ఆరోపణలని తెలిపారు. తప్పుడు ఆరోపణలు చేసినందున అవసరమైతే భర్త ఆమెపై కేసు పెట్టవచ్చన్నారు. మ్యాట్రిమోనీ వెబ్‌సైట్ ద్వారా పరిచయమైన ఆ జంట 2020 మే 29న వివాహం చేసుకుంది. హెచ్1బీ వీసా నవీకరణ కోసం 2 నెలలకే భర్త 2 అమెరికా వెళ్లిపోయాడు. కొన్ని కారణాల వల్ల మరుసటి ఏడాదే 2021లో విడాకుల కోసం అతడు దరఖాస్తు చేశాడు. కానీ, అతనిపై భార్య వేధింపుల కేసు పెట్టింది.

వీసీలు.. ఛీఛీలు

రాజకీయ విశ్వవిద్యాలయాలు.. వైసీపీ కార్యాలయాలుగా పలు వర్సిటీలు

విశ్వవిద్యాలయాలు.. విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దాల్సిన సమున్నత విద్యా కేంద్రాలు. కానీ, జగన్ హయాంలో ఇవి రాజకీయ శిబిరాలుగా, వైసీపీ కార్యాలయాలుగా మారిపోయాయి. జగన్ భజనకు, వైసీపీ వేడుకలకు వేదికలుగా రూపాంతరం చెందాయి. అప్పటి సర్కారుపై అలుపెరుగని పొగడ్తలు కుమ్మరించడంలో జగన్ భక్త ఉపకులపతులు ఆరితేరిపోయారు. ఎన్నికల ఫలితాలకు ముందు సంబరాలు చేసుకున్న వీసీలూ ఉన్నారు. సర్కారు మారడంతో తమ 'పాపాలకు' ప్రాయశ్చిత్తంగా స్వచ్ఛంద రాజీనామాల బాట పట్టారు. అయితే.. దీనిని కూటమి ప్రభుత్వానికి అంటగడుతూ.. ఒత్తిడి చేశారని పేర్కొంటూ.. జగన్ 'రోత పత్రిక' తప్పుడు రాతలు రాయడమే చిత్రం!!

- అత్యంత వివాదాస్పద వీసీగా ప్రసాదరెడ్డి
- సజ్జల అనుచరుడిగా ఏఎన్‌యూ వీసీ
- అర్హత లేకున్నా ఎస్వీయూకు శ్రీకాంత్‌రెడ్డి
- భారతి బంధువుకు రిజిస్ట్రార్ పోస్టు
- వైసీపీ హయాంలో పదవుల పందేరం
- జగన్‌కు వీరభక్తులుగా వైస్ చాన్స్‌లర్లు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రానికి, దేశానికి మేధావులను అందించాల్సిన యూనివర్సిటీలు.. జగన్ ఏలుబడిలో రాజకీయ పునరావాస కేంద్రాలుగా మారిపోయాయి. నిత్యం జగన్ భజన, వైఎస్ఆర్ స్మరణలతో మార్మోగాయి. యూనివర్సిటీలను ఉత్తమోత్తమంగా తీర్చిదిద్దాల్సిన ఉపకులపతులే.. పొలిటికల్ బాటపట్టి చేయరాని పాపాలు చేశారు. అప్పటి ముఖ్యమంత్రి జగన్ పుట్టినరోజులు, ఆయన మాతృమూర్తి విజయలక్ష్మి పుట్టినరోజులే కాదు... వైఎస్ వర్ధంతులకు కూడా యూనివర్సిటీలను వేదికలుగా మార్చారు. దీంతో విద్యార్థుల ఉన్నత విద్యను పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. ఇలా విశ్వవిద్యాలయాలు ఈ స్థాయిలో భ్రష్టుపట్టిపోవడాన్ని మేధావులు సైతం అప్పట్లో తీవ్రం విమర్శించారు. ఇక, పలు చోట్ల విద్యార్థి సంఘాలు అప్పట్లోనే వైస్ చాన్సెలర్ల(వీసీ)ల రాజీనామాలకు డిమాండ్ చేశాయి. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో గత అనుభవాల దృష్ట్యా వైస్ చాన్స్‌లర్లు స్వచ్ఛందంగా రాజీనామా లు చేస్తున్నారు. వారిని రాజీనామా చేయమని కానీ, యూనివర్సిటీలకు రావొద్దని కానీ.. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఎక్కడా చెప్పలేదు. ఎలాంటి ఆదేశాలూ ఇవ్వలేదు. అయితే.. చేసిన పాపాలకు ప్రాయిశ్చిత్తంగానే వారే తప్పుకొంటున్నారు. కానీ, దీనిని కూడా రాజకీయం చేస్తూ.. జగన్ 'రోత పత్రిక' కథనాలు వండి వారుస్తోంది. ప్రభుత్వ బెదిరింపులు, ఒత్తిడి కారణంగానే వీసీలు రాజీనామాలు చేస్తున్నారనే తప్పుడు ప్రచారం మొదలుపెట్టింది. అందులోనూ భారతి చిన్నాన్న కుమారుడు, ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ వీసీ సురేంద్రనాథ్‌రెడ్డి ఫొటో వేసుకుని మరీ 'బెదిరింపులు' అంటూ కథనాన్ని వండి వార్చింది.

అయితే, 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చినప్పుడు అప్పట్లో పలు విశ్వవిద్యాలయాల్లోని వీసీలను బలవంతంగా రాజీనామాలు చేయించిన విషయాన్ని మాత్రం దాచిపెట్టింది. తమ యజమాని ప్రభుత్వంలో అంతా సక్రమంగా జరిగాయని, బెదిరింపులు అనేవి ప్రస్తుత ప్రభుత్వంలోనే కొత్తగా కనిపిస్తున్నాయంటూ దుష్ప్రచారం ప్రారంభించింది.



ఎంతగా దిగజార్చారంటే..

జగన్ హయాంలో యూనివర్సిటీల విలువలు దారుణంగా దిగజారిపోయాయి. ముఖ్యంగా ప్రపంచ స్థాయి గుర్తింపు ఉన్న విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీని వీసీ పీవీజీడీ ప్రసాదరెడ్డి అన్ని రకాలుగా భ్రష్టు పట్టించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ వంటి వారు వీసీలుగా పనిచేసిన ఈ విశ్వవిద్యాలయాన్ని చరిత్రలో ఎన్నడూ లేనంతగా వివాదాల మయం చేశారు. సామాజిక నేపథ్యం దృష్ట్యా వైసీపీ ప్రభుత్వంలో ప్రసాదరెడ్డి వీసీ అయ్యారు. కొద్ది నెలల కిందట రెండో సారి కొనసాగింపు తెచ్చుకున్నారు. రాజకీయ భజన చేయడంలో ఈయన పీహెచ్‌డీ చేశారు. యూనివర్సిటీని పూర్తిస్థాయి వైసీపీ ఆఫీసుగా మార్చేశారు. జగన్, విజయలక్ష్మిల పుట్టిన రోజు వేడుకలు, వైఎస్ జయంతి నిర్వహణను తప్పనిసరి చేశారు. దీంతో విశాఖపట్నం కార్పొరేషన్ ఎన్నికల్లో వైసీపీ టికెట్లు ఇచ్చే స్థాయికి ఎదిగారు. ప్రసాదరెడ్డి చేసిన సర్వేలో అర్హుడని తేలిన వ్యక్తికే అప్పటి కార్పొరేషన్ ఎన్నికల్లో వైసీపీ టికెట్ ఇచ్చింది. చివరికి వర్సిటీలో ఉన్న చెట్లను నరికించి అమ్ముకునే స్థితికి యూనివర్సిటీని దిగజార్చారు. ఇంత స్వామి భక్తి ప్రదర్శించినందుకే ఆయనకు రెండోసారి అవకాశం లభించింది.



నిధులు 'ప్రసాదం'

జేఎన్‌టీయూ-కాకినాడ ఉపకులపతి ప్రసాదరాజుపై నిధుల దుర్వినియోగం ఆరోపణలు గుప్పుమన్నాయి. గ్లోబరీనా అనే సంస్థతో ఆటోమేషన్, ప్లేస్‌మెంట్ల కోసం పలు ఒప్పందాలు చేసుకున్నారు. రూ.34 కోట్ల ఒప్పందాల్లో రూ.19 కోట్లు చెల్లించారు. అయితే, దానివల్ల వర్సిటీకి ఎలాంటి ప్రయోజనం చేకూరలేదు. కానీ, ఆయనకు మాత్రం రూ.60 లక్షల ప్రసాదం అందిందన్న ఆరోపణ వచ్చాయి. దీనిపై అభియోగాలు కూడా నమోదు కాగా.. అప్పటి ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి ఆ నివేదికను తొక్కి పెట్టడం గమనార్హం.



సజ్జల భక్తుడు..

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ(ఏఎన్‌యూ) వీసీ రాజశేఖర్ కూడా రెండుసార్లు ఉపకులపతిగా అవకాశం దక్కించుకున్నారు. అప్పటి ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి మనిషిగా గుర్తింపు పొందిన ఈయన ఉన్నత విద్యామండలినే ధిక్కరించారు. అందుకే సజ్జల ఫొటో ఉన్న ఫ్లెక్సీని వర్సిటీలో శాశ్వతంగా ఏర్పాటుచేశారు. అలాగే వైఎస్ విగ్రహం కూడా పెట్టించారు. ఇక, జగన్, విజయలక్ష్మిల పుట్టినరోజులు నిర్వహించారు. వైసీపీకి అనుకూలంగా మాట్లాడే సినీ దర్శకుడు రాంగోపాల్‌వర్మను ఓ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. అయితే.. వర్మ సదరు కార్యక్రమంలో శృంగార సంబంధిత ప్రసంగం చేయడంతో అభాసుపాలయ్యారు. వీసీ కాకముందు రాజశేఖర్ రిజిస్ట్రార్‌గా అప్పటి వీసీ అనుమతి లేకుండా రూ.కోట్లు దారిమళ్లించారన్న ఆరోపణలున్నాయి. గుంటూరులో ఉండే వర్సిటీ ప్రశ్నాపత్రాలను విశాఖపట్నంలో రీవాల్యుయేషన్ చేయించారని, మలయాళం సబ్జెక్టు లేకపోయినా రీవాల్యుయేషన్ చేయించి బిల్లులు పెట్టడంతో ప్రభుత్వం విచారణకు కమిటీని నియమించింది. గత ప్రభుత్వంలో ఈ విచారణ పక్కదారి పట్టేలా ఆయన చక్రం తిప్పారనే ఆరోపణలొచ్చాయి. ఇక, తాజా ఎన్నికల ఫలితాలకు ముందు ఆయన వైసీపీ గెలుస్తుందంటూ వర్సిటీలోనే సంబరాలు చేసుకోవడం వివాదాలకు దారితీసింది.



అక్రమాల 'విక్రమ' వీసీ!

నెల్లూరు జిల్లాలోని విక్రమ సింహపురి యూనివర్సిటీ ఉపకులపతి సుందరవల్లిపై అనేక ఆరోపణలున్నాయి. అంతకుముందు ఎస్వీయూ రెక్టార్‌గా 120 కాలేజీలకు అడ్డగోలుగా అఫిలియేషన్లు ఇచ్చారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. అయినప్పటికీ ఆమెను విక్రమ సింహపురి వీసీగా నియమించారు. రాజకీయ సిఫారసులతో సుమారు 40 మందికి ఈమె వర్సిటీలో ఉద్యోగాలిచ్చారు. అనుమతులు పొందకుండా రూ.20 కోట్లు భవన నిర్మాణాల కోసం వినియోగించారనే ఆరోపణలు వచ్చాయి. ఎస్‌బీఐలో ఉన్న డిపాజిట్లు ప్రైవేటు బ్యాంక్‌కు మార్చడంలోనూ సుందరవల్లిపై విమర్శలు వెల్లువెత్తాయి.

నన్నయ వీసీ పద్మరాజు రాజీనామా

దివాన్‌చెరువు, జూన్ 30: రాజమహేంద్రవరం ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు ఆదివారం తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని గవర్నర్, ఉన్నత విద్యాశాఖ కార్యదర్శికి పంపారు. గత ప్రభుత్వ హయాంలో నియమితులైన రాష్ట్రంలోని వివిధ వర్సిటీల వీసీలు కొందరు ఇప్పటికే తమ పదవులకు రాజీనామాలు సమర్పించిన విషయం విదితమే. గత ఏడాది మే10వ తేదీన నన్నయ ఏజీ వీసీగా బాధ్యతలు చేపట్టిన పద్మరాజు దాదాపు 14 నెలలు పాటు ఆ బాధ్యతలు నిర్వర్తించారు.

పెద్దిరెడ్డి సిఫారసుతో..



అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సిఫారసుతో శ్రీకాంత్‌రెడ్డి కొద్ది నెలల కిందట శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ వీసీగా నియమితులయ్యారు. అయితే, ప్రొఫెసర్‌గా ఆయనకున్న సర్వీసు ఐదేళ్లు మాత్రమే. అసలు ఆయన ప్రొఫెసర్‌గా నియామకం పారదర్శకమేనా? అనేది ఇంకా పెండింగ్‌లో ఉంది. అయినా పెద్దిరెడ్డి ఆదేశాలతో ఆయన్ను హడావుడిగా వీసీని చేశారు. ఈ క్రమంలో ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి వాస్తవాలను దాచిపెట్టారు. పైగా.. వీసీగా పారదర్శకంగా ఉండేవారు మాత్రమే ఉండాలని నిబంధనలు చెబుతుంటే, ఆయనపై వ్యక్తిగతంగా పలు కేసులున్నా ఉపకులపతిని చేయడం గమనార్హం.

భార్యకు.. గురువుకు.. పందేరం!

ఆర్కిటెక్చర్ వర్సిటీ రిజిస్ట్రార్‌గా భారతి తమ్ముడు సురేంద్రనాథ్ రెడ్డి నియామకమే తప్పయితే.. ఇక, ఆయన తన హయాంలో ఓ పెద్ద సామ్రాజ్యాన్ని విస్తరించారు. వర్సిటీలో ఏకంగా 70 మంది కాంట్రాక్టు ఉద్యోగులను నియమించారు. వీరిలో ఆయన సతీమణి కూడా ఉన్నారు. గతంలో ఆమె జగన్ పత్రికలో పనిచేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో 9 యూనివర్సిటీల రిజిస్ట్రార్లు ఆయన సన్నిహితులు, గతంలో ఆయన పనిచేసిన యోగి వేమన వర్సిటీకి చెందినవారే. ప్రస్తుత వేమన వర్సిటీ వీసీ చింతా సుధాకర్, గతంలో సురేంద్రనాథ్‌రెడ్డికి పీహెచ్‌డీ గైడ్‌గా ఉన్నారు. ఆ కృతజ్ఞతతో ఆయన్ను వీసీని చేశారు. వీరితో పాటు పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వీసీ, ఆదికవి నన్నయ వర్సిటీ వీసీలపైనా అనేక ఆరోపణలున్నాయి. ఇప్పుడు వీరు స్వచ్ఛందంగా రాజీనామాలు చేస్తుంటే 'రోత పత్రిక' విష ప్రచారం చేస్తుండడం గమనార్హం.

భారతి తమ్ముడి.. 'ప్రత్యేకం'



కడప జిల్లాలోని వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ సురేంద్రనాథ్‌రెడ్డి. ఈయన జగన్ సతీమణి భారతికి స్వయానా చిన్నాన్న కుమారుడు. యోగి వేమన యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉన్న సురేంద్రనాథ్‌రెడ్డి.. జగన్ గద్దెనెక్కగానే ప్రత్యేకంగా నోటిఫికేషన్ ఇప్పించుకుని ఆర్కిటెక్చర్ వర్సిటీ రిజిస్ట్రార్ అయిపోయారు. మొదటి రోజు ప్రొఫెసర్‌గా నియామకమైన ఆయన రెండో రోజే రిజిస్ట్రార్ కుర్చీలో కూర్చున్నారు. ఆయన నియామకంపై వివాదం రేగడం, ఇది కోర్టు వరకు చేరడం తెలిసిందే. ప్రస్తుతం ఈ కేసు కోర్టు పరిధిలో ఉంది.

క్రీడలకు వైభవం!



- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ భరోసా
- సీఎం చంద్రబాబుతో చర్చిస్తానని హామీ
- ఇటీవల క్రీడల దుస్థితిని వివరించిన క్రీడాకారులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ క్రీడలపైనా దృష్టిసారిస్తున్నట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వం భ్రష్టుపట్టించిన క్రీడారంగాన్ని తిరిగి గాడిలో పెట్టి రాష్ట్రంలో క్రీడలకు మంచి వైభవాన్ని తీసుకొచ్చే దిశగా ఆలోచిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోని అన్ని రంగాలతో పాటు క్రీడారంగం కూడా అస్తవ్యస్తంగా మారింది. దారి తప్పిన వ్యవస్థలను దారిలో పెట్టడానికి సీఎం చంద్రబాబు, పవన్ కల్యాణ్ ధృడ సంకల్పంతో వడివడిగా అడుగులు వేస్తున్నారు. ఈ క్రమంలోనే పలువురు మేధావులు, ప్రముఖులు, వాణిజ్యవేత్తలు, క్రీడాకారులు ఇటీవల పవన్‌ను కలిశారు. వీరిలో ప్రముఖ క్రికెటర్ హనుమ విహారి కూడా ఉన్నారు. క్రీడా సంఘాలు బాగుపడితేనే అత్యుత్తమ క్రీడాకారులు రూపొందుతారని దీనికి సరైన మార్గదర్శనం అవసరమని వారంతా విన్నవించారు. క్రీడలతో సంబంధం లేని వారి చేతికి క్రీడా సంఘాలను అప్పగించవద్దని ఆవేదనతో విన్నవించారు. క్రికెట్‌లో అనుభవం ఉన్న వారికే క్రికెట్ సంఘం బాధ్యతలు అప్పగించాలని, అలాగే కబడ్డీ ఆటపై పట్టు ఉన్న వారికే కబడ్డీ సంఘాన్ని అప్పగించాలని, ఇదే పద్ధతి అన్ని సంఘాల్లో అమలు చేస్తే ఆంధ్రప్రదేశ్ క్రీడా రంగంలో అగ్రగామిగా నిలుస్తుందని సూచించారు. సంఘాల్లో జరుగుతున్న కొన్ని విషయాలను క్రీడాకారులు వివరించినప్పుడు పవన్ ఆవేదన చెందారు. కొన్ని క్రీడా సంఘాలు రాజకీయ ఉపాధి ఆవాస కేంద్రాలుగా మారిపోవడం వల్ల క్రీడాకారులకు ఇచ్చే సర్టిఫికెట్లు అంగడి సరుకుగా మారిపోయాయని తెలిపారు. దానివల్ల ఎటువంటి క్రీడానుభవం లేని వారు క్రీడాకారుల కోటాలో ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యా సంస్థల్లో సీట్లు పొందుతున్నారని వారంతా ఆవేదన వ్యక్తం చేశారు. క్రీడా సంఘాల్లో తిష్టవేసిన రాజకీయ నాయకులు క్రీడాకారుల ఎంపికలో తమ బంధువులు, సన్నిహితుల పిల్లలను వారి అధికార దర్పంతో ఎంపిక చేయిస్తున్నారనీ ఫలితంగా పోటీల్లో వారు నిలబడలేకపోతున్నారన్నారని తెలిపారు. క్రీడా సంఘాల నిధులు యథేచ్ఛగా దోపిడీకి గురవుతున్నాయనీ, క్రీడా సంఘాల్లో క్రీడానుభవం లేని రాజకీయ నాయకులకు ప్రవేశం లేకుండా చూడాలని కోరారు. సావధానంగా విన్న

పెండింగ్ బిల్లుల గుట్టు తేలేనా?

- సమగ్ర సమాచారం కోసం ఆర్థిక శాఖ ఆదేశం
- అన్ని శాఖలకు ప్రొఫార్మా పంపి వివరాల సేకరణ!

అమరావతి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం కాంట్రాక్టర్లకు, సప్లయర్లకు, వెండర్లకు బిల్లులు చెల్లించకుండా చుక్కలు చూపించింది. ఎంతో దూరం నుంచి వచ్చిన బిల్లు బాధితులను కనీసం కలవడానికి కూడా ఆర్థిక శాఖ అధికారులు ఇష్టపడలేదు. వారెవరినీ కార్యాలయానికి రానివ్వకుండా పోలీసు కాపలా కూడా పెట్టుకున్నారు. దీంతో పెండింగ్ బిల్లుల చెల్లింపులు కోరుతూ హైకోర్టులో 4 లక్షలకుపైగా పిటిషన్లు దాఖలయ్యాయి. ప్రతి ఆర్థిక సంవత్సరం చివరి రోజైన మార్చి 31న వేల కోట్ల బిల్లులను వ్యవస్థ నుంచి ఎలాంటి కారణాలూ లేకుండా రద్దు చేశారు. ఇవన్నీ కలిపి రూ.2 లక్షల కోట్ల వరకు ఉండొచ్చని అంచనా. ఇవి కాకుండా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రద్దు చేయకుండా కొనసాగించిన బిల్లులు మరో రూ.35,000 కోట్లు ఉంటాయి. కొత్త ప్రభుత్వం కీలక శాఖలకు సంబంధించిన శ్వేతపత్రాలు విడుదల చేయాలని నిర్ణయించింది. ఇందులో ఆర్థిక శాఖ కూడా ఉంది. తమ శాఖలో ఉన్న పెండింగ్ బిల్లుల వివరాలను సోమవారం(జూలై 1వ తేదీ)లోగా పంపాలని ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పీయూష్ కుమార్ అన్ని శాఖలకు, హెచ్‌వోడీలకు ఆదేశాలు జారీ చేశారు. ఈ పెండింగ్ బిల్లులను వర్క్స్, నాన్‌వర్క్స్‌ల విభాగాల్లో కలిపి మొత్తం 5 రకాలుగా విభజించారు. అవి..

1. సీఎఫ్‌ఎంఎస్‌లో బిల్లు జనరేట్ అయి నిధుల్లేక, బడ్జెట్ లేక క్లియరెన్స్ కోసం ఎందురుచూస్తున్న బిల్లులు, గత ఐదు సంవత్సరాలకు చెందినవై ఉండి మైగ్రేషన్‌లో ఉన్న బిల్లులు.
2. ఏదైనా ఒక పనికి సంబంధించి అది ఎంత వరకు పూర్తయిందన్న వివరాలు సీఎఫ్‌ఎంఎస్‌లోని మెజర్‌మెంట్ పుస్తకంలో నమోదైనప్పటికీ ఇంకా బిల్లు రూపంలోకి మారనివి.
3. ఏదైనా ఒక పని ఎంతవరకు పూర్తయిందన్న వివరాలు సమగ్రంగా ఉన్నప్పటికీ ఇంకా సీఎఫ్‌ఎంఎస్‌లో నమోదుకాని బిల్లులు.
4. నాన్ వర్క్స్‌ల విభాగంలో బిల్లులు జనరేట్ అయి బడ్జెట్ లేక, నిధుల్లేక, మైగ్రేషన్‌లో ఉన్న బిల్లులు.
5. సీఎఫ్‌ఎంఎస్‌లో ఎంటర్ చేయడానికి సిద్ధం చేస్తున్న బిల్లులు.

ఈ వివరాలు కోరుతూ అన్ని శాఖలకు ఒక ప్రొఫార్మాను ఆర్థిక శాఖ పంపింది. ఏ పని ఇంకా ఎంతమేర పెండింగ్‌లో ఉందన్న సమాచారం కూడా దీని ద్వారా తెలుస్తుంది.

మహిళలకు ఉచిత ప్రయాణం విశాఖ నుంచే

- సీమలో పదివేల ఎకరాలను దోచేసిన పెద్దిరెడ్డి కుటుంబం
- రవాణా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి



గోపాలపట్నం, జూన్ 30: 'రాష్ట్ర రవాణా సంస్థలో ప్రక్షాళనను ప్రారంభించాం. రానున్న ఐదేళ్లలో శతశాతం ఎలక్ట్రికల్ బస్సులు నడిపే దిశగా ముఖ్యమంత్రి ప్రణాళిక రూపొందిస్తున్నారు. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో ఉచిత బస్‌సర్వీసు పథకంపై ఇప్పటికే అధ్యయనం చేశాం. త్వరలో విశాఖ నుంచే మహిళలకు ఉచిత బస్సు సర్వీసులు ప్రారంభిస్తాం' అని రవాణా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం విశాఖ పర్యటనకు వచ్చిన ఆయన విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడారు. గత ఐదేళ్లలో రాష్ట్రాన్ని దోచుకున్న వారిలో జగన్ తర్వాతి స్థానం ఎంపీ మిథున్‌రెడ్డిదేనని మండిపడ్డారు. రెండు దశాబ్దాల క్రితం సామాన్య కుటుంబమైన పెద్దిరెడ్డికి వేల కోట్లు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. పెద్దిరెడ్డి కుటుంబీకులు జగన్‌కు బినామీలని ఆరోపించారు. వారు రాయలసీమలో పదివేల ఎకరాలను బినామీ పేర్లతో మింగేశారన్నారు. వైసీపీ నేతలపై కక్షసాధింపు చర్యలకు దిగుతున్నామని మిథున్‌రెడ్డి ఆరోపించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పెద్దిరెడ్డి కుటుంబం చేసిన ప్రతి అరాచకాన్నీ బయటపెడతామన్నారు.

రేపు తాడేపల్లికి మాజీ సీఎం జగన్

అమరావతి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత పులివెందుల్లో మూడు రోజులు, ఆ తర్వాత బెంగళూరు ప్యాలెస్‌లో మరికొన్ని రోజులు గడుపుతూ వచ్చిన మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి మంగళవారం తాడేపల్లి ప్యాలెస్‌కు రానున్నారు. తన రాకను గురించి పార్టీ ముఖ్యనేతలకు, సన్నిహితులకు సమాచారం అందించారు. దీంతో వారు జగన్‌కు గన్నవరం విమానాశ్రయంలో ఆహ్వానం పలికేందుకు సిద్ధమవుతున్నారు.

గత ప్రభుత్వంలో విధ్వంసం

- కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం
- బీసీ వర్గానికి వన్నె తెచ్చేలా పనిచేస్తా
- రాష్ట్ర కార్యాలయంలో గ్రీవెన్స్ కోసం టోల్‌ఫ్రీ నంబర్: పల్లా



అమరావతి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం విధ్వంసానికి పాల్పడితే చంద్రబాబు అభివృద్ధి, సంక్షేమంతో ముందుకు వెళ్తున్నారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం టీడీపీ ప్రధాన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సామాజిక సంక్షేమానికి టీడీపీ మారుపేరని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలు దిశగా సీఎం చంద్రబాబు చర్యలు చేపట్టారని తెలిపారు. సోమవారం మంగళగిరి నియోజకవర్గం పెనుమాక గ్రామంలో సీఎం చంద్రబాబు నేరుగా పింఛన్లు పంపిణీ చేయనున్నారని, అలాగే వారి వారి నియోజకవర్గాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు పింఛన్ల పంపిణీలో భాగస్వామ్యం కావాలని కోరారు. శవ రాజకీయాల కోసం ఎన్నికల సమయంలో అవ్వాతాతలను ఎండల్లో తిప్పి 34 మంది మరణాలకు జగన్ కారణమయ్యారని ధ్వజమెత్తారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా తనను నియమించినందుకు బీసీ వర్గానికి వన్నె తెచ్చేలా ముందుకు వెళ్తానన్నారు. చంద్రబాబునాయుడు నమ్మకాన్ని నిలబెడతానని తెలిపారు. కాగా, సీఎంను కలిసేందుకు ఎక్కువ మంది ప్రజలు టీడీపీ కేంద్ర కార్యాలయానికి జన సందోహం ఎక్కువైందని, వారికి ఇబ్బంది కలగకుండా టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. 7306299999కు కాల్ చేసి వారి సమస్యలు చెప్తే సీఎంను కలిసేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు. స్థానికంగా మంత్రులు, ఎమ్మెల్యేల వద్ద పరిష్కారం కాని సమస్యలు ఉన్నప్పుడే టీడీపీ కేంద్ర కార్యాలయానికి వస్తే బాగుంటుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గత ప్రభుత్వం టీడీపీ నేతలపై దురుద్దేశంతో పెట్టిన కేసులను కోర్టుల్లో మాఫీ అయ్యేలా కృషి చేస్తామన్నారు.

చిన్నారి హితేసి సాయం కోసం అభ్యర్థన

అరుదైన వ్యాధితో బాధపడుతున్న రాజమండ్రికి చెందిన తొమ్మిది నెలల చిన్నారి హితేసి తల్లిదండ్రులు ప్రీతమ్, గాయత్రి పల్లా శ్రీనివాసరావును కలిసి ప్రభుత్వ పరంగా సాయం అందించాలని కోరారు. పాప ట్రీట్‌మెంట్ కోసం రూ.16 కోట్ల విలువైన ఇంజక్షన్ అవసరమని, దాని కోసం క్రౌడ్ ఫండింగ్ చేస్తున్నట్లు.. ప్రజలు, ఎన్ఆర్ఐలు, బిజినెస్ హోల్డర్లు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి సాయం చేయాలని శ్రీనివాసరావు కోరారు. ప్రభుత్వం తరఫున, పార్టీ తరఫున కూడా సాయం చేస్తామని హామీ ఇచ్చారు.

4న ఢిల్లీకి వెళ్లనున్న చంద్రబాబు

- బడ్జెట్ ప్రతిపాదనలపై చర్చలు

అమరావతి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు జూలై 4వ తేదీన ఢిల్లీ వెళ్లనున్నారు. కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టబోతున్న నేపథ్యంలో రాష్ట్రానికి సంబంధించి బడ్జెట్ ప్రతిపాదనలపై కేంద్రంతో చర్చించే నిమిత్తం ఆయన వెళ్తున్నారని అధికార వర్గాలు తెలిపాయి. ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తదితరులతో చర్చలు జరపనున్నారు. ఆర్థికంగా ఒడిదొడుకుల్లో ఉన్న రాష్ట్రానికి నిధులు సాధించుకునే లక్ష్యంతో ఆయన వెళ్తున్నట్లు ఆ వర్గాలు తెలిపాయి. విభజన హామీల అమలుపైనా చర్చిస్తారు. కేంద్ర బడ్జెట్ ప్రతిపాదనలపై స్పష్టత వస్తే దాని ఆధారంగా రాష్ట్ర బడ్జెట్‌కు ఒక రూపం ఇవ్వవచ్చన్న అభిప్రాయంలో సీఎం ఉన్నట్లు తెలుస్తోంది. అవసరమైతే ఆయన మరో రోజు కూడా ఢిల్లీలో ఉండే అవకాశముంది.

అవ్వా తాతల చేతికి 7 వేలు

(మొదటి పేజీ తరువాయి)

రూ.6 వేలకు పెంచారు. తీవ్ర అనారోగ్యంతో ఉండే వారికి రూ.5 వేల నుంచి రూ.15 వేలకు పెంచారు. ఈ విభాగంలో పెన్షన్ పొందే వారు 24,318 మంది ఉన్నారు. పింఛన్ల పెంపువల్ల ప్రభుత్వంపై నెలకు రూ.819 కోట్లు అదనపు భారం పడనుంది. ఒక్క రోజులో రూ.4408 కోట్లు పంపిణీ చేయనున్నారు. గడచిన మూడు నెలలకు కలిపి పెంచిన మొత్తం ఇవ్వడం వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై రూ.1,650 కోట్లు అదనపు భారం పడనుంది. గత ప్రభుత్వంలో పింఛన్ల పంపిణీకి నెలకు రూ.1,939 కోట్లు ఖర్చయ్యేది. చంద్రబాబు ప్రభుత్వం ప్రతి ఏటా పింఛన్ల కోసం రూ.34 వేల కోట్లు ఖర్చు చేయనుంది.

పండుగ వాతావరణం

మూడు నెలల బకాయితో కలిపి ఒకేసారి రూ.7 వేలు పెన్షన్ ఇస్తుండటంతో అవ్వాతాతలు సంబరపడుతున్నారు. పెన్షన్ల పంపిణీని పండుగలా నిర్వహించేలా రాష్ట్ర వ్యాప్తంగా కూటమి ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర రాజకీయ నేతలు ఈ పండుగను నిర్వహిస్తున్నారు. సీఎంగా బాధ్యతలు చేపట్టగానే ఐదు హామీలపై మొదటి ఐదు సంతకాలు చేసిన చంద్రబాబు వాటి అమలుకు శ్రీకారం చుట్టారు. అధికారంలోకి వచ్చిన మొదటి నెల నుంచే పెన్షన్లు పంపిణీకి శ్రీకారం చుట్టారు. వైసీపీ ప్రభుత్వంలో ఎన్నికల సమయంలో సచివాలయ ఉద్యోగులకు పెన్షన్ల పంపిణీ బాధ్యత అప్పగించకుండా అకౌంట్లలో జమచేసి పెన్షన్‌దారులను ఇబ్బందులు పెట్టారు. 1.26 లక్షల మంది సచివాలయ ఉద్యోగులు ఉన్నప్పటికీ అప్పట్లో అధికారులు అంగీకరించలేదు. సచివాలయ ఉద్యోగుల ద్వారా పకడ్బందీగా పెన్షన్ల పంపిణీ చేపట్టవచ్చని నిరూపించేందుకు కూటమి సర్కార్ చర్యలు ప్రారంభించింది.

రూ.75తో ప్రారంభం


ఒకప్పుడు రూ.75తో ప్రారంభమైన సామాజిక పెన్షన్ ఇప్పుడు ఏకంగా రూ.4 వేలకు పెరిగింది. పెన్షన్ పెంపుపై ప్రతిసారీ టీడీపీ ప్రభుత్వమే చొరవ తీసుకుంది. మొదట్లో ఎన్టీఆర్ రూ.75తో పెన్షన్ ప్రారంభించారు. తర్వాత వైఎస్ హయాంలో రూ.200 చేశారు. 2014లో చంద్రబాబు ఐదు రెట్లు అంటే రూ.1000కు పెంచారు. 2019 ఎన్నికలకు ఆర్నెల్ల ముందు పెన్షన్ మొత్తాన్ని రూ.2 వేలకు పెంచారు. వైసీపీ సర్కార్ వచ్చాక ఐదేళ్లలో విడతల వారీగా రూ.3 వేలు చేసింది. టీడీపీ కూటమి ఇచ్చిన హామీ మేరకు ఇప్పుడు ఏకంగా రూ.4 వేలు లభిస్తోంది.

నేడు పెనుమాకకు చంద్రబాబు

తాడేపల్లి, జూన్ 30: గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం పెనుమాక గ్రామంలో సోమవారం ఉదయం 6 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు పెన్షన్లు పంపిణీ చేయనున్నారు. పెనుమాకలోని సుగాలికాలనీకి చెందిన బాణావత్ పాములు నాయక్ కుటుంబం చంద్రబాబు నుంచి తొలి పింఛన్ అందుకోనుంది. పాములు నాయక్‌కు వృద్ధాప్య పింఛన్, ఆయన కుమార్తె ఇస్లావత్ శివకుమారికి వితంతు పింఛన్‌ను వారి ఇంటి వద్ద చంద్రబాబు స్వయంగా అందజేయనున్నారు. పింఛన్ల పంపిణీ అనంతరం సీఎం చంద్రబాబు రచ్చబండ కార్యక్రమం నిర్వహిస్తారు. ఆయన పర్యటన నేపథ్యంలో పెనుమాక గ్రామం ముస్తాబవుతోంది. ఆదివారం జోరువాన పడినా అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ రాజకుమారి, కమిషనర్ నిర్మల్‌కుమార్ తదితరులు ఏర్పాట్లను పరిశీలించారు.

65 లక్షల మందికి రూ.4,408 కోట్ల పింఛను

తిరుమల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 65 లక్షల మందికి సోమవారం రూ.4,408 కోట్ల పింఛను మొత్తం పంపిణీ చేయనున్నట్టు మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. తిరుమల శ్రీవారిని ఆదివారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. దివ్యాంగులకు రూ.5 వేల నుంచి రూ.15 వేలకు పెంచామన్నారు. సచివాలయ సిబ్బంది, ప్రభుత్వ ఉద్యోగులను వినియోగించుకుని పింఛను అందజేస్తామన్నారు. ఆర్థిక ఇబ్బందులున్నా ఇచ్చిన హామీ మేరకు ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి పెంచిన వెయ్యితో కలిపి పింఛన్ మొత్తాన్ని కలిపి ఇవ్వబోతున్నట్టు చెప్పారు. వలంటీర్ల విషయంలో ప్రభుత్వం త్వరలో ఓ నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు.



తిరుమల ఆలయం వెలుపల మంత్రి కొలుసు పార్థసారథి

డబ్బు సంచులు.. రయ్‌రయ్!

జగనన్న పాలనలో మరో చీకటి కోణం బయటపడింది. గన్నవరం విమానాశ్రయం నుంచి డబ్బు సంచులు కుప్పలుతెప్పలుగా విమానాల్లో ఎక్కడెక్కడికో తరలిపోయిన వైనం వెలుగుచూసింది. ఒక రోజు కాదు.. నెల కాదు.. కనీసం ఏడాది కూడా కాదు.. ఏకంగా ఐదేళ్లపాటు ఎలాంటి తనిఖీలు లేకుండా చార్టర్డ్ విమానాల ద్వారా దర్జాగా ఈ వ్యవహారం నడిచింది.

- గన్నవరం విమానాశ్రయం నుంచి దర్జాగా అక్రమ రవాణా
- చార్టర్డ్ విమానాల్లో భారీగా నగదు తరలింపు
- జగన్ హయాంలో ఐదేళ్ల పాటు ఇదే తంతు
- నిబంధనలను తుంగలో తొక్కి రాకపోకలు
- వారంలో 3-4 సార్లు షార్ట్ కట్ పేర్లతో 'చార్టర్డ్' బుకింగ్స్
- ఎలాంటి తనిఖీలు లేకుండానే ముఖ్య నేత కార్లు రన్‌వే పైకి
- భారీ బ్యాగుల్లో ఏముందో చూడకుండానే లోడింగ్
- ఎయిర్‌పోర్టు డైరెక్టర్, పోలీసు అధికారి సహకారం

(విజయవాడ-ఆంధ్రజ్యోతి)

జగన్ ప్రభుత్వ చీకటి వ్యవహారాలకు విజయవాడ (గన్నవరం) విమానాశ్రయం స్థావరంగా మారిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఢిల్లీలో ఆయన వ్యవహారాలను పర్యవేక్షించే వైసీపీ ముఖ్య నేత ద్వారా ఈ ఎయిర్‌పోర్టు నుంచి పెద్ద ఎత్తున నగదు సంచులు తరలిపోయినట్లు గుప్పుమంది. చార్టర్డ్ విమానాల ద్వారా ఢిల్లీ, హైదరాబాద్, బెంగళూరుకు భారీ ఎత్తున నగదు బ్యాగులు తరలించారని సమాచారం. సీఐఎస్ఎఫ్ భద్రతను కాదని.. రాష్ట్ర పోలీసులను నియోగించిన ప్రభుత్వ పెద్దలకు విమానాశ్రయ డైరెక్టర్, విమానాశ్రయంలో భద్రతను పర్యవేక్షించిన పోలీసు అధికారి ఇద్దరూ సహకరించారన్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. చార్టర్డ్ విమానాల రాకపోకలను అడ్డగోలుగా, నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించడం ద్వారా వీరిద్దరూ స్వామిభక్తి చూపించారని తెలుస్తోంది. విమానాశ్రయంలో బ్యాగేజీ వ్యవహారాలను చూసే ఏజెన్సీని మార్చడం, పథకం ప్రకారం భద్రతను రాష్ట్ర పోలీసులకు అప్పగించడం.. ఏరికోరి భద్రతా వ్యవహారాలను పర్యవేక్షించే అధికారిని నియమించుకోవడం జరిగాయని తెలుస్తోంది. దేశంలోని ప్రతి విమానాశ్రయంలో సీఐఎస్ఎఫ్ బలగాల భద్రత ఉంటుంది. అయితే జగన్ సీఎం అయ్యాక రాష్ట్ర పోలీసులకే ఆ బాధ్యత అప్పగించారు. అంతే.. తనిఖీలు, సోదాలు లేకుండానే డబ్బు సంచుల్లో విమానాల్లో లోడయ్యాయి. ఎక్కడెక్కడికో తరలిపోయాయి.

ఢిల్లీబాస్ కనుసన్నల్లో భారీ బ్యాగులతో..

చార్టర్డ్ విమానాల నిర్వహణను నాటి ఎయిర్‌పోర్టు అధికారులు అత్యంత రహస్యంగా ఉంచారు. ఎన్ని చార్టర్డ్ ఫ్లైట్స్ నడిపారు? అవి ఎక్కడెక్కడకు నడిచాయి.. ఎవరి పేరుతో బుక్ చేశారు.. వంటి వివరాలను సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కింద అడిగినా ఇవ్వలేదు. వైసీపీ ముఖ్య నేతల్లో ఒకరైన ఢిల్లీబాస్ తన పేరుతో షార్ట్ కట్ పదాలతో వీటిని బుక్ చేసుకునేవారని, వారంలో మూడు రోజుల్లో పెద్దపెద్ద బ్యాగులతో ప్రయాణించేవారని సమాచారం. చార్టర్డ్ విమానాన్ని విజయవాడ నుంచి బుక్ చేసుకుంటే, ఇక్కడే చెకింగ్ ఉంటుంది. ఆ విమానం దిగిన చోట ఎలాంటి తనిఖీలూ ఉండవు. విజయవాడ విమానాశ్రయంలో తనిఖీలే జరిగేవి కావు. పైగా ఆ ముఖ్యనేత కారు నేరుగా రన్‌వేపైకి వెళ్లేది. రన్‌వే వద్ద రాష్ట్ర ప్రభుత్వం నియమించుకున్న స్థానిక పోలీసు అధికారి ఉండేవారు. వచ్చిన బ్యాగేజీలను సోదా చేయకుండానే ఆయన విమానాల్లో లోడింగ్‌కు పంపించేవారన్న విమర్శలు ఉన్నాయి. రాష్ట్రపతి, ప్రధాని, సీఎంలకు మాత్రమే నేరుగా రన్‌వేపైకి వాహనాన్ని తీసుకెళ్లే అవకాశం ఉంటుంది. కానీ ఇక్కడ వైసీపీ ముఖ్య నాయకుడి కారును పంపించేవారు. ఎయిర్‌పోర్టులో ఎస్పీఎఫ్ భద్రతా విభాగం ఉన్నా కూడా అప్పటి ప్రభుత్వ ఒత్తిడితో వారు పెద్దగా పట్టించుకునేవారు కాదు. నాటి సీఎం జగన్ కుటుంబానికి ఇష్టుడైన ఓ స్థానిక పోలీసు అధికారి అన్నీ తానై వ్యవహారాలు నడిపేవారు. జగన్ కుటుంబ సభ్యుడి నుంచి ఆయన రూ.25 లక్షల విలువ చేసే రోలెక్స్ వాచీని బహుమతిగా అందుకున్నారనే ఆరోపణలున్నాయి.

అన్నీ తానైన ఎయిర్‌పోర్టు డైరెక్టర్

ఆంధ్రప్రదేశ్ ఎయిర్‌పోర్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఏడీసీఎల్) చైర్మన్‌గా ఉన్న నాటి వైసీపీ అనుంగు నేతకు చెందిన సంస్థనే ఎయిర్‌పోర్టులో బ్యాగేజీ ఏజెన్సీగా నియమించినట్లు తెలుస్తోంది. దీనికి ఎయిర్‌పోర్టు డైరెక్టర్ సహకరించినట్లు సమాచారం. బ్యాగేజీని కచ్చితంగా పరిశీలించడం ఈ ఏజెన్సీ పని. అందులో ఏమున్నా వివరాలు నమోదు చేసుకోవాలి. ఏజెన్సీ తమదే కావడంతో ఇవేమీ రికార్డు చేయించలేదని తెలుస్తోంది. ఇలా ఐదేళ్లపాటు చార్టర్డ్ విమానాల ద్వారా పెద్దఎత్తున నగదు బ్యాగులను తరలించినట్లు సమాచారం. సదరు డైరెక్టర్ జగన్ ప్రభుత్వంలో పనిచేసిన ఓ మంత్రి సిఫారసుతో.. కేంద్ర మంత్రితో చెప్పించుకుని ఈ పోస్టు పొందినట్లు తెలుస్తోంది. విమానాశ్రయంలో ప్రజాప్రతినిధులకు సంబంధించి ప్రొటోకాల్ వ్యవహారాలను కూడా చూసేవారు కాదని.. ప్రభుత్వ పెద్దలు తనకు తెలుసన్న భావంతో ఇతర అధికారులను లెక్కచేసేవారు కాదని.. ముఖ్యంగా ఎయిర్‌పోర్టు అడ్వైజరీ బోర్డు సూచనలను సైతం ఖాతరు చేసేవారు కాదని, కనీసం వారిని సమావేశాలకు కూడా పిలిచేవారు కాదని.. ప్రభుత్వం మారినా ఇప్పటికీ ఆయనలో మార్పు లేదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో విజయవాడ విమానాశ్రయం వేదికగా జరిగిన చీకటి వ్యవహారాలపై టీడీపీ కూటమి ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలన్న డిమాండ్లు వస్తున్నాయి.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

వర్షం.. హర్షం.. కష్టం..!





రెండు రోజులుగా ఎడతెరిపి లేని చిరుజల్లులు కొందరికి ఆహ్లాదాన్ని పంచుతుండగా, మరికొందరికి చికాకు పుట్టిస్తోంది. ఎండాకాలంలో ఉక్కపోతకు గురైన ప్రజలు ఈ చిరుజల్లులను ఆస్వాదిస్తుండగా, ఉదయాన్నే ఉద్యోగాలకు వెళ్లేవారు, పాఠశాల, కళాశాలకు వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వాహనదారుల ఇబ్బందులు చెప్పనలవి కాదు. రోడ్లన్నీ వర్షపునీటితో నిండిపోవడం, ఎక్కడ గుంత ఉందో ఎక్కడ లేదో తెలియక నానా ఇక్కట్లు పడుతున్నారు. మరికొన్ని రోజులు ఇదే పరిస్థితి నెలకొనే అవకాశాలు ఉన్నట్లు వాతావరణ శాఖ నుంచి వార్తలు వస్తున్నాయి.



దర్శకుడు బాలరాజశేఖర్‌ను సత్కరిస్తున్న డాక్టర్ ఇండ్ల, జంధ్యాల

సినీ దర్శకుడు బాలరాజశేఖర్‌కు సత్కారం

విజయవాడ కల్చరల్, జూన్ 30: సినీ దర్శకత్వం, నటనా శిక్షణలో ఉపాధ్యాయుడిగా ప్రతిభకు, కొత్తదనానికి చిరునామాగా నిలిచి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు పొందిన బాలరాజశేఖర్ అభినందనీయుడని మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. కామ్రేడ్ జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి, ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా, ది ఫిలిం సొసైటీ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ బిల్డింగ్‌లో హనీమూన్ ఎక్స్‌ప్రెస్ సినీ దర్శకుడు బాలరాజ శేఖర్‌కు ఆత్మీయ సత్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ ఈ మధ్య విడుదలై మంచి విజయం సాధించిన 'హనీమూన్ ఎక్స్‌ప్రెస్‌ను చక్కగా తెరకెక్కించి విజయం సాధించిన బాల మన నగరానికి చెందిన వ్యక్తి కావడం గర్వించదగిన విషయమన్నారు. కామ్రేడ్ జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి అధ్యక్షులు గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ దర్శకుడు బాల రాజశేఖర్ తెలుగు సినిమా రంగంలో పనిచేయక ముందు థియేటర్ ఆర్ట్స్‌లో ఎంఏ పూర్తిచేసి అమెరికాలో స్క్రీన్ రైటింగ్‌లో థియేటర్ అండ్ సినిమాలో ఎంఎఫ్ఏ చేశారన్నారు. ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా డాక్టర్ టీఎస్ రెడ్డి, నటుడు, దర్శకుడు, రచయిత ఎమ్మెస్ చౌదరి, మాజీ మేయర్ డాక్టర్ జంధ్యాల శంకర్ పాల్గొని దర్శకుడు బాలరాజశేఖర్‌ను ఘనంగా సత్కరించి అభినందించారు.



రజనీని సత్కరిస్తున్న ఆర్యవైశ్య ప్రముఖులు

ఆర్యవైశ్య మహాసభ కృషి ప్రశంసనీయం

● మాజీ ఎంపీ టీజీ వెంకటేష్

పటమట, జూన్ 30: ఆర్యవైశ్యుల సంక్షేమానికి ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ చేస్తున్న కృషి ప్రశంసనీయమని మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ పేర్కొన్నారు. నగరంలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో ఆదివారం ఏపీ ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన టీజీ వెంకటేష్ నూతనంగా నియమితులైన రాష్ట్ర అధ్యక్షురాలు కొప్పురావూరి రజనీతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం టీజీ వెంకటేష్ మాట్లాడుతూ సేవకు మారుపేరు ఆర్యవైశ్యులన్నారు. ఆర్యవైశ్యులపై జరుగుతున్న దాడులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఆర్యవైశ్యులంతా ఐకమత్యంతో ఉండాలని ఆయన సూచించారు. విశిష్ట అతిథి ఎమ్మెల్యే బొండా ఉమా మాట్లాడుతూ టీడీపీ ఆర్యవైశ్యులకు అండగా ఉంటారని హామీ ఇచ్చారు. ఏపీ ఆర్యవైశ్య మహాసభ గౌరవాధ్యక్షుడు పెనుగొండ సుబ్బారాయుడు, నగరాధ్యక్షుడు గడ్డం సత్యనారాయణ, దర్శివాసు, తుమ్మలపెంట శ్రీనివాస్, గొంట్ల రామమోహన్‌రావు, మారం రోజారాణి, ఆరవేటి నిర్మల, శైలజారాణి పాల్గొన్నారు.



ప్రమాణస్వీకారోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యార్లగడ్డ

సమాజాభివృద్ధిలో ఆర్యవైశ్యుల పాత్ర శ్లాఘనీయం

● ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

కృష్ణలంక, జూన్ 30: సమాజాభివృద్ధిలో ఆర్యవైశ్యుల పాత్ర శ్లాఘనీయమని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. రూరల్ మండలం ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం కృష్ణలంకలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం రాత్రి జరిగింది. కమిటీ నూతన అధ్యక్షుడిగా పాల్వాది వెంకట హనుమంతరావు, కార్యదర్శిగా మద్దాలి వెంకట సత్య శ్రీనివాసకుమార్, కోశాధికారిగా చీదెళ్ల వెంకట నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ టీడీపీ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి రావడంలో ఆర్యవైశ్యుల పాత్ర కీలకమన్నారు. రూరల్ మండలంలో కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయించేలా కృషి చేస్తానన్నారు. ఆర్యవైశ్య సంఘం నేత కంచర్ల ముత్తుప్రసాద్ సభా నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏపీ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ, టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు డూండీ రాకేష్, జిల్లా ప్రథమ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బొగ్గవరపు వెంకట రాజారావు, ఆర్యవైశ్య సంఘం నేతలు గొంట్ల రామ్మోహన్‌రావు, దర్శి వాసు పాల్గొన్నారు.



అధ్వానంగా కేజీపై రోడ్డు

రహదారిపై గోతులు.. ఆర్టీసీ సేవలకు బ్రేక్‌లు

జి.కొండూరు, జూన్ 30: కందులపాడు - గంగినేనిపాలెం - ఎర్రుపాలెం (కేజీపై) రోడ్డులో గడ్డమణుగు నుంచి చెర్వుమాధవరం గ్రామం చివరి వరకు కేవలం రెండు కిలో మీటర్ల దూరం మాత్రమే ఉంటుంది. కానీ ఈ మధ్యలో సుమారు 50కి పైగా గోతులుంటాయి. బస్సులు, లారీలు ఇరుక్కుపోతున్నా అధికారులకు, పాలకులకు పట్టడంలేదు. మొన్నటి వరకు ప్రజలు ఇబ్బందులు పడతారని ఆర్టీసీ బస్సులను నడుపుతూ వచ్చారు. డ్రైవర్లు బస్సులు గోతుల్లో ఇరుక్కుపోతున్నాయని, నడపడం తమ వల్లకాదని చేతులేశారు. ఈ రూట్‌లో కాకుండా జి.కొండూరు - మునగపాడు బైపాస్ మీదుగా గంగినేనిపాలెం వైపు వెళ్లిపోతున్నారు. దీంతో గడ్డమణుగు, చెర్వుమాధవరం గ్రామస్థులకు బస్సు సేవలు నిలిచిపోయాయి. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులకు బస్సులు తిరగకపో వడంతో ఆటోలే దిక్కవుతున్నాయి. ఆటోలకు అధిక ధరలు చెల్లించినా సమయానికి అవి తిరగకపోడంతో విద్యార్థులు దూర ప్రాంతంలో ఉండే హైస్కూల్స్‌కు, కళాశాలలకు సమయానికి చేరుకోలేకపోతున్నారు. ఈరెండు గ్రామాల్లో పేద పిల్లలు పాఠశాలలకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు పాసులను, కొందరు ఉచిత పాస్‌లను వినియోగించుకుంటారు. మరో పక్క ఆటోల్లో, మోటార్ బైక్‌లపై ప్రయాణించే వారు, వా హన చోదకులు సైతం ఈగుంతలతో అవస్థలు పడుతున్నారు. ఎప్పుడు ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి తక్షణం ఈ రహదారికి మరమ్మతులు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. వర్షా లు పడుతుండటంతో గోతుల్లో నీరు నిలిచి ఉంటున్నాయి. వాహనచోదకులు గోతుల లోతు తెలియక ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రాణ న ష్టం జరగక ముందే అధికారులు, పాలకులు ఈ రహదారి విషయంలో చర్యలు తీసుకోవాలని వాహన చోదకులు కోరుతున్నారు.

రాష్ట్ర పురోభివృద్ధికి పునరంకితమవుదాం

● ఏపీ ఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు శివారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న శివారెడ్డి

వన్‌టౌన్, జూన్ 30: రాష్ట్రం అగ్రగామిగా నిలవాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనా విధానాలను ఆచరణలో పెట్టేందుకు ఉద్యోగులంతా పునరంకితం కావాలని ఏపీ ఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం గాంధీనగర్‌లోని ఎన్‌జీవో హోమ్‌లో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2014-19 మధ్య ఉద్యోగులకు లభించిన ప్రాధాన్యత, 2019-24 మధ్య అనుభవించిన మానసిక వేదన గుర్తుంచుకోవాలన్నారు. ఈ కాలంలో రాష్ట్రం ఎన్నో రకాలుగా నష్టపోయిన విషయాన్ని ప్రజలతో పాటు ప్రభుత్వ ఉద్యోగులందరూ గుర్తుంచుకోవాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడేందుకు ఎంతో శ్రద్ధతో పనిచేస్తారనే విషయం గతంలో రుజువైందన్నారు. రానున్న రోజుల్లోనూ ఉద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందనే నమ్మకం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరిలో ఉందన్నారు. ఏపీ ఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు ఏ విద్యాసాగర్ మాట్లాడుతూ సంఘంలో ప్రభుత్వంలోని అన్ని విభాగాల ఉద్యోగులున్నారని, ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి సమాంతరంగా చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చేపడుతున్న ప్రతి పనిని చిత్తశుద్ధితో, నిబద్ధతతో చేయడం ద్వారా ఉద్యోగులకు ఒక చరిత్రాత్మక గుర్తింపు లభిస్తుందన్నారు. కాగా జిల్లా కార్యవర్గ సమావేశంలో ఎన్నికల పర్యవేక్షణాధికారి ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి కే జగదీశ్వరరావు పర్యవేక్షణలో కో-ఆప్షన్ పద్ధతిలో జరిగిన ఎన్నికల్లో కార్యదర్శిగా బి.సత్యనారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎం.నాగార్జునను జిల్లా కార్యవర్గం సభ్యులు ఎన్నుకున్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు పి.రమేష్, బి.సతీష్ కుమార్, ఎం.రాజబాబు, మహిళా విభాగం ప్రతినిధి కే.శివలీల, నగర కార్యవర్గం సభ్యులు సీవీ ఆర్ ప్రసాద్, నజురుద్దీన్, రాజశేఖర్, వేమూరి ప్రసాద్ పాల్గొన్నారు. ఏకగ్రీవంగా ఎన్నికైన జిల్లా కార్యదర్శి, ఉపాధ్యక్షులను ఉద్యోగులు అభినందించారు.



జాతీయ పురస్కారాన్ని స్వీకరిస్తున్న జిల్లా మాజీ కలెక్టర్ ఢిల్లీరావు

మాజీ కలెక్టర్ ఢిల్లీరావుకు జాతీయ పురస్కారం

ఆంధ్రజ్యోతి, విజయవాడ: బాలల హక్కుల పరిరక్షణ కోసం కృషిచేసిన జిల్లా మాజీ కలెక్టర్ ఢిల్లీరావు జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. ఆదివారం ఢిల్లీలో నిర్వహించిన పురస్కారం ప్రదానంలో జిల్లా తరపున ఆయన ఈ అవార్డును స్వీకరించారు. వాస్తవానికి ఈ అవార్డు ఢిల్లీరావుకే వరించింది. అవార్డును ప్రకటించిన రోజే ఢిల్లీరావు కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. జిల్లా తరపున ఆయన ఈ అవార్డు తీసుకోవాలని ప్రస్తుత కలెక్టర్ సృజన పట్టుబట్టడంతో ఢిల్లీరావు ఈ అవార్డును స్వీకరించారు. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జాతీయ బాలలహక్కుల పరిరక్షణ కమిషన్ (ఎన్‌సీపీసీఆర్), నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాను అడ్డుకోవటంలో ఢిల్లీరావు జిల్లాలో అత్యుత్తమ పనితీరు కనబరిచారు. బాలలు చెడు అలవాట్లవైపు మళ్లకుండా వినూత్న కార్యక్రమాలను జిల్లాలో అమలు పరిచారు. పోలీసు, ఐసీడీఎస్ వంటి శాఖలతో పాటు చైల్డ్ లైన్, ఫోరం ఫర్ చైల్డ్‌రైట్స్, నవజీవన్ బాలభవన్, సంయుక్త ఫౌండేషన్ వంటి స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థల సమష్టికృషితో అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపారు. జాతీయ గుర్తింపు సాధించడంలో సహాయ, సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికీ ఢిల్లీరావు ధన్యవాదాలు తెలిపారు.

గోదానంతో పుణ్యగతుల ప్రాప్తి

● ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

● టీటీడీకి దానంగా గోవు, దూడ అందజేసిన మండవ

ఉంగుటూరు, జూన్ 30: దానాల్లోకెల్లా గోదానం ఎంతో విశిష్టమైనదని, తద్వారా పుణ్యగతులు ప్రాప్తిస్తాయని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. గన్నవరం ప్రముఖులు మండవ వెంకట ప్రభాకరరావు తిరుమల తిరుపతి దేవస్థానానికి గోదానం చేసిన సందర్భంగా ఆదివారం స్థానిక శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన పూజలకు ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, గద్దె రామ్మోహన్, ఆయన సతీమణి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ ప్రత్యేక అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ దేశవాళీ ఆవుల్లో శ్రేష్ఠమైన కపిలవర్ణం గల గోవుపాలను నిత్యం శ్రీవారి అభిషేకాలు, కైంకర్యాల్లో వినియోగిస్తారని, ఎలాంటి మచ్చలేని స్వచ్ఛమైన కపిలగోవు, దూడలను ఎస్వీ గోసంరక్షణ శాలకు దానమిచ్చిన రైతు ప్రభాకరరావు ధన్యజీవి అని ప్రశంసించారు. ఎమ్మెల్యే గద్దె మాట్లాడుతూ హైందవ ధర్మంలో గోదానానికి ఎంతో ప్రాశస్త్యముందన్నారు. టీడీపీ గన్నవరం మండలాధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు, బీజేపీ రాష్ట్ర నేత చిగురుపాటి కుమారస్వామి, రంగబాబు, నాని, ప్రధాన అర్చకుడు మారుతి పాల్గొన్నారు

జాస్తి శ్రీధర్‌ను పరామర్శించిన యార్లగడ్డ

అనారోగ్యంతో బాధపడుతున్న గన్నవరం టీడీపీ పట్టణాధ్యక్షుడు జాస్తి శ్రీధర్‌ను ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆయన స్వగృహంలో పరామర్శించారు. జాస్తి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. యార్లగడ్డ వెంట జాస్తి వెంకటేశ్వరరావు, మద్దినేని వెంకటేశ్వరరావు ఉన్నారు.



గోపూజలో పాల్గొన్న ఎమ్మెల్యేలు యార్లగడ్డ, రామ్మోహన్, జడ్పీ మాజీ చైర్ పర్సన్ అనూరాధ

ఐదిళ్లు ఇస్తేనే ఆక్రమణలను ఖాళీచేస్తా!

● వీఎంసీ, ఎన్‌హెచ్ అధికారులకు ఆక్రమణదారుడి ఆఫర్

● ఇంటిపన్నులు ఎన్నుంటే అన్నే ఇస్తామంటున్న అధికారులు

కృష్ణలంక: కనకదుర్గ వారధి జాతీయ రహదారి ర్యాంపుపై (గుంటూరు నుంచి నగరానికి వచ్చే జాతీయ రహదారి కింద) నెహ్రూనగర్ డొంకరోడ్డు చివర రివిటింగ్ పనులను ఎన్‌హెచ్ సిబ్బంది కొద్దిరోజుల నుంచి చేస్తున్నారు. ర్యాంపుపై చాలాకాలంగా తిష్టవేసిన ఆక్రమణదారులు కొందరికి వీఎంసీ, రెవెన్యూ అధికారులు వేరేచోట ఇళ్లిస్తామన్నా వైసీపీ ప్రజాప్రతినిధి అండతో తాము ఇళ్లు ఖాళీ చేయాలంటే మూడిళ్లకు బదులుగా ఐదిళ్లు కావాల్సిందేనని ఆక్రమణదారుడు ఒకరు ఆఫర్ పెట్టాడు. ఇంటిపన్నులు ఎన్నుంటే అన్నే ఇవ్వటం కుదురుతుందని అధికారులు చెబుతున్నప్పటికీ ఆక్రమణదారుడు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.



ర్యాంపుపై ఆక్రమణదారులు కట్టుకున్న ఇళ్లు

మిగిలిన ఆక్రమణదారులు ఖాళీ చేసి వెళ్లేందుకు సుముఖత వ్యక్తం చేస్తున్నా, పక్కనున్న ఆక్రమణదారుడు ఖాళీ చేసినప్పుడే తాము వెళ్దామనే తలంపులో ఉన్నట్లు తెలుస్తోంది. ర్యాంపుపై కొంతమేర మాత్రమే రివిటింగ్ పనులు మిగిలివున్నాయి. వైసీపీ హయాంలో కొన్ని వేల ఇళ్లు తొలగించిన అధికారులు ప్రభుత్వం మారినా కేవలం ఒక్క ఆక్రమణదారుడి ఇల్లు తొలగించలేక మల్లగుల్లాలు పడటంపై విమర్శలు చెలరేగుతున్నాయి. ఇప్పటికైనా ఇళ్ల తొలగింపు చర్యలు చేస్తారో లేదో తేలాల్సి ఉంది. భవిష్యత్తులో వీవీఐపీలకు భద్రతకు పొరపాటున ఏదైనా ప్రమాదం జరిగితే సంబంధిత శాఖ వారే బాధ్యత వహించాల్సి ఉంటుంది.

యువ వ్యాఖ్యాతకు నేషనల్ ఐకాన్ అవార్డు



విజయవాడ కల్చరల్: నగరానికి చెందిన యువ వ్యాఖ్యాత కేవీ భాస్కర్ నేషనల్ ఐకాన్ అవార్డు అందుకున్నారు. న్యూఢిల్లీలోని కమనీ ఆడిటోరియంలో భారత్ న్యూస్ భారతీయ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్టిస్ట్ విభాగంలో ఈ అవార్డును అందించి ఘనంగా సత్కరించారు. ఉత్తరప్రదేశ్ కపిలవస్తు ఎమ్మెల్యే శ్యామ్ ధానిరాహీ, న్యూఢిల్లీకి చెందిన భారతీ యువ వెల్ఫేర్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ సాధ్వీ ఈ అవార్డును భాస్కర్‌కు అందించి అభినందించారు. 2017లో వీఎంసీ నిర్వహించిన హ్యాపీ సండేస్‌లో యాంకర్‌గా మంచి గుర్తింపు పొందారు. ప్రభుత్వ ఈవెంట్స్‌లో వ్యాఖ్యాతగా అనేక సేవలందించారు. ఎస్వీఆర్ పురస్కార్, ప్రతిభ, నవరత, యువ కళా సమ్మాన్ బెస్ట్ ఈవెంట్ మేనేజర్ అవార్డ్, బెస్ట్ యాంకర్ అవార్డును గతంలో అందుకున్నారు.

సమాజాన్ని మేల్కొలిపే సాహిత్యం రావాలి

● సాహితీ ప్రస్థానం ప్రధాన సంపాదకుడు తెలకపల్లి రవి



మాట్లాడుతున్న తెలకపల్లి రవి

విజయవాడ కల్చరల్, జూన్ 30: కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి వచ్చిన తరుణంలో భావప్రకటన స్వేచ్ఛ ప్రమాదంలో పడిందని సాహితీ ప్రస్థానం ప్రధాన సంపాదకులు తెలకపల్లి రవి అన్నారు. జాషువా సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో మే డే 2024 సాహిత్య పురస్కారాల ప్రదానోత్సవం నగరంలోని బాలోత్సవ్ భవన్‌లో ఆదివారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ భావ ప్రకటన స్వేచ్ఛకు ప్రమాదం అనడానికి నిదర్శనమే ప్రముఖ మేధావి అరుంధతి రాయ్‌పై 14ఏళ్ల నాటి కేసును నేడు తిరగదోడే పరిస్థితి వచ్చిందన్నారు. అక్షరానికి కూడా సంకెళ్లు పడుతున్న తరుణంలో కవులు, రచయితలు, కళాకారులు, కళాభిమానులు, మేధావులు తమ స్వేచ్ఛను కాపాడుకొంటూనే సమాజంలో జరిగే పరిణామాలపై ఎప్పటికప్పుడు రచనలు చేస్తూ సమాజాన్ని చైతన్యపరిచేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కళింగాంధ్ర కథా జాడ పుస్తకాన్ని సాహితీ స్రవంతి ఉపాధ్యక్షుడు ఎంవీఎస్ శర్మ ఆవిష్కరించారు. రచయిత అట్టాడ అప్పలనాయుడు పుస్తకాన్ని పరిచయం చేశారు. మాసిపోని మరకలు కథాసంకలన పుస్తకాన్ని ప్రముఖ కథా రచయిత అప్పలనాయుడు ఆవిష్కరించగా కథారచయిత్రి ఉషారాణి పుస్తక పరిచయం చేశారు. క్షేత్రం కవితా సంకలనం పుస్తకాన్ని ప్రముఖ కవి విమర్శకులు సుంకర గోపాలయ్య పుస్తకాన్ని పరిచయం చేశారు. దీపం పాటక సంకలనం పుస్తకాన్ని పోలవరపు సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షులు గోళ్ల నారాయణరావు ఆవిష్కరించగా జాషువా సాంస్కృతిక వేదిక ప్రతినిధు గుండు నారాయణరావు పుస్తకాన్ని పరిచయం చేశారు. శాంతిశ్రీ అధ్యక్షతన ప్రజానాట్యమండలి సీనియర్ నేతలు గేయాలు ఆలపించారు. తెలంగాణ సాహితీ స్రవంతి ప్రధాన కార్యదర్శి ఆనందాచారి, కవయిత్రి మందరపు హైమవతి, అరసం నేతలు పరుచూరి అజయ్, డాక్టర్ రావెల శ్రీనివాసరావు, వైష్ణవి, కుమారస్వామితి పాల్గొన్నారు. ఉత్తమ పాట కథ, కవిత పెద్ద విభాగంలోని మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించే విద్యార్థులకు బహుమతులు అందించారు.

అమరావతి సీడ్ యాక్సెస్ రోడ్డు రైతుల సమావేశం రద్దు

● త్వరలో తేదీని ప్రకటిస్తామన్న సీఆర్‌డీఏ

విజయవాడ: రాజధాని అమరావతిలోని సీడ్ యాక్సెస్ రోడ్డుకు సంబంధించి ఉండవల్లి గ్రామ రైతులతో ఆదివారం నిర్వహించాల్సిన సమావేశం అనివార్య కారణాల వల్ల రద్దు చేయటం జరిగిందని సీఆర్‌డీఏ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.విశ్వేశ్వరనాయుడు తెలిపారు. తిరిగి సమావేశం నిర్వహించే తేదీని త్వరలో ప్రకటిస్తామన్నారు. సీడ్ యాక్సెస్ రోడ్డుకు సంబంధించి రైతులు భూములివ్వటానికి సానుకూలంగా ఉన్నప్పటికీ, ప్యాకేజీ డిమాండ్ విషయం లో భిన్నాభిప్రాయాలున్నాయని, రైతులంతా ఏకాభిప్రాయానికి రావటానికి సీఆర్‌డీఏ అధికారులు కొం త సమయం కోరారని, దీంతో ఆదివారం నాటి స మావేశాన్ని రద్దు చేశామన్నారు.

వైసీపీ రద్దుచేసిన సంక్షేమ పథకాలు పునరుద్ధరించాలి

● అంబేడ్కర్ మనవడు యశ్వంత్ అంబేడ్కర్

ధర్నాచౌక్: ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని పునరుద్ధరించాలని, ఎంబీబీఎస్ కోర్సు రీ-క్లాసిఫికేషన్ కాంపిటెంట్ అథారిటీ సీట్లను రద్దు చేయాలని, అసైన్డ్ ల్యాండ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని గ్లోబల్ రిపబ్లికన్ పార్టీ, భారతీయ బౌద్ధ మహాసభ జాతీయ అధ్యక్షుడు, అంబేడ్కర్ మనువడు భీమ్‌రావ్ యశ్వంత్ అంబేడ్కర్ డిమాండ్ చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకాన్ని పునరుద్ధరించాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రాజ్యాంగబద్ధమైన సంక్షేమ పథకాలను రద్దు చేసిందని విమర్శించారు. వీటిని పునరుద్ధరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో బుద్ధి స్ట్ కాన్సెప్ట్ స్కూల్ ఏర్పాటుకు ఐదెకరాల స్థలం కేటాయించాలన్నారు. మదర్సాల ద్వారా ముస్లిం మైనార్టీలను ప్రోత్సహిస్తున్నట్టు బౌద్ధులను ప్రోత్సహించాలన్నారు. బౌద్ధులకు ప్రత్యేక శ్మశాన వాటికలు నిర్మించాలన్నారు. బౌద్ధం స్వీకరించిన వారిని అధికారికం గా గుర్తించి వారికి కుల సర్టిఫికెట్లు అందజేయాలన్నారు. బేతాళ సుదర్శనం, దాసరి చెన్నకేశవులు, నూతలపాటి జగదీష్ పాల్గొన్నారు.

దుర్గమ్మ దేవస్థానంలో శానిటేషన్ సిబ్బంది కొరత

అదనపు విధులతో ఇద్దరు మహిళలకు అస్వస్థత

వన్‌టౌన్: దుర్గగుడిలో శానిటేషన్ సిబ్బంది కొర త ఏర్పడింది. ప్రస్తుత సిబ్బందికి అదనపు డ్యూటీలు వేసి పనిచేయించడంతో పలువురు మహిళలు అస్వస్థతకు గురయ్యారు. 2 రోజుల క్రితం ఇద్దరు మహిళలు స్పృహ తప్పి పడిపోవడంతో ఒకరి చేయికి గాయం కాగా, మరో మహిళకు నరాల బలహీనత ఉండటంతో కాంట్రాక్టర్ వారిని ఆసుపత్రికి తరలించారు. కరోనాకు ముందు సూపర్‌వైజర్లు, సిబ్బంది క లిసి 197 మంది పనిచేసేవారు. తరువాత 147మం ది సిబ్బంది 10మంది సూపర్‌వైజర్లకు కుదించారు. మొత్తంగా 40 మందిని తీసివే సి 157 మందితో పనిచేయిస్తున్నారు. కొండపైన, దిగువన, దుర్గాఘాట్ మాడపాటి సత్రం, సీవీరెడ్డి ట్రస్ట్, జమ్మిదొడ్డి, సీతానగరం, గుణదల క్వార్టర్లు, పోరంకి వేదపాఠశాలలో, మల్లేశ్వరాలయం పాయింట్లలో పనిచేస్తున్నారు. సి బ్బంది కొరత కారణంగా కొంతమందికి బలవంతం గా డబుల్ డ్యూటీలు వేస్తున్నారు. ఈ డ్యూటీలు చే యలేక చాలా మంది అనారోగ్యం పాలవుతున్నారు. అధికారులు ఈవో దృష్టికి తీసుకువెళ్లగా ఆయన ఆ రా తీశారు. ఈ నేపథ్యంలో డబుల్ డ్యూటీలు చేయలేమంటూ కొందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మొక్కు తీర్చుకున్న కార్యకర్తలు

● గుణదల నుంచి పాదయాత్రగా దుర్గగుడికి వచ్చిన జనసేన, టీడీపీ కార్యకర్తలు

వన్‌టౌన్: జనసేన అధినేత పవన్ కల్యాణ్ గెలిచినందుకు గుణదల నుంచి పలువురు జనసేన కా ర్యకర్తలు ఆదివారం దుర్గగుడికి పాదయాత్రగా వచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పవన్ కల్యాణ్ గెలిస్తే 101 టెంకాయలు దుర్గమ్మకు సమర్పిస్తామని మొ క్కుకున్నామన్నారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా తాము అమ్మవారి మొక్కును తీర్చడం కోసం కుటుంబసమేతంగా వచ్చామన్నారు. పవన్‌కల్యాణ్ అసెంబ్లీ గేటు కూడా తాకలేడంటూ వైసీపీ నేతలు అన్నారని, అటువంటిది ఆయన అఖండంగా గెలిచి వైసీపీ నేతలందరినీ తొక్కుకుంటూ వెళ్లి అసెంబ్లీలో కూర్చున్నారని, ఉపముఖ్యమంత్రి అయ్యారన్నారు. కనకదుర్గ మ్మ తమ కోరికను నెరవేర్చిందని, పదేళ్లుగా పవన్‌కల్యాణ్ రాజకీయాలలో రాణించాలని, అసెంబ్లీలో కూ ర్చోవాలని కన్నకలలు ఇప్పటికి నేరవేరాయన్నారు.

మునగచర్ల నుంచి టీడీపీ కార్యకర్తలు...

ఇటీవల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు గెలిచి అ ధికారంలోకి వచ్చిన సందర్భంగా నందిగామ నుంచి టీడీపీ అభిమానులు, నేతలు పలువురు పాదయాత్రగా ఆదివారం దుర్గగుడికి వచ్చారు. కూటమి అభ్యర్థులు గెలవాలని వారంతా మొక్కుకున్నారు. ఆదివారం వర్షాన్ని లెక్కచేయకుండా మహిళలు పాదయాత్రగా వచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

దిక్సూచి
DIKSUCHI

మానవజాతి చరిత్రలో నిప్పు ఉపయోగాలు తెలుసుకోవడం, చక్రం కనుగొనడం వంటివి కీలక పరిణామాలు. వీటి వల్ల మానవజాతికి జరిగిన మేలే ఎక్కువ. అయితే ఇటీవలికాలంలో యావత్ మానవజాతి భవిష్యత్తును మార్చే సామర్థ్యమున్న 'కృత్రిమ మేధ' రూపు దిద్దుకుంటోంది. భవిష్యత్తులో మానవజాతి మనుగడకే సవాలు విసరగల సామర్థ్యాన్ని 'కృత్రిమ మేధ' అందిపుచ్చుకోగలదనే అంచనాలు సర్వత్రా ఆందోళన కలిగిస్తున్నాయి. అందువల్ల 'కృత్రిమ మేధ'పై మరింత లోతైన పరిశోధనలను, ఆవిష్కరణలను, అనువర్తనాలను కొంతకాలంపాటు నిలిపివేయాలని కోరుతూ గతేడాది యాపిల్ సంస్థ కో-ఫౌండర్ స్టీవ్ వోజ్నియాక్, టెస్లా అండ్ స్పేస్‌ఎక్స్ అధినేత ఎలన్ మస్క్ వంటి టెక్నాలజీ నిపుణులు దాదాపు వెయ్యిమందికి పైగా బహిరంగ లేఖపై సంతకాలు చేశారు.

కృత్రిమ మేధపై
సియోల్ సమావేశం

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

"మానవుడు పూర్తిగా తన ఆధీనంలో ఉంచుకునేలా కట్టడి సాంకేతికతలను అభివృద్ధి పర్చుకున్నాకే కృత్రిమ మేధ వల్ల ఏర్పడే ప్రమాదాలు ఎదుర్కోగలం. కాబట్టి ప్రయోజనకరంగా తీర్చిదిద్దగలమన్న నమ్మకం కలిగిన తరవాతనే వినియోగంలోకి తీసుకురావాలి. లేకుంటే అది యావత్ మానవ జాతికే ప్రమాదకరంగా పరిణమిస్తుంది' అని ఎలన్ మస్క్, స్టీవ్ వోజ్నియాక్ తదితరులు ముక్తకంఠంతో స్పష్టం చేశారు.

- అయితే ఈ స్వేచ్ఛా వాణిజ్యయుగంలో, పోటీ ప్రపంచంలో కృత్రిమ మేధ పరిశోధనల సంస్థల నుంచి స్వచ్ఛంద అంగీకారం కరువైంది. ఇక కృత్రిమ మేధ కట్టడికి ఏ దేశాలకు ఆ దేశాలు స్వచ్ఛందంగా నియంత్రణ చట్టాలు తీసుకురావాల్సిన అవసరం ఏర్పడింది. ఈ కోవలో యురోపియన్ యూనియన్ అలాంటి చట్టాన్ని తొలుత పటిష్ఠంగా ఏర్పరచి అనేక దేశాలకు మార్గదర్శకం అయ్యింది. అయితే కృత్రిమ మేధ వంటి అంతర్జాల సాంకేతికతను అనేక బహుళజాతి సంస్థలు అభివృద్ధి పరుస్తున్నాయి. మార్కెట్ పోటీ, లాభాపేక్ష దృష్ట్యా ఇవి తమ కార్యకలాపాలకు ఒక దేశం అనుకూలంగా లేకుంటే మరో దేశాన్ని ఎంపిక చేసు కుంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో దేశాలపరంగా ఆంక్షలు విధించుకున్నా, అంతర్జాల పరంగా అన్ని దేశాలూ అనుసంధానమై ఉన్నా పర్యవసానాలు అందరిపైనా ప్రభావం చూపుతాయి. అందువల్ల దేశాలపరంగా వైయక్తికంగా కృత్రిమ మేధ కట్టడికి చట్టాలు రూపొందించుకోవాలి. ప్రపంచంలోని అన్ని దేశాలూ ఒక కట్టడి వ్యవస్థను ఏర్పర్చుకోవడం, అంతర్జాతీయ చట్టాన్ని తీసుకురావడం వల్ల ప్రయోజనం ఉంటుంది. ఈ దిశగా సమాలోచనలు చేయడానికి ఇటీవల మే 21 నుంచి మే 22 వరకు రెండురోజులపాటు 'ఏఐ సియోల్ సమ్మిట్' పేరిట బ్రిటన్, దక్షిణ కొరియా సంయుక్త నిర్వహణ భాగస్వామ్యంతో ప్రపంచస్థాయి వర్చువల్, ప్రాదేశిక సదస్సును దక్షిణ కొరియాలోని 'సియోల్' వేదికగా నిర్వహించారు. తొలిరోజు సియోల్ సమ్మిట్‌లో దేశాధినేతలు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. మరుసటి రోజు వివిధ దేశాల డిజిటల్ సాంకేతిక శాఖల మంత్రులు, అధికారులు పాల్గొన్న 'ఏఐ గ్లోబల్ ఫోరం' సమావేశం నిర్వహించారు.
- నిజానికి ఈ సియోల్ సమావేశం 2023 నవంబరులో బ్రిటన్‌లోని బ్లెచ్‌లీ పార్క్‌లో జరిగిన తొలి ప్రపంచస్థాయి 'ఏఐ సేఫ్టీ సమ్మిట్'కు కొనసాగింపు. అప్పటి ఈ సమావేశంలో బ్రిటన్, అమెరికా, ఇటలీ దేశాధినేతలతోపాటు ఎలన్‌మస్క్ వంటి టెక్ దిగ్గజాలు, పౌరసమాజ ప్రతినిధులు, పరిశోధకులు, ప్రభుత్వాధికారులు పాల్గొన్నారు. కృత్రిమ మేధ పరమైన సవాళ్లు, భద్రతా చర్యలపై చర్చించారు. భారత్‌తో సహా 28 దేశాలు, యురోపియన్ యూనియన్ 'బ్లెచ్‌లీ ఉడ్ డిక్లరేషన్'పై సంతకాలు చేశాయి. ఈ తీర్మానం ప్రకారం 'బాధ్యతాయుతమైన, భద్రతతో కూడిన కృత్రిమ మేధ' కోసం అంతర్జాతీయ సహకారం పెంపొందించే దిశగా కృషి చేయడానికి అంగీకరించాయి. అంతేకాకుండా ఈ సమావేశాన్ని తరచూ (ఆరు నెలలకు ఒకసారి) నిర్వహించాలని నిర్ణయించారు.



సియోల్ సమావేశం ఎజెండా

బ్లెచ్‌లీ ఉడ్ సమావేశ ప్రధాన ఎజెండా అయిన కృత్రిమ మేధ 'భద్రత'కు కొనసాగింపుగా, నవకల్పన, సమ్మిళిత్వాలను చేర్చారు.

సియోల్ సమావేశం - ముఖ్యాంశాలు

- తొలిరోజు దేశాధినేతల సమావేశంలో కృత్రిమ మేధ ద్వారా ఎదురయ్యే ప్రమాదాలు, దాని ద్వారా సాధించగల అనేక ప్రయోజనాలపై చర్చించారు. అంతేకాక కొందరు కృత్రిమమేధ అభివృద్ధి సంస్థల ప్రతినిధులు పాల్గొని తాము బ్లెచ్‌లీ ఉడ్ తీర్మానానికి అనుగుణంగా తీసుకున్న భద్రత చర్యల గురించి వివరించారు.
- భవిష్యత్తులో ప్రపంచం కొద్దిమంది లేదా కొన్ని సాంకేతిక ప్రోగ్రామ్‌ల చేతిలోకి వెళ్లే ప్రమాదాన్ని అడ్డుకోవడానికి ప్రతి ఒక్కరూ కృత్రిమ మేధకు కాపలాదారుగా వ్యవహరించాల్సిన అవసరం ఉన్నదని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ పేర్కొన్నారు.
- గూగుల్, మెటా, ఓపెన్ ఏఐ వంటి కృత్రిమ మేధ అభివృద్ధి అగ్రశ్రేణి సంస్థలు తమ ఏఐ సిస్టమ్‌లను సురక్షితంగా ఉంచుతామని, ప్రజలకు వీటి గురించిన లాభనష్టాలను తెలియచేయడంలో పారదర్శకంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశాయి. తాము అభివృద్ధి చేసే నూతన విధానాల ద్వారా ఎదురయ్యే సవాళ్లు పరిష్కరించలేనివిగా కనిపించిన పక్షంలో వాటిని వినియోగంలోకి తీసుకురాకుండా నిలిపివేస్తామని స్వచ్ఛందంగా ఈ సమావేశంలో వాగ్దానం చేశాయి.
- దీనికి కొనసాగింపు సమావేశాన్ని 2025లో ఫ్రాన్స్‌లో 'ఏఐ యాక్షన్ సమ్మిట్' నిర్వహించనున్నారు. దీనిలో భద్రతతోపాటు టాలెంట్(ప్రతిభ), ఇన్‌ఫ్రాస్ట్రక్చర్(మౌలిక సదుపాయాలు), యూజెస్(ఉపయోగాలు), ఇన్వెస్ట్‌మెంట్(పెట్టుబడి), గవర్నెన్స్(పాలన) అనే మరో ఐదింటిని చర్చించాలని నిర్ణయించారు.
- మొత్తానికి సియోల్ సమావేశంలో కృత్రిమ మేధతో ఎదురవనున్న సవాళ్లపైనే చర్చ కేంద్రీకృతం కాకుండా సురక్షితంగా వినియోగించుకోవడానికి సరికొత్త ఆవిష్కరణల ఆవశ్యకతపై కూడా దృష్టి సారించారు.
- అయితే సియోల్ సదస్సు గురించి పెద్దగా ప్రచారం జరగకపోవడం, కొద్ది మంది దేశాధినేతలే ఇందులో పాల్గొనడం, కొత్త దేశాలేవీ పెద్దగా ఆసక్తి చూపకపోవడం, ప్రభావవంతమైన నిర్ణయాలు వెలువడకపోవడం, కృత్రిమ మేధ కట్టడిపరంగా ఎలాంటి కదలిక లేకపోవడం వంటి అంశాలపరంగా ఈ సదస్సు తీవ్ర విమర్శలకు గురవుతోంది.
- ఈ రంగంలో నవకల్పనలకు పోటీపడుతున్న అనేక అగ్రగామి టెక్ సంస్థలు, స్టార్టప్‌లు సౌలభ్యాలతోపాటు అనేక సవాళ్లను విసురుతున్నాయి. ఇప్పటికే గోప్యత, ఎంపిక స్వేచ్ఛ, నైతికతల పరంగా పెను సవాళ్లు ఎదురవుతున్నాయి. భవిష్యత్తులో ఉద్యోగావకాశాలను కొల్లగొట్టడమే కాక మానవాళిపై కృత్రిమమేధ ఆధిపత్యం సాధించగలదని ఊహాగానాలు వినిపిస్తున్నాయి.
- మానవ ప్రమేయం ఉన్న రంగాల్లోనూ విస్తరిస్తున్న కృత్రిమ మేధను నియంత్రించినప్పుడే మానవాళి గమనం కూడా సురక్షితంగా సాగిపోతుంది.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

దిశలు - దూరాలు

ఏపీపీఎస్సీ/ ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

రీజనింగ్




పార్ట్-1

1. ఉదయం సూర్యుని వైపుగా అనుపమ్ నడకకు (వాకింగ్) బయలుదేరాడు. కొంత సమయం తరవాత ఎడమవైపునకు, తదుపరి మరల ఎడమవైపునకు, ఆ తదుపరి కుడివైపునకు చివరగా మరల ఎడమవైపునకు తిరిగి నడుస్తున్నాడు. అయితే ఇప్పుడు అనుపమ్ ఏ దిశలో నడుస్తున్నాడు?

ఎ) తూర్పు బి) పడమర సి) ఉత్తరం డి) దక్షిణం

సమాధానం: (బి)


వివరణ: ఉదయం సూర్యుని వైపుగా అంటే తూర్పు దిక్కునకు నడకను ప్రారంభించాడని అర్థం.



పై రేఖాచిత్రాన్ని బట్టి చివరగా ఎడమ వైపునకు '←' గుర్తు చూపిస్తున్నది. ఈ చాప్టర్‌లోని మెయిన్ డయాగ్రమ్‌లోని బేసిక్ పాయింట్ పరిశీలిస్తే ఎడమవైపునకు అంటే పడమర అని అర్థం. కాబట్టి ఇప్పుడు అనుపమ్ చివరగా పడమర వైపునకు నడుస్తున్నాడని తెలుస్తోంది.

సమాధానం పడమర.

షార్ట్‌కట్: ఉదయం సూర్యుని వైపుగా అంటే తూర్పు దిక్కునకు నడకను ప్రారంభించాడు.



ఒక కుడి, ఒక ఎడమ క్యాన్సిల్ అవుతుంది. ఇప్పుడు తూర్పు నుంచి 2 ఎడమలు అంటే తూర్పునకు ఎడమ ఉత్తరం, తదుపరి ఉత్తరానికి ఎడమ పడమర. కాబట్టి సమాధానం పడమర.


గమనిక: ఏ దిశ నుంచి అయినా 2 ఎడమలు లేదా 2 కుడి అంటే పాజిటివ్ దిశ అవుతుంది.

2. A పడమరకు 6 కి॥మీ॥ నడిచి తరవాత కుడివైపునకు 3 కి॥మీ॥ నడిచాడు. తరవాత మరల కుడివైపునకు 6 కి॥మీ॥ నడిచిన అతను బయలుదేరిన స్థానం నుంచి ఎంత దూరంలో ఉన్నాడు?

ఎ) 9 కి॥మీ॥ బి) 3 కి॥మీ॥
సి) 15 కి॥మీ॥ డి) 6 కి॥మీ॥

సమాధానం: (బి)

వివరణ :-




పై రేఖాచిత్రాన్ని, బట్టి A బయలుదేరిన స్థానం నుంచి 3 కి॥మీ॥ దూరంలో ఉన్నాడని తెలుస్తోంది.

3. తూర్పు వాయువ్యం అయింది వాయువ్యం దక్షిణం అయింది అనుకుంటే పడమర ఏమవుతుంది?

ఎ) ఈశాన్యం బి) ఆగ్నేయం సి) నైరుతి డి) ఏదీకాదు

సమాధానం: (బి)

వివరణ: తూర్పు, వాయువ్యం అయింది అంటే తూర్పు నుంచి 3 భాగాలు($3x45=135^0$) గడియారపు అపసవ్యదిశలో తిరిగాయని అర్థం. వాయువ్యం, దక్షిణం అయింది అంటే వాయువ్యం నుంచి దక్షిణానికి అంటే 3 భాగాలు ($3x45=135^0$) అపసవ్యదిశతో తిరిగాయి. అయితే పడమర నుంచి 3 భాగాలు గడియారపు అపసవ్యదిశలో తిరిగితే సమాధానం ఆగ్నేయం అవుతుంది.




4. గడియారంలో సమయం గం॥ 3 గంటలు అయింది. నిమిషాల ముల్లు తూర్పును సూచిస్తున్నది అనుకొంటే గంటలముల్లు ఏ దిక్కును సూచిస్తుంది?

ఎ) తూర్పు బి) పడమర సి) ఉత్తరం డి) దక్షిణం

సమాధానం: (డి)

వివరణ :-



వాస్తవంగా 3 గంటల సమయంలో నిమిషాల ముల్లు ఉత్తరాన్ని సూచిస్తుంది. కాని ప్రశ్నలో తూర్పును సూచిస్తున్నదని ఉన్నది. అంటే గడియారపు సవ్యదిశలో 2 భాగాలు($2x45=90^0$) తిరిగిందని అర్థం. అదే విధంగా 3 గంటల సమయంలో గంటల ముల్లు వాస్తవంగా తూర్పున ఉంటుంది. ఇప్పుడు తూర్పు నుంచి 2 భాగాలు ($2x45=90^0$) గడియారపు సవ్యదిశలో తిరిగితే సమాధానం దక్షిణం అవుతుంది.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్
సీనియర్ ఫ్యాకల్టీ

దేశంలో 1,04,561 రకాల
జంతుజాతులు

- భారతదేశ సమగ్ర జంతుజాలం పట్టిక విడుదల
- ప్రపంచంలోనే తొలిసారన్న కేంద్ర పర్యావరణ మంత్రి

న్యూఢిల్లీ, జూన్ 30: జువాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా స్థాపించి 109 ఏళ్లు పూర్తయిన సందర్భంగా దేశంలోని సమగ్ర జంతుజాలం పట్టికను రూపొందించినట్లు కేంద్ర పర్యావరణ మంత్రి భూపేందర్ యాదవ్ తెలిపారు. వర్గీకరణ శాస్త్రవేత్తలకు, పరిశోధకులకు, విద్యావేత్తలకు ఎంతో ఉపయోగకరమైన ఈ పట్టికను రూపొందించడం ప్రపంచంలోనే తొలిసారి అని ఆయన చెప్పారు. ఆదివారం కోల్‌కతాలో 'భారతదేశ జంతుజాల చెక్‌లిస్టు పోర్టల్'ను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ, దేశంలో మొత్తం 1లక్షా 4వేల 561 రకాల జంతుజాతులు ఉన్నట్లు గుర్తించామని ఆయన తెలిపారు. స్థానికంగా కనబడే జంతుజాలంతోపాటు, అంతరించిపోయే, షెడ్యూల్డ్ జాతుల పట్టికను ఈ జాబితాలో చేర్చినట్లు చెప్పారు. జీవవైవిధ్య పరిరక్షణలో భారతదేశం ముందంజలో ఉందని అన్నారు. ప్రధానిగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత మోదీ ప్రారంభించిన 'ఏక్ పేడ్ మా కే నామ్' (అమ్మ పేరుతో ఒక మొక్క) కార్యక్రమంతో పాటు పులులు, చీతాల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలు భారతదేశం జీవవైవిధ్య పరిరక్షణకు ఎంత చిత్తశుద్ధిగా వ్యవహరిస్తోందో తెలిపేందుకు ఉదాహరణలని భూపేందర్ యాదవ్ పేర్కొన్నారు.

స్వదేశీ చిప్‌తో ఆర్మీ కోసం
మొబైల్ బేస్ స్టేషన్
దేశంలో ఇదే మొదటిసారి

- 4జీ చిప్‌ను తయారు చేసిన బెంగళూరు సంస్థ సిగ్నల్‌చిప్

న్యూఢిల్లీ, జూన్ 30: పూర్తి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో ఇండియాలోనే అభివృద్ధి చేసిన సెమీ కండక్టర్(చిప్) సాయంతో భారత సైన్యం కోసం 4జీ మొబైల్ కమ్యూనికేషన్ బేస్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. బెంగళూరుకు చెందిన సిగ్నల్‌చిప్ అనే సంస్థ ఈ చిప్‌ను రూపొందించింది. ఇండియాలో స్వదేశీ సాంకేతికతతో తయారు చేసిన మొట్టమొదటి 4జీ చిప్ ఇదే కావడం విశేషం. ఈ చిప్‌తో సహ్యాద్రి పేరుతో వైర్‌లెస్ కమ్యూనికేషన్‌లో కీలకమైన నెట్‌వర్క్ ఇన్ బాక్స్(ఎన్ఐబీ)ను తయారు చేయగా.. ఆ ఎన్ఐబీలను భారత సైన్యం బిడ్డింగ్ ద్వారా సిగ్నల్ట్రాన్ అనే సంస్థ నుంచి సేకరించింది. ఆర్మీకి మొత్తం 20 సహ్యాద్రి నెట్‌వర్క్ బాక్స్‌లను సరఫరా చేశామని సిగ్నల్ట్రాన్ వ్యవస్థాపకుడు హిమాంశు ఖాస్నిస్ తెలిపారు. సిగ్నల్ చిప్ కంపెనీని కూడా ఈయనే 2010లో ప్రారంభించారు. "4జీ, 5జీ నెట్‌వర్క్‌ల కోసం సిగ్నల్‌చిప్ సంస్థ చిప్‌లను తయారు చేసింది. పూర్తి స్వదేశీ సాంకేతికతతో చిప్‌లను తయారు చేయడం ఇండియాలో ఇదే మొదటి సారి. ఆర్మీలో సంక్లిష్టమైన కమ్యూనికేషన్ వ్యవస్థ కోసం స్వదేశీ చిప్‌ను ఉపయోగించడంతో భద్రతాపరంగా ఎంతో మేలు జరుగుతుంది" అని ఖాస్నిస్ చెప్పారు. 7కిలోల బరువు ఉండే సహ్యాద్రి నెట్‌వర్క్ ఇన్ బాక్స్ వ్యవస్థ అత్యంత నాణ్యమైన వైర్‌లెస్ కమ్యూనికేషన్ అందిస్తుందని చెప్పారు. ఇండియాలో ఇప్పుడు ఏర్పాటు చేసిన మెజారిటీ బేస్‌స్టేషన్లు ఇండియాలో తయారు చేసినవి కాదు. కొన్ని ఇక్కడ తయారైనవి అయినా కూడా వాటిల్లో ఉపయోగించిన చిప్‌లు విదేశాలవి.

విజయవాడ హైవే..రహదారి నిర్వహణ నుంచి
జీఎంఆర్ ఔట్

- నెలకు రూ.6కోట్ల మేర నష్టమే కారణం
- ఎన్‌హెచ్ఏఐ పరిధిలో మూడు టోల్‌గేట్లు
- తాత్కాలిక ఏజెన్సీలకు బాధ్యతల అప్పగింత

చౌటుప్పల్ రూరల్, జూన్ 30: హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి(ఎన్‌హెచ్-65) నిర్వహణ బాధ్యతల నుంచి జీఎంఆర్ సంస్థ తప్పుకొంది. ఈ మేరకు యాదాద్రి-భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలోని పంతంగి, కేతేపల్లి మండలం కొర్లపహాడ్, ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా చిల్లకల్లు టోల్‌గేట్ల బాధ్యతలను వదులుకుంది. దీంతో.. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్ఏఐ) ఆదివారం అర్ధరాత్రి నుంచి ఈ టోల్‌గేట్లను స్వాధీనం చేసుకుంది. టోల్ వసూలు బాధ్యతలను తాత్కాలికంగా మూడు ఏజెన్సీలకు అప్పగించింది. పంతంగి టోల్‌గేట్ బాధ్యతలను స్కైలాబ్, ఇన్‌ఫ్రా గ్రూపులకు.. చిల్లకల్లు టోల్‌గేట్ బాధ్యతలను కోరల్ ఇన్‌ఫ్రాకు అప్పగించింది.

12 ఏళ్ల అనుబంధం

అత్యంత రద్దీగా ఉండే రహదారుల్లో ఒకటైన విజయవాడ హైవే విస్తరణకు గతంలో ఉద్యమాలు జరిగాయి. దీంతో.. 2010లో అప్పటి యూపీఏ సర్కారు బిల్ట్-ఆపరేట్-ట్రాన్స్‌ఫర్(బీవోటీ) విధానంలో టెండర్లను ఆహ్వానించగా.. జీఎంఆర్ రూ.1,740కోట్లతో పనులను దక్కించుకుంది. యదాద్రి-భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా నందిగామ వరకు 181 కి.మీ రోడ్డును నాలుగు లేన్లుగా అభివృద్ధి చేసింది. 2012 నుంచి పంతంగి, కొర్లపహాడ్, చిల్లకల్లు వద్ద టోల్‌గేట్లు ఏర్పాటయ్యాయి. 12 ఏళ్లుగా ఈ రహదారి బాధ్యతలను నిర్వర్తించిన జీఎంఆర్.. ఇప్పుడు తప్పుకోవడంతో.. తిరిగి ఎన్‌హెచ్ఏఐ తన అధీనంలోకి తీసుకుంది.


యాదాద్రి-భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలోని పంతంగి టోల్‌గేటు

నష్టాలే కారణం..

పంతంగి టోల్ మీదుగా రోజుకు 35 వేల దాకా.. వారాంతాలు, సెలవు రోజుల్లో భారీ సంఖ్యలో వాహనాలు వస్తుంటాయి. అయినా.. తమకు ఈ రహదారి నిర్వహణతో నష్టం వాటిల్లుతోందని జీఎంఆర్ ప్రతినిధి ఒకరు తెలిపారు. నిజానికి 2025 జూన్ నెలాఖరు వరకు జీఎంఆర్ సంస్థకు టోల్ వసూలు హక్కులున్నా.. ఒక ఏడాది ముందుగానే బాధ్యతల నుంచి తప్పుకొంటున్నట్లు తెలిపారు. నెలకు రూ.6 కోట్ల మేర.. అంటే రోజుకు రూ.20 లక్షల చొప్పున నష్టం వస్తుండడంతోనే ఈ టోల్‌గేట్లను వదులుకున్నట్లు వివరించారు. ముందుగానే తప్పుకొంటున్నందుకు నష్టపరిహారం కూడా చెల్లించేందుకు జీఎంఆర్ సిద్ధపడడం గమనార్హం.! 2025లోగా ఈ రహదారిని ఆరు లేన్లకు అభివృద్ధి చేయాల్సి ఉన్నా.. దీనిపై జీఎంఆర్ కోర్టు నుంచి స్టే తెచ్చుకుంది.

విహారయాత్ర విషాదాంతం

- జలపాతంలో కొట్టుకుపోయిన కుటుంబం
- ముగ్గురి మృతదేహాలు లభ్యం.. ఇద్దరి గల్లంతు

పుణే, జూన్ 30: ఆదివారం కావడంతో సరదాగా జలపాతం చూసేందుకు వెళ్లిన కుటుంబం అందులో పడి గల్లంతైన ఘటన మహారాష్ట్రలోని లోనావాలా ప్రాంతంలో జరిగింది. అందులో తల్లి, ఇద్దరు పిల్లల మృతదేహాలు లభ్యం కాగా, మరో ఇద్దరు చిన్నారుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. పోలీసుల కథనం ప్రకారం... హడప్సర్‌కు చెందిన షాహిస్త అన్సారీ(36) అనే మహిళ, ఆమె నలుగురు పిల్లలు కలిసి లోనావాలలో బుషీ డ్యామ్‌కు సమీపంలో ఉన్న జలపాతాన్ని సందర్శించేందుకు వెళ్లారు. ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం పడుతుండటంతో జలపాతంలో నీటి ఉధృతి అంతకంతకూ పెరుగుతోంది. ఇది గమనించని ఆ కుటుంబం అక్కడ కేరింతలు కొడుతోంది. ఇంతలోనే వచ్చిన పెద్ద ప్రవాహం ఒక్క ఉదుటున వారిని కొట్టుకుపోయేలా చేసింది. సమాచారం అందుకున్న సహాయక బృందాలు వెంటనే రంగంలోకి దిగాయి. వీరిలో తల్లి అన్సారీ, అమీమా(13), ఉమేరా(8)ల మృతదేహాలు లభ్యమయ్యాయి. అద్నాన్, మరియా అనే ఇద్దరు చిన్నారుల కోసం గాలిస్తున్నాయి. కాగా, కొట్టుకుపోతూ కూడా కుటుంబ సభ్యులంతా ఒకరినొకరు పట్టుకొని సహాయం కోసం అర్థిస్తున్న హృదయ విదారకర దృశ్యం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

అసోంలో 'క్యాష్ ఫర్ మార్క్స్' కుంభకోణం

- గువాహటి యూనివర్సిటీలో డిజిటల్ ట్యాంపరింగ్
- నగదుకు మార్కులు పెంచిన కంప్యూటర్ ఆపరేటర్లు
- 8 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

న్యూఢిల్లీ, జూన్ 30: అసోం రాష్ట్రంలో 'క్యాష్ ఫర్ మార్క్స్' కుంభకోణం వెలుగులోకి వచ్చింది. విద్యార్థుల మార్కులు పెంచడం కోసం యూనివర్సిటీ సిబ్బంది నగదు తీసుకున్నట్లు బయటపడింది. దాంతో డిజిటల్ ట్యాంపరింగ్‌కు పాల్పడినట్లు అనుమానిస్తున్న 8 మందిని పోలీసులు అరెస్టు చేశారు. గువాహటి యూనివర్సిటీ అనుబంధంగా ఉన్న గణేశ్ లాల్ చౌదరి కళాశాలకు చెందిన అజీజుల్ హక్ అనే విద్యార్థికి వాస్తవంగా వచ్చిన మార్కులకు... మార్క్‌షీట్‌లో మార్కులకు మధ్య వ్యత్యాసం ఉండటంతో సీఐడీ విచారణ చేపట్టింది. పలు సెమిస్టర్లలో మార్కులను పెంచేందుకు గాను కంప్యూటర్ ఆపరేటర్లకు రూ. 10 వేలు చెల్లించినట్లు విద్యార్థి అంగీకరించాడు. ఈ కేసుకు సంబంధించి కీలక నిందితుడు కె కృష్ణమూర్తి ఇప్పటికే అరెస్టు అయ్యాడు. మరికొంత మంది అరెస్టయ్యే అవకాశం కనిపిస్తోంది. డిజిటల్ ట్యాంపరింగ్ వ్యవహారంలో మరింత లోతుగా దర్యాప్తు జరుపుతామని సీఎం హిమంత బిశ్వ శర్మ తెలిపారు. పది మంది విద్యార్థుల మార్కులు పెంచినట్లు తేలిందని, ఆ సంఖ్య మరింత పెరిగే అవకాశముందని సీఐడీ వర్గాలు తెలిపాయి.

నేటి నుంచి 'స్టాప్ డయేరియా'

- చిన్నారుల్లో డయేరియా నివారణకు ప్రత్యేక కార్యక్రమం
- ఏపీలో డయేరియాపై మంత్రి సత్యకుమార్ సీరియస్
- నిపుణుల కమిటీ ఏర్పాటుకు, ప్రత్యేక విధివిధానాలకు ఆదేశం



అమరావతి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకూ 'స్టాప్ డయేరియా' అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఆరోగ్యశాఖ సర్వ సన్నద్ధమయింది. ఐదేళ్లలోపు చిన్నారుల్లో ప్రాణాంతకంగా మారుతున్న డయేరియా వ్యాధిని నిరోధించి మరణాల బారిన పడకుండా ఉండేందుకు కేంద్ర స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని రూపొందించింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఐదేళ్లలోపు చిన్నారుకు ఓఆర్ఎస్ ఇవ్వడంతో పాటు రెండు వారాల పాటు జింక్ ట్యాబ్లెట్లు పంపిణీ చేస్తారు. ఈ కార్యక్రమంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించేందుకు రెండు నెలల పాటు క్యాంపెయిన్ చేస్తారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ఆరోగ్య వసతుల్లో సరైన నిర్వహణ, అవసరమైన వైద్య సామగ్రి లభ్యతను నిర్ధారించడం, స్వచ్ఛమైన నీటిని అందుబాటులోకి తేవడం, పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడం, సురక్షితమైన తాగునీరు అందించడం వంటి కార్యక్రమాలు చేస్తారు. అందులో భాగంగా స్టాప్ డయేరియా కార్యక్రమానికి ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. డయేరియా, సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక విధివిధానాలు తయారీకి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో డయేరియా తీవ్రస్థాయిలో పెరగడాన్ని ఆయన సీరియస్‌గా పరిగణించారు. డయేరియా ముందస్తు నివారణకు ఆరోగ్యశాఖలో ఎలాంటి విధివిధానాలూ లేకపోవడంపై ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేసేశారు. అధికారులు కూడా వ్యాధులు ప్రబలిన తర్వాత స్పందించడం తప్ప ముందస్తుగా చర్యలు మాత్రం చేపట్టకపోవడం బాధ్యతారాహిత్యమన్నారు. ఇకనైనా నిపుణుల కమిటీని ఏర్పాటు చేసి ఇలాంటి పరిస్థితుల్లో ఎలాంటి చర్యలు తీసుకుంటారన్న దానిపై 15 రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

వైసీపీ ప్రభుత్వంలో వంచనకు గురయ్యాం

- చంద్రబాబుతోనే రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి
- గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం

విజయవాడ (గవర్నర్ పేట), జూన్ 30 : వైసీపీ ప్రభుత్వంలో దగా పడ్డామని, వంచనకు గురయ్యామని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.రాజేష్ ఆవేదన వ్యక్తం చేశారు. విజయవాడలో ఆదివారం గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు, టీడీపీ సీనియర్ నాయకుడు డాక్టర్ కొండారెడ్డి నరహరి వరప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాజేష్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలకు జీవో 423 ఇచ్చి తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందన్నారు. గ్రేడ్-2 వీఆర్వోలకు గ్రేడ్-1 వీఆర్వోలుగా పదోన్నతి కల్పించడానికి తెచ్చిన జీవో 166ను అమలు పరచలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ ప్రభుత్వ ఉద్యోగులకూ లేనటువంటి యూనిఫాం వ్యవస్థను సచివాలయ ఉద్యోగులకు తీసుకొచ్చారన్నారు. ఎంతో అనుభవం ఉన్న సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందడం ఖాయమని, తమ సమస్యలు కూడా పరిష్కారమవుతాయన్న నమ్మకముందని చెప్పారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరాం అజయ్‌కుమార్, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని టీడీపీ నాయకుడు కొండారెడ్డి వరప్రసాద్‌కు అందజేశారు.


టీడీపీ నేత వరప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామ, వార్డు సచివాలయ సంఘ నేతలు